# వ్యాపార న్యాయశాస్త్రం

## బి. కాం. ద్వితీయ సంవత్సరం

## సెమిష్టర్ – 4


**రచయితలు**

**డా॥ ఎస్. నరహరి కుమార్**
అధ్యాపకులు, కామర్స్ విభాగం,
శారద కాలేజీ,
విజయవాడ.

**డా॥ కె. వెంకటేశ్వర్లు,**
రీడర్, కామర్స్ విభాగం,
యస్.కె. బి. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
మాచెర్ల.

**శ్రీమతి కె. సుబ్బరత్నమ్మ**
సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ మహిళా కళాశాల,
గుంటూరు.

**శ్రీ టి. త్యాగరాజు**
అధ్యాపకులు, కామర్స్ విభాగం,
ఎ. జె.కళాశాల,
మచిలీపట్నం.

**శ్రీమతి వి. సుగుణ కుమారి**
అధ్యాపకులు, కామర్స్ విభాగం,
ఎ.యన్.ఆర్. కాలేజీ,
గుడివాడ.

**డా॥ జె. దుర్గా ప్రసాదరావు**
సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ మహిళా కళాశాల,
గుంటూరు.

**సంపాదకులు,**
**ఆచార్య కోదాటి వియ్యన్నారావు**
వాణిజ్య మరియు నిర్వహణ విభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**సంచాలకులు**
**డా. నాగరాజు బట్టు**
*ఎం.బీ.ఏ., ఎం.హెచ్.ఆర్.ఎం.,ఎం.ఎస్. సి.(సైకాలజీ), ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ.(సోషియాలజీ), ఎం.ఇ. డి., ఎం.ఫీల్., పిహెచ్.డి.*
దూర విద్యాకేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్ – 522 510, గుంటూరు.

**Ph : 0863 - 2346208, 2346222, 2346259 ( Study Material)**
**Website : www.anucde.info**
**e-mail : anucdedirector@gmail.com**

# బి. కాం. ద్వితీయ సంవత్సరం
## సెమిష్టర్ – 4
# వ్యాపార న్యాయశాస్త్రం

**తొలి ప్రచురణ : 2023**

**కాపీల సంఖ్య :**

© **ఆచార్య నాగార్జున యూనివర్సిటి**

ఈ పాఠ్య పుస్తకం ఆచార్య నాగార్జున యూనివర్సిటిలోని దూర విద్యాకేంద్రం నందు ద్వితీయ సంవత్సరం బి. ఎ. విద్యనభ్యసించుచున్న విద్యార్థుల కొరకు ప్రత్యేకంగాను మరియు పరిమిత పంపిణికై ఉద్దేశించి ముద్రించబడినది.

**ప్రచురణ కర్త :**
**డా. నాగరాజు బట్టు,**
**సంచాలకులు,**
**దూర విద్యాకేంద్రం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**ప్రచురించినది :**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు,పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడ్ ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికిసంతోషిస్తున్నాను.ప్రస్తుతం గుంటూరు , ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలలకు డిప్లమో, డిగ్రీ , పీజీ స్థాయి విద్యా బోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003 –2004 లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్లి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక గల గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బీ.కాం., బి. ఎస్ సి. , పీజీ స్థాయిలో ఎం.కామ్., ఎం.ఎస్ సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బీ.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అని సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు, నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవన యాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగ అవకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో–ఆర్డినేటర్లకు, అకాడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్యనాగార్జునవిశ్వవిద్యాలయం.**

**PROGRAMME: THREE-YEAR B COM**

(General and Computer Applications)

**Course Code:**

**Domain Subject: Commerce**

Semester-wise Syllabus under CBCS

(w.e.f. 2020-21 Admitted Batch)

II Year B Com (Gen & CA)– Semester – IV

## 404BCO21- Course 4D:Business Law

**Learning Outcomes:**

At the end of the course, the student will able to;

- Understand the legal environment of business and laws of business.
- Highlight the security aspects in the present cyber-crime scenario.
- Apply basic legal knowledge to business transactions.
- Understand the various provisions of Company Law.
- Engage critical thinking to predict outcomes and recommend appropriate action on issues relating to business associations and legal issues.
- Integrate concept of business law with foreign trade.

**Syllabus:**

**Unit-I: Contract:**

Meaning and Definition of Contract - Essential Elements of Valid Contract -Valid, Void and Voidable Contracts - Indian Contract Act, 1872

**Unit-II: Offer, Acceptance and Consideration:**

Definition of Valid Offer, Acceptance and Consideration - Essential Elements of a Valid Offer, Acceptance and Consideration.

**Unit-Ill: Capacity of the Parties and Contingent Contract:**

Rules Regarding to Minors Contracts - Rules Relating to Contingent Contracts - Different Modes of Discharge of Contracts - Rules Relating to Remedies to Breach of Contract.

**Unit-IV: Sale of Goods Act 1930 and Consumer Protection Act 2019:**

Contract of Sale - Sale and Agreement to Sell - Implied Conditions and Warranties - Rights of Unpaid Vendor- Definition of Consumer - Person - Goods - Service - Consumer Dispute - Consumer Protection Councils - Consumer Dispute Redressal Mechanism

**Unit-V: Cyber Law:**

Overview and Need for Cyber Law - Contract Procedures - Digital Signature – Safety Mechanisms.

**References:**


1. J. Jaysankar, Business Laws, Margham Publication. Chennai.
2. ND Kapoor, Business Laws, S Chand Publications.
3. Balachandram V, Business law, Tata McGraw Hill.
4. Tulsian, Business Law, Tata McGraw Hill.
5. Pillai Bhagavathi, Business Law,SChand Publications.
6. Business Law, Seven Hills Publishers, Hyderabad.
7. K C Garg, Business Law, Kalyani Publishers.


**Suggested Co-Curricular Activities**

- Seminar on Basics of Indian Contract Act,1872
- Quiz programs
- Co-operative learning
- Seminar on Cyber Law
- Group Discussions
- Debate on Offer, Agreement, and Contract
- Creation of Contract by abiding rules of Indian Contract Act,1872
- Making a sale by abiding rules of Sale of Goods Act,1930
- Guest lecture by a Lawyer/Police officer
- Celebrating consumers day by creating awareness among the students
- Examinations (Scheduled and surprise tests)
- Any similar activities with imaginative thinking beyond the prescribed syllabus

**MODEL QUESTION PAPER** **(404BCO21)**

# B. Com.(General / Comp. Appl.s) Degree Examination

**Second Year – Fourth Semester**

**Part – II : Commerce**

**Paper – IV : BUSINESS LAWS**

**Time : Three hours** **Maximum Marks : 70**

## Section – A

**Answer any FIVE of the following questions. (5 × 4 = 20 Marks)**

1) Valid contract.
చెల్లుబాటు ఒప్పందం.

2) Valid consideration.
చెల్లుబాటు అయ్యే ప్రతిఫలము.

3) Minor.
మైనరు.

4) Contingent contract.
ఆగంతుక కాంట్రాక్టు.

5) Warranties.
పూచీలు.

6) Electronic Records.
ఎలక్ట్రానిక్ రికార్డులు.

7) Agreement to sale.
అమ్మకము నిమిత్తము ఒప్పందము.

8) Family Agreement.
కుటుంబపరమైన ఒప్పందము.

## Section – B

**Answer the following questions. (5 x 10 = 50 Marks)**

9) (a) What are the essentials of valid contract?

చెల్లుబాటు అయ్యే ఒప్పందానికి కావలిసిన ఆవశ్యకతలేమిటి?

Or

(b) Explain Indian Contact Act, 1872.

ఇండియన్ కాంట్రాక్టు చట్టం 1872 వివరించండి.

10) (a) Explain essentials elements of valid offer.

చెల్లుబాటు అయ్యే ఆఫర్ యొక్క ముఖ్యమైన ముఖ్యమైన అంశాలను వివరించండి.

Or

(b) Define Acceptance. Explain essentials elements of valid acceptance.

అంగీకారం నిర్వచించి, చెల్లుబాటు అయ్యే అంగీకారం యొక్క ముఖ్యమైన ముఖ్యమైన అంశాలను వివరించండి.

11) (a) Write about the rules regarding minor's agreement.

మైనరు ఒప్పంద నియమములు గురించి వ్రాయండి.

Or

(b) Explain about the modes of discharge of contract.

కాంట్రాక్టు విమోచనము చెందు వివిధ పద్దతులను వివరింపుము.

12) (a) Explain the Rights of unpaid sellers.

చెల్లించని విక్రేత యొక్క హక్కులను వివరించండి.

Or

(b) Define consumer. Explain consumer protection councils.

వినియోగదారుని నిర్వచించి, వినియోగదారుని రక్షణ మండలిని వివరించండి.

13) (a) Explain the digital signature in detail.

డిజిటల్ సంతకాలను గురించి వివరముగా వివరించండి.

Or

(b) Explain the need and overview of cyber law.

సైబర్ చట్టం యొక్క అవసరం మరియు పర్యావలోకనం వివరించండి.

-----------------

# విషయ సూచిక


| పాఠం సంఖ్య | పాఠం పేరు | పేజి సంఖ్య నుండి | వరకు |
|---|---|---|---|
| 1 | కాంట్రాక్టు – స్వభావం – రకాలు | 1.1 | 1.11 |
| 2 | ప్రతిపాదన – స్వీకృతి | 2.1 | 2.13 |
| 3 | ప్రతిఫలం | 3.1 | 3.13 |
| 4 | పార్టీల అర్హత | 4.1 | 4.9 |
| 5 | స్వేచ్ఛా సమ్మతి | 5.1 | 5.17 |
| 6 | న్యాయాత్మకమైన ఉద్దేశ్యము | 6.1 | 6.14 |
| 7 | ఆగంతుక కాంట్రాక్టులు | 7.1 | 7.4 |
| 8 | కాంట్రాక్టు బాధ్యతా విమోచనము | 8.1 | 8.15 |
| 9 | కాంట్రాక్టు భంగం – నష్టపరిహారాలు | 9.1 | 9.10 |
| 10 | వస్తు విక్రయ చట్టం, 1930 | 10.1 | 10.29 |
| 11 | వినియోగదారుల పరిరక్షణ చట్టం, 1986 మరియు సవరణలు 2019 | 11. 1 | 11.19 |
| 12 | సైబర్ చట్టం | 12. 1 | 12.13 |

పాఠం : 1

# కాంట్రాక్టు - స్వభావం - రకాలు

## (Contract - Nature - Kinds)

## 1.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) వ్యాపార, న్యాయశాస్త్రం ఆధారాలు తెలియును.

బి) కాంట్రాక్టు నిర్వచనము, అగ్రిమెంటు నిర్వచనము, న్యాయాత్మక బాధ్యత అంటే ఏమిటో తెలియును.

సి) సక్రమమైన కాంట్రాక్టు ఆవశ్యకాలు తెలియును.

డి) కాంట్రాక్టులలో గల రకములు తెలియును.

## విషయ సూచిక :


1.1 ఉపోద్ఘాతం

1.2 వ్యాపార న్యాయ శాస్త్రానికి మూలాధారాలు

1.2.1 ఇంగ్లీషు వ్యాపార న్యాయ శాస్త్రము

1.2.2 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన శాసనాలు

1.2.3 కోర్టుల తీర్పులు

1.2.4 వర్తకుల మధ్య వున్న ఆచార వ్యవహారములు

1.3 కాంట్రాక్టు నిర్వచనము

1.3.1 న్యాయాత్మక బాధ్యత

1.3.2 అగ్రిమెంటు

1.4 సక్రమమైన కాంట్రాక్టు - ఆవశ్యకాలు

1.5 కాంట్రాక్టుల వర్గీకరణ

1.5.1 చెల్లుబాటు ఆధారంగా వర్గీకరణ

1.5.2 వ్యక్తీకరణ ఆధారంగా వర్గీకరణ

1.5.3 ఆచరణ సాధ్యత ఆధారంగా వర్గీకరణ

1.6 నమూనా ప్రశ్నలు

1.7 చదువదగిన గ్రంథాలు

## 1.1 ఉపోద్ఘాతం :

వ్యాపార వ్యవహారాలకు సంబంధించిన న్యాయసూత్రాలను వ్యాపార న్యాయశాస్త్రముగా చెప్పవచ్చును. ఈ న్యాయశాస్త్రపు అంశాలు సాధారణంగా వ్యాపార వ్యవహారాలలో ఉత్పన్నమయ్యే వర్తకుల హక్కులకు, బాధ్యతలకు సంబంధించి వుంటాయి.

వ్యాపార వ్యవహారాలు సాధారణంగా చరాస్తులకు సంబంధించి వుంటాయి. ఎందువలననగా చరాస్తుల విలువ అతి శీఘ్రముగా మార్పు చెందుతూ వుంటుంది. కాబట్టి లాభార్జనకు అనువుగా వుంటుంది. అంతేగాక వాటి స్వామ్యము(Ownership), బదిలీచేయుట సులభము. ఎలాంటి వ్యయము చేయనవసరము లేదు. కాని స్థిరాస్థుల విషయంలో పరిస్థితి వేరుగా వుంటుంది. వీటి విలువ స్థిరంగా వుంటుంది. స్వామ్యము బదిలీ కూడా సులభం కాదు. స్థిరాస్థుల స్వామ్యం బదిలీ చేయాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి. చరాస్తులు రెండు రకాలు.

(1) స్వాధీన వస్తువులు (2) వ్యాజ్య సంపాద్యవస్తువులు

స్వాధీన వస్తువులు అనగా హక్కుదారుని స్వాధీనంలో గల వస్తువులు. ఉదా : సైకిలు, రేడియో, జేబులో వున్న పెన్ను. వీటి పరిరక్షణకు న్యాయస్థానములో పోరాడనవసరం వుండదు. మన శక్తిని ఉపయోగించి కాపాడుకొనుటకు వీలుంటుంది.

వ్యాజ్య సంపాద్య వస్తువులు అనగా హక్కుదారు న్యాయస్థానములో దావా వేసి పొందగలిగి తన స్వాధీనంలో లేని తన వస్తువులు.

ఉదా : ప్రామిసరీ నోటు, వినిమయ బిల్లు మొదలైనవి.

ఉదా : P అనే వ్యక్తి 5000లు Q అనే వ్యక్తి నుండి అప్పు తీసుకొని ప్రామిసరీనోటు వ్రాసి ఇచ్చినాడని అనుకుందాం. P సొమ్ము చెల్లించనిచో Q దావా వేయగలడు గాని P జేబులో వున్న రూ. 5000లను బలవంతంగా తీసుకొనుటకు వీలులేదు.

వ్యాపార న్యాయసూత్రాలు వర్తకులకే గాక మామూలు వ్యక్తుల వ్యవహారాలకు కూడా వర్తించును. చరాస్తులకే గాక, స్థిరాస్తులకు కూడా వర్తించును.

ఉదా : A తన పొలం B కి విక్రయించడానికి, B ఆ పొలం లక్ష రూపాయలకు కొనడానికి కాంట్రాక్టు ఏర్పరుచుకున్నారు. A,B లు వర్తకులు కాకపోయినా, పొలం చరాస్తి కాకపోయినా వారిద్దరి మధ్య కాంట్రాక్టుకు, కాంట్రాక్టు న్యాయసూత్రాలు వర్తిస్తాయి.

## 1.2 వ్యాపార న్యాయశాస్త్రానికి మూలాధారములు (Sources of Business Law) :

భారతీయ వ్యాపార న్యాయశాస్త్రానికి ఈ క్రింది అంశాలు మూలాధారాలు(Sources)గా చెప్పవచ్చు.

1. ఇంగ్లీషు వ్యాపార న్యాయశాస్త్రం
2. కేంద్ర, రాష్ట్ర శాసనసభలు చేసిన శాసనాలు
3. కోర్టు తీర్పులు
4. మన దేశములోని వర్తకుల మధ్య అమలులో వున్న ఆచార వ్యవహారాలు

**1.2.1 ఇంగ్లీషు వ్యాపార న్యాయశాస్త్రం :**

వ్యాపార న్యాయశాస్త్రవేత్తలు ఇంగ్లండులో ఉదహరించిన అంశాలు ప్రధానమైన మూలాధారాలుగా పరిగణించినారు.

**(1)** **లా మర్చెంట్ (Law Merchant) :** వ్యాపారస్తుల మధ్య ఏర్పడిన ఆచార వ్యవహారాలను 'లా మర్చెంట్' అంటారు. వ్యాపారస్తులు తాము వ్యాపారం చేసే సమయంలో వారి మధ్య సమ్మతితో ఇవి అమలు జరుపుటకు అనువుగా వుంటాయి. వర్తకుల వ్యాజ్యాలను లావాదేవీలను పరిష్కరించి అప్పటికప్పుడే తీర్పు ఇవ్వడానికి వీలుగా వర్తకులచే స్థాపించబడినవి. ఈ న్యాయస్థానములోని న్యాయాధికారులు వ్యాపార అనుభవం గలవారై వుంటారు. తరువాత ఈ న్యాయస్థానములు, ఈ లావాదేవీలలో తీర్పులు ఇవ్వసాగాయి. ఆ విధంగా తీర్పులు ఇచ్చే ప్రక్రియలో వ్యాపార న్యాయస్థానాలలో గుర్తింపు పొందిన ఆచార వ్యవహారాలను కూడా గుర్తించడం వలన అవి కూడా సామాన్య న్యాయశాస్త్ర అంశాలుగా రూపొందినవి. అంతేగాక ఈ ఆచార వ్యవహారాలను కామన్ లా కోర్టులు (Common Law Courts) గుర్తించినవి.

**(2)** **పార్లమెంటు శాసనాలు (Acts of Parliament) :** పార్లమెంటు చేసిన చట్టాలను శాసనాలు అంటారు. ప్రభుత్వపు ఆమోదము వీటికి వున్నందున వ్యాపార న్యాయశాస్త్రమునకు ఇవి బలమైన ఆధారాలుగా చెప్పవచ్చును. కొన్ని సందర్భాలలో ఈ శాసనాలు సామాన్య న్యాయశాస్త్రము, ధర్మసూత్రాలను కూడా అతిక్రమించి వుంటాయి.

**(3)** **సామాన్య న్యాయశాస్త్రము :** 'లా మర్చంట్' రద్దు అయిన తరువాత మామూలు న్యాయస్థానము న్యాయ శాస్త్ర ఆధారంగా ఏర్పడినవి. ఈ న్యాయస్థానములు వ్యాజ్య పరిష్కార సందర్భములో ఉపయోగించిన వ్యాపార ఆచార సంప్రదాయములు, న్యాయసూత్ర సముదాయమును సామాన్య న్యాయశాస్త్రము అంటారు. వీటిని కూడా వ్యాపార న్యాయశాస్త్రానికి బలమైన ఆధారాలుగా పేర్కొనవచ్చును.

**(4)** **ధర్మ సూత్రములు (Justice, Equity and Good Conscience) :** ఇంగ్లండులో వ్యాజ్యం తెచ్చిన వ్యక్తులు సమగ్రమైన నష్టపరిహారము న్యాయ స్థానములో పొందలేకపోయినపుడు, వారు "ఛాన్సరీ కోర్టులకు" (Chancery Courts) దరఖాస్తు చేసుకొనేవారు. రాజప్రతినిధులైన ఛాన్సలర్స్ (Chancellors) ఈ కోర్టులలో న్యాయాధికారులుగా ఉండేవారు. కొన్ని వ్యాజ్యాలలో అవసరమని భావించినపుడు వీరు న్యాయసూత్ర ప్రక్రియను అధిగమించి సంతృప్తికరమైన, ఆమోదయోగ్యమైన న్యాయమును తీర్పుగా ఇచ్చేడివారు. కాని కామన్ లా కోర్టులను (Common Law Courts), ఛాన్సరీ కోర్టు (Chancery Courts)లను రద్దు చేసి ప్రస్తుత హైకోర్టు విధానమును హైకోర్టు జ్యూడికేచరు చట్టము 1873 (Highcourt Judicature Act 1873) ద్వారా ప్రవేశపెట్టినారు. ఈ న్యాయస్థానములు కూడా సామాన్య న్యాయసూత్రాలను, ధర్మసూత్రాలను అన్వయిస్తూ ఉండేవి. ఒక వేళ సామాన్య న్యాయసూత్రాలు, ధర్మసూత్రాలకు విరుద్ధంగా వుంటే ధర్మసూత్రాలకే ప్రాధాన్యత ఇవ్వడం జరిగేది.

**1.2.2 కేంద్ర, రాష్ట్ర ప్రభత్వములు చేసిన శాసనములు :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన వ్యాపార చట్టాలన్ని వ్యాపార న్యాయశాస్త్రానికి మూలాధారాలుగా చెప్పవచ్చును.

ఉదా : భారతీయ కాంట్రాక్టు చట్టము 1872, భారత కంపెనీల చట్టము 1956, వస్తు విక్రయ చట్టము 1930, భాగస్వామ్య చట్టము 1932 మొదలైనవి.

**1.2.3 కోర్టుల తీర్పులు :**

న్యాయ పరిరక్షణలో న్యాయాధీశులు కొన్ని సందర్భములలో ఎంతో విజ్ఞతతో వ్యవహరించి ఇచ్చిన చాలా తీర్పులు కూడా భారత వ్యాపార న్యాయశాస్త్రమునకు మూలాధారములుగా పేర్కొనవచ్చును.

**1.2.4 వర్తకుల మధ్య వున్న ఆచార వ్యవహారాలు :**

వర్తకుల మధ్య వచ్చిన వివాదాలను పరిష్కరించుటకు అనాదిగా వారు అనేక ఆచార వ్యవహారాలను పాటించెడి వారు. ఈ ఆచార వ్యవహారాలు కూడా భారతీయ వ్యాపార న్యాయశాస్త్రానికి ప్రముఖమైన మూలాధారాలుగా చెప్పవచ్చును.

## 1.3 కాంట్రాక్టు - నిర్వచనము :

కాంట్రాక్టు అనే పదం contractum అనే లాటిన్ పదము నుండి ఉద్భవించినది. Contractum = Drawn together అనగా ఇరుపార్టీలను దగ్గరకు చేర్చుట.

భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(h) ప్రకారం "అమలు పరచదగిన ప్రతి అగ్రిమెంటు కాంట్రాక్టు".

సర్‌జాన్ సాల్మండ్ (Sir John Salmond) అభిప్రాయంలో "పార్టీల మధ్య నిర్దిష్టమైన, చట్టబద్ధమైన అవశ్యపాలనీయమైన బాధ్యతలను సృష్టించగల ఒప్పందం కాంట్రాక్టు".

న్యాయశాస్త్ర రీత్యా ప్రతి కాంట్రాక్టులోను రెండు అంశాలు వుంటాయి.

(1) న్యాయాత్మక బాధ్యత (Legal Obligation)

(2) అగ్రిమెంటు (Agreement)

**1.3.1 న్యాయాత్మక బాధ్యత (Legal Obligation) :**

న్యాయాత్మక బాధ్యత అనగా న్యాయబంధము (Viniculum Juris = Legal tie). నిర్దిష్టమైన పనిని లేదా పనులను చేయడానికి లేదా చేయకుండా ఉండటానికి ఒక వ్యక్తి మీద గాని, కొంత మంది వ్యక్తుల మీద గాని విధించు న్యాయబంధమును న్యాయాత్మక బాధ్యతగా చెప్పవచ్చును. న్యాయాత్మక బాధ్యతకు ఈ క్రింద ఉదహరించిన ఆవశ్యకాలు ఉంటాయి.

1. ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఉండాలి.
2. న్యాయాత్మక బాధ్యత నిర్ధిష్టమైన పనికి లేదా పనులకు సంబంధించినదై ఉండాలి.
3. న్యాయాత్మక బాధ్యత, న్యాయవిషయాలకు సంబంధించనదై వుండవలెను. సాంఘిక విషయాలకు, కుటుంబ విషయాలకు సంబంధించినదై ఉండరాదు.

ఉదా : స్నేహితుని విందు భోజనానికి ఆహ్వానించుట.

**బేల్‌ఫూర్** Vs **బేల్‌ఫూర్** (Balfour Vs Balfour) : ఈ కేసులో ఒక ఇంగ్లీషు యువకుడు సిలోన్‌లో ఉద్యోగం చేస్తూ శలవులకు తన భార్యతో ఇంగ్లండు వెళ్ళారు. శలవలనంతరం తిరిగి ఉద్యోగంలో చేరుటకు బయలుదేరినాడు. కాని భార్యకు జబ్బుచేయగా, జబ్బునయమయ్యేంతవరకు అక్కడే ఉండమని, మందుల ఖర్చులకు గాను ప్రతి నెల £ 30 పంపిస్తానని వాగ్దానము చేసినాడు. తరువాత ఆ విధంగా సొమ్ము పంపనందున భార్య భర్తపై దావా తెచ్చినది. భార్యాభర్తల మధ్య జరిగే మామూలు సంభాషణాలు న్యాయాత్మక భాధ్యతను సృష్టించవని, వారి మధ్య అమలు జరపగల కాంట్రాక్టు లేదని కోర్టు తీర్పు యిచ్చినది.

**వీక్స్** Vs **టై బాల్డు** (Weeks Vs Tybold) : ఈ కేసులో ఒక యువకుడు విందు జరుగుతుండగా ఆ ఇంటి యజమానితో అతని కుమార్తె వివాహ విషయం గురించి ప్రస్తావించగా, ఆ యజమాని "నా అంగీకారంతో ఎవరు నా కుమార్తెను వివాహం చేసుకుంటారో అతనికి £ 100లు ఇస్తాను అన్నాడు. అదే యువకుడు కొంత కాలము తరువాత యింటి యజమాని కుమార్తెను అతని అనుమతితో

పెళ్ళిచేసుకొన్నాడు. £ 100లు చెల్లించమని ఈ దావా తెచ్చినారు. యథాలాపముగా మాట్లాడిన మాటలు న్యాయాత్మక బాధ్యతను సృష్టించవని దావా చెల్లదని కోర్టు తీర్పుయిచ్చినది.

**ఫరీనా** Vs **ఫికస్** (Farina Vs Ficus) : ఈ కేసులో మామగారు అల్లుడికి ఉత్తరం వ్రాస్తూ అందులో "నా తదనంతరం నా కుమార్తెకు అనగా నీ భార్యకు కూడా నా ఆస్తిలో వాటా వుంటుంది" అని వ్రాశాడు. తరువాత కొంత కాలానికి మామగారు మరణించగా అల్లుడు మామగారి వారసులపై ఆస్తిలో వాటా కోసం దావా తెచ్చినాడు. యథాలాపముగా వ్రాసిన మాటలు న్యాయాత్మక బాధ్యతను సృష్టించలేవని దావాను కోర్టు కొట్టివేసింది.

న్యాయాత్మక బాధ్యత అగ్రిమెంటు ద్వారా ఏర్పడుతుంది. కాని క్రింద పేర్కొన్న సందర్భాలలో పార్టీల మధ్య ఎలాంటి అగ్రిమెంటు లేకుండానే న్యాయాత్మక బాధ్యత ఉత్పన్నము కావడానికి అవకాశము కలదు.

(1) వ్యవహారాల అపకృత్యములు (Torts)

(2) న్యాయస్థానముల తీర్పులు (Court Judgements)

(3) క్వాజీ కాంట్రాక్టులు (Quasi Contracts)

(4) ధర్మకర్త - లాభానుభోక్తల మధ్య ఉత్పన్నమయ్యే బంధాలు (Trustees and Benificiaries)

**1.3.2 అగ్రిమెంటు** (Agreement) :

ప్రతిపాదన, స్వీకృతుల కలయికను అగ్రిమెంటు అంటారు. అగ్రిమెంటు కాంట్రాక్టుకు పునాది వంటిది. కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(E) ప్రకారం "ప్రామిస్ లేదా ఒకదానికొకటి ప్రతిఫలముగాగల ప్రామిస్‌ల సముదాయము అగ్రిమెంటు". అగ్రిమెంటుకు ఈ క్రింది ఆవశ్యకములు ఉండవలెను.

1) ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు వుండవలెను.

2) అగ్రిమెంటు, నిర్దిష్టమైన పని లేక పనులకు సంబంధించి ఉండవలెను.

3) అగ్రిమెంటు న్యాయ విషయాలకు సంబంధించి ఉండవలెను. సాంఘిక విషయాలు, కుటుంబ విషయాలకు సంబంధించినవిగా ఉండరాదు.

4) అగ్రిమెంటు ఏర్పడే పార్టీల మధ్య ఏకమనస్కత ఉండవలెను.

అన్ని రకాల అగ్రిమెంట్లు న్యాయాత్మక బాధ్యతను ఉత్పన్నము చేయలేవు. కాబట్టి అలాంటి అగ్రిమెంట్లు కాంట్రాక్టులుగా రూపొందవు. ఈ క్రింది వాటిని ఆ తరహా అగ్రిమెంట్లుగా చెప్పవచ్చు.

1) హక్కులను బదలాయించే అగ్రిమెంట్లు

ఉదా : అమ్మకపు దస్తావేజులు (Sale Deeds), బదిలీ దస్తావేజులు (Transfer Deeds)

2) హక్కులను, బాధ్యతలను కొల్పోయే అగ్రిమెంట్లు.

ఉదా : విడుదల (Release), వదులుకోలు(Surrender)

3) సాంఘిక విషయాలకు సంబంధించిన అగ్రిమెంట్లు

ఉదా : సినిమాకు వెళ్ళడానికి స్నేహితునితో ఒప్పందం.

కాబట్టి అన్ని అగ్రిమెంట్లు న్యాయాత్మక బాధ్యతను సృష్టించవు. అంతేగాక న్యాయాత్మక బాధ్యత కూడా అగ్రిమెంటు వలన ఏర్పడదని పైన తెలుసుకున్నాము. ఈ సందర్భములో సాల్‌మండ్(Salmond) ఈ విధంగా వ్యాఖ్యానించినారు "కాంట్రాక్టు న్యాయ శాస్త్రము సంపూర్ణముగా అగ్రిమెంట్లకు, బాధ్యతలకు సంబంధించినది కాదు. బాధ్యతలను సృష్టించే అగ్రిమెంట్లకు, అగ్రిమెంటు ద్వారా ఉత్పన్నమయ్యే బాధ్యతలకు సంబంధించినది".

పైన పేర్కొన్న వివరాల దృష్ట్యా అన్ని అగ్రిమెంట్లు కాంట్రాక్టులు కావు. కాని అన్ని కాంట్రాక్టులు అగ్రిమెంట్లే.

## 1.4 సక్రమమైన కాంట్రాక్టు ఆవశ్యకాలు (Essentials of a valid Contract) :

భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 10 ప్రకారం "కాంట్రాక్టు చేయడానికి సమర్థులైన పార్టీలు, బుద్ధిపూర్వకమైన సమ్మతితో, న్యాయ సమ్మతమైన ప్రతిఫల నిమిత్తము, న్యాయపూరితమైన ఉద్దేశముతో చేసుకొన్న అగ్రిమెంట్లన్నీ కాంట్రాక్టులే. అంతేగాక అవి చెల్లనివిగా ప్రకటితమై ఉండరాదు". ఈ వివరణ ప్రకారం సక్రమమైన కాంట్రాక్టుకు ఈ క్రింది ఆవశ్యకాలు ఉండవలెను.

**(1)** **ప్రతిపాదన - స్వీకృతి (Offer and Acceptance) :** కాంట్రాక్టులో తప్పనిసరిగా ఇరు పార్టీలు ఉండాలి. ఒక పార్టీ ప్రతిపాదన చేయగా రెండవ పార్టీ స్వీకృతి ఇవ్వవలెను. ఆ ప్రతిపాదన నిర్దిష్టంగా వుండాలి. స్వీకృతి బేషరతుగా, ప్రతిపాదనకర్త కోరిన విధంగా వుండాలి.

**(2)** **పార్టీల సామర్థ్యము (Capacity of Parties) :** కాంట్రాక్టు ఏర్పరచుకొనే పార్టీలకు కాంట్రాక్టు అర్హత ఉండవలెను. అనగా వారు చట్టము క్రింద అనర్హులుగా ప్రకటించబడిన వారై వుండరాదు. అనర్హత మానసిక వైకల్యము, అవివేక చిత్తము, హోదావలన సంక్రమించును. అలాంటి అనర్హులతో చేసుకున్న కాంట్రాక్టు సక్రమము కాదు. మానసిక వైకల్యము వలన మైనర్లు; అవివేక చిత్తము వలన మూఢులు, త్రాగుబోతులు; హోదావలన దివాలాదార్లు, విదేశీ శత్రువులు మొ॥వారు కాంట్రాక్టులో ప్రవేశించుటకు అనర్హులు.

**(3)** **సర్వసమ్మతి (Consensum - ad - idem = Identity of Minds) :** దీనినే ఏకమనస్కత లేక మనోభావతుల్యత అంటారు. కాంట్రాక్టులోని ఇరుపార్టీలు ఒకే విషయాన్ని, ఒకే సమయంలో, ఒకే విధంగా అంగీకారం ఏర్పరచుకుంటే వారి మధ్య సర్వసమ్మతి వుందని చెప్పవచ్చు. సర్వసమ్మతి లోపించిన కాంట్రాక్టు సక్రమము కాదు.

ఉదా : A అనే వ్యక్తికి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో ఒక ఇల్లు, పాకిస్తాన్‌లోని హైదరాబాద్‌లో ఇంకొక ఇల్లు కలదు. A తన పాకిస్తాన్‌లోని హైదరాబాద్ ఇంటిని మనస్సులో ఉంచుకొని "నా యింటిని పది లక్షల రూపాయలకు అమ్ముతానని" B కి ప్రతిపాదన చేయగా, B ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌లో వున్న A ఇంటిని మనస్సులో పెట్టుకొని స్వీకృతిని ఇస్తే వారిద్దరి మధ్య సర్వసమ్మతి లోపించిన కారణాన ఆ కాంట్రాక్టు సక్రమము కాదు.

**(4)** **న్యాయాత్మక సంబంధము (Legal Relationship) :** పార్టీల మధ్య ఉత్పన్నమయ్యే అగ్రిమెంటు న్యాయాత్మక సంబంధాన్ని సృష్టించేదిగా వుండాలి. సాంఘికపరమైన అగ్రిమెంట్లు కాంట్రాక్టులుగా రూపొందజాలవు.

ఉదా : స్నేహితునితో సినిమాకు వెళ్దామని వాగ్దానం చేయుట.

**(5)** **ప్రతిఫలం (Consideration) :** న్యాయశాస్త్రరీత్యా అమలుపరచదగిన ప్రతికాంట్రాక్టుకు మన దేశంలో ప్రతిఫలం అవసరం. ప్రతిఫలం అనగా తిరిగి వచ్చునది అని అర్థం. ప్రతిఫల రహితమైన కాంట్రాక్టులను ఉచితమైన కాంట్రాక్టులు (Gracious Contracts) అంటారు. అలాంటి కాంట్రాక్టులు సక్రమమైనవి కావు.

ఉదా : P తన సైకిలును Q కి ఉచితంగా ఇస్తానంటే ప్రతిఫలం లేనందున P,Q ల మధ్య అమలుపరచదగిన కాంట్రాక్టు ఏర్పడదు.

**(6) న్యాయసమ్మతమైన ప్రతిఫలం (Lawful Consideration) :** కాంట్రాక్టులో ప్రతిఫలం ఉంటే చాలదు. అది న్యాయ సమ్మతంగా వుండాలి. అనగా ప్రతిఫలం న్యాయవిరుద్ధంగా గాని, అన్యాయమైనదిగా గాని వుండరాదు.

ఉదా : B, C ని చంపడానికి, ఇందుకు ప్రతిఫలంగా A, B కి రూ. 10,000లు ఇవ్వడానికి కాంట్రాక్టు ఏర్పరచుకుంటే ప్రతిఫలం న్యాయవిరుద్ధం. కాబట్టి ఈ కాంట్రాక్టు చెల్లదు.

**(7) స్వేచ్ఛా సమ్మతి (Free Consent) :** దీనినే బుద్ధిపూర్వకమైన సమ్మతి అని కూడా అంటారు. కాంట్రాక్టులోని పార్టీల సమ్మతి స్వేచ్ఛగా లేదా బుద్ధిపూర్వకంగా ఉండాలి. లేనిచో ఆ కాంట్రాక్టు చెల్లదు. దోషభూయిష్టమైన సమ్మతితో ఏర్పడిన కాంట్రాక్టు చెల్లదు. కాంట్రాక్టులో సమ్మతి బలప్రయోగము వలన గాని, అనుచిత ప్రయోగము వలన గాని, మోసము వలన గాని పొందితే అలాంటి స్వీకృతి స్వేచ్ఛా సమ్మతిగా పరిగణించరు. అలాంటి సమ్మతితో ఏర్పడిన కాంట్రాక్టులు చెల్లనివిగా పరిగణిస్తారు.

ఉదా : P, Q ని చంపుతానని బెదిరించి ఒక ప్రామిసరీ నోటుపై సంతకం తీసుకున్నాడు. స్వేచ్ఛా సమ్మతి లోపించినందున ఇది చెల్లదు.

**(8) ఆచరణ సాధ్యత (Possibility of Performance) :** కాంట్రాక్టులోని అంశాలు ఆచరణకు అనువుగా ఉండవలెను. అసంభవమైన ఆచరణకు వీలులేని పనులను నెరవేర్చుటకుగాను ఏర్పరచుకున్న కాంట్రాక్టులు చెల్లవు.

ఉదా : రెండు సమాంతర రేఖలు కలుపుటకు ఒప్పందం.

**(9) నిర్దిష్టం (Certainity) :** కాంట్రాక్టులోని అంశాలు స్పష్టంగా, ఖచ్చితంగా ఉండాలి. అనిశ్చితమైన, సందిగ్ధమైన అంశాలతో ఏర్పడిన కాంట్రాక్టు చెల్లదు.

ఉదా : A, B తాలూకు ఇంటిని ఆధునీకరణ చేస్తే నెలకు రూ. 1000లకు అద్దెకు తీసుకుంటానని చెప్పినాడు. ఇది చెల్లదు. ఎందుచేతనంటే ఈ కాంట్రాక్టులో 'ఆధునీకీకరణ'అనే వాదానికి స్పష్టత లేదు.

**(10) న్యాయసమ్మతమైన ఉద్దేశం (Lawful Objective) :** కాంట్రాక్టు యొక్క ప్రధాన ధ్యేయం న్యాయసమ్మతంగా వుండాలి. చట్టవిరుద్ధమైన, అవినీతికరమైన, ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన, సంఘానికి హాని కలిగించే ఉద్దేశముతో పార్టీలు కాంట్రాక్టు ఏర్పరచుకుంటే అవి చెల్లవు.

ఉదా : A, B లు కలిసి నల్లమందు వ్యాపారం చేయడానికి కాంట్రాక్టు ఏర్పరచుకున్నారు. ఉద్దేశం చట్టవిరుద్ధం కావున అది చెల్లదు.

**(11) చెల్లనివిగా పేర్కొనబడి వుండరాదు (Declared as Voids) :** పార్టీల మధ్య ఏర్పడిన అగ్రిమెంటు దేశములో అమలులోగల ఏ చట్టము చేతనైనా చెల్లనివిగా ప్రకటించబడి వుండరాదు.

ఉదా : వర్తక నిరోధక అగ్రిమెంట్లు.

**(12) చట్టబద్ధమైన లాంఛనాలు (Legal Formalities) :** కొన్ని రకాల కాంట్రాక్టులు తప్పనిసరిగా లిఖిత పూర్వకంగా వుండాలి. ఉదా : అన్యాక్రాంత పత్రాలు. కొన్ని రకాల కాంట్రాక్టులు విధిగా లిఖితపూర్వకంగా ఉండడమేగాక రిజిష్టరు కూడా చేయించాలి.

ఉదా : స్థిరాస్తుల బదిలీలు.

## 1.5 కాంట్రాక్టుల వర్గీకరణ (Classification of Contracts) :

కాంట్రాక్టులను ముఖ్యంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చును. అవి :

1. చెల్లుబాటు ఆధారంగా
2. వ్యక్తీకరణ ఆధారంగా
3. ఆచరణ సాధ్యత ఆధారంగా

పైన పేర్కొన్న వర్గీకరణను క్రింది విధంగా విపులీకరించవచ్చును.

### 1.5.1 చెల్లుబాటు ఆధారంగా వర్గీకరణ :

1. **సక్రమమైన కాంట్రాక్టు (Valid Contract) :** భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 10 ప్రకారం అన్ని ఆవశ్యకాలు ఉన్న కాంట్రాక్టును సక్రమమైన కాంట్రాక్టు అంటారు. వీటినే క్రమబద్ధమైన కాంట్రాక్టులు, చెల్లే కాంట్రాక్టులు అని కూడా అంటారు. ఇవి న్యాయసంబంధమైన హక్కులను, బాధ్యతలను పార్టీలకు కలుగజేస్తాయి. ఇవి అమలుపరుచుటకు వీలున్న కాంట్రాక్టులు.

ఉదా : A తన ఇంటిని ఐదు లక్షల రూపాయలకు అమ్ముతానని B కి ప్రతిపాదన చేసినాడు. ఇందుకు B స్వీకృతిని ఇచ్చినాడు. ఇది సక్రమమైన కాంట్రాక్టు.

2. **చెల్లని కాంట్రాక్టు (Void Contract) :** కాంట్రాక్టులోని ఇరు పార్టీలలో ఎవరూ కూడా అమలు జరపలేని కాంట్రాక్టును చెల్లని కాంట్రాక్టు అంటారు. కాంట్రాక్టు ముఖ్య లక్షణాలలో ఏది లోపించినా ఆ కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది. కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(G) ప్రకారం "అమలుపరచలేని అగ్రిమెంటు చెల్లనిది అవుతుంది".

క్రమబద్ధమై కాంట్రాక్టుకు న్యాయ పూర్వక ఫలితాలు వుంటాయి. చెల్లని కాంట్రాక్టులకు న్యాయపూర్వక ఫలితాలు వుండవు. కొన్ని కాంట్రాక్టులు మొదటి నుండి (Abinitio = From the very begining) చెల్లనివిగా వుంటాయి. మరికొన్ని క్రమబద్ధమైన కాంట్రాక్టులుగా రూపొంది తరువాత ఏర్పడిన పరిస్థితుల వలన చెల్లని స్థితి పొందవచ్చును. కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(J) న్యాయశాస్త్ర దృష్ట్యా ఒక కాంట్రాక్టును అమలుజరపడానికి వీలులేకపోతే అప్పటి నుండి అది చెల్లనిది అవుతుంది.

ఉదా : ప్రతిఫలరహితమైన కాంట్రాక్టులు, మైనర్లతో ఏర్పరచుకున్న కాంట్రాక్టులు, న్యాయవిరుద్ధమైన ఉద్దేశాలు గల కాంట్రాక్టులు.

3. **చెల్లగూడని కాంట్రాక్టులు (Voidable Contracts) :** భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(I) ప్రకారం "పార్టీలలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఇష్ట ప్రకారం న్యాయశాస్త్రరీత్యా ఒక అగ్రిమెంటును అమలు జరుపుటకు వీలుండి, ఇతరుల ఇష్టప్రకారం అమలుజరుపుటకు వీలులేనపుడు అలాంటి అగ్రిమెంటును చెల్లగూడని కాంట్రాక్టు" అంటారు. ఈ విధమైన కాంట్రాక్టులలో కాంట్రాక్టును అమలు పరుచుట లేదా రద్దు చేసుకొనుట ఒక పార్టీ ఇష్టాఇష్టముల మీద ఆధారపడి వుంటుంది. అంతేగాని వేరొక పార్టీ ఇష్టాఇష్టములతో సంబంధం లేదు. ఆ విధంగా హక్కు గల పార్టీ రద్దు చేయడానికి సిద్ధపడి రద్దు చేసే దాకా క్రమబద్ధమైన కాంట్రాక్టుగానూ, రద్దు చేసినప్పటి నుండి చెల్లని కాంట్రాక్టుగాను పరిగణిస్తారు. కాంట్రాక్టులో ఒక పార్టీ తన సమ్మతిని బల ప్రయోగం, అనుచిత ప్రభావం, మోసం, అసత్య వర్ణనల వలన తెలియజేస్తే అది చెల్లగూడని కాంట్రాక్టు అవుతుంది.

ఉదా : P అనే వ్యక్తి Q ని చంపుతానని బెదిరించి రూ. 10,000ల ప్రామిసరీ నోటుపై సంతకం తీసుకున్నాడు. ఇది బలప్రయోగం వలన ఏర్పడిన కాంట్రాక్టు. కాబట్టి చెల్లగూడని కాంట్రాక్టు అవుతుంది.

**4. న్యాయవిరుద్ధమైన కాంట్రాక్టులు** (Illegal Contracts) : అవినీతికరమైన ఒప్పందాలు, క్రిమినల్ ఒప్పందాలు, సాంఘిక నియమాలకు, ప్రజావిధానమునకు విరుద్ధమైన ఒప్పందాలు, న్యాయవిరుద్ధమైన కాంట్రాక్టులుగా చెప్పవచ్చును. ఇవి చెల్లనివి అవుతాయి. వీటిని అమలుపరుచుటకు వీలులేదు. న్యాయవిరుద్ధమైన కాంట్రాక్టులతో సంబంధం గల అనుబంధ కాంట్రాక్టులు (Colletaral Contracts) కూడా చెల్లనివి అవుతాయి. న్యాయవిరుద్ధమైన కాంట్రాక్టులన్నీ చెల్లని కాంట్రాక్టులు. కాని చెల్లని కాంట్రాక్టులన్ని న్యాయవిరుద్ధమైన కాంట్రాక్టులు కావు.

ఉదా : A వేశ్యాగృహం నిర్వహించడానికి B ఇంటిని రూ. 1000లకు అద్దెకు తీసుకుంటున్నాడు. B కి అద్దె అడ్వాన్సు ఇవ్వడానికి గాను A, C కి ఈ విషయం చెప్పి రూ. 10,000లు అప్పు తీసుకున్నాడు. A, B ల మధ్య కాంట్రాక్టు చెల్లదు. దాని ఆధారంగా A, C ల మధ్య కాంట్రాక్టు కూడా చెల్లనిది అవుతుంది.

### 1.5.2 వ్యక్తీకరణ ఆధారంగా వర్గీకరణ :

1. విస్పష్టమైన **కాంట్రాక్టులు** (Express Contracts) : లిఖిత పూర్వకంగా గాని, నోటి మాటలతోగాని స్పష్టంగా చేసుకొనే కాంట్రాక్టును విస్పష్టమైన కాంట్రాక్టు అంటారు.

ఉదా : P తన ఇంటిని రూ. 5 లక్షల రూపాయలకు అమ్ముతానని లిఖిత పూర్వకంగా గాని, నోటి మాట ద్వారా గాని చెబితే అది విస్పష్టమైన కాంట్రాక్టు.

2. ప్రచ్ఛన్నమైన **కాంట్రాక్టులు** (Implied Contracts) : వ్యక్తుల ప్రవర్తనను బట్టి, పరిస్థితులను అనుసరించి, ఇలాంటి కాంట్రాక్టులు న్యాయసూత్రాలు సృష్టిస్తాయి. వీటిని "కాంట్రాక్టులు సృష్టించిన సంబంధాలు" అని అంటారు. వీటినే సంభావిత కాంట్రాక్టులు, క్వాజీ కాంట్రాక్టులు (Quasi Contracts) అని కూడా అనవచ్చు.

ఉదా : A తాలుకూ పర్సు B కి దొరికింది. A, B ల మధ్య ఎలాంటి కాంట్రాక్టు లేకపోయినా B, A ని వెతికి ఆ పర్సును A కు అందజేయాలి.

3. **అనుక్తమైన కాంట్రాక్టులు** (Tacit Contracts) : మాటలు, రాతలు లేకుండా వ్యక్తుల చర్యలను బట్టి ఈ రకమైన కాంట్రాక్టులు ఏర్పడతాయి. పార్టీల ప్రవర్తనల ద్వారానే ప్రతిపాదన, స్వీకృతులు ఉంటాయి.

ఉదా : హోటల్‌లో భోజనం చేయుట, బస్సులో ప్రయాణం చేయడం మొదలైనవి.

### 1.5.3 ఆచరణ సాధ్యత ఆధారంగా వర్గీకరణ :

(1) **అమలు జరపలేని కాంట్రాక్టులు** (Unenforceable Contracts) : ఈ రకమైన కాంట్రాక్టులు అమలు జరపడానికి వీలుంటుంది కాని కొన్ని సాంకేతిక లోపాల (Technical Defects) వలన వాటిని అమలు జరపడానికి వీలుకాకపోవచ్చును.

ఉదా : కాంట్రాక్టు పత్రం మీద నిర్ణీత స్టాంపు లేకపోవడం, రిజిష్టరు చేయవలసినవి రిజిష్టరు చేయించకపోవడం. ఆ సాంకేతిక లోపాలను తొలగించిన తరువాత వీటిని అమలుపరచవచ్చును.

**(2) ఏకపక్ష కాంట్రాక్టులు (Unilateral Contracts) :** ఈ కాంట్రాక్టులను "అమలు జరిపిన ప్రతిఫలయుక్తమైన కాంట్రాక్టులు" అని కూడా అంటారు. ఏకపక్ష కాంట్రాక్టులలో ఒక పార్టీ తన బాధ్యతను కాంట్రాక్టు ఏర్పడే సమయానికి నెరవేర్చుట జరిగి, రెండవ పార్టీ తన బాధ్యతను నిర్వహించవలసి వుంటుంది.

ఉదా : రైల్వే కూలి రైలులో సామాను పెట్టుట. సామాను రైలులో పెట్టిన తరువాత మాత్రమే కూలి చెల్లించే బాధ్యత ప్రయాణికునికి ఏర్పడుతుంది.

**(3) ద్విపక్ష కాంట్రాక్టులు (Bilateral Contracts) :** ఈ కాంట్రాక్టులను "అమలు జరపవలసిన ప్రతిఫలయుక్తమైన కాంట్రాక్టులు" అని కూడా అంటారు. ద్విపక్ష కాంట్రాక్టులలో ఇరు పార్టీలు తమ తమ బాధ్యతలను నెరవేర్చవలసి వుంటుంది.

ఉదా : A అనే వ్యక్తి 100 బస్తాల ధాన్యం B కి రెండు నెలల తరువాత ఇస్తానని, వెంటనే B, A కు ఆ ధాన్యం ధర మొత్తం రూ. 50,000 ఇవ్వాలని కాంట్రాక్టు.

**(4) పూర్తి అయిన కాంట్రాక్టు (Executed Contract) :** ఇరు పార్టీలు తమ బాధ్యతలను పూర్తి చేసిన ఎడల దానిని పూర్తి అయిన కాంట్రాక్టు లేక నెరవేర్చిన కాంట్రాక్టు అంటారు.

ఉదా : **నగదు అమ్మకాలు (Cash Sales) :** ఇందులో సొమ్ము చెల్లించుట, వస్తువు ఇవ్వడం జరిగిపోయి నెరవేర్చవలసిన బాధ్యతలు ఎవరిమీద వుండవు.

## 1.6 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు**

1. స్వాధీన వస్తువులు
2. వ్యాజ్య సంపాద్య వస్తువులు
3. లా మర్చెంట్ (Law Merchant)
4. సామాన్య న్యాయశాస్త్రము
5. కాంట్రాక్టు అనగానేమి ?
6. న్యాయాత్మక బాధ్యత అనగానేమి ?
7. అగ్రిమెంటు అనగానేమి ?
8. సర్వసమ్మతి అనగానేమి ?
9. ప్రతిఫలం అనగానేమి ?
10. స్వేచ్ఛాసమ్మతి అంటే ఏమిటి ?
11. చెల్లని కాంట్రాక్టు అనగానేమి ?
12. చెల్లగూడని కాంట్రాక్టు అనగానేమి ?

13. ప్రచ్ఛన్నమైన కాంట్రాక్టులు అనగానేమి ?

14. ఏకపక్ష కాంట్రాక్టులు అనగానేమి ?

15. ద్విపక్ష కాంట్రాక్టులు అనగానేమి ?

**10 మార్కుల ప్రశ్నలు**

1. చరాస్తి అనగానేమి ? చరాస్తులలో రకాలు వ్రాయుము.

2. ఇంగ్లీషు వ్యాపార న్యాయశాస్త్రమునకు గల మూలధారాలు ఏమి ?

3. న్యాయాత్మక బాధ్యత అనగానేమి ? దాని ముఖ్యాంశాలు వ్రాయుము.

4. అగ్రిమెంటు అనగానేమి ? దాని ముఖ్యాంశాలు వ్రాయుము.

5. చెల్లుబాటు ఆధారంగా కాంట్రాక్టుల వర్గీకరణ వ్రాయుము.

6. ఆచరణ సాధ్యత దృష్ట్యా కాంట్రాక్టుల వర్గీకరణ వ్రాయుము.

**20 మార్కుల ప్రశ్నలు**

1. భారతీయ వ్యాపార న్యాయశాస్త్రమునకు గల మూలాధారాలు వివరించుము.

2. అగ్రిమెంటు, న్యాయాత్మక బాధ్యతను వివరించి వాటి ముఖ్యాంశాలు వ్రాయుము.

3. "అన్ని కాంట్రాక్టులు అగ్రిమెంట్లు. కాని అన్ని అగ్రిమెంట్లు కాంట్రాక్టులు కావు" - వివరించుము.

4. సక్రమమైన కాంట్రాక్టు ఆవశ్యకాలు పేర్కొనుము.

5. వివిధ రకాల కాంట్రాక్టులను గురించి వ్రాయండి.

## 1.7 చదువదగిన గ్రంథాలు :


1. Contract Act, 1872 - Bare Act
2. A.C. Patna - Indian Contract Act, 1872, Asia Publishing House, Bombay
3. K. Ponnuswami & K.K. Puri - Cases and Materials on Law of Contract, Eastern Book Co., Lucknow
4. Avatar Singh - Law of Contract, Eastern Book Co., Lucknow
5. Avatar Singh - The Principles of Mercantile Law, Eastern Book Co., Lucknow
6. M.C. Shukla - A Manual of Mercantile Law, S. Chand & Co., New Delhi
7. ND Kapoor - Mercantile Law


*- శ్రీ టి. త్యాగరాజు*

పాఠం : 2

# ప్రతిపాదన – స్వీకృతి

## (Offer - Acceptance)

**2.0 లక్ష్యం :** ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) ఈ పాఠంలో ప్రతిపాదన అంటే ఏమిటో తెలియును.

బి) సక్రమమైన ప్రతిపాదన ఆవశ్యకాలు తెలియును.

సి) ప్రతిపాదన రద్దు, ఉపసంహరణ, తిరస్కృతి గురించి తెలియును.

డి) స్వీకృతి అంటే ఏమిటో తెలియును

ఇ) స్వీకృతి ఆవశ్యకాలు తెలియును

ఎఫ్) ప్రతిపాదన - స్వీకృతిని తెలియజేయుట, ఉపసంహరించుట గురించి తెలియును.

**విషయ సూచిక :**


**2.1** ప్రతిపాదన - నిర్వచనం

**2.2** సక్రమమైన ప్రతిపాదన - ఆవశ్యకాలు

**2.3** ప్రతిపాదన - రద్దు - ఉపసంహరణ - తిరస్కృతి

**2.3.1** ప్రతిపాదన - రద్దు

**2.3.2** ప్రతిపాదన - ఉపసంహరణ

**2.3.3** ప్రతిపాదన - తిరస్కృతి

**2.4** స్వీకృతి - నిర్వచనము

**2.4.1** స్వీకృతి - ఆవశ్యకాలు

**2.5** ప్రతిపాదన - స్వీకృతిని తెలియజేయుట, ఉపసంహరించుట

**2.5.1** స్వీకృతిని తెలియజేయుట - ఎప్పుడు పూర్తి అవుతుంది.

**2.6** నమూనా ప్రశ్నలు

**2.7** చదువదగిన గ్రంథాలు

## 2.1 ప్రతిపాదన - నిర్వచనం :

ఒక ఒప్పందం ఏర్పడాలంటే కావలసిన ప్రధాన ఆవశ్యకములలో ప్రతిపాదన ఒకటి. భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(a) ప్రకారం "ఎదుటి వ్యక్తి యొక్క సమ్మతి పొందే ఉద్దేశంతో ఒక వ్యక్తి నిర్దిష్టమైన పని చేయడానికి లేక మానుకోవడానికి తన సంసిద్ధతను తెలియజేస్తే దానిని ప్రతిపాదన చేయడం అంటారు. ప్రతిపాదన చేసే వ్యక్తిని ప్రతిపాదనకర్త అని అంటారు. ఏ వ్యక్తికి ప్రతిపాదన చేయడం జరిగినదో ఆ వ్యక్తిని ప్రతిపాదన గ్రహీత అని అంటారు. ప్రతిపాదన గ్రహీత ఆ ప్రతిపాదనకు తన అంగీకారమును తెలియజేస్తే అతనిని స్వీకర్త అంటారు. ప్రతిపాదనను ప్రామిస్ (Promise) లేక ప్రపోజల్ (Proposal) లేక ఆఫర్ (Offer) అని కూడా అంటారు. కాబట్టి ప్రతిపాదనకర్తను ప్రామిసర్ (Promisor), ప్రపోజర్ (Proposer), ఆఫరర్ (Offeror) అని, ప్రతిపాదన గ్రహీతను ప్రామిసీ (Promisee), ఆఫరీ (Offeree), ప్రపోజీ (Proposee) అని కూడా అనవచ్చును.

## 2.2 సక్రమమైన ప్రతిపాదనకు ఉండవలసిన ఆవశ్యకాలు :

క్రమబద్ధమైన ప్రతిపాదన ఆవశ్యకాలను ప్రతిపాదనకు సంబంధించిన న్యాయాత్మక నిబంధనలుగా చెప్పవచ్చును. ఒక ప్రతిపాదన సక్రమమైనదిగా పరిగణించవలెనంటే ఈ క్రింది ఆవశ్యకాలు ఉండవలెను.

**(1) ప్రతిపాదన అంశాలు న్యాయపూరిత పరిణామాలకు దారి తీసేవిగా వుండవలెను :** న్యాయపూరిత పరిణామాలను ఉత్పన్నం చేయని ప్రతిపాదన సక్రమం కాదు. అలాంటి ప్రతిపాదన కాంట్రాక్టును ఉత్పన్నం చేయలేదు. అనగా ప్రతిన చేసేటప్పుడు న్యాయబద్ధంగా అమలు జరగడానికి వీలులేదనే ఆంక్షను సూచించే అంశమున్నచో అలాంటి ప్రతిపాదన అంగీకారము పొందినప్పటికి కాంట్రాక్టు ఏర్పడదు.

**సంబంధిత కేసు :**

1. **రోజ్ ఫ్రాంక్ అండ్ కో Vs క్రాంప్టన్ బ్రదర్స్ లిమిటెడ్ (Rose Frank & Co. Vs. Crompton Brothers Ltd) :** ఒక ఇంగ్లీషు వ్యాపార సంస్థకు, మరొక అమెరికన్ వ్యాపార సంస్థకు ఏర్పడిన కాంట్రాక్టులో ఈ వ్యవహారం న్యాయబద్ధంగా అమలు జరపడానికి ఉద్దేశించిన కాంట్రాక్టు కాదని, ఏ పార్టీ కాంట్రాక్టును భంగపరచినా ఎదుటిపార్టీ వ్యాజ్యం వేయకూడదని వ్రాసుకున్నారు. ఈ అంశాలు న్యాయపూరిత పరిణామాలకు దారి తీసేవిగా లేవని అందుచేత దావా చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చినది.

2. **జోన్స్ వెర్నన్ పూల్ లిమిటెడ్ (Jones Vs Wernon Pool Ltd) :** ఒక బంతి ఆట పందెంలో ఏ జట్టు విజయం సాధిస్తుందో కూపన్‌లో నింపి పంపిన వారికి బహుమతి ఇస్తామని ప్రకటించారు. వాది సూచించిన జట్టు గెలిచింది. కూపన్ వెనుక భాగాన "ఈ వ్యవహారంలో ఎలాంటి అగ్రిమెంటు ఏర్పడినా, డబ్బు యివ్వడానికి ఒప్పుకున్నా ఏ విధమైన దావాలు తీసుకురాకూడదని వ్రాసి వున్నందున బహుమానం కోరుతూ తెచ్చిన దావా చెల్లదని కోర్టు తీర్పు యిచ్చినది.

**(2) ప్రతిపాదనాంశాలు న్యాయాత్మక సంబంధాన్ని కలిగించేవిగా వుండాలి :** ప్రతిపాదనలోని అంశాలు పార్టీల మధ్య న్యాయాత్మక సంబంధము ఏర్పరచేవిగా వుండవలెను. న్యాయాత్మక సంబంధము సృష్టించే ఉద్దేశము లేకుండా చేసిన ప్రతిపాదన క్రమత్వమును పొందదు. సాంఘికమైన, మత సంబంధమైన, నైతికమైన విషయాలపై చేసిన ప్రతిపాదనలు సక్రమమైనవి కావు.

ఉదా : A తన యింటికి B ని విందుకు ఆహ్వానించగా B అంగీకరించెను. ఇది సాంఘికపరమైన విషయము. B తరువాత విందుకు రాలేకపోతే A, B పై ఎలాంటి చర్య తీసుకొనుటకు వీలు లేదు.

**(3) ప్రతిపాదనలోని అంశాలు నిర్దుష్టంగా గాని లేక కనీసం నిర్దుష్టం చేసేవిగా గాని వుండాలి :** ప్రతిపాదన అంశాలు అస్పష్టంగా, అనిశ్చితంగా ఉన్నయెడల అది సక్రమమైన ప్రతిపాదన కాదు. కాబట్టి ప్రతిపాదనలోని అంశాలు ఖచ్చితంగా అసందిగ్ధముగా ఉండవలెను. లేనిచో ప్రతిపాదన అమలు చేయుటకు వీలుండదు. భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 29 ప్రకారం "అగ్రిమెంటులోని అంశాల అర్థము స్పష్టంగా లేకపోయినా లేక స్పష్టము చేయుటకు అవకాశము లేకపోయినా ఆ అగ్రిమెంటు చెల్లదు.

**కేసులు :**

1. **మాంట్రియల్ గ్యాస్ కంపెనీ Vs వెసే (Montreal Gas Company Vs Vesey) :** "నువ్వు ఖాతాదారుగా నాకు నచ్చితే నీ కాంట్రాక్టును పొడిగించడానికి నీవు చేసిన దరఖాస్తును పరిశీలిస్తాను. అనే అంశము నిర్దుష్టముగా లేనందున కంపెనీకి ఎలాంటి బాధ్యత లేదని తీర్పు యిచ్చినారు.

2. **గట్టింగ్ Vs లిన్ (Gutting Vs Lyn) :** A, B వద్ద ఒక గుఱ్ఱము కొని "ఈ గుఱ్ఱము అదృష్టదాయకము అయితే నీ వద్ద ఇంకొక గుఱ్ఱము కొంటాను లేదా నీకు 5 పౌన్లు బహుమానం యిస్తాను అన్నాడు. కొంత కాలము తరువాత £ 5 కొరకు గుఱ్ఱము అమ్మిన వ్యక్తిమీద దావా తేగా ప్రతిపాదన నిర్దుష్టము లేనిదే కాకుండా నిర్దిష్టము చేసేదిగా కూడా లేదని దావాను కొట్టివేసినారు.

3. **టైలరు Vs పోర్టింగ్‌టన్ (Tylor Vs Portington) :** A అనే వ్యక్తి B అనే యింటి యజమానితో "నీ యింటిని బాగా మరమ్మతు చేయించి, యింటి డ్రాయింగ్ రూములను ఆధునీకరణ చేస్తే సంవత్సరానికి £ 85 చొప్పున మూడు సంవత్సరాలు అద్దెకు తీసుకుంటానని వాగ్దానము చేసినాడు. కాని యింటికి మరమ్మతులు. అలంకరణ చేసిన తరువాత ఆధునీకరణ సంతృప్తిగా లేదని A అద్దెకు తీసుకొనుటకు నిరాకరించగా దావా వచ్చినది. వాగ్దానములోని అంశాలు నిర్దుష్టంగా లేవని దావా చెల్లదని తీర్పు యిచ్చినారు.

4. **బిషప్ అండ్ బెక్స్టర్ Vs ఆంగ్లో ఈస్టర్న్ కంపెనీ (Bishop and Bextsor Vs Anglo Eastern Co.,) :** "యుద్ధకాలపు షరతులకు లోబడి వుండవలెను. అనే షరతు అనిర్దిష్టముగా ఉన్నందున కాంట్రాక్టు ఉత్పన్నము కాదని తీర్పు యిచ్చినారు.

**(4) ప్రతిపాదన ఒక వ్యక్తికి చేయవచ్చును లేదా ప్రజలందరిని ఉద్దేశించి చేయవచ్చును :** నిర్దిష్టమైన వ్యక్తికి గాని, కొంతమంది వ్యక్తులకు గాని చేసిన ప్రతిపాదనను నిర్దిష్ట ప్రతిపాదన (Specific Offer) అంటారు. ప్రజలందరిని ఉద్దేశించి చేసిన ప్రతిపాదనను సాధారణ ప్రతిపాదన (General Offer) అంటారు. నిర్దిష్ట ప్రతిపాదనకు ఆ నిర్దిష్ట వ్యక్తి మాత్రమే స్వీకృతి ఇవ్వవలెను. సాధారణ ప్రతిపాదనకు ఎవరైనా స్వీకృతి ఇవ్వవచ్చును.

ఉదా (1) : A తన తప్పిపోయిన గుర్రమును వెదికి తీసుకువస్తే రూ. 1000 ఇస్తానని B కి తెలిపెను. ఇది నిర్దిష్ట ప్రతిపాదన. కాబట్టి B మాత్రమే స్వీకృతి యివ్వవలెను.

ఉదా (2) : A తన తప్పిపోయిన గుర్రమును వెదికి తెచ్చిన వారికి రూ. 1000 ఇస్తానని అన్నాడు. ఇది సాధారణ ప్రతిపాదన. ఎవరైనా స్వీకృతిని యివ్వవచ్చును.

**కేసు (Case) :**

**క్లారిల్ Vs కార్బాలిక్ స్మోక్ బాల్ కంపెనీ లిమిటెడ్ (Carlill Vs Carbolic Smoke Ball Co. Ltd) :** కార్బాలిక్ స్మోక్ బాల్ కంపెనీ వారు ఇన్‌ఫ్లూయంజా వ్యాధికి ముందు ఉత్పత్తి చేయటం జరిగినదని, ఆ మందును సూచించిన

విధంగా ఉపయోగించినచో వ్యాధిగ్రస్తులకు వ్యాధి నయమవుతుందని, వ్యాధి లేని వారు ఉపయోగించిన ఎడల వ్యాధి సోకదనియు, ఆ విధంగా మందు నిష్ఫలమని ఋజువు చేసిన వారికి £ 100 బహుమానం ఇస్తామని, వారి మనోనిశ్చయానికి £ 1000 ఆ ఖాతా క్రింద ఎలయన్సు బ్యాంకు (Alliance Bank)లో డిపాజిట్ చేశామని ప్రకటించినారు. కార్లిల్ అనే ఆమె ఆ మందుకొని సూచించిన విధంగా మందు వాడినా "ఇన్‌ఫ్లుయంజా" వ్యాధి ఆమెకు సోకినది. మందు నిష్ఫలమని ఋజువు అయినందున ప్రకటించిన £ 100 బహుమానం కోరుతూ దావా తెచ్చినది. ప్రకటన కంపెనీ యొక్క ప్రతిపాదన అనియు, మందుకొని వాడుట, స్వీకృతి అని ప్రకటించిన బహుమానం చెల్లించవలెనని కోర్టు తీర్పు యిచ్చినది.

**(5) ప్రతిపాదనకు ఆహ్వానాలు ప్రతిపాదనలు కావు :** ప్రతిపాదనకు ఆహ్వానాలు ప్రతిపాదనలుగా పరిగణించబడవు. ధరను సూచించుట, ధరను సూచించమని కోరుట ప్రతిపాదనలు కావు. ప్రతిపాదన చేయని కోరడము అవుతాయి. ధరల పట్టీలు, కాట్‌లాగులు, వేలం ప్రకటనలు, రైల్వే టైం టేబుల్స్, బస్సు టైం టేబుల్స్, వస్తువులకు కట్టిన ధరల చీటీలు ప్రతిపాదనలు కోరేవేగాని ప్రతిపాదనలు కావు. అదే విధంగా కంపెనీలు జారీ చేసే పరిచయ పత్రము, ఉద్యోగ ప్రకటనలు ప్రతిపాదనకు ఆహ్వానములు అవుతాయి గాని ప్రతిపాదనలు కావు.

**కేసులు (Cases) :**

1 **హార్వీ Vs ఫేసీ (Harvey Vs Facey) :** A, B యొక్క 'బంపర్ హాల్‌పెన్ ఎస్టేట్ (Bumper Hall Pen Estate) కొనతలచి ఈ క్రింది విధంగా టెలిగ్రాంలు ఇచ్చినాడు.

"బంపర్ హాల్‌పెన్ అమ్ముతారా ? కనీస ధర ఎంతో తెలియజేయండి".

దానికి సమాధానంగా క్రింది విధంగా టెలిగ్రాం ఇచ్చాడు.

"బంపర్ హాల్ పెన్ ధర £ 900"

వెంటనే A, B కి క్రింది విధంగా టెలిగ్రాం ఇచ్చాడు.

"మీరు అడిగిన ధర £ 900 ఇస్తాను. వెంటనే ఆస్తి తాలూకు దస్తావేజులు పంపండి".

A టెలిగ్రాంకు B సమాధానం యివ్వనందున A, B పై ఆస్తి దస్తావేజులు రిజిస్ట్రేషన్ కోరుతూ దావా తెచ్చాడు. ధరను సూచించుట ప్రతిపాదన కాదని, A, B ల మధ్య అమలు జరపగల కాంట్రాక్టు లేదని, B తాలూకు ఆఖరి టెలిగ్రాం ప్రతిపాదన అని, స్వీకృతి కాదని కోర్టు తీర్పు యిచ్చినది.

2 **మేక్ఫర్సన్ Vs అప్పన్న (Macpherson Vs Appanna) :** ఈ కేసులో వాది ప్రతివాది తాలూకు ఆస్తిని రూ. 6,000లకు కొంటానని ఉత్తరం వ్రాసాడు. ప్రతివాది రూ. 10,000లకు తక్కువకు అమ్మే ప్రసక్తి లేదని సమాధానం యిచ్చాడు. వాది రూ. 10,000 ఇస్తాను అని జవాబు ఇచ్చాడు. కాని ఆ ఆస్తిని రూ. 10,000లకు వేరే వ్యక్తికి విక్రయించటం జరిగింది. దావా రాగా రూ. 10,000లకు తక్కువకు అమ్మే ప్రసక్తి లేదని తెలియజేయుటలో ప్రతిపాదన కాదనియు, అది ప్రతిపాదనకు ఆహ్వానము అవుతుందని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చినది.

3 **ఫార్మాస్యూటికల్ సొసైటీ Vs బూట్స్ కాష్ కెమిస్ట్స్ (Pharmaseutical Society Vs Boots Cash Chemists) :** ఈ కేసులో ప్రతివాది షాపులో వస్తువులకు కట్టిన ధర చీటీలు చూసి తనకు కావలసిన వస్తువు తీసికొని దానిపై వున్న ధరను చెల్లించినాడు. ప్రతివాది వస్తువు ధర పెరిగినదని, ముద్రించిన ధరను తీసుకోవడానికి నిరాకరించగా ఈ

దావా వచ్చినది. వస్తువు తీసికొని దానిపై వున్న ధర చెల్లించడం ప్రతిపాదన అవుతుంది గాని స్వీకృతి కాదని కోర్టు తీర్పు యిచ్చినది.

4 **హారిస్ Vs నికర్సన్ (Harris Vs Nikerson) :** ఒక వేలందారు తన దగ్గర వున్న కొన్ని వస్తువులను ఫలానా తేదీని, ఫలానా స్థలంలో వేలం వేస్తానని ప్రకటించినాడు. ఆ ప్రకటన చూసి B అనే వ్యక్తి వేలం వేసే వేళకు, వేలం వేస్తామన్న స్థలానికి వెళ్ళాడు. కాని ఆ వేళకు, ఆ స్థలంలో ప్రతివాది వస్తువులను వేలం వెయ్యలేదు. వాది అక్కడికి వెళ్ళినందుకు అయిన ప్రయాణ ఖర్చులకు దావా తెచ్చాడు. వేలం వేస్తానని ప్రకటించుట ప్రతిపాదన కాదని, వేలానికి వెళ్ళడం స్వీకృతి కాదని దావా చెల్లదని తీర్పు యిచ్చినారు.

**(6) ప్రతిపాదన కర్త తన ప్రతిపాదనను స్వీకర్తకు తెలియచేయాలి :** ప్రతిపాదన ఎవరిని ఉద్దేశించి చేయుట జరిగినదో ప్రతిపాదన కర్త వారికి ప్రతిపాదన అంశాలు తెలియచేయవలెను. లేనిచో అలాంటి ప్రతిపాదన సక్రమము కాదు. కాంట్రాక్టు ఏర్పడదు. ఈ నిబంధన నిర్దిష్ట ప్రతిపాదనలకు, సాధారణ ప్రతిపాదనలకు వర్తిస్తుంది. కాంట్రాక్టు చట్టము సెక్షన్ 4 ప్రకారం "ప్రతిపాదన సందేశము ప్రతిపాదన ఉద్దేశించబడిన వాని దృష్టికి తెచ్చినపుడే సందేశము పూర్తి అవుతుంది.

**కేసులు :**

1 **లాల్‌మన్ శుక్లా Vs గౌరీదత్ (Lalman Shukla Vs Gowri Dutt) :** తప్పిపోయిన తన మేనల్లుని వెదికి అప్పగించిన వారికి రూ. 500లు బహుమానం ఇస్తానని ప్రతివాది ప్రకటించాడు. ప్రతివాది నౌకరువాది. ప్రకటన గురించిన వివరాలు వాదికి తెలియదు. నౌకరు యజమాని తాలూకు తప్పిపోయిన మేనల్లుని వెతికి అప్పగించిన తరువాత ప్రకటన గురించి తెలిసికొని రూ. 500లు బహుమానం కోసం దావా తెచ్చినారు. ప్రకటన వివరాలు వాదికి తెలియదు. కావున స్వీకృతి లేదని దావాను కొట్టి వేసినారు.

2 **ఫిచ్ Vs స్నెడేకర్ (Fitch Vs Snedekar) :** ప్రతివాది కుక్కపిల్ల తప్పిపోయినది. తప్పిపోయిన తన కుక్క పిల్లను వెదికి తెచ్చి ఇచ్చిన వారికి లేదా దాని సమాచారం తెలియజేసిన వారికి బహుమానం ఇస్తామని ప్రకటించినాడు. తప్పిపోయిన కుక్కపిల్ల సమాచారం ప్రతివాదికి తెలియజేసిన తరువాత ప్రకటన గురించి తెలిసికొని బహుమానం కొరకు దావా తీసుకురాగా ప్రకటన సంగతి వాదికి తెలియదు కావున స్వీకృతి లేదని, వాది ప్రతివాదుల మధ్య అమలు జరపగల కాంట్రాక్టు ఏర్పడలేదని కోర్టు దావాను కొట్టివేసినది.

**(7) సాధారణ ప్రతిపాదనలు, స్థాయి ప్రతిపాదనలు ఒకటి కావు :** స్థాయి ప్రతిపాదన అనగా అవిచ్ఛిన్న ప్రతిపాదన లేక ఎడతెగని ప్రతిపాదన. దీనినే టెండరు (Tender) అని కూడా అంటారు. అముల జరపవలసిన ప్రతిఫలయుక్తమైన కాంట్రాక్టులలో ఒక పార్టీకి తన యిష్టప్రకారం నడచుకొనే అవకాశం వుంటే దానిని టెండరు అంటారు. నిజానికి ఇది ప్రతిపాదన కాదు. ఉదా : నిర్ణీతమైన ధరకు నిర్ణీత తేది నుండి నిర్ణీత కాలానికి Z కి బొగ్గు సరఫరా చేయడానికి Y ప్రతిపాదన చేస్తే దానికి Z స్వీకృతిని తెలియజేస్తే అది టెండరు అవుతుంది. **టెండరు సమర్పించిన వ్యక్తి ప్రతిపాదన చేసినట్లు అవుతుంది. టెండరును ఆమోదించుట స్వీకృతి కాదు.** అనగా టెండరు అంగీకరించగానే కాంట్రాక్టు ఏర్పడదు. **టెండరు ప్రకారం ఆర్డరు యిచ్చినపుడే కాంట్రాక్టు ఏర్పడుతుంది.** ఆర్డరు యివ్వడానికి ముందు పార్టీలు తమ ప్రతిపాదనలను ఉపసంహరించుకొనవచ్చును. ప్రతిపాదన కర్త కొంత ప్రతిఫలాన్ని తీసికొని గడువు తేదీ లోపల ప్రతిపాదనను ఉపసంహరించనని చెప్పిన ఎడల గడువుతేదీ వరకు టెండరుకు బద్ధుడై ఉండును.

**(8) స్వీకృతి పొందే ఉద్దేశంతో ప్రతిపాదన చేయాలి :** కాంట్రాక్టు చట్టం ప్రకారం ఎదుటి వ్యక్తి నుండి అంగీకారం పొందాలనే ధ్యేయముతో తెలియజేసిన అభిప్రాయమే ప్రతిపాదన అవుతుంది. విచారణలు ప్రతిపాదనలుగా పరిగణించబడవు.

**(9) ప్రతిపాదన విస్పష్టంగా, ప్రచ్ఛన్నంగా ఉండవచ్చును :** లిఖిత పూర్వకంగా గాని, మాటాల ద్వారా గాని చేసిన ప్రతిపాదనను విస్పష్ట ప్రతిపాదన అంటారు. వ్యక్తుల ప్రవర్తనలను బట్టి, చర్యలను బట్టి ఏర్పడిన ప్రతిపాదనను ప్రచ్ఛన్న ప్రతిపాదన అంటారు. కాబట్టి ప్రతిపాదన విస్పష్టంగా గాని, ప్రచ్ఛన్నంగా గాని ఉండవచ్చును.

**(10) ప్రతిపాదన షరతులతో ఉండవచ్చును :** ప్రతిపాదన కర్త తన కవసరమైన షరతులను విధించి ప్రతిపాదన చేయవచ్చును. అలాంటి ప్రతిపాదన సక్రమము అవుతుంది. ఉదా : తనకు అనువైన విధంగా స్వీకృతిని తెలియచేయమని ప్రతిపాదన కర్త నిర్దేశించుట. ఈ విధమైన స్థితి నిర్మాణ రంగంలో ఏర్పడుతుంది. ఒక రోడ్డు కాంట్రాక్టరు, మెటీరియల్ ధరలు పెరిగినపుడు, పెరిగిన ధర ప్రకారం కాంట్రాక్టు మొత్తం చెల్లించవలెనని షరతు విధించవచ్చు.

## 2.3 ప్రతిపాదన - రద్దు - ఉపసంహరణ - తిరస్కృతి :

ఎలాంటి పరిస్థితులలో ప్రతిపాదన రద్దు అవుతుంది, ఎప్పుడు ఉపసంహరించుకోవచ్చు లేదా ఏ సందర్భములలో తిరస్కరించబడినట్లుగా పరిగణిస్తారో ఈ క్రింది అంశాలు తెలియజేస్తాయి.

**2.3.1 రద్దు (Cancellation) :** ప్రతిపాదన రద్దు (Cancellation)నే ప్రతిపాదన లుప్తం (Lapse) అని కూడా వ్యవహరించవచ్చును. ప్రతిపాదన ఈ క్రింద ఉదహరించిన కారణాల వలన నిష్ఫలం (ineffective) అయినచో ఆ ప్రతిపాదన రద్దు అయినదిగా లేక లుప్తం అయినదిగా పరిగణించవచ్చు. ఆ విధంగా రద్దు లేదా లుప్తం అయిన ప్రతిపాదనకు స్వీకృతి లభించినా కాంట్రాక్టు ఏర్పడదు. ఈ క్రింది కారణాల వలన ప్రతిపాదన రద్దు, లేదా లుప్తం జరుగుతుంది.

**పార్టీల మరణం వలన :** స్వీకర్త స్వీకృతి తెలియజేసేలోపున ప్రతిపాదన కర్త గాని, స్వీకర్త గాని మరణించిన లేక మతిభ్రమణం చెందిన ప్రతిపాదన రద్దు అవుతుంది. ఇంగ్లీషు న్యాయశాస్త్రం ప్రకారం ప్రతిపాదన కర్త, స్వీకర్తలలో ఎవరు మరణించినా ఆ ప్రతిపాదన దానంతట అదే రద్దు అవుతుంది. కాని భారతీయ కాంట్రాక్టు చట్టం ప్రకారం ప్రతిపాదన కర్త మరణించిన విషయం గురించి స్వీకర్తకు తెలియకముందు స్వీకృతి యిచ్చిన ఎడల కాంట్రాక్టు ఏర్పడును.

**నిర్ణయించిన కాలములో స్వీకృతి తెలియజేయని యెడల :** స్వీకృతి ప్రతిపాదనకర్త నిర్దేశించిన కాలములో గాని, ఆ విధంగా నిర్ణయించనిచో సముచిత కాలంలో గాని స్వీకృతి చేయని ఎడల ప్రతిపాదన రద్దు లేక లుప్తం అయినట్లుగా భావించవలెను. ఆ విధంగా రద్దు లేక లుప్తం అయిన ప్రతిపాదనకు స్వీకృతి యిచ్చినా కాంట్రాక్టు ఏర్పడదు. సముచితకాలం అనేది కాంట్రాక్టులోని విషయాన్ని బట్టి నిర్ణయించవలెనని రామ్స్‌గేట్ విక్టోరియా Vs హోటల్ మోంటిఫోయిర్ (Ramsgate Victoria Hotel Vs Monte Foire) అనే కేసులో తీర్పు యిచ్చినారు.

**ప్రతిపాదన ఉపసంహరణ - తిరస్కృతి వలన :** ప్రతిపాదన కర్త తన ప్రతిపాదనను వెనుకకు తీసుకున్నా అనగా ఉపసంహరించుకున్నా లేక స్వీకర్త ప్రతిపాదనను తోసిపుచ్చినా అనగా తిరస్కరించినా ఆ ప్రతిపాదన రద్దు లేదా లుప్తం అయినట్లుగా భావించవలెను.

**2.3.2 ఉపసంహరణ (Revocation or Taking Back) :** ప్రతిపాదన ఉపసంహరణ అనగా ప్రతిపాదనను వెనుకకు తీసికొనుట అని అర్థము. ప్రతిపాదనకు స్వీకర్త స్వీకృతి ఇచ్చేలోపున ప్రతిపాదనకర్త తన ప్రతిపాదనను ఎప్పుడైనా ఉపసంహరించుకోవచ్చును. ప్రతిపాదన స్పష్టంగా గాని, ప్రచ్ఛన్నం గాని ఉండవచ్చును. భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 6 ప్రకారం ప్రతిపాదన ఉపసంహరణ ఈ క్రింది పద్ధతుల ద్వారా జరుగుతుంది.

**(1) నోటీసు ద్వారా (By Notice) :** ప్రతిపాదన కర్త, స్వీకర్తకు నోటీసు ఇచ్చి తన ప్రతిపాదనను ఉపసంహరించు కోవచ్చును. ఒక వేళ ప్రతిపాదనకర్త ఉపసంహరణ ఉత్తరమును పోస్టులో వేసిన ఎడల, అంత మాత్రముచే ప్రతిపాదన ఉపసంహరణ

జరగదు. ప్రతిపాదన ఉపసంహరణ నోటీసు స్వీకర్తకు చేరితేనే ప్రతిపాదన ఉపసంహరణ జరిగినట్లుగా పరిగణించాలి. అనగా ఉపసంహరణ విషయము స్వీకర్తకు తప్పనిసరిగా తెలియాలి.

**(2) కాలము లుప్తమగుట (By Lapse of time) :** ప్రతిపాదన కర్త ప్రతిపాదనలో స్వీకృతి తెలియచేయుటకు కాలమును నిర్దేశించి ఎడల, ఆ గడువు కాలము లోపున స్వీకృతి తెలియచేయని ఎడల ప్రతిపాదన ఉపసంహరించబడినట్లే. ఒక వేళ కాల నిర్ణయము లేనిచో స్వీకర్త సముచిత కాలములో స్వీకృతిని తెలియజేయవలెను. సముచిత కాలము అనునది సందర్భాన్ని బట్టి నిర్ణయించుట జరుగుతుంది.

**(3) నిర్వర్తించవలసిన బాధ్యత :** స్వీకర్త ప్రతిపాదనకు స్వీకృతిని తెలియజేయటానికి ముందు నెరవేర్చవలసిన షరతును పాటించని ఎడల ప్రతిపాదన ఉపసంహరణ జరిగినట్లుగా భావించవలెను.

ఉదా : S, నీవు సంవత్సరము లోపున వివాహం చేసుకుంటే నా యింటిని రెండు లక్షల రూపాయలకు అమ్ముతానని T కి ప్రతిపాదన చేసినారు. T సంవత్సరం లోపల వివాహం చేసుకోని ఎడల ప్రతిపాదన ఉపసంహరణ జరుగుతుంది.

**(4) ప్రతిపాదన కర్త మరణము :** స్వీకృతిని ఇవ్వడానికి ముందే ప్రతిపాదన కర్త మరణము గురించి స్వీకర్తకు తెలిసి వుంటే ప్రతిపాదన ఉపసంహరణ జరిగినట్లే. అనగా ప్రతిపాదనకర్త మరణము గురించి స్వీకర్తకు తెలిసిన తరువాత ఇచ్చిన స్వీకృతి చెల్లదు. మరణించిన సంగతి తెలియకముందు ఇచ్చిన సమ్మతి సక్రమమైనదవుతుంది.

**(5) ప్రతిపాదనకర్త ఉన్మత్తత :** ప్రతిపాదనకర్త ఉన్మత్తుడు అయినాడన్న విషయం స్వీకర్తకు తెలిసిన తరువాత స్వీకృతి ఇస్తే అది చెల్లదు. అనగా అలాంటి సందర్భములో కూడా ప్రతిపాదన ఉపసంహరించబడినట్లుగా భావించవలెను.

**(6) ఎదురు ప్రతిపాదన :** ప్రతిపాదనకు స్వీకృతి సమగ్రంగాను, బేషరతుగాను ఉండవలెను. స్వీకృతిలో షరతులతో కూడిన స్వీకృతి గాని, ఎదురు ప్రతిపాదనగాని ఉన్న ఎడల ఆ ప్రతిపాదన ఉపసంహరణ జరిగినట్లుగా భావించవలెను.

**కేసు (Case) :**

**హైడే Vs రెంచ్ (Hyde Vs Rench) :** P తన ఇంటిని Q కి £ 10,000లకు అమ్మటానికి ప్రతిపాదన చేసినాడు. Q £ 9,500 కొంటానని జవాబు ఇచ్చినాడు. P ఆ ధరకు అమ్మనని చెప్పగా Q మరలా £ 10,000 కొంటానని అన్నాడు. Q £ 9,500 కొంటానని చెప్పుట ఎదురు ప్రతిపాదన అవుతుందని వెంటనే ప్రతిపాదన ఉపసంహరణ జరిగిందని, Q మరలా £ 10,000లకు కొంటానని చెప్పడం స్వీకృతి కాదని కోర్టు తీర్పు యిచ్చినది.

**(7) ప్రతిపాదన కర్త బాధ్యత :** ప్రతిపాదన కర్త తన బాధ్యతను నెరవేర్చుటకు అశక్తుడైనాడనే విషయం స్వీకర్తకు తెలియగానే ప్రతిపాదన ఉపసంహరించబడినట్లుగా భావించవలెను.

**ఉదా :** P తన కారును 'S'కు అమ్మటానికి ప్రతిపాదనలు చేసెను. కాని S స్వీకృతి ఇచ్చేలోపున P తన కారును Q కు విక్రయించెను. ఈ విషయం 'S'కు తెలియగానే తనకు చేసిన ప్రతిపాదన ఉపసంహరించబడినట్లే.

## 2.3 ప్రతిపాదన తిరస్కృతి (Rejection) :

ప్రతిపాదన తిరస్కృతి అనగా ప్రతిపాదనను నిరాకరించుట, ప్రతిపాదన పొందిన వ్యక్తి అనగా ప్రతిపాదన గ్రహీత ప్రతిపాదనను తిరస్కరించవచ్చును. ఒకసారి తిరస్కరించిన ప్రతిపాదనకు తిరిగి స్వీకృతి ఇచ్చినా చెల్లదు. క్రింది సందర్భాలలో ప్రతిపాదనను తిరస్కరించబడినదిగా పరిగణిస్తారు.

(1) ప్రతిపాదన పొందిన వ్యక్తి (Offeree) ఆ ప్రతిపాదనను తిరస్కరించినట్లుగా పేర్కొన్నపుడు.

(2) ప్రతిపాదన కర్తకు స్వీకృతి సందేశము పంపడానికి బదులు ఎదురు ప్రతిపాదన లేక తిరుగు ప్రతిపాదన చేసినపుడు

(3) ప్రతిపాదనకు షరతులతో కూడిన స్వీకృతి చేసినపుడు.

## 2.4 స్వీకృతి - నిర్వచనం :

ప్రతిపాదనకు సమ్మతిని తెలియజేయుట స్వీకృతి. భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(b) స్వీకృతిని ఈ క్రింది విధంగా నిర్వచించినది. ప్రతిపాదన ఎవరిని ఉద్దేశించి చేయుట జరిగినదో అలాంటి వ్యక్తి ఆ ప్రతిపాదనను సమ్మతినిస్తే ఆ ప్రతిపాదన స్వీకృతి పొందినది అని అర్థము". స్వీకృతి పొందిన ప్రతిపాదన వాగ్దానము అవుతుంది. స్వీకృతిని తెలియజేసే వ్యక్తిని స్వీకర్త అంటారు. ప్రతిపాదన పొందిన వ్యక్తి తన అంగీకారమును మాటల ద్వారా గాని, లిఖిత పూర్వకంగా గాని తెలియజేయవచ్చును. అలాంటి స్వీకృతిని భావ ప్రకటన స్వీకృతి అంటారు. స్వీకృతి ప్రచ్ఛన్నంగా కూడా వుండవచ్చును. అనగా వ్యక్తుల చర్యలు ప్రవర్తనల వలన కూడా స్వీకృతిని తెలియజేయవచ్చును. ప్రఖ్యాత న్యాయశాస్త్రవేత్త సర్ విలియం ఏన్సన్ (Sir William Anson) ప్రతిపాదన, స్వీకృతుల మధ్య సంబంధం మందుగుండు, వెలిగించిన అగ్గిపుల్లలతో పోల్చినాడు. మందుగుండుకు, అగ్నిజ్వాల తగిలీ తగలగానే పేలుడు ఎలా సంభవిస్తుందో అదే విధంగా ప్రతిపాదనకు స్వీకృతి రాగానే వెంటనే వాగ్దానము (Promise) ఏర్పడి, ప్రతిపాదన స్వీకృతులు మాయమగును.

**2.4.1 స్వీకృతి - ఆవశ్యకాలు :** క్రమబద్ధమైన స్వీకృతికి ఈ క్రింది ఆవశ్యకాలు ఉండవలెను.

**(1) స్వీకృతి సమగ్రముగాను, బేషరతుగాను ఉండవలెను :** స్వీకృతి పాక్షికంగా గాని, షరతులతో కూడుకొని గాని ఉండరాదు. ప్రతిపాదనలోని ప్రతి అంశానికి తు.చ. తప్పకుండా స్వీకృతి ఉండాలి. అనగా స్వీకృతి ఎల్లప్పుడు సమగ్రంగాను, బేషరతుగాను ఉండాలి. షరతులతో కూడిన స్వీకృతి సక్రమమయినది కాదు. కాబట్టి స్వీకృతిలో ప్రతిపాదనాంశాలు మార్పు చేసినా లేదా షరతులు పెట్టినా అలాంటి స్వీకృతి క్రమత్వాన్ని కోల్పోతుంది. షరతులతో కూడిన స్వీకృతి ఎదురు ప్రతిపాదన అవుతుంది గాని స్వీకృతి కాదు.

ఉదా : A తన ఇంటిని B కి రూ. 50,000లకు అమ్మటానికి ప్రతిపాదన చేసాడు. B రూ. 40,000లకు కొంటానని స్వీకృతిని తెలియజేసినాడు. ఈ స్వీకృతి సక్రమమయినది కాదు. అది ఎదురు ప్రతిపాదన అవుతుంది.

**కేసు (Case) :**

**యూనియన్ ఆఫ్ ఇండియా Vs బాబూలాల్ (Union of India Vs Babulal) :** ఈ కేసులో B తన కారును S కు రూ. 10,000లకు అమ్మడానికి ప్రతిపాదన చేసినాడు. S ఆ కారును రూ. 8,000లకు కొంటానని సమ్మతిని ఇచ్చాడు. S ఇచ్చిన సమ్మతి సక్రమము కాదని ఎదురు ప్రతిపాదన అవుతుందని తీర్పు యిచ్చినారు.

ఉదా : A తన సైకిలును రూ. 1000లకు B కి అమ్మటానికి ప్రతిపాదన చేసినాడు. B తన అంగీకారముతో రూ. 200 బయానా కూడా చెల్లించమని A తెలియజేసినాడు. B తన అంగీకారమును మాత్రం తెలియజేశాడు. బయానా రూ. 200 చెల్లించలేదు. ఇలాంటి స్వీకృతి సమగ్రంగా లేనందున చెల్లదు.

**కేసు (Case) :**

నీల్ Vs మెర్రెట్ (Neil Vs Merrit) : ఈ కేసులో X తన భూమిని £ 280కు విక్రయిస్తానని ప్రతిపాదన చేశాడు. Y కొనటానికి సమ్మతిని తెలియజేస్తూ £ 80 చెక్కులను పంపి, మిగిలిన సొమ్మును నెలసరి వాయిదాలలో చెల్లిస్తానని తెలియచేసినాడు. స్వీకృతి షరతులతో యివ్వడం జరిగినదని కాంట్రాక్టు ఉత్పన్నం కాలేదని కోర్టు తీర్పు యిచ్చినది.

**(2) స్వీకృతి సందేశము ప్రతిపాదన కర్తకు తెలియచేయాలి :** స్వీకృతిని ప్రతిపాదన కర్త సూచించిన పద్ధతిలో తెలియచేయవలెను. ఒక వేళ ప్రతిపాదన కర్త స్వీకృతి విధానమును తెలియచేయకపోతే సముచితమైన పద్ధతిలో సాధారణముగా అనుసరించే పద్ధతిలో స్వీకర్త తన సమ్మతిని తెలియచేయవలెను. స్వీకృతిని మాటల ద్వారా గాని, లిఖితపూర్వకముగా గాని, ప్రవర్తన లేక చర్యల ద్వారా గాని తెలియచేయవచ్చును. ప్రకటించని లేక తెలియచేయని స్వీకృతి సక్రమమయిన స్వీకృతి కాదు. **మౌనం అంగీకారం కాదు. మానసిక సమ్మతిని న్యాయస్థానాలు సక్రమమయిన స్వీకృతిగా పరిగణించవు.** ఏన్సన్ అభిప్రాయములో "మనిషి మనసులోని మాట దెయ్యానికి కూడా తెలియదు" కాబట్టి స్వీకృతిని బహిరంగముగా ప్రకటించవలెను.

**కేసులు (Cases) :**

1. **పెల్టు హౌస్ Vs బిండ్లె (Felthouse Vs Bindle) :** ఈ కేసులో మేనమామ తన మేనల్లుని గుఱ్ఱమును నిర్ణీత ధరకు కొంటానని తనకు ఎలాంటి సమాధానము రాకపోతే ఆ నిర్ణీత ధరకు ఫలానా గుఱ్ఱము తనదేనని భావించవలెనని వ్రాసినారు. మేనల్లుడు ఆ విషయమును తన గుర్రాల వేలందారుకు చెప్పి మేనమామ కోరిన గుర్రం తప్ప మిగిలిన గుర్రాలను వేలంలో విక్రయించమని చెప్పినాడు. కాని వేలందారు పొరపాటున మేనమామ చెప్పిన గుర్రాన్ని కూడా వేలంలో విక్రయించినాడు. తరువాత కాంట్రాక్టు భంగానికి నష్టపరిహారం కోరుతూ మేనమామ, మేనల్లునిపై దావా తెచ్చినాడు. మౌనం అంగీకారం కాదని, మేనల్లుడు తన సమ్మతిని తెలియచేయలేదని కాబట్టి కాంట్రాక్టు లేదని కోర్టు తీర్పు యిచ్చినది.
2. **పావెల్ Vs లీ (Powell Vs Lee) :** A ఒక కాలేజి ప్రిన్సిపాల్ పదవికి దరఖాస్తు చేసినాడు. మేనేజ్‌మెంట్ వారు A ను ఆ పదవికి నియమించినారు. ఈ విషయమును పాలకవర్గ సభ్యుని ద్వారా రహస్యంగా A తెలుసుకున్నాడు. కాని మేనేజ్‌మెంట్ వారు అధికారికంగా ఆ నియామక విషయమును వాదికి తెలియచేయలేదు. తరువాత కొన్ని కారణాల వలన మేనేజ్‌మెంటు ఆ నియామకమును రద్దు చేసినది. ఆ కారణంగా వాది మేనేజ్‌మెంటుపై దావా తెచ్చాడు. నియామకము గురించి మేనేజ్‌మెంటువారు తెలియచేయలేదు. కావున స్వీకృతి సందేశము లేదని దావా చెల్లదని తీర్పు యిచ్చినారు.
3. **బ్రాగ్డెన్ Vs మెట్రోపాలిటన్ రైల్వే కంపెనీ (Brogdew Vs Metropoliton Railway Co.) :** వాది బొగ్గు సరఫరా చేయుటకు గాను రైల్వే కంపెనీకి ప్రతిపాదన చేసినాడు. కంపెనీ మేనేజరు అగ్రిమెంటుపై "అంగీకరించటమైనది" అని వ్రాసి పొరపాటున దానిని తన టేబుల్ సొరుగులో పెట్టి పోస్టు చేయటం మరచినాడు. కాంట్రాక్టు భంగానికి దావా రాగా స్వీకృతిని తెలియచేయలేదు. కావున కాంట్రాక్టు లేదని దావాను కొట్టి వేసినారు.

**(3) స్వీకృతి నిర్దేశించిన విధంగా వుండాలి :** ప్రతిపాదనకర్త స్వీకృతి విధానమును సూచిస్తే స్వీకర్త తన సమ్మతిని అదే విధంగా తెలుపవలెను. ఒక వేళ ప్రతిపాదనకర్త స్వీకృతి విధానమును నిర్దేశించనియెడల సముచితమైన పద్ధతిలో సాధారణంగా స్వీకృతిని అందజేసే విధానంలో తెలియచేయవలెను.

ఉదా : A తన యింటిని రూ. 2,00,000లకు అమ్మటానికి ప్రతిపాదన చేస్తూ తన అంగీకారమును టెలిఫోన్ ద్వారా తెలియచేయమని B తో అంటే, B తన స్వీకృతిని టెలిఫోన్ ద్వారా తెలియచేస్తే సక్రమము అవుతుంది. B టెలిగ్రాం యిచ్చిన యెడల అది సక్రమము కాదు.

భారతీయ కాంట్రాక్టు చట్ట ప్రకారం ప్రతిపాదన కర్త సూచించిన పద్ధతిలో గాక స్వీకర్త స్వీకృతిని వేరే విధంగా తెలియచేస్తే, ఆ స్వీకృతిని తిరస్కరించినట్లుగా ప్రతిపాదనకర్త స్వీకర్తకు తెలియచేయని ఎడల, అది సక్రమమైన స్వీకృతిగా పరిగణించబడుతుంది.

**(4) నిర్ణయించిన కాలములో స్వీకృతిని యివ్వాలి :** ప్రతిపాదనకర్త కాలము నిర్ణయించిన ఎడల ఆ నిర్దేశించిన కాలములో పున స్వీకర్త స్వీకృతిని యివ్వాలి. ఒక వేళ కాల పరిమితిని నిర్ణయించని ఎడల సముచిత కాలము లోపున స్వీకృతిని తెలియచేయాలి. సముచిత కాలము అనేది కాంట్రాక్టు విషయములపై ఆధారపడి వుంటుంది.

**(5) ప్రతిపాదన అమలు ఉండగా సమ్మతి నివ్వాలి :** ప్రతిపాదన అమలులో వున్నప్పుడు మాత్రమే స్వీకర్త స్వీకృతిని తెలియచేయాలి. అనగా ప్రతిపాదన రద్దు, లుప్తము, తిరస్కృతి, ఉపసంహరణ చెందకముందు స్వీకృతిని యివ్వవలెను. లేనిచో ఆ స్వీకృతి సక్రమము కాదు.

**(6) ప్రతిపాదన పొందిన వ్యక్తి స్వీకృతి యివ్వాలి :** ఎవరిని ఉద్దేశించి ప్రతిపాదన చేయడం జరిగిందో వారే స్వీకృతి ఇవ్వాలి. వేరొక వ్యక్తి యిచ్చిన స్వీకృతి సక్రమము కాదు. కొంత మంది వ్యక్తులకు ప్రతిపాదన చేయబడితే వారిలో ఎవరైనా స్వీకృతి తెలియచేయవచ్చును. ప్రజలందరిని ఉద్దేశించి చేసిన ప్రతిపాదనకు స్వీకృతి ఎవరైనా తెలుపవచ్చును.

**కేసు (Case) :**

**బౌల్టన్ Vs జోన్స్ (**Boulton Vs Jones**) :** A తన వ్యాపారమును B కి విక్రయించినాడు. ఈ విషయము A తన ఖాతాదారులకు తెలియచేయలేదు. తరువాత C అనే ఖాతాదారుడు కొన్ని సరుకుల కొరకు A పేరు మీద ఆర్డరు పంపినాడు. B ఆ ఆర్డరును అంగీకరించి అసలు విషయం C కి తెలియచేయకుండా సరుకులను C కి సరఫరా చేసినాడు. C, B కి ఎలాంటి ప్రతిపాదన చేయలేదు కావున B, C ల మధ్య కాంట్రాక్టు ఉత్పన్నం కాలేదని కోర్టు తీర్పు యిచ్చినది.

**(7) స్వీకృతి విధానమును సడలించుట :** స్వీకృతి సందేశము ప్రతిపాదనకర్త ప్రయోజనానికి మాత్రమే ఉద్దేశించబడినది. కాబట్టి ప్రతిపాదనకర్త కొన్ని సందర్భాలలో స్వీకృతి విధానమును సడలించవచ్చును. ఈ సడలించడము ప్రతిపాదనకర్త ప్రత్యక్షముగా లేక పరోక్షముగా ప్రకటించవచ్చును.

ఈ సూత్రమును కార్లిల్ Vs కార్బాలిక్ స్మోక్ బాల్ కంపెనీ కేసులో కోర్టు వారు ధృవీకరించినారు. ఈ కేసులో కార్బాలిక్ స్మోక్ బాల్ కంపెనీ వారి ప్రకటనలో ప్రతిపాదనలోని షరతులను పాటించడం తప్ప స్వీకృతి సందేశమును కోరటం జరగలేదు. కాబట్టి స్వీకృతిని పంపవలెననే నిబంధన సడలించుట జరిగినది.

**(8) ప్రతిపాదన తరువాత స్వీకృతి ఉండాలి :** ప్రతిపాదన ముందు వుంటుంది. స్వీకృతి దానిని అనుసరిస్తుంది. అనగా ప్రతిపాదన వచ్చిన తరువాత స్వీకృతిని ఇవ్వాలి. ప్రతిపాదన లేకుండా, చేరకుండా స్వీకృతి యిచ్చినా అది సక్రమమైన స్వీకృతిగా పరిగణించరు.

**ఉదా :** ఒక కంపెనీ S నుండి ఎలాంటి దరఖాస్తు లేకుండానే వాటాలను కేటాయించినది. ఈ విషయం A కు తెలియదు. తరువాత A వాటాలకు దరఖాస్తు చేసినాడు. ఈ దరఖాస్తును ఈ స్వీకృతిగా పరిగణించరు. దరఖాస్తు చేయకముందు వాటాల కేటాయింపు జరిగినది. కావున కేటాయింపు చెల్లదు.

**(9) స్వీకృతిని ఉపసంహరించుటకు వీలులేదు :** ప్రతిపాదనకు స్వీకృతి కలిసిన ఎడల కాంట్రాక్టు ఏర్పడుతుంది. వెలిగించిన అగ్గిపుల్లను మందుగుండు సామానుపై వేస్తే తిరిగి తీసుకోవటానికి వీలుండనట్లే ప్రతిపాదనకు స్వీకృతి ఇచ్చిన తరువాత తిరిగి వెనుకకు తీసికొనుటకు అనగా ఉపసంహరించుటకు వీలుండదు. ఈ నియామకము ఇంగ్లీషు న్యాయశాస్త్రమునకు వర్తిస్తుంది. కాని భారతీయ కాంట్రాక్టు చట్టం ప్రకారం స్వీకృతి సందేశము ప్రతిపాదన కర్తకు చేరేలోపున స్వీకృతిని ఉపసంహరించుటకు వీలు వున్నది. తరువాయి భాగంలో ఈ విషయాన్ని విపులీకరించడం జరిగింది.

## 2.5 ప్రతిపాదన - స్వీకృతిని తెలియచేయుట, ఉపసంహరించుట :

ప్రతిపాదన కర్త, స్వీకర్త వేరు వేరు ప్రదేశాలలో, ఉన్నప్పుడు వారి మధ్య కాంట్రాక్టు ఉత్పన్నం కావాలంటే పోస్టు లేదా టెలిగ్రామ్, టెలిఫోన్, టెలెక్స్ లేదా ఫ్యాక్సు ద్వారా గాని ఏర్పడుతుంది. అనగా ప్రతిపాదనను, స్వీకృతిని నోటి మాటల ద్వారా గాని, లిఖిత పూర్వకంగా గాని తెలియచేయవచ్చును. పార్టీల ప్రవర్తనపై ఆధారపడి కూడా తెలియచేయడం జరుగుతుంది.

### 2.5.1 తెలియచేయుట ఎప్పుడు పూర్తి అవుతుంది ?

1. ప్రతిపాదన చేసిన వ్యక్తికి తెలియగానే ప్రతిపాదన తెలియచేయుట పూర్తి అవుతుంది. ఉదా : A, B కి తన ఇంటిని రూ. 5,00,000లకు అమ్ముతానని నంబరు 25న ఒక ఉత్తరం వ్రాసినాడు. ఆ ఉత్తరం నవంబరు 28వ తేదీన B కి అందినది. నవంబర్ 20వ తేదీన ప్రతిపాదన తెలియచేయుట పూర్తి అయినదిగా భావించవలెను.

2. స్వీకర్త, ప్రతిపాదనకర్త చిరునామా సరిగ్గా వ్రాసి, అవసరమైన స్టాంపులు అంటించి స్వీకృతిని పోస్టులో వేసిన వెంటనే స్వీకృతి పూర్తి అవుతుంది. స్వీకృతి సందేశము ప్రతిపాదనకర్తకు ఆలస్యంగా అందినా, అసలు చేరకపోయినా స్వీకృతి పూర్తి అయినట్లుగా పరిగణించబడుతుంది. అనగా స్వీకృతి సందేశము పోస్టులో వేయగానే కాంట్రాక్టు ఏర్పడుతుంది.

   ఉదా : శ్రీరాం ఒంగులో నుండి హైదరాబాద్‌లోని హరికి ప్రతిపాదన నవంబరు 25న పోస్టు ద్వారా తెలియచేసెను. ఈ ప్రతిపాదన హరికి నవంబరు 30న చేరినది. కాబట్టి నవంబరు 30న ప్రతిపాదన పూర్తి అయినట్లుగా భావించవలెను. ఈ ప్రతిపాదనకు హరి తన స్వీకృతిని డిసెంబరు 5న పోస్టు ద్వారా తెలియచేసెను. స్వీకృతి ఉత్తరం డిసెంబరు 10న శ్రీరాంకు చేరినది. స్వీకృతి ఉత్తరం ఎప్పుడు చేరినా, అసలు చేరకపోయినా డిసెంబరు 5న స్వీకృతి పూర్తి అయినట్లుగా భావించవలెను. కాబట్టి డిసెంబరు 5వ తేదీ తరువాత స్వీకృతిని ఉపసంహరించుటకు వీలులేదు.

   ఇంగ్లీషు న్యాయశాస్త్ర ప్రకారం స్వీకృతి ఉత్తరం పోస్టులో వేయగానే పూర్తి అవుతుంది. స్వీకృతిని పోస్టులో వేసిన తరువాత ఉపసంహరించుటకు వీలుండదు. ప్రతిపాదనను మాత్రము ఉపసంహరించుకొనే వీలు వుంటుంది.

   కాని భారతీయ కాంట్రాక్టు చట్ట ప్రకారం స్వీకృతి ఉత్తరం ప్రతిపాదన కర్తకు చేరకముందు ఉపసంహరించుకోవచ్చును. అనగా స్వీకృతి ఉపసంహరణ సందేశము స్వీకృతి సందేశము కంటే ముందుగా ప్రతిపాదన కర్తకు చేరవలెను.

   స్వీకర్త స్వీకృతిని తెలియచేసే లోపున ప్రతిపాదన కర్త ఎప్పుడైనా ప్రతిపాదనను ఉపసంహరించుకోవచ్చును.

**కేసు (Case) :**

   డన్‌లప్ Vs హిగ్గిన్స్ (Dunlop Vs Higgins) : ఈ కేసులో డన్‌లప్ అండ్ కంపెనీ 28-01-1847వ తేదీన ఉత్తరం ద్వారా కొంత ఇనుమును నిర్ణీత ధరకు ఇస్తానని తెలియచేసినాడు. ఆ ఉత్తరం 30వ తేదీన చేరినది. ఆ రోజునే హిగ్గిన్స్ స్వీకృతి తెలియచేస్తూ ఉత్తరం వ్రాసినాడు. కాని ఆ స్వీకృతి ఉత్తరం పోస్టు వారి అజాగ్రత్త వలన ఫిబ్రవరి 18వరకు అందలేదు. ఈలోపున ఇనుము ధరలు పెరిగిపోవుట వలన కంపెనీ నిరాకరించినది. దావారాగా స్వీకృతి 30వ తేదీన చేసినట్లుగా భావించవలెనని కాంట్రాక్టు ఏర్పడినదని కోర్టు తీర్పు ఇచ్చినది.

3. **టెలిఫోన్, టెలెక్సు ద్వారా కాంట్రాక్టులు :** టెలిఫోన్, టెలెక్సుల ద్వారా ఏర్పరచుకునే కాంట్రాక్టుల విషయంలో మన దేశంలోను, ఇంగ్లండులోను న్యాయసూత్రాలు ఒకే విధంగా వున్నాయి. అనగా పార్టీలు ముఖాముఖిగా వుండి చేసుకున్నా కాంట్రాక్టులకు వర్తించే న్యాయసూత్రాలు వీటికి వర్తిస్తాయి. స్వీకర్త తన స్వీకృతి సందేశము ప్రతిపాదన కర్తకు వినబడినట్లు, పూర్తిగా అర్థం చేసుకున్న విషయం నిర్ధారణ చేసుకోవలెను. లేని ఎడల కాంట్రాక్టు ఉత్పన్నం కాదు.

డెన్నింగ్ అనే న్యాయమూర్తి **ఎంటూర్స్ లిమిటెడ్ Vs మైల్సుఫార్ ఈస్టరన్ కార్పోరేషన్** అనే కేసులో టెలిఫోన్ ద్వారా కాంట్రాక్టు ఏర్పరచుకున్నప్పుడు స్వీకృతి సందేశము ప్రతిపాదనకర్తకు వినబడినట్లు, దానిని అర్థం చేసుకున్నట్లు నిర్ధారణ చేసుకోవలెనని స్వీకృతి సందేశము ప్రతిపాదనకర్తకు స్పష్టంగా అవగతమైనపుడు కాంట్రాక్టు ఉత్పన్నమవుతుందని తీర్పు యిచ్చినారు.

ఈ న్యాయసూత్రములు మన దేశంలో కూడా వర్తిస్తాయని భగవాన్ దాస్ Vs గిరిధరలాల్ అనే కేసులో సుప్రీంకోర్టు వారు ఆమోదించినారు.

## 2.6 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు**

1. ప్రతిపాదన అనగానేమి ?
2. నిర్దిష్ట ప్రతిపాదన అనగానేమి ?
3. సాధారణ ప్రతిపాదన అనగానేమి ?
4. ప్రతిపాదన రద్దు అనగానేమి ?
5. ప్రతిపాదన ఉపసంహరణ అనగానేమి ?
6. స్వీకృతిని నిర్వచించుము.
7. టెలిఫోన్, టెలెక్సుల ద్వారా కాంట్రాక్టు.

**10 మార్కుల ప్రశ్నలు :**

1. హార్వీ Vs ఫేసీ (Harvey Vs Facey) కేసులోని వివరాలు పేర్కొనుము.
2. "ప్రతిపాదన కర్త ప్రతిపాదన వివరాలు స్వీకర్తకు తెలియచేయాలి" - వివరించుము.
3. ప్రతిపాదన రద్దు సందర్భములను వివరించుము.
4. ప్రతిపాదన ఎప్పుడు ఉపసంహరించబడుతుంది.
5. "స్వీకృతి సందేశం ప్రతిపాదనకర్తకు తెలియచేయాలి" - వివరించుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. ప్రతిపాదనను నిర్వచించి ప్రతిపాదన ఆవశ్యకాలు వివరించుము.
2. ప్రతిపాదన రద్దు, ఉపసంహరణ, తిరస్కృతికి సంబంధించిన నియమాలను వ్రాయుము.
3. స్వీకృతిని నిర్వచించి సక్రమమైన స్వీకృతి ఆవశ్యకాలను వ్రాయుము.
4. ప్రతిపాదన - స్వీకృతిని తెలియచేయుట, ఉపసంహరించుట గురించి నియమాలను పేర్కొనుము.

## 2.7 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Contract Act, 1872 | - | Bare Act |
| 2. | A.C. Patna | - | Indian Contract Act, 1872, Asia Publishing House, Bombay |
| 3. | K. Ponnuswami & K.K. Puri | - | Cases and Materials on Law of Contract, Eastern Book Co., Lucknow |
| 4. | Avatar Singh | - | Law of Contract, Eastern Book Co., Lucknow |
| 5. | Avatar Singh | - | The Principles of Mercantile Law, Eastern Book Co., Lucknow |
| 6. | M.C. Sheekala | - | A Manual of Mercantile Law, S. Chand & Co., New Delhi |
| 7. | ND Kapoor | - | Mercantile Law |


*– శ్రీ టి. త్యాగరాజు*

**పాఠం : 3**

# ప్రతిఫలం

## (Consideration)

### 3.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) ఈ పాఠంలో ప్రతిఫలం అంటే తెలుసుకోవడం జరుగును.

బి) ప్రతిఫలం ఆవశ్యకాలు తెలియును.

సి) ప్రతిఫలానికి అపరిచితుని గురించి తెలుసుకోవడం.

డి) కాంట్రాక్టుకు అపరిచితుని గురించి వివరాలు తెలియును.

ఇ) ప్రతిఫలం లేని కాంట్రాక్టుల గురించి వివరాలు తెలుసుకోవడం జరుగును.

### విషయ సూచిక :


**3.1** ప్రతిఫలం - అర్థము - నిర్వచనం

**3.2** ప్రతిఫలం - ఆవశ్యకాలు

**3.2.1** ప్రతిఫలం ప్రామిసర్ కోరికపై వుండవలెను

**3.2.2** ప్రతిఫలం ప్రామిసీ నుండి మరి ఏ యితర వ్యక్తి నుండి అయినా రావచ్చును

**3.2.3** ప్రతిఫలం భూత, భవిష్యత్, వర్తమాన కాలానికి సంబంధించినదై ఉండవచ్చును

**3.2.4** ప్రతిఫలం తగినంతగా ఉండనవసరం లేదు

**3.2.5** ప్రతిఫలం వాస్తవంగా ఉండవలెను

**3.2.6** ప్రతిఫలం న్యాయసమ్మతంగా వుండాలి

**3.3** ప్రతిఫలం - అపరిచితుడు

**3.4** కాంట్రాక్టుకు సంబంధం లేని వ్యక్తి

**3.5** ప్రతిఫలం లేని కాంట్రాక్టు చెల్లదు

**3.5.1** మినహాయింపులు

**3.6** నమూనా ప్రశ్నలు

**3.7** చదువదగిన గ్రంథాలు

## 3.1 ప్రతిఫలం - అర్థం - నిర్వచనం :

కాంట్రాక్టు ముఖ్య ఆవశ్యకాలలో ప్రతిఫలం అత్యంత ప్రధానమైన ఆవశ్యకము. కాంట్రాక్టుకు ప్రతిఫలము ప్రాణము వంటిది. ప్రతిఫలములేని కాంట్రాక్టులు దిగంబర కాంట్రాక్టులు (Nudum Pactum = Nude Pacts)గా, కోర్టులలో గుర్తించటానికి వీలులేనివిగా పేర్కొన్నారు. ఇవి న్యాయాత్మక బాధ్యతలను ఉత్పన్నం చేయలేవు. ప్రతిఫలం లేని కాంట్రాక్టులు నిస్సారమై, నిర్జీవమై చెల్లని కాంట్రాక్టులు అవుతాయి. కాబట్టి ప్రతిఫలం లేని కాంట్రాక్టు చెల్లదు. ప్రతిఫలమనగా తిరిగి వచ్చునది (Quid Pro Quo = Something in return) లేదా ఒకదానికి మరొకటి అని అర్థము. కాంట్రాక్టు న్యాయసమ్మతమై, పార్టీలను ఒకరికొకరిని బంధించే శక్తితో ఉండవలెనంటే అది ప్రతిఫలంతో కూడినదై ఉండవలెను. కాంట్రాక్టులో ఒక పార్టీ ఏదైనా ఒక పనిచేస్తానని గాని మానుకుంటానని గాని వాగ్దానం చేసినపుడు దానికి ఎదుటి పార్టీ నుండి కొంత తిరిగి పొందేది కూడా వుంటుంది. దానిని ప్రతిఫలం (consideration) అంటారు.

భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(d) ప్రతిఫలమును క్రింది విధంగా నిర్వచించినది "ప్రామిసర్ కోరికపైన, ప్రామిసీగాని మరి ఎవరు గాని చేసిన పని లేదా మానివేసిన పనిగాని, చేసేపని లేదా మానివేసే పనిగాని, చేస్తాననే లేదా మానివేస్తాననే పనిగాని ప్రామిసర్ యొక్క ప్రామిస్‌కు ప్రతిఫలం" కాబట్టి **ప్రతిఫలము భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సంబంధించినదై వుండవచ్చును.** అంతేగాక ప్రతిఫలం ప్రామిసీ నుంచే రానవసరం లేదు. మరి ఏ ఇతర వ్యక్తి అయినా ప్రామిసర్‌కు ప్రతిఫలము ఇవ్వవచ్చును.

ఉదా : A తన సైకిలును B కి రూ. 1000లకు అమ్ముతానని అన్నాడు. రూ. 1000లు B ఇవ్వవచ్చును లేదా B స్నేహితుడు F ఆ మొత్తాన్ని A కి ఇచ్చినా A, B ల మధ్య కాంట్రాక్టు ఏర్పడుతుంది.

కాని ఇంగ్లండులో మాత్రం ప్రతిఫలం వర్తమానానికి గాని, భవిష్యత్‌కు గాని సంబంధించి వుండవచ్చును. పూర్వ ప్రతిఫలము సక్రమము కాదు. అనగా ఎప్పుడో చేసిన పూర్వపు పని మాత్రం సాధారణ ప్రతిఫలం కాదని ఇంగ్లీషు న్యాయశాస్త్రం చెప్తున్నది.

ప్రతిఫలాన్ని క్యూరి Vs మీసా (Currie Vs Misa) అనే కేసులో లష్ (Lush) అనే న్యాయమూర్తి ఈ క్రింది విధంగా నిర్వచించినాడు. "కాంట్రాక్టు వలన ఒక పార్టీకి సంక్రమించిన హక్కు-భుక్తాలుగాని, లాభసదుపాయాలు గాని లేదా మరో పార్టీకి కలిగిన నిషిద్ధంగాని, నష్టంగాని, బాధ్యత లేదా హాని గాని ఆ కాంట్రాక్టుకు విలువ కలిగిన ప్రతిఫలం".

పై నిర్వచనం దృష్ట్యా ప్రతిఫలము నగదు లేదా వస్తు రూపంలో మాత్రమే వుండాలనే నియమం లేదు. అది ఒక పార్టీకి కలిగిన లాభసదుపాయములు, హక్కు కావచ్చును లేక మరొక పార్టీకి కలిగిన నష్టాలు కావచ్చు.

పొలాక్ (Pollock) అభిప్రాయములో "మరి ఒకని నుంచి తను ప్రామిస్ పొందటానికి తాను చేసిన, చేసి వుండిన, చేస్తానన్న లేదా మానివేసిన, మానివేసి వుండిన లేదా మానివేస్తానన్న తన ప్రామిస్ మొదటి వ్యక్తి ప్రామిస్‌కు ప్రతిఫలం అవుతుంది".

ప్రతిఫలం ఒక పని చేయుటకు సంబంధించి లేదా మానుటకు సంబంధించి ఉండవచ్చును. అంతేగాక రెండు పార్టీలకు ప్రతిఫలం లభించేదిగా వుండవచ్చును.

ఉదా : (1) A, B తో C కు అరువుపై అమ్మిన సరుకుల మొత్తమునకు హామీ ఇచ్చినాడు. B,C కు సరుకులు విక్రయించుట A ప్రామిస్‌కు ప్రతిఫలం.

(2) A, B తో అతడు చెల్లించవలసిన మొత్తమును చెల్లించినచో న్యాయస్థానములో దావా వేయనని వాగ్దానము చేసెను. A దావా వేయకపోవుట 'B' చెల్లింపునకు ప్రతిఫలము.

(3) A సరుకులను B కు రూ. 10,000లకు అమ్ముటకు అంగీకరించెను. సరుకులు 'B'కు ప్రతిఫలం. రూ. 10,000 నగదు 'A'కు ప్రతిఫలం.

## 3.2 ప్రతిఫలం - ఆవశ్యకాలు :

ఈ క్రింది వానిని ప్రతిఫలం యొక్క ఆవశ్యకాలుగా చెప్పవచ్చును.

**3.2.1 ప్రతిఫలము ప్రామిసర్ కోరికపై ఉండవలెను :** ప్రామిసర్ కోరకుండా ప్రామిసీ ఏ పని చేసినా అది ప్రతిఫలము కాదు. ప్రామిసర్ కోరికపైనే ప్రతిఫలము రావలెను. అనగా ప్రామిసర్ కోరిన మీదటనే ఒక పనిచేయుట గాని, నష్టము భరించుట గాని ఉండాలి. స్వచ్ఛందముగా చేసిన పనులుగాని, మూడవపార్టీ కోరిన మీదట చేసిన పనులు గాని సక్రమమైన ప్రతిఫలంగా పరిగణించరు. ఈ విషయం కాంట్రాక్టు చట్టము, సెక్షన్ 2(d) నిర్వచనంలో స్పష్టం చేయబడినది.

**కేసు (Case) :** దుర్గాప్రసాద్ Vs బలదేవ్ (Durga Prasad Vs Bala Dev) కేసులో జిల్లా కలెక్టరు కోరిన మీదట A ఒక మార్కెట్‌ను నిర్మించెను. ఆ మార్కెట్‌లో అమ్మిన వస్తువులపై కొంత కమిషన్ చెల్లించటానికి A కి, B వాగ్దానము చేసెను. తరువాత B కమిషన్ సొమ్ము చెల్లించలేదు. A సొమ్ము రాబట్టుకొనడానికి B మీద దావా తెచ్చినాడు. B కోరికపైన A మార్కెట్‌ను నిర్మించలేదు. కావున వాది కమీషన్ రాబట్టుకొనుటకు వీలుకాదని కోర్టువారు తీర్పుఇచ్చినారు.

**3.2.2 ప్రతిఫలం ప్రామిసీ నుండి గాని మరి ఏ ఇతర వ్యక్తి నుండి గాని రావచ్చును :** భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(d) ప్రకారము ప్రతిఫలము ప్రామిసీ నుండి గాని మరి యే ఇతర వ్యక్తి నుండి గాని రావచ్చును. కాబట్టి ప్రతిఫలము ఇవ్వని వ్యక్తి కూడా కాంట్రాక్టుపై దావా తీసుకురావచ్చును. అనగా ప్రతిఫలమునకు అపరిచితుడు, సంబంధము లేని వారు లేక మూడవ వ్యక్తి కాంట్రాక్టుపై దావా వేయవచ్చును.

ఉదా : A, B కి రూ. 1000లు ఇచ్చెను. ఇందుకు ప్రతిఫలంగా B, C కి ఒక షర్ట్ కొని ఇస్తానని వాగ్దానము చేసెను. ప్రతిఫలము C నుండి B కి రాకపోయినా C, B పై దావా వేసి కాంట్రాక్టు అమలును కోరవచ్చును.

**3.2.3 ప్రతిఫలము భూత, భవిష్యత్ వర్తమాన కాలాలకు సంబంధించినదై వుండవచ్చును :** భారతీయ కాంట్రాక్టు చట్ట ప్రకారం ప్రతిఫలం భూతకాలానికి, వర్తమాన కాలానికి, భవిష్యత్ కాలానికి గాని సంబంధించినదై వుండవచ్చును. భూతకాలానికి సంబంధించిన ప్రతిఫలము అనగా పూర్వ ప్రతిఫలము (Past Consideration) **భారతీయ న్యాయశాస్త్ర ప్రకారం సక్రమమే అయినా, ఇంగ్లీషు న్యాయశాస్త్ర ప్రకారం పూర్వ ప్రతిఫలం సక్రమమైన ప్రతిఫలం కాదు.** అనగా ఇంగ్లీషు న్యాయశాస్త్రం ప్రకారం ప్రతిఫలం వర్తమాన కాలమునకు, భవిష్యత్ కాలానికి సంబంధించినదై వుండవచ్చును గాని, భూతకాలానికి సంబంధించినదై వుండరాదు.

**కేసు (Case) :**

**ఎడ్‌వర్డ్ Vs కాన్యాన్ (Edward Vs Kenyan) :** అనే ఇంగ్లీషు కేసులో P అనే వ్యక్తి, వీలునామా ఆధారంగా Q అనే మైనరుకు గార్డియన్‌గా వున్నాడు. Q యొక్క నిత్యావసరములకు తన సొంత డబ్బును ఖర్చు చేసినాడు. తనకు మైనారిటీ తీరిన తరువాత P చేసిన ఖర్చు తాలూకు సొమ్ము ఇస్తానని Q వాగ్దానము చేసినాడు. కాని ఆ విధంగా సొమ్ము చెల్లించనందున దావా రాగా కోర్టు వారు దావా చెల్లదని పూర్వప్రతిఫలం సక్రమము కాదని తీర్పు ఇచ్చినారు.

పూర్వ ప్రతిఫలం సక్రమమైన ప్రతిఫలం కాదు అనే న్యాయసూత్రమునకు, ఇంగ్లీషు న్యాయశాస్త్ర ప్రకారం ఈ క్రింది మినహాయింపులు కలవు.

**(A) ప్రామిసర్ కోరికపై చేసిన సేవలు :** పూర్వ ప్రతిఫలం ప్రామిసర్ యొక్క కోరికపైన ఇచ్చిన ఎడల అలాంటి పూర్వ ప్రతిఫలం సక్రమమైన ప్రతిఫలం అవుతుంది.

**కేసు (Case) :**

**లేంప్లీ Vs బ్రెత్ వైట్ (Lampleigh Vs Braith Waite) :** ఈ కేసులో P కు Q ని చంపినందుకు మరణశిక్ష విధించబడింది. P స్నేహితుడైన S ను తన తరపున రాజుగారికి క్షమాపణ పత్రము సమర్పించమని కోరెను. రాజుగారు క్షమాభిక్ష పెట్టగా, P విముక్తుడయ్యెను. స్నేహితుడైన S చేసిన సహాయానికి కృతజ్ఞతగా £ 100 ఇస్తానని P, S కు వాగ్దానము చేసెను. సొమ్ము చెల్లించక పోవుటచే S దావా తెచ్చినాడు. ప్రామిసర్ కోరిన తరువాత చేసిన సేవలు తరువాత ఇచ్చిన ప్రామిస్‌కు విలువ గల ప్రతిఫలము అవుతుందని దావా సక్రమమని తీర్పు యిచ్చినారు.

(B) **కాలదోషము పట్టిన బాకీ :** కాలదోషము పట్టిన బాకీని తీరుస్తానని ఋణగ్రస్తుడు, ఋణదాతకు లిఖిత పూర్వకమైన వాగ్దానం చేసిన ఎడల అది సక్రమము అవుతుంది.

(C) **పరపతి సాధనాలు :** ఒక వసూలు హుండీకి గత కాలములోని బాకీ సక్రమమైన ప్రతిఫలం అవుతుంది.

కాబట్టి పైన పేర్కొన్న మినహాయింపులు తప్ప ఇంగ్లీషు న్యాయశాస్త్ర ప్రకారం పూర్వ ప్రతిఫలం సక్రమమైన ప్రతిఫలం కాదు. కాని భారతీయ కాంట్రాక్టు చట్టం ప్రకారం భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సంబంధించిన ప్రతిఫలాలు సక్రమమైనవే. ఈ విషయాలన్నీ భారతీయ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 2(d) తన ప్రతిఫల నిర్వచనంలో స్పష్టం చేసింది.

**3.2.4 ప్రతిఫలం తగినంతగా ఉండవలసిన అవసరం లేదు :** ఏదైనా చేయనవసరంలేనిది చేయడం గాని, చేయవలసినది మానడం గాని ప్రతిఫలం అవుతుంది. ఏమి లేనిదే ప్రతిఫలం లేదు; ప్రతిఫలం అంటే ఏదో ఒకటి ఉండవలెను. (It cannot be nothing, it must be something). **కాంట్రాక్టులో వచ్చే లాభానికి కాంట్రాక్టు క్రింద ఇవ్వవలసిన ప్రతిఫలం సమానంగా ఉండనవసరం లేదు.** కారణమేమనగా వస్తువుల తాలూకు విలువ పార్టీల తాలూకు కోరికలపై, ఆ వస్తువులపై ఆ వ్యక్తికి ఉండే ఆసక్తిని బట్టి వుంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తికి ఒక వస్తువుపై మోజు ఉన్నప్పుడు, ఆ వస్తువు హక్కుదారు ఆ వస్తువుకు ఎంత విలువ కోరినా ఆ వస్తువుపై మోజు కల వ్యక్తి, ఆ కోరిన వస్తువు యొక్క అసలు విలువ కంటే ఎంత ఎక్కువైనా ఇవ్వడానికి ఒప్పుకోవచ్చును. అలాంటపుడు దానిని మోజుపై క్రయము (Fancy Purchase) అంటాము. అదే విధముగా వస్తువు హక్కుదారుకు డబ్బు అవసరమైనపుడు, ఆ వస్తువు మీద మోజు లేనపుడు అతడు ఆ వస్తువును ఎంత తక్కువ ధరకు అడిగినా విక్రయించడానికి అంగీకరించవచ్చును. అలాంటపుడు దానిని అవసర విక్రయము ( Necessity Sale) అంటాము. అలాంటి సందర్భాలలో ఏర్పడిన కాంట్రాక్టులను తరువాత పార్టీలు ప్రతిఫలం చాలినంతగా లేదని, విలువ ఎక్కువ అని గాని, చాలా తక్కువగా వుందని గాని, కాబట్టి ప్రతిఫలం సక్రమం గాదని వాదించడానికి వీలులేదు.

**ఉదా :** (1) రూ. 100ల విలువ గల చీర రూ. 500లకు కొనుగోలు చేయుట.

(2) రూ. 1000ల విలువ చేసే సైకిలును రూ. 200లకు విక్రయించుట.

అదే విధంగా కాంట్రాక్టు వలన మొదటి పార్టీకి గాని, ఎదురు పార్టీకి గాని స్వల్పమైన లాభం, సుఖం గాని, కష్టం, నష్టం గాని జరిగినపుడు వాటిని సక్రమమైన ప్రతిఫలంగా పరిగణిస్తారు. ఉదా : హరి రెండు రోజులు సిగరెట్లు కాల్చడం మానుకుంటే శ్రీరాం, హరికి రూ. 100లు ఇస్తానని అన్నాడు. ఒప్పంద ప్రకారం హరి రెండు రోజులు సిగరెట్లు మానివేశాడు. శ్రీరాం రూ. 100లు హరికి చెల్లించాలి. శ్రీరాంకు ఎలాంటి లాభం లేకపోయినా హరి తన అలవాటు మానుకోవడంలో ఆ రెండు రోజులు పడిన కష్టం కాంట్రాక్టుకు ప్రతిఫలం అవుతుంది.

కాంట్రాక్టు చట్టము సెక్షన్ 26 ప్రకారం "ప్రామిసర్ స్వేచ్ఛగా అగ్రిమెంటుకు సమ్మతిని తెలియచేసిన ఎడల ప్రతిఫలము

చాలినంత లేదనే కారణముపై అగ్రిమెంటు సక్రమము కాకపోదు" అనగా ప్రతిఫలం చాలినంతగా లేకపోవుట కాంట్రాక్టు క్రమత్వానికి లోపం రాదు. ఏన్సన్ (Anson) ప్రకారం **"ఒక కాంట్రాక్టుకు ఒక మిరియపు గింజ లేదా గుండుసూది అయినా ప్రతిఫలం అవుతుంది".**

**కేసు** (Case) **: థామస్** Vs **థామస్** (Thomas Vs Thomas) **:**

ఈ కేసులో చనిపోయిన భర్త కోరిక ప్రకారం భార్యకు సంవత్సరమునకు £ 1 చొ॥న ఇంటిని అద్దెకు ఇచ్చెను. తరువాత ఆమెకు ఇల్లు "అద్దె తక్కువ" అనే మిషతో ఖాళీ చేయమని చెప్పెను. ఆమె దావా వేయగా అద్దె చాలినంత లేకపోయినా కాంట్రాక్టు సక్రమమని తీర్పు ఇచ్చినారు.

**చజ్మల్** Vs **రామ్‌పాల్‌సింగ్** (Chazmal Vs Ramapaul Singh) **:** ఈ కేసులో ప్రతిఫలం వాగ్దానమునకు చాలినంతగా ఉండనవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినది.

కాంట్రాక్టులోని పార్టీల కష్టనష్టములనే ఆ కాంట్రాక్టుకు ప్రతిఫలమంటారు. కాబట్టి **ప్రతిఫలం విధిగా నగదు రూపంలో గాని, వస్తు రూపంలోగాని ఉండనవసరం లేదు.** అది సేవారూపముగా గాని, కార్యముగా గాని, కార్యాభావముగా గాని ఉండవచ్చును. తాను చేయవలసిన పని చేయకపోవుటగాని, చేయుటగా గాని అయి వుండవచ్చును. అంతేగాక ఒక పార్టీకి లాభంగా గాని ఎదుటి పార్టీ లేక ఇరు పార్టీలకు నష్టముగా గాని ఉండవచ్చును.

**కేసు** (Case) **:**

**కేదారనాథ్** Vs **గోరి మహమ్మద్ :** ఈ కేసులో టౌన్‌హాల్ నిర్మాణానికి కొంత సొమ్ము చందా ఇస్తానని, A, B కి వాగ్దానము చేసెను. A ఇచ్చిన వాగ్దానం పై నమ్మకంతో B ప్లాన్లు తయారుచేయించి కాంట్రాక్టర్లకు పని అప్పగించి ఆర్థికపరమైన కొన్ని బాధ్యతలను చేపట్టినాడు. తరువాత A తన వాగ్దానం నెరవేర్చుటకు నిరాకరించినాడు. దానిపై B, A మీద దావా తీసుకురాగా A కి ప్రయోజన రూపంలో ప్రతిఫలం లేకపోయినప్పటికీ B కి నష్టరూపంలో ప్రతిఫలం ఉన్నది కాబట్టి దావా సక్రమమని కోర్టు తీర్పు యిచ్చినది.

### 3.2.5 ప్రతిఫలం వాస్తవముగా ఉండవలెను :

ప్రతిఫలం యదార్థముగా ఉండవలెను. అది భ్రమగా వుండరాదు. అనగా ప్రతిఫలం భౌతిక అసాధ్యముగా, మిధ్యగా, లేని దానిగా ఉండకూడదు. ఈ క్రింది అంశాలను నిజమైన ప్రతిఫలముగా పరిగణించరు.

**(1) భౌతిక అసాధ్యత** (Physical Impossibility) **:** భౌతికముగా అసంభవనీయమైన ప్రతిఫలము వాస్తవమైన ప్రతిఫలంగా పరిగణించబడదు. చట్టము దృష్టిలో ఈ విధమైన ప్రతిఫలము సక్రమము కాదు. ఉదా : నీరజ గంటకు 100 కి.మీ. వేగముతో పరుగెత్తితే శ్రీరాం వజ్రాల ఉంగరం ఇస్తానని వాగ్దానం చేసినాడు. 100 కి.మీ. వేగముతో పరుగెత్తుట అసాధ్యం.

**(2) న్యాయాత్మక అసంభవము** (Legal Impossibility) **:** ప్రతిఫలం న్యాయసూత్రాల ప్రకారం అసంభవమైనదిగా ఉండరాదు. ఉదా : P, Q కు రూ. 1000లు బాకీ వున్నాడు. Q కి సేవకుడైన R కి రూ. 100 చెల్లించెను. దానికి ప్రతిఫలంగా P ని ఋణవిముక్తుని చేస్తానని R వాగ్దానము చేసెను. ఇది న్యాయాత్మకముగా అసంభవము. సేవకుడు తన యజమానికి రావలసిన బాకీని రద్దుచేయలేడు.

**(3) అనిశ్చితమైన ప్రతిఫలము** (Uncertain Consideration) **:** ఖచ్చితంగా పేర్కొనలేని ప్రతిఫలం సక్రమము కాదు. ప్రతిఫలం నిర్దిష్టంగా ఉండవలెను. ఉదా : గోపి ఒక పని చేసినందుకు సముచితమైన సొమ్ము ఇస్తానని రాధ అన్నది. సముచితమైన సొమ్మును ఎంత మొత్తమో చెప్పటం సులభం కాదు.

**(4)** **భ్రమతో కూడిన ప్రతిఫలం (**Illusory Consideration**) :** భ్రమతో కూడిన ప్రతిఫలం సక్రమమైనది కాదు. ఉదా: P సూర్య గ్రహం నుండి కిలో బంగారం తెచ్చి ఇస్తానని Q కు వాగ్దానము చేయుట.

**(5)** **నిర్వర్తించవలసిన బాధ్యత (**Existing Legal Obligation**) :** ముందుగా నిర్వర్తించవలసిన న్యాయాత్మక బాధ్యతను ప్రస్తుతం నిర్వహించిన ఎడల అది ప్రతిఫలం కాదు.

**కేసు : కాలిన్స్ Vs గాడ్‌ఫ్రే (**Collins Vs God Fray**) :** ఈ కేసులో S ను సాక్షిగా హాజరు కావలసిందిగా కోర్టువారు ఉత్తర్వులు జారీ చేసినారు. S కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పిన ఎడల కొంత సొమ్ము చెల్లించెదనని A వాగ్దానము చేసెను. ఈ కాంట్రాక్టు చెల్లదు. ఎందువలననగా S సాక్షిగా కోర్టుకు హాజరు కావడం అతనికి ఇంతకుముందు వున్న బాధ్యత.

ఈ క్రింది అంశాలను మంచి ప్రతిఫలంగా పరిగణిస్తారు.

**1** **వ్యాజ్యం వేయకుండా మానుట (**Abstaining from Suit**) :** దావా వేయకుండా విరమించుకొనుట మంచి ప్రతిఫలంగా పరిగణించబడుతుంది.

ఉదా : ప్రామిసరీ నోటుపై ఋణదాత దావా తీసుకురావడం విరమించుకుంటే, స్థిరాస్థి హామీ వుంచుతానని ఋణగ్రస్తుడు చెప్పితే అది సక్రమమైన ప్రతిఫలం అవుతుంది.

**2** **తగాదాలు రాజీ చేసుకొనుట (**Compramise of Dispute Claims**) :** వివాదగ్రస్తమైన క్లెయిమ్‌లు రాజీ చేసుకొనే సందర్భములలో చెల్లించే ప్రతిఫలం సక్రమమైనది అవుతుంది. ఉదా : మధు రూ. 5000లు కిషోర్ నుండి రాబట్టుకొనుటకు దావా వేసెను. కిషోర్, మధుకి రూ. 2000లు చెల్లించుటకు రాజీగా అంగీకరించిన ఎడల ఆ వాగ్దామునకు క్రమమైన ప్రతిఫలం వున్నదని చెప్పవచ్చును.

**3** **బాకీదారులతో ఉమ్మడి పరిష్కారం చేసుకొనుట (**Composition With Creditors**) :** ఋణగ్రస్తుడు ఆర్థికపరమైన ఇబ్బందులలో ఉన్నపుడు తన ఋణదాతలతో అప్పు మొత్తాల తగ్గింపును అడుగవచ్చును. దానికి ఋణదాతలు అంగీకరిస్తే అలాంటి రాజీ ఒప్పందము సక్రమం అవుతుంది. కాబట్టి క్రింది రాజీ ఒప్పందాలు సక్రమమైన ప్రతిఫలాలుగా పరిగణిస్తారు.

(A) భవిష్యత్‌లో వివాదమును నివారించుటకు పార్టీలు ఏర్పరుచుకొన్న అగ్రిమెంట్లు

(B) మనోవర్తి సందర్భములో ఏర్పడిన వివాద పరిష్కారమునకు హిందూ భర్త తన భార్యతో ఏర్పరచుకున్న అగ్రిమెంటు.

**3.2.6 ప్రతిఫలం న్యాయసమ్మతంగా వుండాలి :** ప్రతిఫలం న్యాయసమ్మతమైనదిగా ఉండవలెను. అనగా ప్రతిఫలం న్యాయవిరుద్ధంగా గాని, అన్యాయమైనదిగా గాని చట్ట విరుద్ధమైనదిగా గాని ఉండకూడదు. అలాంటి ప్రతిఫలంతో కూడిన కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది. ప్రతిఫలం తాలూకు ఉద్దేశం కూడా న్యాయసమ్మతంగా వుండవలెను.

## 3.3 ప్రతిఫలం - అపరిచితుడు :

కాంట్రాక్టులోని ప్రతిఫలానికి సంబంధం లేని వ్యక్తి ప్రతిఫలానికి అపరిచితునిగా చెప్పవచ్చు. అలాంటి అపరిచితుడు లేక సంబంధం లేని వాడు లేక మూడవ వ్యక్తి కాంట్రాక్టు అమలు కోరుతూ దావా తీసుకురావచ్చును. భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 2(d) ఇచ్చిన ప్రతిఫల నిర్వచనములో ఈ విషయమును స్పష్టం చేసినారు. ఈ నిర్వచనం ప్రకారం ప్రామిసీ నుండి గాని మరి ఏ ఇతర వ్యక్తి నుండి గాని కాంట్రాక్టుకు ప్రతిఫలం రావచ్చును. **కాబట్టి ప్రతిఫలం ఇవ్వని వ్యక్తి కూడా కాంట్రాక్టుపై దావా**

తీసుకురావచ్చును. ఉదా : P, Q కి రూ. 1000లు ఇచ్చెను. ఇందుకు ప్రతిఫలంగా Q, R కి ఒక సైకిలును కొని ఇస్తానని వాగ్దానము చేసెను. ప్రతిఫలం R నుండి Q కి రాకపోయినా R, Q పై దావా వేసి కాంట్రాక్టు అమలు కోరవచ్చును.

**కేసు (Case) : చిన్నయ్య Vs రామయ్య (Chinnayya Vs Ramayya) :** ఈ కేసులో తల్లి తన ఆస్తినంతయూ కూతురుకు వ్రాసి ఇచ్చెను. దానికి ప్రతిఫలంగా కూతురు తన మేనమామకు జీవితాంతం కొంత పైకమును చెల్లించుటకు మేనమామకు వాగ్దానము చేసినది. మేనకోడలు కొంత కాలము తరువాత డబ్బు చెల్లించనందున మేనమామ ఈ దావా వేసెను. ప్రతిఫలము మేనమామ నుండి రాలేదని మేనకోడలు వాదించినది. తన తల్లి నుండి తనకు వచ్చిన ఆస్తి ఈ కాంట్రాక్టుకు ప్రతిఫలమని మేనమామకు జీవితాంతము సొమ్ము చెల్లించవలెనని కోర్టు తీర్పు యిచ్చినది.

అందువలన భారతీయ న్యాయశాస్త్రము ప్రకారం ప్రతిఫలము ప్రామిసీ నుండే గాక ఏ ఇతర వ్యక్తి నుండైనా కూడా రావచ్చునని, ప్రతిఫలమునకు సంబంధము లేని వాడు, మూడవ వ్యక్తి, అపరిచితుడు కాంట్రాక్టుపై దావా వేయవచ్చునని తెలుస్తున్నది.

**కాని ఇంగ్లీషు న్యాయశాస్త్ర ప్రకారం ప్రతిఫలం ప్రామిసీ నుండి మాత్రమే రావలెను.** ఇతరుల నుండి వచ్చిన ప్రతిఫలము సక్రమమైన ప్రతిఫలముగా పరిగణించరు. కాబట్టి ప్రతిఫలమునకు అపరిచితుడు, మూడవ వ్యక్తి, సంబంధం లేని వాడు కాంట్రాక్టుపై దావా వేయరాదు.

ఉదా : A, B కి రూ. 1000లు ఇచ్చెను. దీనికి ప్రతి ఫలంగా B, C కి చీర కొని ఇస్తానని వాగ్దానము చేసెను. A, B కి ఇచ్చిన ప్రతిఫలమునకు అపరిచితుడు కాబట్టి B చీరను C కు కొని ఇవ్వకపోతే C, B పై దావా వేయలేడు. C నుండి B కి ఎలాంటి ప్రతిఫలం లేదు. కావున ఇంగ్లీషు న్యాయశాస్త్రం ప్రకారం చెల్లదు.

**కేసు (Case) : ట్విడిల్ Vs అట్కిన్‌సన్ (Twiddle Vs Autkinson) :** ఈ కేసులో వధువు తండ్రి వరునికి కొంత సొమ్ము ఇస్తే, వరుని తండ్రి వధువుకు కొంత సొమ్ము ఇస్తానని వాగ్దానము చేసెను. వరుని తండ్రి వాగ్దానము ప్రకారం వధువుకు సొమ్ము ఇచ్చినాడు. వధువు తండ్రి వరునికి సొమ్ము ఇవ్వకుండా మరణించెను. వరుడు తన మామగారి వారసులపై సొమ్ము చెల్లింపు కోరుతూ దావా తెచ్చినాడు. వారసులు కాంట్రాక్టును అంగీకరిస్తూ, ఆ కాంట్రాక్టుకు వాది నుండి వచ్చిన ప్రతిఫలం ఏమియు లేదు కావున అది చెల్లని కాంట్రాక్టు అని వాదించినారు. కోర్టు వారు ఆ వాదనను అంగీకరిస్తూ దావాను కొట్టి వేసినారు.

**సంభావిత ప్రతిఫలం :**

**కేసు (Case) : డట్టన్ Vs పూల్ (Dutton Vs Pool) :** ఈ కేసులో తండ్రి తన ఎస్టేట్‌లోని చెట్లను నరికించి కలప అమ్మి తన కుమార్తెకు పెళ్ళి ఖర్చులకు వినియోగిద్దామని అనుకుంటుండగా కుమారుడు జోక్యం చేసుకొని తన తండ్రి ఆ చెట్లను నరికించ కుండా వుంటే తాను పెళ్ళి ఖర్చులు ఇస్తానని అంగీకరించాడు. తరువాత అతడు సొమ్ము ఇవ్వనందున చెల్లెలు అన్నపై కాంట్రాక్టు అమలు కోరుతూ ఈ దావా తెచ్చినది. ప్రతివాది కాంట్రాక్టును అంగీకరిస్తూ ఆ కాంట్రాక్టుకు వాది ఎలాంటి ప్రతిఫలం ఇవ్వనందున ఆ కాంట్రాక్టు చెల్లదని వాదించినాడు. దానికి వాది తన తండ్రి చెట్లను నరికించకుండా మానుకోవడం ఈ కాంట్రాక్టుకు ప్రతిఫలమని వాదించినది. కోర్టు ఆ వాదనను అంగీకరిస్తూ ఏదైనా కాంట్రాక్టులో ప్రతిఫలం ప్రామిసీకి గాని, అతని రక్తసంబంధీకుని నుంచి గాని రావచ్చునని, అట్టి రక్తసంబంధీకుని నుంచి వచ్చిన ప్రతిఫలాన్ని సంభావిత ప్రతిఫలంగా చూడవచ్చునని, దావా సక్రమమని తీర్పు ఇచ్చినారు.

## 3.4 కాంట్రాక్టుకు సంబంధం లేని వ్యక్తి :

సాధారణంగా కాంట్రాక్టుకు సంబంధించిన పార్టీలు మాత్రమే ఒకరిపై ఒకరు దావా వేయవచ్చును. కాంట్రాక్టుకు పార్టీలు కాని వ్యక్తులు కాంట్రాక్టును అమలు పరచలేరు. అనగా కాంట్రాక్టు పార్టీలు మాత్రమే కాంట్రాక్టును అమలుపరచగలరు. దీనికి గల

కారణము ఆ పార్టీల మధ్య ప్రివిటీ ఆఫ్ కాంట్రాక్టు (Privity of Contract) ఉంటుంది. కాంట్రాక్టుకు పార్టీ గాని వ్యక్తులు కాంట్రాక్టును అమలు పరచమని దావా తీసుకు రాలేరు. ఈ విషయంలో ఇంగ్లీషు న్యాయశాస్త్రానికి భారతీయ న్యాయశాస్త్రమునకు ఎలాంటి తేడా లేదు.

ఉదా : A, B కి రూ. 50,000లు బాకీ వుంటే, A, C కి తన ఇంటిని రూ. 2,00,000లకు అమ్మితే C, A రూ. 1,50,000లు నగదు ఇచ్చి రూ. 50,000లు A తరపున తానే B కి తీరుస్తానని A తో ఒప్పుకొని అమ్మకం అగ్రిమెంటు వ్రాయించుకుంటే ఆ కాంట్రాక్టుకు C, A లు పార్టీలు అయినపుడు, ఆ కాంట్రాక్టు క్రింద తాను B కి ఇవ్వవలసిన రూ. 50,000లు ఇవ్వకపోతే, B ఆ కాంట్రాక్టును అమలుపరచలేడు. దీనికి కారణం B అనే వ్యక్తి C, A ల మధ్య వున్న కాంట్రాక్టుకు పార్టీ కాకపోవుటయే.

**కేసు (Case) : డన్‌లప్ న్యూమాటిక్ టైరు కంపెనీ Vs సెల్ఫురిడ్జి అండ్ కంపెనీ (Dunlop Pneumatic Tyre Co. Vs Self Ridge & Co) :**

డ్యూ అండ్ కంపెనీ (Dew & Co) వారు డన్‌లప్ కంపెనీ (Dunlop Co.) వారి ఏజెంట్లు. సెల్ఫ్ రిడ్జి కంపెనీ వారికి, డ్యూ అండ్ కంపెనీ వారు డన్‌లప్ కంపెనీ వారి టైర్లను, ట్యూబులను అమ్ముతూ వాటి కేటలాగు ధర కంటే తక్కువ ధరకు అమ్మరాదని, ఒక వేళ ఆ విధంగా అమ్మితే అమ్మిన ప్రతిదానికి £ 5 ముదరా చెల్లించవలెనని కాంట్రాక్టు ఏర్పరచుకున్నారు. సెల్ఫ్ రిడ్జి అండ్ కంపెనీ వారు రెండు టైర్లను కేటలాగు ధర కంటే తక్కువ ధరకు అమ్మగా ఈ విషయం వాది కంపెనీకి తెలిసినది. £ 10 రాబట్టుకొనే నిమిత్తం డన్‌లప్ కంపెనీ దావా తెచ్చినది. అందుకు ప్రతివాది కంపెనీ, వాది కంపెనీతో తనకు ఎలాంటి కాంట్రాక్టు లేదని, తాను చేసిన కాంట్రాక్టు డ్యూ అండ్ కంపెనీతో కాబట్టి వాది కంపెనీకి దావా తెచ్చే హక్కు లేదని వాదించినది. ఈ వాదనను హౌస్ ఆఫ్ లార్డ్స్ (House of Lords) వారు అంగీకరిస్తూ వాది దావా చెల్లదని తీర్పు చెప్పినారు.

కాంట్రాక్టుకు పార్టీ కాని వ్యక్తి కాంట్రాక్టు అమలును కోరలేడు అనే ఈ సాధారణ న్యాయసూత్రమునకు ఈ క్రింది మినహాయింపులు కలవు.

1 **ట్రస్టు వ్యవహారములు :** ట్రస్టు వ్యవహారములలో ట్రస్టును సృష్టించే వ్యక్తి, ట్రస్టీల మధ్య కాంట్రాక్టు ఏర్పడినప్పటికి, ట్రస్టీ, ట్రస్టు అంశాలకు అనువుగా వ్యవహారాలు నిర్వహించనపుడు, లాభానుభోక్త కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినప్పటికీ కాంట్రాక్టు అమలు కోరవచ్చును.

**కేసు (Case) : గ్యాండి Vs గ్యాండి (Gandy Vs. Gandy) :**

విడిపోయిన భార్య పోషణకు భర్త ఒక ట్రస్టును ఏర్పాటు చేసి, ఆమెకు ఆ ట్రస్టు నుండి కొంత సొమ్ము పంపడానికి ట్రస్టీలను నియమించెను. భార్య ట్రస్టు కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినప్పటికీ ట్రస్టు అమలును కోరవచ్చునని తీర్పు యిచ్చినారు.

2 **ఎస్టాపెల్ (Estoppel) సిద్ధాంతము :** కాంట్రాక్టు అమలు కోరే వ్యక్తి కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినప్పటికీ, ప్రామిసీ అలాంటి వ్యక్తితో తన బాధ్యతను నెరవేరుస్తానని నోటి మాటల ద్వారా గాని, లిఖిత పూర్వకంగా గాని, వ్యవహార రీత్యాగాని అంగీకరించినపుడు అలాంటి ప్రామిసీ ఎస్టాపెల్ సిద్ధాంతము వలన అలాంటి వ్యక్తి చేసే అమలును ఆటంక పరచలేడు. అనగా అలాంటి సందర్భములలో కాంట్రాక్టుకు పార్టీ కాని వ్యక్తి కూడా కాంట్రాక్టు అమలు కోరవచ్చును.

ఉదా : P రూ. 10,000లు Q కి ఇచ్చి ఆ మొత్తాన్ని S కు ఇవ్వమని చెప్పెను. ఈ విషయం Q, S తో చెప్పెను. S కాంట్రాక్టుకు సంబంధం లేని వాడైనా ఆ సొమ్మును రాబట్టుకొనుటకు దావా వేయవచ్చును.

పైన పేర్కొన్న మినహాయింపు సూత్రాలే గాక మన దేశంలో మన కాంట్రాక్టు న్యాయశాస్త్రం ఈ క్రింది మినహాయింపులను కూడా పేర్కొన్నది.

3 **స్థిరాస్థికి సంబంధించిన కాంట్రాక్టులు :** ఒక కాంట్రాక్టు ప్రకారం ఒక వ్యక్తికి లాభం సంక్రమిస్తూ, కాంట్రాక్టు బాధ్యతకు ఏదైనా స్థిరాస్థి హామీగా ఉన్నటువంటి వ్యక్తి కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినా ఆ కాంట్రాక్టును అమలు పరచవచ్చును.

**కేసు(Case) : క్వాజా మహమ్మద్ ఖాన్ Vs హుస్సేనీ బేగం (Khwajah Mahommed Khan Vs Hussaini Beguam) :**

ఈ కేసులో వరుని తండ్రి వధువు తండ్రితో తన కుమారునికి పిల్లనిస్తే తను నెలకు రూ. 500, కోడలికి కొంత స్థిరాస్థి హామీగా తాంబూలాల ఖర్చుల (ఖర్చ పాన్ దాన్) క్రింద ఇస్తానని ఒప్పందం చేసినాడు. పెళ్ళి అయిన కొన్నాళ్ళకు మామగారు ఈ సొమ్ము ఇవ్వకపోగా కోడలు మామగారిపై సొమ్ము వసూలుకు దావా తెచ్చినది. ప్రతివాది అయిన మామగారు తాను ఏర్పరచుకున్న కాంట్రాక్టును అంగీకరిస్తూ ఆ కాంట్రాక్టుకు వాది పార్టీ కానందున ఈ దావా చెల్లదని వాదించినాడు. కాని, కోడలు కాంట్రాక్టుకు సంబంధం లేని వ్యక్తి అయినా ఆమె లాభానికి స్థిరాస్థి హామీగా వుంచి కాంట్రాక్టు ఏర్పరచుకోవడం జరిగింది కాబట్టి ఆమె కాంట్రాక్టును అమలుపరచగలదని ప్రీవీ కౌన్సిల్ (Privey Council) వారు తీర్పు ఇచ్చినారు.

4 **కుటుంబ సర్దుబాట్లు :** హిందూ సమిష్టి కుటుంబంలోని సభ్యులు ఆస్తులు పంచుకుంటూ ఆ సమిష్టి ఆస్తిపై ఏవైనా బాధ్యతలు వుంటే అలాంటి బాధ్యతలను సర్దుబాట్లు ద్వారా పార్టీల అంగీకారముతో ఒకే పార్టీ వాటాకు నిర్ణయించుకోవచ్చును. అలాంటి సందర్భములలో ఆ బాధ్యతా స్వీకర్తకు, లాభానుభోక్తకు మధ్య వేరే కాంట్రాక్టు లేకపోయినా, ఆ లాభానుభోక్త ఆ ఏర్పాటు పార్టీల మధ్య కాంట్రాక్టును అమలుపరచగలడు.

ఉదా : P, Q అనే అన్నదమ్ములు వారి పిత్రార్జితపు ఆస్తి రూ. 5,00,000లు పంచుకోవలసి వుంది అనుకుంటే వారికి S అనే పెళ్ళి కాని చెల్లెలు వుంటే వారు చెల్లెలి పెళ్ళి ఖర్చులు జాయింటు ఆస్తి నుండి భరించవలసి వుంటుంది. పెళ్ళి ఖర్చులు రూ. 1,00,000గా నిర్ణయించుకుంటే మిగిలిన రూ. 4,00,000లు మాత్రమే పంచుకోవలె. అలాంటపుడు Q, S తాలూకు వివాహం జరిపేటట్లు P, Q ల మధ్య కాంట్రాక్టు ఏర్పరచుకొని P తన 2,00,000లు తీసికొని Q కి రూ. 3,00,000లు విలువ గల ఆస్తిని వదిలితే తరువాత Q, S తాలూకు వివాహం జరపకపోతే P, Q ల మధ్య కాంట్రాక్టు మాత్రమే వున్నప్పటికీ S, Q పై దావా వేసి ఆ కాంట్రాక్టు అమలు కోరవచ్చును.

**కేసు (Case) :**

1 **సుందరరాజా Vs లక్ష్మీ అమ్మాళ్ :** ఈ కేసులో తల్లి పోషణకు గాను అన్నదమ్ములు కాంట్రాక్టు చేసుకున్నారు. తల్లి కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినా తన కుమారుల మధ్య కాంట్రాక్టు అమలును కోరవచ్చునని తీర్పు ఇచ్చినారు.

2 **సుప్పు అమ్మాళ్ Vs సుబ్రహ్మణ్యం :** ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములు ఆస్తిని పంచుకుంటూ తల్లి పోషణకు కొంత సొమ్ము చెల్లించుటకు కాంట్రాక్టు చేసుకున్నారు. ఆ పైకమును అన్న దగ్గర వుంచడానికి అంగీకారం కుదిరింది. డబ్బు కొరకు తల్లి అన్నపై దావా వేయగా తల్లి కాంట్రాక్టుకు సంబంధం లేని వ్యక్తి కావున కాంట్రాక్టు అమలుకై కోరలేదని వాదించినాడు. తల్లి కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినా, కాంట్రాక్టు అమలుపరచగలదని దావా సక్రమమని కోర్టు తీర్పు యిచ్చినది.

5 **ఏజెన్సీ కాంట్రాక్టులు :** ఏజెంటు తన ప్రిన్సిపాల్ తరపున మూడవ వ్యక్తితో కాంట్రాక్టు చేసుకుంటే, ప్రిన్సిపాల్ కాంట్రాక్టుకు సంబంధం లేనివాడైనా మూడవ వ్యక్తిపై కాంట్రాక్టును అమలుపరచగలడు.

ఉదా : X శామ్‌సంగ్ కంపెనీ ఏజెంటు. A 100 శామ్‌సంగ్ టెలివిజన్ సెట్లను కొనడానికి X తో ఆర్డరు వ్రాయించుకున్నాడు. A టెలివిజన్ సెట్లు తీసికొనకపోతే కాంట్రాక్టు X తో ఏర్పడినప్పటికి శామ్‌సంగ్ A మీద దావా వేయవచ్చు.

6 **అస్సైన్ మెంటు కాంట్రాక్టులు :** అస్సైన్‌మెంటు కాంట్రాక్టులలో అస్సైనీ (బదలాయింపు పొందిన వ్యక్తి) కాంట్రాక్టుకు పార్టీ కాకపోయినా కాంట్రాక్టును అమలుపరచగలడు.

ఉదా : X రూ. 5000లు Y దగ్గర అప్పు తీసికొని ఆ మేరకు ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చినాడు. Y ఆ ప్రామిసరీ నోటును Z అనే వ్యక్తికి బదలాయింపు చేశాడు. X, Z ల మధ్య ఏ విధమైన కాంట్రాక్టు లేకపోయినా, Z కాంట్రాక్టుకు సంబంధం లేనివాడైనా X నుండి సొమ్ము రాబట్టుకొనగలడు.

## 3.5 ప్రతిఫలం లేని కాంట్రాక్టులు చెల్లవు :

ప్రతిఫలం లేని కాంట్రాక్టును అమలుపరచుటకు వీలులేదు. ప్రతిఫలరహితమైన కాంట్రాక్టులు దిగంబర కాంట్రాక్టులు. అలాంటి కాంట్రాక్టులకు వ్యాజ్య కారణం వుండదు. సాల్‌మండ్ (Salmond) అభిప్రాయములో "ప్రతిఫలం లేని వాగ్దానము దానముతో సమానము. ప్రతిఫలంతో కూడిన వాగ్దానము బేరముతో సమానము''. కాబట్టి ప్రతిఫలము లేకుండా చేసుకొన్న అగ్రిమెంటు చెల్లదు. **అందుచే "ప్రతిఫలము లేదు, కాంట్రాక్టు లేదు" అనేది సాధారణ న్యాయసూత్రం.**

**కేసు (Case) : అబ్దుల్ అజీజ్ Vs మాసూమ్ ఆలి (Abdul Aziz Vs Masoom Ali)**

ఈ కేసులో మసీదు పునర్నిర్మాణము చేయుటకు చందా ఇస్తానని ప్రతివాది వాగ్దానము చేసినారు. కాని ఆ విధంగా సొమ్ము చెల్లించనందున ఈ దావా వచ్చినది. ప్రతివాదికి ప్రయోజన రూపంలో ప్రతిఫలం లేదని, అలాగే వాగ్దానము పొందిన వాదికి నష్ట రూపంలో ప్రతిఫలం గాని లేనందున కాంట్రాక్టు లేదని దావాను తిరస్కరించినారు.

"ప్రతిఫలం లేదు కాంట్రాక్టు లేదు'' అనే సాధారణ న్యాయసూత్రమునకు భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 25 ప్రకారం ఈ క్రింది మినహాయింపులు కలవు.

### 3.5.1 మినహాయింపులు :

1. **సహజ ప్రేమాతిశయాలు (Natural Love and Affection) :** ఇరుపార్టీలు దగ్గర బంధువులై వుండి వారి మధ్య గల సహజ ప్రేమాతిశయముల వలన, వ్రాతపూర్వకంగా కాంట్రాక్టు ఏర్పరచుకొని దానిని రిజిష్టరు చేయించుకుంటే అలాంటి కాంట్రాక్టు ప్రతిఫల రహితమైనా సక్రమమే అవుతుంది.

**కేసులు (Cases) :**

1 **పూను బీబీ Vs ఫైజుబిక్ష్ (Poonoobibi Vs FyazBuksh) :** భర్త తన భార్యకు ప్రతినెలా కొంత సొమ్ము చెల్లిస్తానని తన సహజ ప్రేమ వలన రిజిష్టరు కాంట్రాక్టు చేసుకున్నాడు. తరువాత సొమ్ము యివ్వనందున భార్య, భర్తపై ఈ దావా తెచ్చినది. ఈ కాంట్రాక్టు క్రింద భార్య నుండి భర్తకు ఎలాంటి ప్రతిఫలం లేకపోయినా, సహజ ప్రేమ వలన రిజిష్టర్డు కాంట్రాక్టు ఏర్పడినందున మినహాయింపు సూత్రం వర్తిస్తుందని కోర్టు తీర్పు యిచ్చినది.

2 **రాజలఖి Vs భూతనాథ్ (Rajalukhy Vs Bhootanadh) :** భార్య, భర్తల మధ్య ఎప్పుడూ కీచులాటలు ఉండుట వలన వారిద్దరికి సరిపడక భర్త, తన నుండి భార్య వేరుగా ఉండడానికి, తను ప్రతినెలా కొంత సొమ్ము ఇవ్వడానికి

ఒక రిజిష్టరు కాంట్రాక్టు చేసుకున్నాడు. ఈ కేసులో సహజ ప్రేమాతిశయాలు ఇద్దరి మధ్య లోపించినందున మినహాయింపు సూత్రం వర్తించదని కోర్టు తీర్పు యిచ్చినది.

3 **వెంకటస్వామి Vs రంగస్వామి (Venkata Swamy Vs Ranga Swamy) :** ఈ కేసులో V, R లు అన్నదమ్ములు. V సహజ ప్రేమ, వాత్సల్యముల కారణంగా తన సోదరుడగు R అప్పులను తీర్చటానికి ఒక రిజిష్టరు పత్రమును వ్రాసి ఇచ్చినాడు. కాని ఒప్పందం ప్రకారం అప్పులను తీర్చనందుకు R బాకీలు తీర్చమని V పై దావా వేసెను. ఈ కాంట్రాక్టు సహజ ప్రేమ వాత్సల్యము వలన ఏర్పడినందున మినహాయింపు సూత్రంలోకి వస్తుందని కోర్టు తీర్పు ఇచ్చినది.

4 **భీవా Vs శివరామ్ (Bhiva Vs Shiva Ram) :** ఈ కేసులో ఇద్దరు అన్నదమ్ములలో ఒకరు రెండవ వాని మాట వినకుండా చెడు అలవాట్లతో తిరుగుతూ ఉండేవారు. అన్న తమ్ముని ప్రవర్తనని మందలించినా ఉపయోగము లేనందున అన్న తన ఆస్తి వాటాలో సగ భాగము తమ్ముడికి ఇవ్వడానికి, తమ్ముడు సవ్యంగా ఉండడానికి ఒక రిజిష్టరు కాంట్రాక్టు చేసుకున్నాడు. తరువాత కాంట్రాక్టు బాధ్యతను నిరాకరించగా తమ్ముడు అమలు కోరుతూ దావా తెచ్చినాడు. ఈ కాంట్రాక్టు సహజ ప్రేమ వలన ఏర్పడినదని, మినహాయింపు సూత్రం వర్తిస్తుందని హైకోర్టు తీర్పు యిచ్చినది.

2 **స్వచ్ఛంద సేవలు (Compensation for Voluntary Services) :** ఎవరైనా, ఎదుటి వ్యక్తి కోరకుండానే తనకు తానై తనకు ఎలాంటి బాధ్యత లేకపోయినా రెండవ వానికి ఏదైనా సేవ గాని, సహాయం గాని చేస్తే ఆ సేవలకు గాని, సహాయానికి గాని కొంత సొమ్ము చెల్లించడానికి కాంట్రాక్టు చేసుకుంటే అలాంటి కాంట్రాక్టు ప్రతిఫలరహితమైనా సక్రమమవుతుంది.

ఉదా : A అనే వ్యక్తికి B యొక్క మనీ పర్సు దొరికినది. A దానిని B కి ఇచ్చెను. B అందుకు గాను రూ. 100లు A కు ఇస్తానని అన్నాడు. ఇది సక్రమమైన కాంట్రాక్టు అవుతుంది.

**కేసు (Case) : సుధ Vs అబ్రహాం (Sudha Vs Abraham) :** ఈ కేసులో P అనే మైనరు తనకు మైనారిటీ తీరేంతవరకు సేవలు చేయవలసినదిగా Q ని కోరినాడు. Q, P యొక్క కోరిక మేరకు అవసరమైన సేవలు నిర్వహించినాడు. P మేజరు అయిన తరువాత తనకు సేవలు చేసినందుకు గాను కొన్ని సంవత్సరాల వరకు Q కి కొంత సొమ్ము చెల్లిస్తానని వాగ్దానము చేసినాడు. ఈ కాంట్రాక్టును అమలుపరచవచ్చునని తీర్పు ఇచ్చినారు.

3 **కాలదోషం పట్టిన బాకీలు (Time Barred Debts) :** కాలదోషం పట్టిన బాకీని పూర్తిగా లేక పాక్షికముగా తీరుస్తానని ఋణగ్రస్తుడు లిఖిత పూర్వకముగా వ్రాసి, సంతకం చేసి ఋణదాతకు అందజేస్తే అలాంటి మొత్తమును ఋణదాత వసూలు చేసుకోవచ్చు. ఆ మేరకు ఏర్పడిన లిఖిత పూర్వక ఒప్పందము సక్రమము అవుతుంది.

ఋణానికి లిమిటేషన్ చట్టము యొక్క నిబంధనలు వర్తించిన ఎడల దానిని కాలదోషము పట్టిన బాకీ అంటారు. లిమిటేషన్ చట్ట ప్రకారం ఇచ్చిన బాకీని చెల్లింపు తేదీ నుండి 3 సంవత్సరముల లోపున వసూలు చేసుకోవటానికి న్యాయపరమైన చర్యలు తీసుకోనపుడు ఆ బాకీ మొత్తానికి కాలదోషం పట్టినదిగా పరిగణిస్తారు.

ఉదా : A, B కి రూ. 10,000లు బాకీ వున్నాడు. ఈ బాకీ మొత్తానికి కాలదోషం పట్టినది. A బాకీ మొత్తంలో రూ. 5000లు B కి ఇవ్వడానికి అంగీకరించి ఆ మేరకు లిఖిత పూర్వకంగా పత్రం వ్రాసి సంతకం చేసి B కి ఇచ్చినాడు. ఇది సక్రమమైన కాంట్రాక్టు అవుతుంది.

4 **నెరవేర్చిన దానము (Completed Gift) :** దానము ఇస్తానన్న వాగ్దానమునకు ప్రతిఫలం లేనందున తరువాత ఇవ్వకపోయినా దావా వేసి రాబట్టుకొనటానికి వీలులేదు. కాని దానము ఇచ్చిన తరువాత ప్రతిఫలము లేదు అనే మిషతో మరలా తిరిగి తీసుకొనుటకు వీలులేదు.

5 **ఏజెన్సీ కాంట్రాక్టులు (Agency Contracts) :** భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 185 ప్రకారం ఏజెన్సీ కాంట్రాక్టు ఏర్పాటుకు గాను ప్రతిఫలం అవసరం లేదు.

6 **కాంట్రాక్టు బాధ్యత నిర్వర్తించుటకు కాలము పొడిగించుట :** కాంట్రాక్టు బాధ్యతను నెరవేర్చుటకు కాలము పొడిగించవలసినపుడు ప్రతిఫలం అవసరం లేదు. అనగా కాలము పొడిగించిన కొత్త కాంట్రాక్టు ప్రతిఫలరహితమైనా సక్రమము అవుతుంది.

## 3.6 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. ప్రతిఫలము అనగానేమి ?
2. అనిశ్చితమైన ప్రతిఫలం అంటే ఏమిటీ ?
3. డట్టన్ Vs పూల్ (Dutton Vs Pool) కేసులోని వివరాలు వ్రాయుము.
4. ప్రివిటీ ఆఫ్ కాంట్రాక్టు (Privity of Contract) అనగానేమి ?
5. ఎస్టొపెల్ సిద్ధాంతమును పేర్కొనుము.

**10 మార్కుల ప్రశ్నలు :**

1. "ప్రతిఫలం ప్రామిసర్ కోరికపై ఉండవలెను" - వివరించుము.
2. "పూర్వ ప్రతిఫలం సక్రమమైన ప్రతిఫలం కాదు" - ఇంగ్లీషు న్యాయశాస్త్రానికి, భారతీయ న్యాయశాస్త్రమునకు గల వ్యత్యాసాలు వ్రాయుము.
3. "ప్రతిఫలం చాలినంతగా ఉండనవసరం లేదు" - వివరించుము.
4. "ప్రతిఫలం వాస్తవంగా ఉండవలెను" - వివరించుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. ప్రతిఫలం నిర్వచించి, ప్రతిఫలం ఆవశ్యకాలు పేర్కొనుము.
2. "ప్రతిఫలం ప్రామిసీ నుండి మాత్రమే రావలెను" భారతీయ న్యాయశాస్త్రమునకు, ఇంగ్లీషు న్యాయశాస్త్రమునకు గల వ్యత్యాసము ఏమిటీ ?
3. "ప్రతిఫలం లేని కాంట్రాక్టు చెల్లదు" - మినహాయింపులను వ్రాయుము.
4. "కాంట్రాక్టుతో సంబంధం లేని వ్యక్తి కాంట్రాక్టుపై దావా వేయలేడు" - చర్చించి, మినహాయింపులు ఏమైనా ఉంటే వ్రాయుము.

## 3.7 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Contract Act, 1872 | - | Bare Act |
| 2. | A.C. Patna | - | Indian Contract Act, 1872, Asia Publishing House, Bombay |
| 3. | K. Ponnuswami & K.K. Puri | - | Cases and Materials on Law of Contract, Eastern Book Co., Lucknow |
| 4. | Avatar Singh | - | Law of Contract, Eastern Book Co., Lucknow |
| 5. | Avatar Singh | - | The Principles of Mercantile Law, Eastern Book Co., Lucknow |
| 6. | M.C. Sreekala | - | A Manual of Mercantile Law, S. Chand & Co., New Delhi |
| 7. | ND Kapoor | - | Mercantile Law |
| 8. | Dr. S. N. Maheswari | - | Business Law |
| 9. | E. Venkatesam | - | Mercantile Law |


*– శ్రీ టి. త్యాగరాజు*

పాఠం : 4

# పార్టీల అర్హత

## (Capacity of Parties)

### 4.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) ఈ పాఠంలో పార్టీల అర్హత అర్థం తెలుసుకోవడం.

బి) పార్టీల అనర్హతకు గల కారణాలు తెలుసుకోవడం.

సి) హోదా వలన అనర్హుల వివరములు తెలియును.

డి) మానసిక వైకల్యము వలన ఎవరు అనర్హులో తెలుసుకోవడం.

ఇ) అవివేక చిత్తము వలన ఎవరు అనర్హులో తెలుసుకోవడం.

### విషయ సూచిక :


4.1 పార్టీల అర్హతను గురించిన వివరము

4.2 హోదా వలన అనర్హతలు

4.2.1 రాజకీయ హోదా వలన అనర్హత

4.2.2 సాంఘిక హోదా

4.2.3 వృత్తి హోదా

4.2.4 సాంసారిక హోదా

4.3 మానసిక వైకల్యము

4.3.1 మైనర్లు - భారతీయ న్యాయశాస్త్రము

4.4 మైనరు - ఇంగ్లీషు న్యాయశాస్త్రము

4.5 అవివేక చిత్తం

4.6 నమూనా ప్రశ్నలు

4.7 చదువదగిన గ్రంథాలు


### 4.1 పార్టీల అర్హతను గురించిన వివరం :

కాంట్రాక్టు చేసుకునే పార్టీలు కాంట్రాక్టులో ప్రవేశించే సామర్థ్యమును కాంట్రాక్టు అర్హత అని అంటారు. అనగా కాంట్రాక్టు

చేసుకునే పార్టీలకు కాంట్రాక్టు ఏర్పరచుకునే అర్హత లేక సామర్ధ్యము ఉండాలి. భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 10 ప్రకారం కాంట్రాక్టు పార్టీలు అనర్హులైనచో ఆ కాంట్రాక్టు చెల్లదు. కాంట్రాక్టు చేసుకొనే పార్టీల అర్హత - అనర్హతల గురించి భారతీయ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 11 వివరాలు తెలియచేసినది. అనర్హతకు కారణాలు మూడు రకాలు. అవి -

(1) హోదా (Status) (2) మానసిక వైకల్యం (Mental Deficiency)

(3) అవివేక చిత్తము (Unsound Mind)

ఈ మూడు రకాలకు సంబంధించిన ఉపవర్గీకరణను దిగువ పట్టికలో చూడవచ్చు.

**పట్టిక - 4.1**

కాంట్రాక్టు అనర్హత వర్గీకరణ




## 4.2 హోదా వలన అనర్హతలు :

కాంట్రాక్టు ఏర్పరచుకునే పార్టీల అనర్హత రాజకీయ హోదా వలన గాని, సాంఘిక హోదా వలన గాని, వృత్తి హోదా వలన గాని, సాంసారిక హోదా వలన గాని ఏర్పడవచ్చును.

**4.2.1 రాజకీయ హోదా వలన అనర్హత :** ఈ అంశం క్రింద వివిధ రకాలైన వ్యక్తులకు అనర్హత కలుగుతుంది. వారిలో (1) విదేశీ సార్వభౌమాధికారులు (2) విదేశీ దౌత్యాధికారులు (3) విదేశీ శత్రువులను పేర్కొనవచ్చును.

1. **విదేశీ రాజ్యాధినేతలు** (Foreign Sovereigns) : ఇంగ్లండులోని కోర్టులు విదేశీ రాజ్యాధి నేతలపై దావాలను పరిష్కరించవు. ఒకవేళ ఎవరైనా వారిపై దావాలను తెచ్చినచో కోర్టు వారికి సమన్లు పంపుతుంది. అలాంటపుడు విదేశీ రాజ్యాధినేత కావాలనుకుంటే కోర్టుకు హాజరు కావచ్చు లేదా మానివేయవచ్చు. ఒక వేళ కోర్టుకు హాజరు కావటం మాని వేసిన ఎడల కోర్టు అలాంటి దావాను విచారణ చేయదు.

**కేసు** (Case) : **మిగెల్** Vs **సుల్తాన్ ఆఫ్ జోహార్** (Mighell Vs Sulthan of Johore) : ఈ కేసులో సుల్తాన్ ఆఫ్ జోహార్ అనే విశీదీ రాజ్యాధినేత "అబూ భాకర్" అను మారు పేరుతో ఇంగ్లండులో తిరుగుతూ 'మిగెల్' అనే యువతిని

వివాహం చేసుకుంటానికి వాగ్దానం చేసినాడు. ఆ వాగ్దానం అమలు పరచనందున మిగెల్ దావా తేగా పై సూత్రాలను అన్వయిస్తూ ప్రతివాది నిరాకరించినందున దావా విచారణకు కోర్టు తిరస్కరించినది.

2. **విదేశీ దౌత్యాధికారులు (**Ambassadors**) :** వీరి విషయంలో కూడా విదేశీ రాజ్యాధినేతలకు వర్తించే నియమాలు వర్తిస్తాయి. కాబట్టి అలాంటి కాంట్రాక్టులను ఇంగ్లండులో సక్రమమైన కాంట్రాక్టులుగా పరిగణించరు. ఈ కాంట్రాక్టులను ఇంగ్లండు కోర్టులు అమలుపరచవు. భారతదేశంలో విదేశీ రాజ్యాధికారులు, విదేశీ దౌత్యాధికారులతో గాని చేసుకున్న కాంట్రాక్టులకు ఇంగ్లండులో వున్న నిబంధనలు వర్తిస్తాయి. ఒక వేళ వారితో కాంట్రాక్టులు ఏర్పరచుకొని, వాటిని అమలు పరచడానికి దావా తీసుకురావలెనంటే సివిల్ ప్రొసీజర్ కోడ్ (Civil Procedure Code) సెక్షన్ 86 ప్రకారం కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి లిఖిత పూర్వకమైన ధృవపత్రం ఉంటేనే మన దేశంలో కోర్టులు అలాంటి దావాలను గుర్తిస్తాయి.

3. **విదేశీ శత్రువులు (**Alien Enemies**) :** మన దేశమునకు ఏదైనా దేశంతో యుద్ధం సంభవించిన ఎడల ఆ పరాయి దేశస్తులను విదేశీ శత్రువులు అంటారు. శత్రురాజ్యమునకు సంబంధించిన వారు మన దేశంలో ఉన్న ఎడల వారు విదేశీ శత్రువులు కారు. ఒక వేళ మన దేశస్తులు శత్రు రాజ్యంలో ఉంటే వారిని కూడా విదేశీ శత్రువులుగా పరిగణించడం జరుగుతుంది. కాబట్టి కాంట్రాక్టు అర్హత నిర్ణయించడానికి ఒక వ్యక్తి విదేశీ శత్రువు అవుతాడా లేదా అనే విషయం ఆ వ్యక్తి యొక్క పౌరసత్వాన్ని బట్టి గాక అతని నివాసమును బట్టి నిర్ణయించవలెనని నిర్ధారణ చేసినారు. ఈ విషయంలో మన దేశంలోని న్యాయసూత్రాలు, ఇంగ్లండులోని న్యాయసూత్రాలు ఒకే రకంగా ఉన్నాయని చెప్పవచ్చును. యుద్ధానికి పూర్వం కాంట్రాక్టు ఏర్పడిన ఎడల యుద్ధ కాలంలో అమలు కాకుండా నిలుపు చేసి, యుద్ధం ముగిసిన తరువాత అమలు జరుపుతారు. ఒక వేళ యుద్ధం చాలా కాలం కొనసాగితే యుద్ధం ముగిసిన తరువాత కాంట్రాక్టు బాధ్యత నిర్వహణ అసంభవం కావచ్చు. ఆ కారణమున పార్టీలు కాంట్రాక్టు బాధ్యత నుండి విముక్తి చెందుతారు.

**4.2.2 సాంఘిక హోదా :** ఈ అంశం క్రింద 1. ఖైదీలు, 2. దివాలాదార్లు, 3. కార్పోరేషన్లను పేర్కొనవచ్చు.

**(1)** ఖైదీలు (Convicts) : జైలు శిక్షను అనుభవించే వారిని ఖైదీలు (Convicts) అంటారు. కాంట్రాక్టుకు స్వేచ్ఛా సమ్మతి అవసరము. ఖైదీలకు స్వేచ్ఛ ఉండదు. స్వేచ్ఛగా ఉన్న శరీరములోనే స్వేచ్ఛగా వున్న మనసు వుంటుంది. (A free mind in free body). కాబట్టి ఒక వ్యక్తి కారాగారంలో నిర్బంధములో వున్నప్పుడు అత్యవసర పరిస్థితులలో ఇచ్చే అనుమతిపత్రం (ticket of leave) ఉంటే తప్ప అతడు కాంట్రాక్టు ఏర్పరచుకొనే అర్హత, దావా తెచ్చే అర్హత కోల్పోతాడు. అతడు తిరిగి విడుదల అయిన తరువాత ఆ హక్కులు పొందడం జరుగుతుంది.

**(2)** దివాలాదార్లు (Insolvents) : కోర్టు చేత దివాలాదారుగా ప్రకటించబడిన వ్యక్తిని "దివాలాదారు" అంటారు. దివాలాదారుగా ప్రకటించబడిన తరువాత ఆ వ్యక్తి ఆస్తి అప్పులు దివాలా న్యాయశాస్త్రప్రకారం అఫీషియల్ రిసీవర్ (Official Receiver or Official Assignee)కి సంక్రమిస్తాయి. కాబట్టి అప్పటి నుండి దివాలాదారు తన ఆస్తికి సంబంధించిన కాంట్రాక్టులను చేసుకోవటానికి అర్హత కోల్పోతాడు.

**(3)** **కార్పోరేషన్లు (**Corporations**) :** న్యాయశాస్త్రము చేత సృష్టించబడిన కల్పిత మానవుడు కార్పోరేషన్. కాబట్టి సామాన్య మానవుల వలె కాంట్రాక్టులు ఏర్పరచుకొనవచ్చును. అనగా వాటి పేరుతో ఆస్తులను కొనవచ్చును. విక్రయించవచ్చును. బయటి వ్యక్తులపై దావాలు వేయవచ్చును. బయటి వ్యక్తులు వీటిపై దావాలు తీసుకురావచ్చును. ఇవి వీటిని

సృష్టించిన చట్టములోని నియమాలకు లోబడి మానవ సహకారం ద్వారా వ్యవహారాలు నిర్వహిస్తూంటాయి. కాని వీటికి భౌతిక రూపం లేనందున భౌతిక శరీరానికి సంబంధించిన ఒప్పందాలు ఏర్పరచుకోలేవు.

ఉదా : వివాహ ఒప్పందాలు. వీటి కాంట్రాక్టు అర్హతకు చట్టం కొన్ని ఆంక్షలు పెట్టినది (A) దైనందిన కాంట్రాక్టులు, చిల్లర కాంట్రాక్టులు తప్ప మిగిలిన అన్ని ముఖ్యమైన కాంట్రాక్టులు దాని అధికార ముద్ర (Common Seal) లేనిదే చెల్లవు. (B) కంపెనీ ఏ ధ్యేయాలతో స్థాపించుట జరిగినదో అలాంటి ముఖ్యధ్యేయాలకు అనువైన కాంట్రాక్టులను మాత్రమే ఏర్పరచుకోవచ్చు. అలాంటి ప్రధాన ధ్యేయాలకు విరుద్ధమైన లేదా అతీతమైన అంశాలతో ఏర్పరచుకున్న కాంట్రాక్టులు కంపెనీని బంధించవు. అలాంటి కాంట్రాక్టులు అధికారాతీతమైనవి (Ultravires) అవుతాయి. (C) వ్యాపారం చేసే ప్రతి కంపెనీకి అప్పు తెచ్చుకునే అధికారం ప్రచ్ఛన్నంగా వుంటుంది. ఈ అప్పు తెచ్చే అధికారం కంపెనీ విషయంలో నియమావళి (Articles of Association)లో పొందుపరచబడి ఉంటుంది. ఆ విధంగా లేకుండా, కంపెనీ అప్పు చేస్తే ఆ మేరకు ఏర్పరచుకున్న కాంట్రాక్టులు అధికారాతీతమైన (Ultravires) కాంట్రాక్టులుగా పరిగణించబడతాయి. వాటి వలన కంపెనీకి ఏ బాధ్యత ఏర్పడదు.

**4.2.3 వృత్తి హోదా (**Professional Status**) :** ఈ శీర్షిక క్రింద లాయర్లు, డాక్టర్లను పేర్కొనవచ్చును.

**లాయర్లు, డాక్టర్లు (**Lawyers, Doctors**) :** న్యాయవాదవృత్తి, వైద్యవృత్తి అతి ఉత్కృష్టమైనవి, పవిత్రమైనవిగా భావిస్తారు. ఈ కారణము వలన ఇంగ్లీషు న్యాయశాస్త్ర ప్రకారం లాయర్లు వారి వ్యాజ్యాధికారుల (Clients)పై వృత్తికి సంబంధించిన కాంట్రాక్టు ఏర్పరచుకుంటే అవి చెల్లవు. అనగా వృత్తి వ్యవహారంలో జరిగే ఫీజు కాంట్రాక్టులు అమలు జరపలేని కాంట్రాక్టులు. అదే విధంగా డాక్టర్లు తమ పేషెంట్లపై తమ ఫీజులను వసూలు చేసే నిమిత్తం దావా వేయుటకు వీలులేదు. అనగా అవి కూడా సక్రమమైన కాంట్రాక్టులు కావు.

కాని భారతీయ కాంట్రాక్టు చట్ట ప్రకారము లాయర్లు వారి వ్యాజ్యాధికారులతో, డాక్టర్లు వారి రోగులతో వారి ఫీజుల కొరకు చేసుకున్న కాంట్రాక్టులు సక్రమమైనవే. కాబట్టి వారికి ఈ విషయంలో కాంట్రాక్టు అనర్హత ఉన్నదని చెప్పలేము.

**4.2.4 సాంసారిక హోదా (**Marital Status**) :**

**వివాహిత స్త్రీలు (**Married Women**) :** ఇంగ్లండులో ప్రారంభంలో వివాహిత స్త్రీకి కాంట్రాక్టులో ప్రవేశించే హక్కు లేదు. ఇంగ్లీషు న్యాయశాస్త్రం స్త్రీ జీవితాన్ని మూడు దశలుగా విభజించినది. (1) కన్యాదశ (2) వివాహిత - అనగా వివాహం అయినప్పటి నుండి వైవాహిక స్థితి పోయేంత వరకు అనగా భర్త అధీన స్థితిలో వున్న దశ. ఈ దశలో భార్య వ్యక్తిత్వం భర్త వ్యక్తిత్వంతో ఐక్యత చెందుతుందని కావున భార్యకు దావా చేసే హక్కు, ఆమెపై ఇతరులు దావా వేసే హక్కు లేదన్నారు. (3) వైవాహిక దశ అనంతరం. మొదటి, మూడవ దశలలో కాంట్రాక్టు అర్హత గురించి స్త్రీ, పురుషుల విషయంలో ఇంగ్లీషు న్యాయశాస్త్రంలో ఎలాంటి బేధం లేదు.

కాని 1936 సం॥ తరువాత ఐక్యత సిద్ధాంతమును రద్దు చేస్తూ ఇంగ్లండులో చట్టం చేసినారు. అప్పటి నుండి ఇంగ్లండులో కాంట్రాక్టు అర్హత విషయంలో స్త్రీ పురుషులకు ఎలాంటి వివక్షత లేదు.

మన దేశంలోని కాంట్రాక్టు న్యాయశాస్త్ర ప్రకారం మొదటి నుండి స్త్రీ, పురుషుల విషయంలో కాంట్రాక్టు అర్హత గురించి ఎలాంటి తేడా లేదు. పురుషుల వలెనే స్త్రీలు అన్ని రకాల కాంట్రాక్టులు చేసుకోవచ్చును. వివాహిత స్త్రీలు వారి పేరుతో ఆస్తులు కొనుగోలు చేయవచ్చును. విక్రయించవచ్చును. ఇతరులపై దావాలు వేయవచ్చును. ఇతరులు వీరిపై దావాలు తేవచ్చును. ఇంటి అవసరాలకు వివాహిత స్త్రీ అప్పు చేస్తే ఆ మేరకు భర్త బాధ్యుడవుతాడు. అలాంటపుడు భార్య తన భర్తకు

ఏజెంటుగా వ్యవహరిస్తుంది. మనదేశములో స్త్రీకి అనాదిగా 'స్త్రీ ధనం' అనే ప్రత్యేక ఆస్తి ఏర్పరచుకునే హక్కు వుంది. అలాంటి ఆస్తిని ఆమె తన ఇష్టానుసారం ఉపయోగించుకొనే హక్కు కూడా గలదు.

## 4.3 మానసిక వైకల్యము :

**మైనర్లు (Minors) :** మైనర్లకు మనస్సు పరిపక్వత చెందక మానసిక పరిపూర్ణత ఉండదు. అందుచే మానసిక వైకల్యము వలన మైనర్లు కాంట్రాక్టుకు అనర్హులు. భారతీయ మెజారిటీ చట్టము (Indian Majority Act) సెక్షన్ 3 ప్రకారం గార్డియన్ లేదా సంరక్షకుడు లేని బాలుడు 18 సం॥ దాకా, గార్డియన్ వున్నా లేదా అతని ఆస్తి కోర్టు ఆఫ్ వార్డ్స్ (Court of Wards) అధీనంలో ఉన్నా 21 సంవత్సరాల వరకు మైనరుగా ఉంటాడని పేర్కొన్నది. అందుచే మైనర్లకు కాంట్రాక్టులో ప్రవేశించే అర్హత ఉండదు. ఇది కేవలం మైనర్ల రక్షణ కోసం ఏర్పాటు చేసిన అనర్హత. ఈ అనర్హత వలన న్యాయశాస్త్రం మైనర్లను రక్షిస్తుంది. వారి హక్కులకు, ఆస్తులకు భద్రత కలుగజేస్తుంది. వారి లోపాలను క్షమతో వదిలేస్తుంది. వాదనలలో సాయం అందిస్తుంది. న్యాయస్థానములు వారి న్యాయవాదులు. జూరీ వారి సేవకులు. న్యాయశాస్త్రం వారి సేవకుడు. ఇది ఇంగ్లండులోని న్యాయోక్తి.

**4.3.1 మైనర్లు - భారతీయ న్యాయశాస్త్రము :** భారత కాంట్రాక్టు చట్టం ప్రకారం మైనర్ల న్యాయాత్మక స్థితి ఈ క్రింది విధంగా వుంటుంది.

మైనర్లతో కాంట్రాక్టులు మొదటి నుండి చెల్లని (Void Abinitio) కాంట్రాక్టులు. ప్రీవీ కౌన్సిల్ (Privy Council) వారు పూర్తిగా చెల్లని కాంట్రాక్టులే అవుతాయని, చెల్లగూడని కాంట్రాక్టులు కాజాలవని మొహిరి బేబి Vs ధర్మదాస్ ఘోష్ (MohiriBibi Vs Dharmadas Ghosh) అనే కేసులో ధృవీకరించినారు.

**కేసు (Case) : మోహిరి బేబి Vs ధర్మదాస్ ఘోష్ (Mohiri Bibi Vs Dharma Das Ghosh) :** ఈ కేసులో వాది ఒక మైనరు చేత, వాని స్థిరాస్థి హామీగా రూ. 20,000లకు తనఖా వ్రాయించుకొని రూ. 8,000లు ఇచ్చినాడు. ఆ వ్యవహారానికి ముందే మైనరు తాలూకు గార్డియన్ వాదికి, ప్రతివాది మైనరు అనియు అతనితో లావాదేవీలు చేయవద్దని నోటీసు ద్వారా తెలియచేసినాడు. అయినప్పటికీ వాది ఆ హెచ్చరికలను నిర్లక్ష్యం చేసి ఈ తనఖా పత్రాన్ని వ్రాయించుకున్నాడు. తరువాత ప్రతివాది తాను మైనరు అనియు, వ్రాసి యిచ్చిన తనఖాపత్రం చెల్లదనియు, సొమ్ము చెల్లించనవసరం లేదని వాదించినారు. దానిపై వాది మొత్తం సొమ్ముగాని, తాను ఇచ్చినట్లు అంగీకరించిన రూ. 8,000లు మొత్తమునకు డిక్రి (Decree) ఇప్పించమని దావా తెచ్చినాడు. ప్రీవి కౌన్సిల్ వారు మైనరుతో చేసిన కాంట్రాక్టులు చెల్లవని దావాను కొట్టివేసినారు.

మైనర్ల కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు కావడం వలన మైనరుకు మెజారిటీ వచ్చిన తరువాత కూడా వాటిని ధృవీకరించుటకు వీలుండదు.

**కేసు (Case) : ఆరుముగ Vs దురసింగ (Arumuga Vs Durasinga) :** ఈ కేసులో ఒక వ్యక్తి మైనరుగా ఉన్నప్పుడు రూ. 500 అప్పుగా తీసికొని ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చినాడు. మేజరు అయిన తరువాత ఆ నోటును రద్దు చేసి క్రొత్త ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చినాడు. పాతప్రామిసరీ నోటు చెల్లదు కావున కొత్త ప్రామిసరీ నోటు కూడా చెల్లదని, క్రొత్త ప్రామిసరీ నోటుకు ప్రతిఫలం లేదని దావాను కొట్టివేసినారు.

**మైనరు - ఎస్టోపెల్ సిద్ధాంతము :** మైనర్లకు ఎస్టోపెల్ సిద్ధాంతము (Doctrine of Estoppel) వర్తించదు. మైనరు మేజరునని నమ్మించి కాంట్రాక్టు ఏర్పరచుకుంటే అలాంటి కాంట్రాక్టు చెల్లదు. తరువాత తాను మేజరు కాదని మైనరునని వాదించి కాంట్రాక్టును రద్దుపరచుకొనవచ్చును. భారత సాక్ష్యచట్టం (Indian Evidence Act) సెక్షన్ 115లోని ఎస్టోపెల్ సిద్ధాంతము (Doctrine of Estoppel)

మైనర్లకు వర్తించదు. ఈ విషయాన్ని సాధిక్ ఆలీఖాన్ Vs జై కిషోర్ (Sadik Alikhan Vs Jai Kishore) అనే కేసులో ప్రీవీ కౌన్సిల్ ధృవీకరించినది.

**మైనరు - లాభానుభోక్త :** కాంట్రాక్టుల కింద మైనర్లు లాభానుభోక్తలైన ప్రతిగ్రహీతలుగా ఉండవచ్చును. కాని బాధ్యతా స్వీకర్తలుగా వుండకూడదు. ఈ సూత్రం యొక్క ప్రధాన ధ్యేయము మైనర్లను బాధ్యతల నుండి రక్షించుట. కాబట్టి కాంట్రాక్టుల వలన మైనర్లకు ఎలాంటి బాధ్యతలు ఉత్పన్నం కాకూడదు కాని హక్కులు, లాభాలు కలుగవచ్చు. ఉదా : మైనరుపేర ఇతరులు వ్రాసిన ప్రామిసరీనోటు సక్రమము. మైనరు వేరే వ్యక్తికి వ్రాసి ఇచ్చిన ప్రామిసరీనోటు చెల్లదు.

**కేసు (Case) : రాఘవాచారి Vs శ్రీనివాస (Raghavachary Vs Srinivasa) :** ఈ కేసులో మైనరు తన పేర తనఖా పత్రం వ్రాయించుకొని కొంత మొత్తాన్ని ఋణంగా ఇచ్చాడు. తరువాత దావా రాగా ఆ తనఖా సక్రమవుతుంది. మైనరు దానిని అమలుపరచవచ్చునని కోర్టు తీర్పు యిచ్చినది.

**మైనరు - ప్రత్యర్పణం (Restitution) :** ప్రత్యర్పణం అనగా తిరిగి అప్పగించుట అని అర్థము. మైనర్ల కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు. మైనర్లను న్యాయశాస్త్రము రక్షించినప్పటికి వారు ఇతరులను మోసము చేసి ఆస్తిని పొందితే దానిని యజమానికి తిరిగి అప్పగించవలసిన బాధ్యత వుంటుంది. ఒకవేళ ఆస్తి మృగ్యమైనా, నశించినా దాని విలువకు మైనరును గాని, అతని ఆస్తిని గాని బంధించదు. లీలి Vs షీల్ (Liele Vs Shiell) అనే కేసులో సొమ్ము వాపసు ప్రారంభమైనపుడు ప్రత్యర్పణం అంతమవుతుంది. (Restitution stops where repayment begins) అని కోర్టు తీర్పు యిచ్చినది.

**మైనరు - దివాలాదారు :** మైనర్లతో ఏర్పరచుకున్న కాంట్రాక్టులు మొదట నుండి చెల్లనివి అవుతాయి కాబట్టి అతనికి ఎలాంటి ఋణ బాధ్యత ఉత్పన్నం కాదు. కాబట్టి మైనరును దివాలాదారుగా ప్రకటించుటకు వీలులేదు.

**మైనరు - ఏజెంటు :** మైనరును ఏజెంటుగా నియమించవచ్చు. ఏజెంటుగా మైనరు చేసిన పనులకు ప్రిన్సిపల్ మూడవ వ్యక్తికి బాధ్యుడు. కాని ఎలాంటి పరిస్థితులలోను ఏజెంటుగా ఉన్న మైనరుకు వ్యక్తిగత బాధ్యత వుండదు. ఏజెంటుగా వున్న మైనరు తన నిర్లక్ష్యము వలన, అజాగ్రత్త వలన, అశ్రద్ధ వలన కాంట్రాక్టుకు సంబంధించి ప్రిన్సిపల్‌కు నష్టము వచ్చిన అలాంటి నష్టమును మైనరు ఏజెంటు నుండి ప్రిన్సిపల్ రాబట్టుకొనలేడు.

**మైనరు - భాగస్వామ్యము :** భాగస్వామ్య ఒప్పందములో మైనరు పార్టీగా ఉండటానికి వీలులేదు. అనగా మైనరుతో భాగస్వామ్య వ్యాపారం ప్రారంభించడానికి వీలులేదు. కాని కొనసాగుతున్న భాగస్వామ్య సంస్థలో, భాగస్తులందరి అంగీకారముతో, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా, లాభాలు పంచుకోవడానికి మైనరు భాగస్తునిగా చేరవచ్చును. అతడు నష్టములకు భాద్యుడు కాడు.

**మైనరు - గార్డియన్ :** మైనరు తాలూకు గార్డియన్ మైనరు తరపున కాంట్రాక్టును ఏర్పరచుకోవచ్చును. కాని అలాంటి కాంట్రాక్టు అధికారమునకు లోబడి వుండి మైనరుకు లాభదాయకంగా వుండాలి. కోర్టు అనుమతితో గార్డియన్ మైనరు తరపున ఆస్తులను కొనవచ్చును, విక్రయించవచ్చును.

**మైనరు - వాటాదారుడు :** కంపెనీ నియమావళి అనుమతిస్తే మైనరు కంపెనీలో వాటాదారు కావచ్చు. లేనిచో వాటాల కోసం మైనరు దరఖాస్తు చేయరాదు. కంపెనీలో సభ్యునిగా వుండరాదు.

**మైనరు - అపకృత్యము (Tort) :** వ్యవహారాల అపకృత్యం నుండి మైనరుకు మినహాయింపు లేదు. మైనరుతో చేసిన కాంట్రాక్టులు చెల్లనిది కాబట్టి మైనరుకు అలాంటి కాంట్రాక్టు భంగం వలన ఎదుటి పార్టీకి సంభవించిన నష్టమును భర్తీ చేయవలసిన బాధ్యత ఉండదు. కాని వ్యవహారముల అపకృత్యము వలన ఎదుటి పార్టీకి సంభవించిన కష్టనష్టములకు మైనరు బాధ్యత వహించవలెను.

**కేసు (Case) : బెర్నార్డ్ Vs హగ్గిన్స్ (Bernard Vs Haggins) :** ఈ కేసులో ఒక మైనరు స్వారీకి గాను గుర్రాన్ని అద్దెకు తీసుకున్నాడు. కాని ఆ గుర్రాన్ని స్నేహితునికివ్వగా అతడు దానిని స్వారీకి ఉపయోగించకుండా అడ్డాలు దూకడానికి (Jumping Over the Fences) ఉపయోగించగా గుర్రానికి దెబ్బలు తగిలి చనిపోయినది. గుర్రం యజమాని గుర్రం విలువకు మైనరుపై దావా తేగా ఇది నిర్దిష్టమైన అపకృతిగా పరిగణించి దావాకు డిక్రీ ఇచ్చినారు.

**మైనరు - నిత్యావసర వస్తువులు :** భారతీయ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 68 ప్రకారం మైనర్లకు గాని, వారి రక్షణలో వున్నవారికి గాని ఎవరైనా నిత్యావసరవస్తువులు (Necessaries) సరఫరా చేస్తే ఆ మొత్తమును మైనరు ఆస్తి నుండి రాబట్టుకోవచ్చును. మైనరుకు ఆస్తి లేని ఎడల నిత్యావసరాలకు, జీవనోపాధికి సంబంధించిన కాంట్రాక్టులకు కూడా మైనరు వ్యక్తిగతంగా బాధ్యుడు కాడు. అత్యవసరాలు మైనరు హోదాను, ఉనికిని, పరిస్థితులను బట్టి నిర్ధారణ చేయవలసి వుంటుంది. అత్యవసర వస్తువులు అనగా భోజనము, వస్త్రములు, నివాసము గాక, ఈ క్రింది కేసులలో నిత్యావసరములుగా ఏ అంశాలను పరిగణనలోనికి తీసుకోవచ్చునో కోర్టులు నిర్ధారణ చేసినవి.

1. వాట్కిన్స్ Vs ధున్నూబాబు (Watkins Vs Dhannu Babu) షోలారామ్ Vs అయూబ్‌ఖాన్ (Sholaram Vs Ayubkhan) ఈ కేసులలో మైనరు ఆస్తి పరిరక్షణకు గాను చేసిన దావా ఖర్చులు నిత్యవసరములని తీర్పు ఇచ్చినారు.
2. శ్యామ్ చరణ్‌సింగ్ Vs చౌద్రి లేభ్యసింగ్ (Shyam Charan Singh Vs Choudri Lebya Singh) అనే కేసులో మైనరు యొక్క ఆస్తిని కోర్టు జప్తు, వేలం నుండి రక్షించడానికి చేసిన ఖర్చులు నిత్యావసరములని తీర్పు ఇచ్చినారు.
3. కేదార్‌నాథ్ Vs అజూధియా (Kedarnath Vs Ajudhia) అనే కేసులో హిందూ మైనరుకు వివాహ ఖర్చులకు గాను ఇచ్చిన మొత్తం నిత్యావసరములని తీర్పు యిచ్చినారు.

## 4.4 మైనరు - ఇంగ్లీషు న్యాయశాస్త్రం :

ఇంగ్లండులో ఒకే వ్యక్తిని 21 సం॥ల వరకు మైనరుగానే పరిగణిస్తారు. ఇంగ్లీషు న్యాయశాస్త్రం ప్రకారం మైనర్ల కాంట్రాక్టులను మూడు రకాలుగా విభజించవచ్చును. (1) చెల్లే కాంట్రాక్టులు (2) చెల్లని కాంట్రాక్టులు (3) చెల్లగూడని కాంట్రాక్టులు.

**(1) చెల్లే కాంట్రాక్టులు (సక్రమమైన కాంట్రాక్టులు) :** మైనరుకు, అత్యవసరాలకు, జీవనోపాధికి ఏర్పడిన కాంట్రాక్టులు సక్రమమైనవిగా పరిగణిస్తారు. అత్యవసర వస్తువులు మైనర్ జీవన స్థితిగతులకు తగిన వస్తువులే కాకుండా - అవి కాంట్రాక్టు ఏర్పరచుకొనేటపుడు, నెరవేర్చునపుడు కూడా అత్యవసరాలుగా వుండవలెను. అత్యవసరాలు అనగా తిండి, బట్ట, నివాసమే కాకుండా విద్య, జీవనోపాధికి కావలసిన జ్ఞానం, వివాహం, దహనసంస్కారాలకు చేసిన ఋణాలు, ఆస్తి పరిరక్షణకు అయిన దావా ఖర్చులు మొదలైనవి కూడా అత్యవసరాలుగా పరిగణించబడినవి.

**కేసులు (Cases) :**

**రైడరు Vs ఊంబ్‌వెల్ (Ryder Vs Wombwell) :** ప్రతివాదికి గల ఆస్తి £ 20,000. అతని సాంవత్సరిక ఆదాయం £ 500. అతడు తన మిత్రుని పుట్టిన రోజు బహుమానంగా ఇవ్వడానికి £ 15 విలువ గల ఒక బంగారు కఫ్ లింక్ (Cuff Link), తన స్వంతానికి £ 25 ల విలువ గల మరియొక కఫ్ లింక్ (Cuff Link) అరువుకు కొని ధర చెల్లించనందున వాది ఈ దావా తెచ్చినాడు. కోర్టువారు బంగారు కఫ్‌లింక్స్ అత్యవసరములు కావని తీర్పు యిచ్చినారు.

2. నాష్ Vs ఇన్‌మన్ (Nash Vs Inman) : ఈ కేసులో ఒక బట్టల షాపు యజమాని ఒక ఆక్స్‌ఫర్డు కాలేజి విద్యార్థికి వెయిస్టు కోట్లు (Waist Coats) అరువుకు అమ్మినాడు. తరువాత విద్యార్థి ఆ నగదు చెల్లించనందున ఈ దావా

వచ్చినది. ఆ విద్యార్థి తాను మైనరునని కాంట్రాక్టు చెల్లదని వాదించినాడు. షాపు యజమాని ఆ బట్టలు మైనరుకు నిత్యావసరాలు అని పేర్కొనగా కోర్టు వారు షాపు యజమాని సరఫరా చేసిన వస్తువులు అత్యవసర వస్తువులైనంత మాత్రాన బాధ్యుడు కాడని ఆ వస్తువులు కాంట్రాక్టు చేసినపుడే గాక, సరఫరా చేసినపుడు కూడా మైనరుకు నిత్యావసరాలని ఋజువు కావలెనని దావాను తిరస్కరించినారు.

3. రాబర్టు Vs గ్రె (Robert Vs Grey) : ఈ కేసులో వాది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బిలియర్డ్స్ (Billiards) క్రీడాకారుడు. ప్రతివాది అయిన మైనరు ఆ బిలియర్డ్స్ ఆటను నేర్చుకొని, దానినే తన జీవనోపాధికి వృత్తిగా చేసుకొనటానికి నిర్ణయించుకొని వారితో కాంట్రాక్టు చేసుకున్నాడు. వాదితో మైనరు ప్రపంచ యాత్ర చేయడానికి, ఆ యాత్రలో అతను ఆడే ఆటలు మైనరుకు చూపిస్తూ, కొన్నిచోట్ల ఆడిస్తూ వుండడానికి, తగిన మెళకువలు నేర్పడానికి అందుకు ప్రతిఫలంగా మైనరు £ 1500 ఇవ్వడానికి కాంట్రాక్టు ఏర్పడినది. కాని తరువాత సొమ్ము చెల్లించనందున మైనరుపై ఈ దావా తెచ్చినాడు. మైనరు అయిన ప్రతివాది బిలియర్డ్స్ ఆటయే తన వృత్తిగా నిర్ణయించుకొన్నట్లు ఋజువు అయినది కాబట్టి ఈ యాత్ర ఆ మైనరుకు ప్రయోజనకరం కాబట్టి అత్యవసరం అని చెప్పుతూ వాది దావాకు డిక్రీ (Decree) ఇచ్చినారు.

పైన చెప్పిన అంశాలను బట్టి మనకు తెలిసేదేమంటే, నిత్యావసరాలకు, జీవనోపాధికి సంబంధించిన కాంట్రాక్టులు మినహా, మైనరుతో చేసుకున్న అన్ని రకాల కాంట్రాక్టులు చెల్లవు. మైనరుతో చేసుకున్న వివాదాస్పదమైన కొన్ని కాంట్రాక్టులు న్యాయస్థానాలు నిర్ధారణ చేసేంతవరకు చెల్లగూడని కాంట్రాక్టులుగా పరిగణించబడతాయి. ఉదా : భూమి సాగు అగ్రిమెంట్లు, భాగస్వామ్య ఒప్పందములు, వైవాహిక ఒప్పందములు మొదలైనవి.

## 4.5 అవివేక చిత్తం (Unsound Mind) :

ఈ అనర్హత వలన పిచ్చివాళ్ళు (Lunatics), మూఢులు (Idiots), తాగుబోతు(Drunken Persons)లకు కాంట్రాక్టు అర్హత లోపిస్తుంది. పిచ్చివాళ్ళు ఉన్మత్తత లేకుండా వున్న సమయములలో కాంట్రాక్టు ఏర్పరచుకుంటే అవి సక్రమము అవుతాయి. మూఢుల విషయంలో వారికి మతే వుండదు కాబట్టి వీరితో చేసుకున్న కాంట్రాక్టులు చెల్లవు. త్రాగుబోతుల విషయంలో వారు తాగి, మతి తప్పి ఉన్న సమయంలో వారితో చేసుకున్న కాంట్రాక్టులు చెల్లనివి అవుతాయి. కాబట్టి పిచ్చి వాళ్ళతో మాత్రం ఉన్మత్తత లేకుండా వున్న సమయాలలో (Lucid Intervals)లో కాంట్రాక్టులు చేసుకోవచ్చును.

## 4.6 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. కాంట్రాక్టు అర్హత అంటే ఏమిటి ?
2. మైనరు అనగా ఎవరు ?
3. సాంఘిక హోదా క్రింద ఎవరు అర్హులు ?
4. విదేశీ శత్రువు అంటే ఎవరు ?
5. "నిత్యావసర వస్తువులు" అంటే ఏవి ?

**10 మార్కుల ప్రశ్నలు :**

1. రాజకీయ హోదా వలన ఏ ఏ వ్యక్తులు కాంట్రాక్టుకు అనర్హులు ?
2. అవివేక చిత్తము వలన ఏ ఏ వ్యక్తులు కాంట్రాక్టు చేసుకోవడానికి అనర్హులు ?
3. మోహిరీ బీబీ Vs ధర్మదాస్ ఘోష్ (Mohiri Bibi Vs Dharma das Ghosh) కేసులోని వివరాలు వ్రాయుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. మైనరు యొక్క న్యాయాత్మక స్థితిని వివరించండి.
2. ఇంగ్లండులో మైనర్ల యొక్క కాంట్రాక్టులను గురించి వివరించుము.

## 4.7 చదువదగిన గ్రంథాలు :

1. Elements of Mercantile Law - N.D. Kapoor
2. Mercantile Law - A.S. Avadhani

– శ్రీ టి. త్యాగరాజు

పాఠం : 5

# స్వేచ్ఛా సమ్మతి

# (Free Consent)

## 5.0 లక్ష్యం :

ఈ పాఠం చదివిన తరువాత మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) కాంట్రాక్టులోని పార్టీలు తెలియజేయు సమ్మతి ఏ విధంగా ఉండవలెనో తెలియును.

బి) కాంట్రాక్టు పార్టీలు తెలియజేయు సమ్మతి స్వేచ్ఛా సమ్మతి కావలెనన్న వాటిని ప్రభావితం చేయు అంశములను గురించి తెలియును.

సి) స్వేచ్ఛాసమ్మతి లోపించుటకు కారణమయిన బలప్రయోగము, అసత్యవర్ణన, అనుచిత ప్రభావము, మోసము మరియు పొరపాటు వంటి అంశముల గురించి స్పష్టముగా తెలియును.

డి) వివిధ సందర్భములలో స్వేచ్ఛాసమ్మతి లోపించినట్లుగా భావించిన యధార్ధ సంఘటనలు మరియు న్యాయసూత్రములు గురించి కూలంకుషంగా తెలియును.

## విషయ సూచిక :


5.1 ఉపోద్ఘాతము

5.2 సమ్మతి నిర్వచనము

5.2.1 యదార్ధ కలయిక కాకపోవడానికి వీలుకాని పరిస్థితి

5.2.2 యదార్ద కలయిక ఏర్పడుతుంది కాని అది స్వేచ్ఛా కలయిక కాకపోవడం

5.3 స్వేచ్ఛా సమ్మతి - నిర్వచనం

5.3.1 బలప్రయోగము

5.3.2 నిర్బంధము

5.4 అనుచిత ప్రభావము

5.4.1 పరదా స్త్రీలు

5.4.2 బల ప్రయోగమునకు, అనుచిత ప్రభావమునకు ఉన్న వ్యత్యాసములు

5.5 అసత్య వర్ణన

5.5.1 అసత్య వర్ణన ముఖ్యాంశములు

5.5.2 మోసము లేదా బుద్ధి పూర్వకముగా చర్య తీసుకోదగిన అసత్య వర్ణన

5.5.2.1 మోసము - ముఖ్యాంశములు

5.5.2.2 మోసము - ప్రభావము

5.5.2.3 మోసమునకు సంబంధించిన అంశములు

అసత్యవర్ణన, మోసానికి గల వ్యత్యాసములు

5.6 పొరపాటు

5.6.1 న్యాయవిషయక పొరపాటు

5.6.2 వృత్తి విషయకమైన పొరపాటు

5.6.2.1 ద్విపక్ష పొరపాటు

5.6.2.2 ఏకపక్ష పొరపాటు

5.6.3 పొరపాటు జరిగినప్పుడు దానికి పరిహారాలు

5.7 నమూనా ప్రశ్నలు

5.8 చదువదగిన గ్రంథాలు

## 5.1 ఉపోద్ఘాతము :

కాంట్రాక్టు చట్టం సెక్షన్ 10 ప్రకారము "ఒక ఒప్పందం చేసుకునేందుకు అర్హత ఉన్న పార్టీలు బుద్ధి పూర్వకంగా న్యాయబద్ధంగా ప్రతిఫలానికి న్యాయపూరితమైన ఉద్దేశ్యముతో చేసుకొన్న అగ్రిమెంట్లను ఇందుమూలంగా స్పష్టంగా చెల్లనేరవని ప్రకటించి వుండకపోతే అవి కాంట్రాక్టులే".

పై నిర్వచనమును అధ్యయనము చేయగా ఒక ఒప్పందము కాంట్రాక్టుగా మారవలెను అంటే ఈ దిగువ పేర్కొన్న లక్షణములు వుండవలెను.

1. ఒప్పందము ఇద్దరూ లేక అంతకు మించిన పార్టీల మధ్య జరిగి వుండవలెను.
2. పార్టీలు బుద్ధి పూర్వక సమ్మతితో ఒప్పందంలో ప్రవేశించి వుండవలెను.
3. ఒప్పందంలో పాల్గొను పార్టీల మధ్య న్యాయబద్ధమైన ప్రతిఫలం వుండవలెను.
4. ఒప్పందం యొక్క ఉద్దేశ్యము న్యాయాత్మకమై వుండవలెను.
5. ఒప్పందంలోని అంశములు ఏ కారణము చేతనైనా చెల్లనేరవని ప్రకటించి ఉండరాదు.

## 5.2 సమ్మతి - నిర్వచనము :

సెక్షన్ 13 ప్రకారము "ఇద్దరూ లేదా అంతకు మించిన సంఖ్యలో వ్యక్తులు ఒక విషయాన్ని గురించి ఒకే భావంతో అంగీకరిస్తే వారి మధ్య సమ్మతి ఉందంటారు". ఈ నిర్వచనం ప్రకారం సమ్మతి అనగా ఒప్పందంలోనికి ప్రవేశించే పార్టీలు ఒప్పందం యొక్క అంశమును ఒకే భావనతో (అర్థంతో) అర్థం చేసుకున్నట్లయితే వారి మధ్య సమ్మతి కలదు అంటారు. ఒప్పందంలోని సమ్మతి యధార్థమైనదిగానూ మరియు స్వేచ్ఛాగాను ఉండవలెను. ఈ రెండు లక్షణములలో ఏ లక్షణము లోపించినప్పటికీ అది కంట్రాక్టు ముఖ్య లక్షణములలో ఒకటి అయిన స్వేచ్ఛా సమ్మతిని సంతృప్తి పరచలేకపోవచ్చును.

అయితే ఒప్పందములోని పార్టీలలో ఈ కలయిక స్వేచ్ఛగా లేకపోవడానికి రెండు కారణములు కలవు.

1. యధార్థ కలయిక కాకపోవడానికి వీలుకాని పరిస్థితి.
2. యధార్థ కలయిక ఏర్పడుతుంది కానీ అది స్వేచ్ఛా కలయిక కాకపోవడం.

**5.2.1 యథార్ధ కలయిక కాకపోవడానికి వీలుకాని పరిస్థితి :** ఈ పరిస్థితిలో ఏర్పడే ఒప్పందం చెల్లని ఒప్పందము అవుతుంది. అనగా కాంట్రాక్టు అంశమును ఇరువురు పార్టీలు ఒకే భావనలో అర్థం చేసుకోకపోవడం.

ఉదా : 'A' అనే వ్యక్తికి విజయవాడ మరియు గుంటూరు పట్టణములలో నివాస గృహములు కలవు. 'A' తనకున్న విజయవాడ గృహమును దృష్టియందు ఉంచుకొని ఇంటిని విక్రయిస్తానని 'B'కి ప్రతిపాదన చేసినాడు. 'B', 'A'కు వున్న గుంటూరు గృహమును దృష్టిలో వుంచుకొని కొనుగోలు చేస్తానని స్వీకృతి తెలియజేసినాడు. అయితే వీరిరువురి మధ్య ఏర్పడిన ఒప్పందం చెల్లని ఒప్పందం అవుతుంది. కారణము ఏమనగా కాంట్రాక్టు పార్టీల ఇరువురి భావనలో సారూప్యత లోపించినది. ప్రతిపాదన మరియు స్వీకృతి ఉన్నప్పటికీ వాటి యొక్క భావన వేరయినందున ఆ ఒప్పందము అమలు జరుప వీలులేని పరిస్థితిలో ఏర్పడిన ఒప్పందము కనుక అది చెల్లని ఒప్పందం అవుతుంది.

**5.2.2 యథార్ధ కలయిక ఏర్పడుతుంది కానీ అది స్వేచ్ఛా కలయిక కాకపోవడం :** ఈ సందర్భంలో ఏర్పడే కాంట్రాక్టులనే చెల్లకూడని కాంట్రాక్టులు (Voidable Contracts) అంటారు. అటువంటి లోపాన్ని "హేతు లోపము" (Error in Cause) అని కూడా అంటారు.

భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 2(1) చెల్లకూడని కాంట్రాక్టులను స్పష్టముగా నిర్వచించినది. "పార్టీలలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది యిష్ట ప్రకారము న్యాయశాస్త్ర దృష్ట్యా ఒక అగ్రిమెంటును అమలు జరపడానికి వీలుండి, యితరుల యిష్ట ప్రకారం అమలు జరపడానికి వీలులేనప్పుడు అట్లాంటి అగ్రిమెంటును చెల్లెకూడని కాంట్రాక్టు" అంటారు.

అనగా ఒప్పందం అమలు జరుపుటకు అర్హత గల పార్టీలు అగ్రిమెంటును కాంట్రాక్టుగా మార్చవచ్చును. లేదా కాంట్రాక్టును రద్దు చేయవచ్చును.

## 5.3 స్వేచ్ఛా సమ్మతి :

నిర్వచనము : భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 14 ప్రకారము ఒక సమ్మతి స్వేచ్ఛా సమ్మతి అయి వుండాలంటే, అది ఈ క్రింది అంశముల ప్రభావానికి లోబడి వుండరాదు.

1. సెక్షన్ 15 లో నిర్వచించిన బలప్రయోగం
2. సెక్షన్ 16 లో నిర్వచించిన అనుచిత ప్రభావం
3. సెక్షన్ 17 లో నిర్వచించిన మోసం
4. సెక్షన్ 18 లో నిర్వచించిన అసత్య వర్ణన లేదా
5. సెక్షన్ 20, 21, 22 లలో నిర్దేశించిన పొరపాటు.

అయితే ఇంగ్లీషు న్యాయశాస్త్రం ఈ 5 కారణాలను మూడు విధాలుగా విభజించినది.

1. బల ప్రయోగం     2. అసత్య వర్ణన     3. పొరపాటు

**5.3.1 బలప్రయోగం (Coercion) :** భారత కాంట్రాక్టు చట్టము సెక్షన్ 15 లోని బలప్రయోగము, ఇంగ్లీషు న్యాయశాస్త్రములోని నిర్బంధము (Duress) ఒక్కటే. బలప్రయోగము అంటే ఒక వ్యక్తిని కాంట్రాక్టు చేసుకోమని బలవంతం చేయడం.

కాంట్రాక్టు చట్టం సెక్షన్ 15 ప్రకారము "ఒక వ్యక్తి ఇండియన్ పీనల్ కోడ్‌లో నిషేధించిన ఏదైనా ఒక పనిని చేయడం వల్ల గానీ, చేస్తానని బెదిరించడం వల్ల గాని లేదా మరో వ్యక్తికి కష్టనష్టాలు కలిగే విధంగా వాని ఆస్తిని అక్రమంగానూ, అన్యాయంగానూ

ఉంచివేసుకోవడం గానీ, తీసుకొనడం గానీ అట్లా చేస్తానని బెదిరించడం వల్ల కానీ మరి ఒకని సమ్మతిని సంపాదించినపుడు దానిని 'బలప్రయోగం' అంటారు''. ఈ నిర్వచనాన్ని అధ్యయనం చేసే ఈ క్రింది విషయములు అవగతము అవుతాయి. బలప్రయోగం కాంట్రాక్టులోని పార్టీలపై గానీ లేక ఇతర వ్యక్తులపై గానీ జరుపవచ్చును. అదే విధముగా బలప్రయోగమును కాంట్రాక్టులోని పార్టీలే కాదు, బయటి వ్యక్తులైనా చేయవచ్చును. ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారము నిషేధించబడిన ఏ చర్య అయినా బలప్రయోగం కిందకు వస్తుంది. బలప్రయోగము ఆస్తికి సంబంధించి వుండవచ్చును. బలప్రయోగము వలన జరిగే హింస లేదా అశాంతి వెంటనే జరిగేది అయి వుండనక్కరలేదు. బలప్రయోగము సాధారణ మానవుని మనోధైర్యాన్ని కలవరపరిచేటట్లుగా వుండనవసరం లేదు. బలప్రయోగం జరిగే ప్రదేశంలో ఇండియన్ పీనల్ కోడ్ అమలులో వున్నదా ? లేదా? అనే విషయమునకు ప్రాధాన్యత లేదు.

క్రింది కేసులను పరిశీలించడం ద్వారా "బలప్రయోగము'' గురించి స్పష్టముగా తెలుసుకొనవచ్చును.

**కేసులు : 1 :**

1. **చిక్కం అమ్మిరాజు Vs చిక్కం శేషమ్మ :** ఈ కేసులో భర్త తన భార్య యొక్క ఆస్తి తనఖా పెట్టడానికి ఒప్పుకొనకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినాడు. దాని మీద తన సమ్మతినిచ్చి ఆ తరువాత ఇచ్చిన సమ్మతి "బలప్రయోగం'' వల్ల జరిగినది అని వాదించినది. అయితే ప్రతివాది అయిన భర్త తను ఆత్మహత్య చేసుకుంటాననే చర్య ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం నిషేధించిన చర్య కాదు గనుక తన చర్య బలప్రయోగములోనికి రాదని వాదించినాడు.

**తీర్పు :** "ఆత్మహత్యా ప్రయత్నం'' ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 309 ప్రకారం శిక్షార్హము. ఆత్మహత్య బెదిరింపు ఇండియన్ పీనల్‌కోడ్ విస్తృత పరిధిలో ఆలోచించాలని సూచించినది. న్యాయమూర్తులు ఈ విషయాన్ని చెబుతూ బెదిరింపు నిషేధించబడినది గనుక ఆమె ఇచ్చిన సమ్మతి స్వేచ్ఛా సమ్మతి కాదంటూ బలప్రయోగము వలన పొందిన సమ్మతి అని తీర్పు చెప్పినారు. ఈ కేసులో ఆత్మహత్యా ప్రయత్నం అనే బెదిరింపు ఐపిసి (IPC) యొక్క విస్తృత అర్థంలో శిక్షార్హం కనుక భర్త భార్యపై మానసిక ఒత్తిడిని కలిగించడం జరిగినది కనుక అది బలప్రయోగం.

2. **రంగనాయకమ్మ Vs ఆళ్వార్‌శెట్టి :** ఈ కేసులో భర్తను కోల్పోయిన స్త్రీ దుఃఖిస్తూ వుండగా ఒక బంధువు తన కుమారుని దత్తత చేసుకోవడానికి ఆమె అంగీకరిస్తే తప్ప శవాన్ని స్మశానానికి తీసుకెళ్ళనివ్వనన్నాడు. దాని మీద ఆమె సమ్మతించి ఆ తరువాత ఆ సమ్మతి "బలప్రయోగము'' వలన ఇవ్వవలసి వచ్చిందే కానీ స్వేచ్ఛా సమ్మతి కాదని వాదించింది.

**తీర్పు :** శవాన్ని స్మశానానికి తీసుకువెళ్ళకుండా అభ్యంతర పెట్టడం ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 297 క్రింద శిక్షార్హమైన చర్యగా గుర్తించడం చేత ఆమె తెలిపిన సమ్మతి "బలప్రయోగం'' ద్వారా చేయబడినది కనుక ఆ కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు అని చెప్పినారు.

3. **ముత్తయ్య Vs ముత్తు :** ఈ కేసులో ఏజెంటు తన ప్రిన్సిపాల్‌తో తనను ఋణవిముక్తుణ్ణి చేసినప్పుడే ఖాతా పుస్తకాలను నూతన ఏజెంటుకు ఇస్తానని బెదిరించినాడు. ప్రిన్సిపాల్ భయపడి ఏజెంటుకు ఋణవిమోచనా పత్రాన్ని ఇచ్చినాడు.

**తీర్పు :** ఖాతా పుస్తకాలు అనే ఆస్తిని స్వాధీనం చేసుకోవడం అనే చర్య "బలప్రయోగము'' కనుక ప్రిన్సిపాల్ దీనిని చెల్లకూడని కాంట్రాక్టుగా పరిగణించవచ్చని, సమ్మతి స్వేచ్ఛగా సంపాదించినది కాదని తీర్పు యిచ్చినది.

**బలప్రయోగము యొక్క ప్రభావము :** సెక్షన్ 19 ప్రకారము కాంట్రాక్టులో బలప్రయోగము, మోసం లేదా అసత్యవర్ణన ఉన్నప్పుడు గాయపడిన వ్యక్తి ఆ కాంట్రాక్టును చెల్లకూడని కాంట్రాక్టుగా మార్చవచ్చును. సెక్షన్ 62 ప్రకారము బలప్రయోగము వలన కాంట్రాక్టులో

ప్రవేశించి కొంత మొత్తము చెల్లించినప్పటికీ ఆ మొత్తమును తిరిగి పొందవచ్చును. అయితే ఈ విషయంలో బలప్రయోగము వల్లనే కాంట్రాక్టు ఏర్పడినదని బల ప్రయోగము లేకుంటే కాంట్రాక్టు ఏర్పాటు అవకాశం వుండదనే విషయమును ఋజువు చేయవలసిన బాధ్యత గాయపడిన వ్యక్తిపై కలదు.

**5.3.2 నిర్భంధము :** భారత న్యాయశాస్త్రములోని బలప్రయోగము ఇంగ్లీషు న్యాయశాస్త్రములోని భౌతిక నిర్భంధము ఒకే విధమైనవి. అయితే ఈ భౌతిక నిర్భంధము సరుకులకు గానీ, ఆస్తులకు గానీ వర్తించదు. బలప్రయోగము, భౌతిక నిర్భంధము ఒకే విధమైనవి అయినప్పటికీ వాటి మధ్య కొన్ని వ్యత్యాసములు కలవు.

**బలప్రయోగమునకు, నిర్భంధమునకు గల వ్యత్యాసములు.**

| బలప్రయోగము (Coercion) | నిర్భంధము (Duress) |
|---|---|
| 1. బలప్రయోగము ఎవరిమీదనైనా ప్రయోగించవచ్చును. అనగా కాంట్రాక్టులో సంబంధం లేని అపరిచితుడై కూడా బలప్రయోగం చేయవచ్చును. | 1. నిర్భంధము కేవలం కాంట్రాక్టుపై సమ్మతిని తెలియజేయు పార్టీపీ కానీ, అతని కుటుంబ సభ్యులపై కానీ చేయవలెను. అనగా వారి జీవితాలపై కానీ లేదా స్వేచ్ఛపై కానీ ఈ నిర్భంధం జరుగవలెను. |
| 2. ఆస్తికి సంబంధించిన చర్య బలప్రయోగం అవుతుంది. | 2. ఆస్తితో సంబంధం ఉన్న చర్య నిర్భంధం కాదు. |
| 3. బలప్రయోగం తక్షణం హింస జరిగేదయి వుండనవసరం లేదు. | 3. నిర్భంధంలో తక్షణం హింస జరిగి వుండవలెను. |
| 4. బలప్రయోగము చేసిన చర్య కానీ, చేస్తానని బెదిరించిన చర్య కానీ ఐపిసి (IPC) చేత నిషేధించబడిన కార్యం కానీ, ఆస్తికి సంబంధించిన విషయం కానీ కావచ్చు. | 4. నిర్భంధం కాంట్రాక్టు పార్టీలోని వ్యక్తులకు సంబంధించి వుండడమే కాకుండా, వారియొక్క ప్రాణానికి కానీ, దేహానికి కానీ, వ్యక్తి స్వాతంత్ర్యానికి కానీ సంబంధించినదై వుండవలెను. |
| 5. బలప్రయోగము సామాన్య మనోబలం గల వ్యక్తిని కలవరపరిచేటట్లు ఉండవలెనని లేదు. | 5. నిర్భంధము సామాన్య మనోబలం కలిగిన వ్యక్తిని కలవరపరచేటట్లు వుండవలెను. |

## 5.4 అనుచిత ప్రభావము (Undue Influence) :

నిర్వచనము : భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 16(1) ప్రకారము "ఎవరైనా ఇద్దరు వ్యక్తుల మధ్య ఒకరి ఇష్టాఇష్టాల మీద మరొకరికి ఆధిపత్యం వుండేటటువంటి సంబంధం వుండి అట్లాంటి ఆధిక్య స్థితిని ఆసరా చేసుకొని అక్రమ లాభం రెండవ పార్టీ నుండి పొందితే దానిని అనుచిత ప్రభావము అంటారు''. ఈ నిర్వచనంలో ఈ క్రింది విషయాలు ఇమిడి వున్నాయి.

1. ఒప్పందంలోని ఇరువురి పార్టీల మధ్య ఒకరి ఇష్టానిష్టాలపై మరొకరికి ఆధిక్యం వుండేటటువంటి సంబంధం ఒప్పందానికి ముందే వుండాలి.

2. అటువంటి విశ్వాసాన్ని ఆసరాగా చేసుకొని వుండవలెను.

3. ఆ విశ్వాసాన్ని దుర్వినియోగం చేసి రెండవ పార్టీ అక్రమ లాభం పొందే విధంగా సమ్మతిని పొందడాన్ని అనుచిత ప్రభావం అంటారు.

సెక్షన్ 16(2)(a) ప్రకారము ఒక వ్యక్తి మరొకరిపై వాస్తవంగా లేదా ముఖతా అట్లా కనిపించేటట్లు గానూ అధికారం కలిగి ఉన్నప్పుడు. ఉదా : యజమాని - సేవకుడు, పోలీసు అధికారి - నేరము మోపబడిన వ్యక్తి. సెక్షన్ 16(2)(b) ప్రకారము ఒక పార్టీ రెండవ పార్టీతో విశ్వసనీయమైన సంబంధం కలిగి వున్నప్పుడు. ఉదా : ఆధ్యాత్మిక గురువు - శిష్యుడు, వైద్యుడు - రోగి, న్యాయవాది - క్లయింటు, ట్రస్టీ - బెనిఫిషయరీ. సెక్షన్ 16(2)(c) ప్రకారము ఒక వ్యక్తి తన వార్ధక్యము వల్ల కానీ, అనారోగ్యము వల్ల కానీ, మానసిక లేదా భౌతిక దురవస్థ వల్ల కానీ శాశ్వతంగా కానీ, తాత్కాలికంగా కానీ మానసిక వైకల్యంలో ఉన్నప్పుడు వానితో ఎవరైనా కాంట్రాక్టు చేసుకుంటే. ఉదా : నిరక్షరాస్యులైన వృద్ధులు.

సెక్షన్ 16(3) ప్రకారము కాంట్రాక్టు పార్టీల మధ్య పైన సూచించిన సంబంధం ఉంటూ ఆ కాంట్రాక్టు అన్యాయమైనదిగా కనిపిస్తే అట్లాంటి కాంట్రాక్టులోని సమ్మతి అనుచిత ప్రభావము వల్లనే ఇచ్చినట్లు భావించడం జరుగుతుంది.

కాంట్రాక్టులోని పార్టీ "అనుచిత ప్రభావము" వలన సమ్మతిని ఇవ్వడం జరిగినదని కోర్టు వారికి తన వాదనను వినిపిస్తే ఆ సమ్మతి తెలియజేసిన వ్యక్తికి స్వతంత్రంగా సలహా పొందే అవకాశం వుందని రెండవ పార్టీ ఋజువు చేస్తే మొదటి పార్టీ అనుచిత ప్రభావం వల్ల సమ్మతి ఇచ్చినాడన్న భావన సమసిపోతుంది.

ఈ విషయంలో ప్రముఖమైన ఒక ఇంగ్లీషు కేసు కలదు. Allcord Vs Skinner అనే కేసులో 'A' అనే కన్య స్త్రీ సమాజంలో (sisterhood) ప్రవేశించింది. ఆమె అక్కడ ఉన్నవారికి మత సంబంధపు శిష్యురాలై ఉంటూ తన ఆస్తిలో ఎక్కువ భాగం ఆ సమాజమునకు దానం చేసినది. తరువాత కొన్నాళ్ళకు ఆమె ఆ సమాజాన్ని వదిలి సోదరుని ఇంటికి వచ్చినది. 6 సం॥లు తరువాత సమాజమునకు తాను దానం చేసిన ఆస్తిని రాబట్టుకునేందుకు దావా వేసినది.

**తీర్పు 1 :** ఆమెకు ప్రతివాదికి మధ్య గల సంబంధము అనుచిత ప్రభావము ఉన్నదనే భావనకు అవకాశం కలిగించే మాట వాస్తవమే అయినప్పటికీ వారి మధ్య అటువంటి సంబంధము అంతమైన తరువాత 6 సంవత్సరముల కాలం పాటు ఏ ఆక్షేపణ లేకుండా మౌనంగా ఉండటం వల్ల వాది (ఆమె) ఇచ్చిన దానం ఖాయపరచినట్లయింది కనుక ఆస్తిని వాపసు కోరే హక్కులేదు అని తీర్పు చెప్పడమైనది.

ఏ ఇద్దరు పార్టీల మధ్య ఒకరి మీద మరొకరికి ఎటువంటి ఆధిక్యము వున్నా లేదా రెండవ పార్టీకి లొంగి వున్నా ఈ అనుచిత ప్రభావము ఉన్నట్లుగా భావించవచ్చును.

**కేసు 1 : తుంగాభాయ్, కుంభోజీకర్ Vs యశ్వంత్ దింఖర్‌జోగ్ :** ఈ కేసులో ఒక నిరక్షరాస్యురాలైన భార్య తాలూకు ఆస్తిని 'ఆమె భర్త చూస్తూ ఉండేవాడు. తన స్వలాభానికై ఆ భర్త ఆమె చేత ఆస్తి అంతటినీ, తనఖా పత్రంపై వ్రాయించి సంతకం పెట్టించినాడు. ఆమెకు సంతకం పెట్టడం తప్ప మరే అక్షరాలు రావు. ఈ విషయాలన్నీ తనఖా వ్రాయించుకున్న వానికి కూడా తెలుసునని ఋజువు అయినది. తనఖా చెల్లదని తీర్పు చెప్పడమైనది.

**కేసు - 2 : జీన్ మెకంజీ Vs రాయల్ ఆఫ్ కెనడా :** కేసులో ప్రీవీ కౌన్సిల్ ఈ విధముగా నిర్దేశించినది.

(ఎ) భార్యభర్తల మధ్య అనుచిత ప్రభావము భావన లేదు.

(బి) అనుచిత ప్రభావము ఉన్నదనే వాదన త్రోసిపుచ్చడానికి రక్షణ పొందిన వ్యక్తి కాంట్రాక్టులో ప్రవేశించిన తరువాత కాక అంతకుముందుగానే స్వతంత్రంగా సలహా పొందినాడని నిరూపించాలి.

ఇంగ్లాండులో భార్యభర్తల మధ్య అనుచిత ప్రభావం లేదని భావించిన పార్టీలు ప్రేమికుడు, ప్రేమికురాలు సంబంధంతో వున్నప్పుడు ప్రేమికురాలు ఇటువంటి ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందన్నారు.

**కేసు :** ఇంచినారయ్యా Vs షేక్ అలీబీన్ ఉమర్ అనే కేసులో (ప్రేమికుడు, ప్రేమికురాలు) ఇటువంటి సందర్భాలాన్నింటిలోనూ అనుచిత ప్రభావం వుందన్న భావన కలుగవచ్చునన్నప్పుడు ఏ పార్టీకైతే ఈ ప్రభావం ప్రయోగించడానికి అవకాశం వుందనుకుంటారో అట్లాంటి పార్టీ ఎదుటి పార్టీకి స్వతంత్రమైన సలహా తీసుకోవడానికి అవకాశం వుందని ఋజువు చేయడం ఉత్తమమైన పద్ధతి అన్నారు.

**5.4.1 పరదా స్త్రీలు :** సాంప్రదాయం ప్రకారం పరదా మాటున నివసించే స్త్రీలనే 'పరదానసీన్ స్త్రీలు' అని అంటారు. వీరితో ఒప&పందం చేసుకునేటప్పుడు రెండవ పార్టీ ఆ స్త్రీలపై అనుచిత ప్రభావం లేదు. వారు స్వేచ్ఛగా కాంట్రాక్టులో భాగస్వాములైనారని ఋజువు చేయుటకు కోర్టు వారికి ఈ క్రింది చర్యలను నిరూపించవలెను.

1. పరదా స్త్రీకి ఒప్పందం యొక్క అంశము స్పష్టంగా వివరించడం జరిగినదని,
2. ఆ స్త్రీ కి ఒప్పందం యొక్క విషయాన్ని స్వేచ్ఛగా సమగ్రంగా వివరణ సేకరించే పరిస్థితులలో తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం, ఇతరుల ద్వారా "కాంట్రాక్టులోనికి ప్రవేశించినదని".
3. ఆమె ఎటువంటి అనుచిత ప్రభావానికి లోనుకాకుండా తను స్వేచ్ఛా సమ్మతిని తెలియచేసినదని ఋజువు చేయవలెను.

**5.4.2 బలప్రయోగమునకు, అనుచితప్రభావమునకు వున్న వ్యత్యాసములు :**

| బలప్రయోగము | అనుచిత ప్రభావము |
|---|---|
| 1. నిర్వచనము : బలప్రయోగము ఐపీసి (IPC) చే నిషేధించబడిన పనిని చేసినప్పుడు లేదా చేస్తానని బెదిరించినపుడు దానిని బలప్రయోగం అంటారు. | 1. అనుచిత ప్రభావము అనగా ఒక వ్యక్తి వేరే వ్యక్తి యొక్క మనస్సుపై అధికారమును చెలాయించే శక్తిని, సంబంధమును కలిగి వుండి ఆ అధికారమును ఉపయోగించి అక్రమ లాభమును ఆర్జించుట జరుగును. |
| **2. స్వభావము :** బలప్రయోగము భౌతిక ఒత్తిడికి సంబంధించినది. | 2. అనుచిత ప్రభావము మానసిక ఒత్తిడికి సంబంధించినది. |
| **3. క్రిమినల్ చర్య :** బలప్రయోగము క్రిమినల్ చర్య. | 3. అనుచిత ప్రభావము క్రిమినల్ చర్య కాదు. |
| **4. సంబంధము :** దీనిని చేయుటకు రెండు పార్టీల మధ్య సంబంధము ఉండనవసరం లేదు. ఆ ఒప్పందమునకు బయటి వ్యక్తులపై గానీ లేదా బయట వ్యక్తులు కానీ బలప్రయోగం జరుపవచ్చును. | 4. అనుచిత ప్రభావము ఉపయోగించుటకు రెండు పార్టీల మధ్య ఒప్పందమునకు ముందే సంబంధము వుండవలెను. |

## 5.5 అసత్య వర్ణన :

కాంట్రాక్టులో ప్రవేశించునపుడు చేయు ప్రకటనను "వర్ణన" అని అంటారు. ఈ వర్ణన లేక ప్రకటన కాంట్రాక్టు అంశమునకు సంబంధించి ఉండవలెను. దీనిని మౌఖికముగా లేదా లిఖితపూర్వకముగా తెలియచేయవచ్చును. వ్యక్తుల ప్రవర్తన ద్వారా కూడా

దీనిని తెలియచేయవచ్చును. ప్రకటనను అమాయకంగా వేరే వ్యక్తికి ఎటువంటి నష్టమూ కలిగించే ఉద్దేశ్యము లేకుండా తప్పును తప్పు అని తెలియకుండా చేసినపుడు దానిని అసత్య వర్ణన అని అంటారు. ఈ అసత్య వర్ణనను అమాయకంగా చేస్తే అది కేవలం అసత్య వర్ణన అవుతుంది. ఈ అసత్య వర్ణన మోసం చేసే ఉద్దేశ్యంతో చేస్తే దానిని "మోసం" లేదా 'చర్య' తీసుకోదగిన 'అసత్య వర్ణన' అని అంటారు.

కాంట్రాక్టు చట్టము సెక్షన్ 18 ప్రకారము 'అసత్య వర్ణన' ఈ క్రింది విధముగా నిర్వచింపబడినది.

1. తాను వాస్తవమని నమ్ముతున్నప్పటికీ వాస్తవం కాని విషయాన్ని తనకు తెలిసిన సమాచారం దృష్ట్యా సమంజసంగా, తోచని విధంగా ధృవపరచి చెప్పడం.

2. మోసం చేసే ఉద్దేశ్యం లేకుండా ఎదుటి పార్టీని గానీ, అతని స్థానీయులను గాని దారి తప్పించి వారిని ప్రతికూల పరిస్థితులలో ఉంచడానికి తన కర్తవ్య భంగం చేసి తద్వారా తనకు గాని తన స్థానీయులకు గాని లాభం చేకూర్చుకోవడం.

3. అమాయకంగానైనా ఎదుటి పార్టీని అగ్రిమెంటు విషయ వస్తువు సారాంశంలో పొరపాటు అభిప్రాయం కలిగి వుండేలా చేసే పరిస్థితులను సృష్టించడం.

**5.5.1 అసత్య వర్ణన - ముఖ్యాంశములు :**

1. అత్యంత విశ్వాసపూరితమైన కాంట్రాక్టులో పొరపాటుగా వర్ణించటం గానీ, అంశాన్ని ధృవపరచటం గానీ లేదా కర్తవ్య భంగం చేయటం లేదా నమ్మకమైన సంబంధాలు ఉన్నప్పుడు అసలు విషయాన్ని గురించి మౌనంగా వుండడం.

2. ధృవపరచిన విషయం అంశమునకు సంబంధించినదై ఉండవలెను. కానీ ఆ వ్యక్తి యొక్క అభిప్రాయం అయి వుండకూడదు.

3. ధృవపరచిన అంశం అబద్ధం అయి వుండవలెను.

4. సమ్మతి ఇవ్వడానికి ధృవపరచిన అంశం దోహదపడవలెను.

5. ధృవపరచిన అంశములు కాంట్రాక్టు యొక్క షరతులు, పూచీలుగా వున్నవి అయితే అవి అసత్య వర్ణన పరిధిలోనికి రావు. అసత్య వర్ణన పరిధిలోనికి రావాలంటే చేయబడిన నివేదన కాంట్రాక్టుకు సమ్మతిని చేకూర్చడానికి దోహదం చేసేది అయి వుండవలెను.

సెక్షన్ 19 ప్రకారము 'సమ్మతి' అసత్య వర్ణన వలన ఇచ్చినట్లయితే వారి మధ్య ఏర్పడే కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు అవుతుంది. ఈ సందర్భంలో సమ్మతిని తెలియచేసిన పార్టీ మాత్రమే కాంట్రాక్టును ఉపసంహరణ చేయమని కోరవచ్చును లేదా అమలు చేయమని కోరవచ్చును. కానీ అసత్య వర్ణన వలన సమ్మతిని ఇచ్చే పార్టీకి ఏర్పడే కష్టనష్టాలు చెల్లింపు చేయమని దావా వేసే హక్కు లేదు.

**ఉదా :** 'A' తన ఆస్తిని నమ్మకంగా సదుద్దేశ్యంతో విక్రయిస్తానని 'B' కి ప్రతిపాదన చేసినాడు. 'B' ఆ ఆస్తిని కొనుగోలు చేయుటకు సమ్మతించినాడు. అయితే ఆ ఆస్తి తనఖాలో వున్నది. 'A' ఆ విషయాన్ని మరచి అసత్య వర్ణన చే ప్రతిపాదన చేసినాడు. తనఖా విషయం తెలిసిన 'B' తన సమ్మతిని నిరాకరించి కాంట్రాక్టును రద్దు చేయవచ్చును లేక తనఖాను తీర్చి కాంట్రాక్టును యధావిధిగా కొనసాగించమని కోరవచ్చును.

**5.5.2 మోసము లేదా బుద్ధి పూర్వకముగా చర్య తీసుకోదగిన అసత్య వర్ణన :** ఒక వ్యక్తి మరొక వ్యక్తికి నష్టం కలిగించే ఉద్దేశ్యంతో ఒక

అంశం వాస్తవం కాదు అని తెలిసి లేదా నిజాన్ని గురించిన నమ్మకం లేకుండా అది నిజమా కాదా అనే విషయాన్ని పట్టించుకోకుండా, నిర్లక్ష్యంతో ఒక ప్రకటన చేసి కాంట్రాక్టు ఏర్పాటుకు రెండవ వ్యక్తిని బాధ్యుని చేసినపుడు మొదటి వ్యక్తి చేసిన పని మోసం అవుతుంది.

కాంట్రాక్టు చట్టము సెక్షన్ 17 ప్రకారము "ఒక పార్టీ తనంతట తాను కానీ, ఏజెంటు ద్వారా కాని క్రింద ఉదహరించిన పనులను మోసం చేసే ఉద్దేశ్యంతో చేయడం కానీ, చేయించడం కానీ, జరిపించిన లేదా వాటి ద్వారా రెండవ పార్టీకి కానీ, అతని ఏజెంటును కానీ కాంట్రాక్టుకు సమ్మతి ఇచ్చేటట్లు చేస్తే అది మోసం అవుతుంది".

(1) ఒక అబద్ధపు అంశాన్ని అది నిజం అని, నమ్మకుండానే నిజం అని సూచించడం.

(2) ఒక నిజమైన అంశాన్ని అది నిజమని నమ్మి కూడా చెప్పకుండా దాచడం.

(3) అమలు చేసే ఉద్దేశ్యం లేని ప్రామిస్ చేయడం.

(4) మోసం చేయడానికి అనువైన పని చేయడం.

(5) ఒక పని చేయడం కానీ, లేదా మానివేయడం కానీ న్యాయసూత్రాల చేత మోసమని నిర్దిష్టంగా చెప్పబడినప్పుడు అట్లాంటి పనిని అతడు చేయడం.

**5.5.2.1 మోసము - ముఖ్యాంశాలు :** ఒక వ్యక్తి మోసము ద్వారా కాంట్రాక్టులో ప్రవేశించినాడు అనే విషయాన్ని నిర్ణయించుటకు ఈ క్రింది అంశములను పరిగణనలోనికి తీసుకుంటారు.

1. ఒక పార్టీ లేదా అతని ఏజెంటు ఒక విషయాన్ని వర్ణించడము లేదా స్పష్టం చేయడమూ లేదా విషయాన్ని దాచి వుంచడం.
2. నివేదించిన లేదా దాచి వుంచిన విషయం ఒక వాస్తవానికి సంబంధించినది అయి వుండవలెను. కాని ఒక పార్టీ యొక్క అభిప్రాయం కాని లేదా ఉద్దేశ్యమునకు చెంది వుండరాదు.
3. ఆ వ్యక్తి / ఆ పార్టీ స్పష్టం చేసిన విషయం అబద్ధం అని అతనికి తెలిసి ఉండాలి. లేదా అది అసత్యమని తనకే నమ్మకం లేక ఉండాలి లేదా ఆ విషయం నిజమో అబద్ధమో పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వుండాలి.
4. తాను స్పష్టం చేసిన అంశం ఆధారంగా రెండవ పార్టీ కాంట్రాక్టులోనికి ప్రవేశించేందుకు తోడ్పడవలెను.
5. ఆ అంశం ఆధారంగా రెండవ పార్టీ కాంట్రాక్టులోనికి ప్రవేశించి నష్టపోవటం జరిగి వుండవలెను.

**కేసు** : డెర్రీ Vs పీక్ : అనే కేసులో ఒక ట్రామ్‌వే కంపెనీ డైరెక్టర్లు గుర్రాలతో కాకుండా ఆవిరి యంత్రాలతో ట్రామ్ కార్లను నడిపే ప్రణాళికను వర్తకపు బోర్డు వారికి సమర్పించినారు. వారు ప్రణాళిక ఆమోదించినారు. ఈ ఆమోదమును ఆసరా చేసుకొని ట్రామ్‌వే కంపెనీ ఆవిరి యంత్రాలతో కార్లను నడిపే హక్కు పొందినట్లు ప్రకటన పత్రాన్ని(Prospectus) జారీ చేసినారు.

ఈ పత్రంలోని అంశాన్ని నమ్ముతూ ఒక వ్యక్తి కంపెనీలోని వాటాలను కొనుగోలు చేసినాడు. అయితే వర్తకపు బోర్డు ఆవిరి యంత్రములను ఉపయోగించడానికి అనుమతి నిరాకరించడం వలన కంపెనీ మూతపడినది. కనుక డైరెక్టర్లు నష్టపరిహారం చెల్లించవలెనని వాటాలను కొనుగోలు చేసిన వ్యక్తి దావా వేసెను.

**తీర్పు** : హౌస్ ఆఫ్ లార్డ్స్ వారు ఈ వాదనను త్రోసిపుచ్చినారు. ఒక వ్యక్తి తగిన ఆధారాలు లేకపోయినప్పటికి తాను వాస్తవమని నమ్ముతున్న విషయాన్ని ప్రకటిస్తే అది అమాయకపు అసత్య వర్ణన చేసినట్లే అవుతుంది అని తీర్పు చెప్పినారు.

**5.5.2.2 మోసం ప్రభావం :** ఒప్పందమునకు లభించిన సమ్మతి మోసం జరగడం వలన లభించి వుంటే అటువంటి సమ్మతి తెలియచేసిన వారి ఇష్టానికి లోబడి కాంట్రాక్టు చెల్లకూడనిది అవుతుంది. కనుక ఆ కాంట్రాక్టుకు సమ్మతి ఇచ్చిన పార్టీ కాంట్రాక్టును రద్దు చేయమని కోరవచ్చును. లేక అమలు చేయమని కోరవచ్చును. అదే విధముగా నష్టపరిహారమును పొందుటకు దావా

వేయవచ్చును ఒకసారి కాంట్రాక్టులోనికి ప్రవేశించిన తరువాత ఆ కాంట్రాక్టులోని అంశమును మూడవ వ్యక్తికి బదిలీ చేసినప్పుడు కాంట్రాక్టును రద్దు చేయు అవకాశమును కోల్పోవును.

**కాంట్రాక్టు రద్దు నిరాకరణ సందర్భములు :**

ఈ దిగువ సందర్భములలో గాయపడిన వ్యక్తి కాంట్రాక్టును రద్దు చేయమని కోరలేడు.

1. మోసము వలన సమ్మతి తెలియచేసిన వ్యక్తి కాంట్రాక్టు రద్దు చేసుకునే అధికారం వున్నట్లు తెలిసిన తరువాత తన చర్యల ద్వారా కానీ, మాటల ద్వారా కానీ తను అంగీకరించినట్లుగా వ్యక్తమైన సందర్భములలో కాంట్రాక్టు రద్దును కోరలేడు.
2. కాంట్రాక్టు విషయ వస్తువులను యథాస్థితికి తీసుకురాలేని సందర్భములలో ఉన్నప్పుడు కాంట్రాక్టు రద్దును కోరలేరు. ఉదా : కాంట్రాక్టుకు సంబంధించిన వస్తువులు వినియోగించినా లేక పాడైపోయినా.
3. సముచిత కాలం దాటిన తరువాత కాంట్రాక్టును రద్దు చేయమని కోరలేరు.
4. మూడవ పార్టీకి హక్కులు సరియైన పద్ధతిలో సంక్రమించినప్పుడు కాంట్రాక్టును రద్దు చేయమని కోరలేరు.

**5.5.2.3 మోసమునకు సంబంధించిన అంశములు :** సెక్షన్ 17 ప్రకారము "ఒక పార్టీ యొక్క మౌనం వేరే పార్టీ యొక్క కాంట్రాక్టు ఏర్పాటు ఉద్దేశ్యమును ప్రభావితం చేయవచ్చును. కానీ అటువంటి మౌనం మోసం అని అనుటకు అవకాశం లేదు''. ఈ నిబంధనకు గల మినహాయింపులు.

(ఎ) కాంట్రాక్టు స్వభావమును బట్టి ఒక పార్టీ కాంట్రాక్టు ఏర్పాటు సమయంలో మౌనం వహించుటకు అవకాశం లేనపుడు అటువంటి కాంట్రాక్టుకు సంబంధించిన మౌనం వహించుటను మోసం అంటారు.

(బి) కొన్ని సందర్భములలో మౌనం వహించుట మాట్లాడిన వానితో సమానం అయినప్పుడు మౌనంను మోసం అని పిలువవచ్చును. ఉదా : 'A', 'B'తో నీవు ఏమీ మాట్లాడకుంటే నీవు అమ్మే గుఱ్ఱం మతిని కలిగి వున్నదని భావిస్తాను అని చెప్పినపుడు B మౌనం వహించెను. ఈ మౌనం "గుఱ్ఱం మతిని కలిగి వుందని A మాట్లాడిన దానితో సమానంగా'' అర్థం చేసుకొనుటకు అవకాశం కలదు. ఈ గుఱ్ఱం మతి సరిగా లేనట్లయితే ఏర్పడిన కాంట్రాక్టు మోసం ద్వారా ఏర్పడిన కాంట్రాక్టుగా పరిగణించబడుతుంది.

**అసత్య వర్ణన, మోసానికి గల వ్యత్యాసములు :**

| అసత్య వర్ణన | మోసం |
|---|---|
| 1. **ఉద్దేశ్యము :** అమాయకంగా కాంట్రాక్టులోని రెండవ పార్టీకి ఎటువంటి హానీ కలిగించే ఉద్దేశ్యం లేకుండా చేసేది అసత్య వర్ణన. | 1. తెలిసి మోసం చేసే ఉద్దేశ్యంతో ఉద్దేశ్య పూర్వకంగా రెండవ పార్టీకి హానీ కలిగించే ఉద్దేశ్యం కలిగిన దానిని మోసము అంటారు. |
| 2. **నష్టపరిహారము :** కాంట్రాక్టులో అసత్యవర్ణన ఉన్నప్పుడు గాయపడిన వ్యక్తి కాంట్రాక్టును రద్దు చేయవచ్చును. కానీ నష్టపరిహారం కొరకు దావా వేయుటకు అవకాశం లేదు. | 2. కాంట్రాక్టులో మోసం ఉన్నప్పుడు గాయపడిన వ్యక్తి కాంట్రాక్టును రద్దు చేయవచ్చును మరియు నష్ట పరిహారము కొరకు దావా వేయవచ్చును. |
| 3. రద్దు : కాంట్రాక్టులో అసత్య వర్ణన వుండి నిజం వ్యక్తమైనప్పుడు నష్టపడిన వ్యక్తి కాంట్రాక్టును రద్దు చేయుటకు అవకాశం లేదు. | 3. కాంట్రాక్టులో మోసం వుండి నిజం వ్యక్తమైనపుడు (మౌనంతో కూడిన మోసం మినహా) కాంట్రాక్టును రద్దు చేయవచ్చును. |

## 5.6 పొరపాటు :

కాంట్రాక్టు చేసుకునే పార్టీలు ఏకాభిప్రాయంలో ఉండడమే కాకుండా సమ్మతి వాస్తవమైనది మరియు స్వేచ్ఛగా ఇచ్చినది అయి వుండవలెను. కాంట్రాక్టు పార్టీలలో ఒకరు కాంట్రాక్టు అంశమును పొరపాటుగా అర్థం చేసుకోవడం వల్ల కానీ లేదా ఇద్దరూ పొరపాటు అభిప్రాయం కలిగి వుండడం జరిగితే అటువంటి కాంట్రాక్టును అమలు చేయడానికి వీలుండదు. ఇటువంటి పొరపాటుతో కూడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది. **'పొరపాటు'**ను ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చును.




### 5.6.1 న్యాయ విషయక పొరపాటు :

(a) **స్వదేశీ న్యాయ విషయక పొరపాటు :** సామాన్య న్యాయశాస్త్రము "న్యాయసూత్రాలు'' తెలియదంటే అది క్షమార్హం కాదు''. (Ignorance of law is no excuse). కనుక స్వదేశీ న్యాయవిషయంలో పొరపాటు వల్ల కాంట్రాక్టు ఏర్పడితే ఆ కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు అవదు.

(b) **విదేశీ న్యాయ విషయక పొరపాటు :** విదేశీ న్యాయశాస్త్ర పరిజ్ఞానములోని లోపాన్ని కాంట్రాక్టు యొక్క వృత్త విషయక పొరపాటుగా భావించుట జరిగినది. కనుక కాంట్రాక్టు అమలు అనేక ఇతర అంశములపై ఆధారపడి వుంటుంది.

భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 21 ప్రకారము "మన దేశంలో అమలులో వున్న న్యాయసూత్రాల విషయమైన

పొరపాటు వల్ల కాంట్రాక్టుకు సమ్మతి ఇచ్చినాడన్నంత మాత్రం చేత కాంట్రాక్టు చెల్లకూడనిది కాదు. కానీ ఆ పొరపాటు విదేశీ న్యాయసూత్రాల విషయంలో అయినప్పుడు మాత్రం అది వృత్త విషయకమైన పొరపాటుకు వుండే ప్రభావంతోనే ఉంటుంది.

**5.6.2 వృత్త విషయకమైన పొరపాటు :** వృత్త విషయకమైన పొరపాటును రెండు విధములుగా విభజించవచ్చును.

అవి. 1 ద్విపక్ష పొరపాటు, 2. ఏకపక్ష పొరపాటు.

**5.6.2.1 ద్విపక్ష పొరపాటు :** కాంట్రాక్టులోని రెండు పార్టీలు కాంట్రాక్టుకు ముఖ్యమైన వృత్త విషయాలలో (Facts essential to the contract) పొరపాటు అభిప్రాయము. ఇది మనోభావ తుల్యత ఉండవలెననే సూత్రాన్ని వ్యతిరేకిస్తుంది. కనుక అటువంటి కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

సెక్షన్ 20 ప్రకారము "కాంట్రాక్టు లోని ఉభయ పార్టీలు అగ్రిమెంటుకు సంబంధించిన ముఖ్యమైన వృత్త విషయంలో ఎప్పుడు పొరపాటు అభిప్రాయంలో ఉన్నారో అప్పుడు ఆ అగ్రిమెంటు చెల్లదు.

ఈ నిర్వచనం ప్రకారము ద్విపక్ష పొరపాటు రెండు షరతులకు లోబడి వుంటుంది.

1. ఒప్పందంలోని ఉభయ పార్టీలు పరస్పరం కాంట్రాక్టులోని అంశమును పొరపాటుగా అర్థం చేసుకొని వుండవలెను.

**కేసు : స్కాట్ Vs కౌల్సన్ :** ఈ కేసులో భీమా పాలసీ తీసుకునే సమయానికి ఏ వ్యక్తి జీవితంపైనా భీమా అగ్రిమెంటు జరుగుతున్నదో ఆ వ్యక్తి వాస్తవానికి మరణించాడు. అయితే పాలసీ జారీచేసే పార్టీకి పాలసీ తీసుకునే వారికి ఈ విషయం తెలియదు. కనుక ఇది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

2. పొరపాటు అనేది కాంట్రాక్టు యొక్క వృత్త విషయమై వుండవలెను.

(ఎ) **విషయమునకు సంబంధించిన పొరపాటు (Mistake as to Subject Matter of Contract) :** కాంట్రాక్టులోని ముఖ్య విషయమునకు సంబంధించిన పొరపాటును ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చును.

1. ఉనికి 2. గుర్తింపు, 3. హక్కు, 4. పరిమాణం, 5. నాణ్యత, 6. ధర,
7. పూర్తి చేయుటకు సంబంధించిన పొరపాటు.

1. **ఉనికి (Existence of Subject Matter) :** ఒప్పందంలోని ఇరు పార్టీలు ఒప్పందం చేసుకునేటప్పుడు ఆ వస్తువు ఉందనుకొని కాంట్రాక్టు చేసుకొని తరువాత అది లేదని గ్రహిస్తే అటువంటి కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు అవుతాయి.

**కేసు : కోరియర్ Vs హేస్టీ (Coutnrier Vs Hastie) :** ఈ కేసులో ఇంగ్లాండు వెడుతున్న ఓడపై ఇండియన్ కారన్ అమ్మడానికి, కొనడానికి కాంట్రాక్టు చేసుకున్నారు. ఈ కాంట్రాక్టు జరిగేందుకు కొన్ని రోజులు ముందుగానే జొన్న పాడవడం వల్ల త్రోవలో దానిని దింపివేసినారు. అయితే ఈ విషయం ఇరు వర్గాల వారికి తెలియదు. కనుక పొరపాటు వుండడం వలన కాంట్రాక్టు చెల్లదని తీర్పు యిచ్చినారు.

2. **గుర్తింపు (Identity of Subject Matter) :** కాంట్రాక్టును ఒక వ్యక్తి ఒక రకంగా అర్థం చేసుకున్నప్పుడు వేరే వ్యక్తి భిన్నంగా అర్థం చేసుకున్నప్పుడు పొరపాటు జరుగుటకు అవకాశం కలదు.

**కేసు : రాఫిల్స్ Vs విచల్ హేస్టే :** ఈ కేసులో బొంబాయి నుంచి 'పీర్‌లెస్' అనే ఓడలో రానున్న 125 బేళ్ళ ప్రత్తిని కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదిరినది. అయితే అదే ఓడ పేరుతో వున్న రెండు ఓడలలో ఒకటి అక్టోబరులోనూ మరొకటి డిశెంబరులోనూ బయలుదేరుతున్నాయి. అమ్మకందారు డిశెంబరులో వెళ్ళే పీర్‌లెస్ నౌక మీద సరుకు పంపుదామనుకున్నాడు. కానీ కొనుగోలుదారు అక్టోబరులో బయలుదేరనున్న పీర్‌లెస్ ఓడలో సరుకు కొందామనుకున్నాడు.

**తీర్పు :** అమ్మకందారు వేసిన దావాలో కాంట్రాక్టుకు సంబంధించిన విషయ వస్తువు గుర్తింపులో పొరపాటు జరిగినదని, అందువల్ల కాంట్రాక్టు చెల్లదని తీర్పు యిచ్చినారు.

3. **హక్కు (Right of Parties) :** కాంట్రాక్టు యొక్క వృత్త విషయంపై గల హక్కు విషయంలో పొరపాటు కారణంగా ఏర్పాటైన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**కేసు : కూపర్ Vs ఫిబ్స్ (Cooper Vs Phibbs) :** ఈ కేసులో A తనకే చెందిన చేపలు పట్టే స్థలానికి హక్కు B ది అని భావించి B నుండి లీజు హక్కును పొందినాడు. అయితే A తన పొరపాటును గ్రహించి కాంట్రాక్టును రద్దు చేయమని న్యాయస్థానమును ఆశ్రయించెను.

**తీర్పు :** హక్కుకు సంబంధించిన పొరపాటు కాంట్రాక్టు వృత్త విషయమునకు సంబంధించినది కనుక వారి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు చెల్లనిది అవుతుందని తీర్పు చెప్పినారు.

4. **పరిమాణము :** వస్తు పరిమాణము గురించి ఉభయపక్షాల వారు తప్పుగా అర్థం చేసుకున్నప్పుడు అది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**ఉదా : కాక్స్ Vs ప్రెట్టీస్ :** ఈ కేసులో A, B లు వెండి బరువును తప్పుగా అర్థం చేసుకున్నారు. కాంట్రాక్టులో వస్తు పరిమాణమునకు సంబంధించి పొరపాటు జరగడం వలన ఇది చెల్లని కాంట్రాక్టు అని తీర్పు చెప్పినారు.

5. **నాణ్యత :** కాంట్రాక్టులోని వస్తువు యొక్క నాణ్యతలో జరిగే పొరపాటు ద్విపక్ష పొరపాటు అయినట్లు అయిన అది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

సాధారణంగా వస్తు విక్రయాల విషయంలో "కొనుగోలుదారుడు జాగ్రత్త పడవలెను" అనేది సామాన్య సూత్రము. అయితే కొనుగోలుదారుడు తన యొక్క అవసరాన్ని తెలియజేస్తూ అందుకు తగిన వస్తువులను సూచించమని అమ్మకందారుని కోరినప్పుడు అమ్మకందారుడు సూచించిన వస్తువు కొనుగోలుదారుని అవసరాన్ని తీర్చని సందర్భంలో ఏర్పడిన కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది. అదే విధముగా ఇరు పార్టీల మధ్య "విశ్వాసాత్మక సంబంధాలు" వున్నప్పుడు "కొనుగోలుదారుడే జాగ్రత్త పడవలెను" అనే సూత్రం వర్తించదు.

6. **ధర :** ఒప్పందంలోని ఇరు పార్టీలు ఒకే ధరకు ఒప్పందం చేసుకొని వ్రాత పూర్వకముగా వేరొక ధరను వ్రాసుకున్నట్లయిన ఆ విధముగా ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**కేసు : వెబ్బర్ Vs సెసిల్ (Webster Vs Cecil)** అనే కేసులో A తన ఆస్తిని £ 2,250కు విక్రయిస్తానని ప్రకటన చేయగా, B ఆ ఆస్తిని అదే ధరకు కొనుగోలు చేస్తానని అంగీకరించినాడు. అయితే వారిరువురూ కాంట్రాక్టులోని ప్రవేశం సందర్భంలో వ్రాసుకొను ఒప్పంద పత్రంలో ప్రతిఫలం £ 2.250 కు బదులుగా £ 1250గా నమోదు చేయడం జరిగింది.

తీర్పు : ఈ విధముగా వారి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుందని లేదా జరిగిన పొరపాటును సరిదిద్ది దానిని అమలుపరచవచ్చునని తెలియజేసినారు.

7. **పూర్తి చేయుటకు సంబంధించిన పొరపాటు :** కాంట్రాక్టులోని ఇరు పార్టీలు కాంట్రాక్టును పూర్తి చేయుట సంభవం అని భావించి కాంట్రాక్టులో ప్రవేశించిన తరువాత ఆ కాంట్రాక్టును పూర్తి చేయుట అసంభవం అయినప్పుడు అది చెల్లని కాంట్రాక్టు అవుతుంది. అదే విధముగా న్యాయశాస్త్ర రీత్యా అమలు జరపలేని అగ్రిమెంట్లు చెల్లని అగ్రిమెంట్లు కనుక ఆ విధమైన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**5.6.2.2 ఏకపక్ష పొరపాటు :** కాంట్రాక్టు చట్టం సెక్షన్ 22 ప్రకారము "ఒక కాంట్రాక్టులో ఎవరైనా ఒక పార్టీ వృత్త విషయక పొరపాటు పడినంత మాత్రాన ఆ కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు కాదు". కానీ పొరపాటు అసత్య వర్ణన లేదా మోసం ద్వారా జరిగి ఉండరాదు. కాంట్రాక్టులోని ఒక పార్టీ పొరపాటు అభిప్రాయంలో ఉన్నప్పుడు కాంట్రాక్టును తోసివేసే అవకాశం లేదు.

కొన్ని ప్రత్యేక సందర్భములలో ఏర్పడిన కాంట్రాక్టులలో న్యాయస్థానం తీర్పులు ఈ విధముగా వున్నవి. మోసం వలన గానీ, అసత్య వర్ణన వలన గానీ లేక ఇతర కారణముల వలననైనా ఏకపక్ష పొరపాటుగా పరిగణించిన కాంట్రాక్టు ప్రారంభం నుండి చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**పొరపాటు అభిప్రాయంలో ఉండడం వలన ఒక పార్టీ కాంట్రాక్టును తోసివేయలేని సందర్భములు :**

1. వస్తువులను వర్ణనతో అమ్మేటప్పుడు వ్యాపార వర్ణనకు సంబంధించి దానిని అర్థం చేసుకొనడంలో పొరపాటు జరిగితేను.
2. ఒక వ్యక్తి తన అభిప్రాయం వెలిబుచ్చడంలో పొరపాటు జరిగితేనూ.
3. వాస్తవానికి ధర తక్కువే అయినప్పటికీ ఒక వ్యక్తి పొరపాటు వలన ఎక్కువ ధర చెల్లించేందుకు ఒప్పుకున్నప్పుడు.
4. కాంట్రాక్టును అమలు జరుపడంలో ఒక వ్యక్తి తన శక్తిని గురించి పొరపాటు పడినప్పుడు.

**మినహాయింపులు :**

1. **కాంట్రాక్టు చేసుకున్న వ్యక్తిని గుర్తించుటలో పొరపాటు :** కాంట్రాక్టు ఏర్పాటుకు సంబంధించిన వ్యక్తిని గుర్తించుటలో ఏకపక్ష పొరపాటు జరిగినప్పుడు ఆ కాంట్రాక్టును రద్దు చేయవచ్చును.

ఉదా : A అను వ్యక్తి B అను వ్యక్తితో కాంట్రాక్టు ఏర్పాటు చేసుకోదలచి పొరపాటున C తో కాంట్రాక్టును ఏర్పాటు చేసుకున్నాడు. ఈ కాంట్రాక్టులో Bని గుర్తించుట ప్రధాన అంశం. A మరియు C ల మధ్య **మనోభావతుల్యత** లేదు కనుక కాంట్రాక్టు ఏర్పాటు కాదు.

**కేసులు :**

1. **కండే Vs లిండ్సే (Cundy Vs Lindsay) :** ఈ కేసులో బ్లెంకారన్ అనే వ్యక్తి బ్లెంకిరాన్ అనే సుప్రసిద్ధ వ్యాపారస్తుని సంతకాన్ని అనుకరిస్తూ లిండ్సే అనే వ్యక్తి నుండి అరువుపై సరుకు కొనుగోలు చేసి దానిని కండే అనే వ్యక్తికి విక్రయించినాడు. ఆ వస్తువుల ధర లిండ్సేకి చేరకపోవడంతో అతను బ్లెంకిరాన్ వద్దకు ధర వసూలుకు వెళ్ళగా అతను అటువంటి ఆర్డరు ఏమీ లిండ్సేకు ఇవ్వలేదని సరుకు తనకు చేరలేదని స్పష్టం చేశాడు. లిండ్సే సరుకు విషయమై వాకబు చేయగా అది కండే వద్ద వున్నట్లుగా కనుగొని వస్తువుల ధర కొరకు దావా వేసినాడు.

**తీర్పు :** లిండ్సే బ్లెంకారన్ అనే వ్యక్తితో కాంట్రాక్టు చేసుకోవడానికి ఉద్దేశించి వుండలేదు. కనుక వారిద్దరి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు. ఈ కారణంగా బ్లెంకారన్ వద్ద సరుకు కొనుగోలు చేసి కండే నిర్దోషి అయినప్పటికీ ఆ సరుకుపై హక్కు అతనికి సంక్రమించలేదు. కండే ఆ సరుకును లిండ్సేకు వాపసు చేయవలసి వుంటుందని తీర్పు చెప్పినారు.

**2. ఇంగ్రామ్ Vs లిటిల్ (Ingram Vs Little) :** ఈ కేసులో A, B, C అను ముగ్గురు అక్కాచెల్లెళ్ళు తమ కారుని అమ్ముతామని చెప్పగా D అనే మోసగాడు ఆ కారును కొంటానన్నాడు. కాంట్రాక్టు అయిన తరువాత కారు ఖరీదుకి E అనే శ్రీమంతుని సంతకం పెట్టి తనే E నని చెప్పి చెక్కు ఇచ్చినాడు. అప్పుడు A తాము చెక్కు తీసుకోమని డబ్బు చెల్లించమని పట్టుపట్టింది. దానితో D తన పేరు E అని తన చిరునామా ఫలానా అని E అడ్రస్సు ఇచ్చినాడు. అది విని D కి తెలియకుండా B పోస్టాఫీసుకు వెళ్ళి టెలిఫోన్ డైరెక్టరీలో E చిరునామా అడిగితే D చెప్పిన చిరునామా చెప్పినారు. దానితో D యే E అని నమ్మి A ఆ చెక్కును తీసుకోవచ్చునని B చెప్పింది. D చెక్కు ఇచ్చి కారు తీసుకొని తరువాత F కు అమ్మినాడు.

A పంపిన E పేర చెక్కు అనాదరణ జరిగినది. దానిపై D కోసం వెతకగా F వద్ద కారు కనిపించినది. ఆ కారును వాపసు చేయమని లేదా ధర చెల్లించమని F మీద A, B లు దావా వేసినారు.

**తీర్పు :** A, B, C లకు D తో కాంట్రాక్టు చేసుకునే ఉద్దేశం లేదు. A మరియు D ల మధ్య ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు కనుక కారును కొనుగోలు చేసిన F కు ఆ కారుపై ఎటువంటి హక్కు లేదు కనుక ఆ కారును A కు వాపసు చేయమని తీర్పు చెప్పినారు.

**3. ఫిలిప్స్ Vs బ్రూక్స్ (Phillips Vs Brookes) :** ఈ కేసులో 'N' అనే వ్యక్తి నగల దుకాణంలో ప్రవేశించి తను పరపతి గల 'G' అని చెప్పి ఖరీదైన నగలను ఎంపిక చేసి చెక్కు ద్వారా వాటిని కొనుగోలు చేశాడు. వర్తకుడు ఆ చెక్కును ఆమోదించి నగలను 'N'తో తీసుకువెళ్ళనిచ్చాడు.

N ఆ నగలను B కు అమ్మివేసినాడు. N ఇచ్చిన చెక్కు అనాదరణ చెందినదని మరియు తన నగలు B వద్ద వున్న విషయం తెలిసిన ఫిలిప్స్ B పై దావా వేసినాడు.

**తీర్పు :** ఈ కేసులో వ్యక్తి గుర్తింపు విషయంలో తప్పు జరగలేదు. అందువలన ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు కాదు. కానీ కాంట్రాక్టు ఏర్పాటులో మోసం జరిగినది. కనుక ఈ కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు.

**4. లేక్ Vs సిమ్మన్స్ (Lake Vs Simmons) :** ఈ కేసులో A అనే స్త్రీ తను C అనే ధనికుని భార్యనని B అనే వ్యక్తి నగల దుకాణం నుండి నగలను ఎంపిక చేసి C కి చూపించి అతనికి నచ్చితే వాటి ధర పంపిస్తానని చెప్పి వాటిని దుకాణం నుండి తీసుకువచ్చినది. తరువాత వాటిని D కి విక్రయించింది. తరువాత B వచ్చిన స్త్రీ C భార్య కాదని తెలుసుకొని ఆ వస్తువును కలిగి వున్న D పై దావా వేసినాడు.

**తీర్పు :** ఈ కేసులో B, C తో కాంట్రాక్టు చేసుకునే ఉద్దేశం కలిగి వున్నాడు. కానీ A తో కాదని B కు, A కు మధ్య ఏర్పడిన కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు కనుక D కు వస్తువులపై ఎటువంటి హక్కు సంక్రమించలేదని తెలియజేసినారు.

2. **కాంట్రాక్టు స్వభావాన్ని బట్టి పొరపాటు :** కాంట్రాక్టు స్వభావాన్ని బట్టి పొరపాటు జరిగితే అటువంటి కాంట్రాక్టులను రద్దు చేయవచ్చును.

**కేసు : ఫాస్టర్ Vs మెక్కినాన్ (Faster Vs Mackinnon) :** ఈ కేసులో చదువురాని ముసలి వాని చేత హామీ పత్రము అని అసత్య వర్ణన చేసి బిల్లుపై సంతకం చేయించినారు. బిల్లుపైన ఎండార్సీ చేసిన దావాలో న్యాయస్థానము ఈ విధముగా తీర్పు యిచ్చినది.

**తీర్పు :** వృద్ధుడు బిల్లుపై సంతకం చేద్దామని ఎప్పుడు ఉద్దేశించలేదు. సంతకం చేసేటప్పుడు "చేయి మనస్సును అనుకరించలేదు" - కనుక "ఈ పత్రం నాది కాదు" అనే సూత్రం వర్తిస్తుందని చెప్పినారు. ఈ రకమైన కేసులలో కాంట్రాక్టు క్రమత్వం మోసం వలన భంగమైనట్లు కాకుండా అసలు సమ్మతే లేదని భావించి కాంట్రాక్టు చెల్లదని తీర్పు యిచ్చినారు.

**ఇతర మినహాయింపులు :**

1. సంతకం చేయు వ్యక్తి "కాంట్రాక్టు యొక్క స్వభావం" (Nature of the contract) గురించి కాక కాంట్రాక్టు (విషయాలను), నిబంధనలను (Terms of the contract) గురించి పొరపాటు పడితే ఆ కాంట్రాక్టు రద్దు కాదు.

2. అన్యాక్రాంత యోగ్యతా పత్రాలకు (Negotiable Instruments) మరియు ఇతర పత్రాలకు మధ్య వ్యత్యాసం వున్నది.

**5.6.3 పొరపాటు జరిగినప్పుడు దానికి పరిహారాలు :**

1. **కాంట్రాక్టు అమలు పరచవలసి వున్నప్పుడు :** కాంట్రాక్టు అమలు పరచవలసి వున్నప్పుడు పొరపాటు జరిగినట్లుగా గుర్తించిన వ్యక్తి దానిని ఋజువు చేసి ఆ కాంట్రాక్టును (అమలు జరపడం నుండి బయటపడవచ్చును) రద్దు చేసుకొనవచ్చును.

2. **కాంట్రాక్టు అమలు జరిగిపోయినప్పుడు :** ఈ సందర్భంలో ఆ కాంట్రాక్టు చెల్లదని తేలిన వెంటనే దాని ద్వారా ప్రయోజనం పొందినట్లయిన సెక్షన్ 65 ప్రకారము ఆ ప్రయోజనాన్ని వాపసు చేయడమో లేక పరిహారము చెల్లించడమో చేయవలెను.

## 5.7 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. స్వేచ్ఛా సమ్మతి అనగానేమి ?
2. అసత్య వర్ణన అనగానేమి ?
3. బలప్రయోగం యొక్క ప్రభావం ?
4. పరదా స్త్రీ

**10 మార్కుల ప్రశ్నలు :**

1. బలప్రయోగమును నిర్వచించి సంబంధిత కేసులను వివరించుము.

2. బలప్రయోగమునకు, అనుచిత ప్రభావమునకు మధ్య గల వ్యత్యాసములను వివరింపుము.

3. అసత్య వర్ణనను నిర్వచించి, ముఖ్యాంశములను తెల్పుము.

4. కాంట్రాక్టు రద్దు నిరాకరణ సందర్భములను వివరింపుము.

5. న్యాయవిషయక పొరపాటును వివరింపుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. బలప్రయోగము, అనుచిత ప్రభావము, అసత్య వర్ణన మరియు మోసములను వివరించుము.

2. పొరపాటును వర్గీకరించి, ఆ పొరపాటును వివరించుము.

3. కాంట్రాక్టు స్వభావమును బట్టి జరుగు పొరపాటును వివరించి, మినహాయింపులు తెలియజేయుము.

4. మోసము ముఖ్యాంశములను, ప్రభావమును తెలిపి కాంట్రాక్టు రద్దును నిరాకరించు సందర్భములు తెలియజేయుము.

## 5.7 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Mercantile Law | - | Mc Kuchhal |
| 2. | Mercantile and Industrial Law | - | R.C. Chawala, K.C. Garg |
| 3. | వ్యాపార న్యాయశాస్త్రము | - | ఇ. వెంకటేశం (తెలుగు అకాడమి) |
| 4. | వ్యాపార న్యాయ శాస్త్రము | - | తెలుగు అకాడమి |
| 5. | వ్యాపార న్యాయశాస్త్రము | - | డా॥ రుద్రసాయిబాబా; డా॥ సంతోష్ కేతన్; డా॥ బసవరాజ్; శ్రీమతి ఎస్. మధుసూదన్; శ్రీ కె. కోటేశ్వరరావు. |


– శ్రీమతి వి. సుగుణకుమారి

పాఠం : 6

# న్యాయాత్మకమైన ఉద్దేశ్యము

## (Legality of Objective)

### 6.0 లక్ష్యం :

ఈ పాఠం పూర్తి అయ్యేసరికి మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

1. కాంట్రాక్టు అమలుకు అవసరమైన లక్షణాలలో ఒకటి అయిన న్యాయాత్మకమైన ఉద్దేశ్యము గురించి తెలియును.
2. అవినీతికరమైన ఉద్దేశ్యంతో ఏర్పాటైన కాంట్రాక్టులు చెల్లవని తెలియును.
3. ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశ్యాలను, వాటి ఫలితాలను గురించి స్పష్టంగా తెలియును.
4. వ్యాపార నిరోధక ఒప్పందాలు మరియు మినహాయింపులు గురించి తెలియును.
5. జూదపు ఒప్పందాలు మరియు మినహాయింపులు గురించి తెలియును.
6. చెల్లని కాంట్రాక్టులు మరియు పరిహారాల గురించి తెలియును.

### విషయ సూచిక :


6.1 విషయ పరిచయము

6.2 భార్యాభర్తలను విడదీయటానికి అగ్రిమెంట్లు

6.3 వైవాహిక దళారీ కాంట్రాక్టులు

6.4 ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశ్యాలు

- 6.4.1 ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశ్యాల శీర్షికలు
- 6.4.2 న్యాయపరిపాలనకు సంబంధించివి
  - 6.4.2.ఎ నేరాలకు సంబంధించిన వ్యవహారాలలో రాజీలు
  - 6.4.2.బి కోర్టు అధికార పరిధులను తొలగించే అగ్రిమెంట్లు
  - 6.4.2.సి ఇతరుల వ్యాజ్యాలకు మద్దతు ఇస్తామన్న అగ్రిమెంట్లు
  - 6.4.2.డి వ్యాజాస్తి బేరాలు
- 6.4.3 వ్యక్తిగత హక్కుల గురించి
- 6.4.4 జూదపు ఒప్పందాలు

6.5 మినహాయింపులు

6.6 చెల్లని కాంట్రాక్టులు

6.7 చెల్లని కాంట్రాక్టులు - పరిహారాలు

6.8 నమూనా ప్రశ్నలు

6.9 చదవదగిన గ్రంథాలు

## 6.1 విషయ పరిచయము :

భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 10 ప్రకారము "ప్రతి కాంట్రాక్టులో ప్రతిపాదన, స్వీకృతి, పార్టీల అర్హత, స్వేచ్ఛా సమ్మతి, న్యాయాత్మకమైన ప్రతిఫలము మరియు న్యాయాత్మకమైన ఉద్దేశ్యము ఉండవలెను''. కాంట్రాక్టులో న్యాయాత్మకమైన ఉద్దేశ్యము లేనప్పుడు దానిని అమలుపరచుటకు అవకాశము లేదు. కాంట్రాక్టు చట్టం సెక్షన్ 23లో కాంట్రాక్టు యొక్క ఉద్దేశ్యము లేదా ప్రతిఫలము న్యాయాత్మకం కానిదిగా ప్రకటించబడిన సందర్భములను చర్చించడం జరిగినది.

నిర్వచనము :

(ఎ) **సెక్షన్ 23(1) ప్రకారము న్యాయసూత్రాల చేత నిషేధించబడటం జరిగితే :** ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారము శిక్షార్హమైన ప్రతి చర్య న్యాయసూత్రాల చేత నిషేధించబడినది. సాధారణ మరియు ప్రత్యేక అంశములుగా పరిగణించి చట్ట సభల చేత నిషేధించినట్లుగా తీర్మానించిన అంశములు కూడా న్యాయసూత్రముల చేత నిషేధించబడినవి. ఈ విధముగా ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు.

**ఉదా :** నిత్యావసర వస్తువుల చట్టం నిర్ధేశించిన ధరల కన్నా అధిక ధరకు వస్తువులను విక్రయించేందుకు చేసుకునే ఒప్పందం.

(బి) **సెక్షన్ 23(2) ప్రకారము అగ్రిమెంటును అమలుపరిస్తే దాని పర్యవసానం న్యాయసూత్రాలను ఉల్లంఘించేది అయితే:** ఈ నిబంధన ప్రకారము ఒప్పందం యొక్క ఉద్దేశ్యము ప్రత్యక్షంగా న్యాయసూత్రాలచే ఉల్లంఘించబడక పోయినప్పటికీ ఒప్పందపు ఉద్దేశ్యము యొక్క అమలు న్యాయసూత్రాలను ఉల్లంఘించినట్లయిన ఆ విధంగా ఏర్పడిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**కేసు : అలెగ్జాండర్ Vs రేసన్ (1936) :** ఈ కేసులో A తన ఇల్లును B కు £ 1200కు వార్షిక అద్దెపై ఇచ్చినాడు. ఇంటిపన్నును ఎగవేసే ఉద్దేశ్యంతో ఈ ప్రతిఫలం £ 450 అద్దెగా మిగిలిన £ 750 సర్వీసు ఛార్జీగా అంగీకరిస్తూ ఒప్పందం ఏర్పాటు చేసుకున్నారు. ఇది చెల్లని ఒప్పందం అని న్యాయస్థానం తీర్పును ఇచ్చెను.

(సి) **సెక్షన్ 23(3) ప్రకారము మోసంతో కూడుకున్నది అయితే :** మోసపూరితమైన ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసుకున్న కాంట్రాక్టు న్యాయవిరుద్ధమైనది మరియు చెల్లని కాంట్రాక్టు.

**ఉదా :** A అను వ్యక్తి B అను వ్యక్తిని మోసం చేసే ఉద్దేశ్యంతో తానే C ని అని నమ్మించి ఒప్పందం చేసుకొనుట.

(డి) సెక్షన్ **23(4)** ప్రకారము ఒప్పందం మరొక వ్యక్తికి కానీ, ఆస్తికి కాని హాని కలిగించేది అయితే కాంట్రాక్టు యొక్క ఉద్దేశ్యం ఒక వ్యక్తికి గానీ లేదా అతని ఆస్తికి గానీ హాని కలిగించేది అయితే అటువంటి కాంట్రాక్టు అన్యాయమైనది (UnLawful) మరియు చెల్లని ఒప్పందం అవుతుంది.

**ఉదా :** B ని హతమార్చమని A, C తో చేసుకునే ఒప్పందం.

(ఇ) సెక్షన్ **23(5)** ప్రకారము న్యాయస్థానాల దృష్ట్యా అవినీతికరం అనిగానీ, ప్రభుత్వ విధానానికి వ్యతిరేకం అని గానీ భావింపబడేది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

ఉదా : (i) వ్యభిచార కార్యకలాపములు నిర్వహించుటకు చేసుకొను ఒప్పందములు అవినీతికరమైనవి మరియు న్యాయవిరుద్ధమైనవి కనుక అవి చెల్లని ఒప్పందాలు అవుతాయి.

కేసు : కాళి కుమార్ Vs మనోమోహిని అనే కేసులో ఒక వ్యభిచార స్త్రీకి వ్యభిచార గృహాన్ని నడిపే వ్యక్తి కొన్ని నగలను అరువుగా ఇచ్చెను. వాటిని ఇచ్చుటలో ముఖ్య ఉద్దేశ్యము ఆ స్త్రీ విటులను ఆకర్షించి వ్యభిచార వృత్తిని ప్రోత్సహించుట. వీరి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు అవినీతికరమైనది, న్యాయవిరుద్ధమైనది కనుక అది చెల్లని కాంట్రాక్టు అని, నగలను రాబట్టుకోవడానికి అవకాశం లేదని తీర్పు చెప్పినారు.

(ii) గతంలో కొనసాగిన అక్రమ సంబంధం తాలూకు ప్రతిఫలం రాబట్టుకొనుటకు చేసుకొను ఒప్పందం అవినీతికరమైనది కనుక అది చెల్లని ఒప్పందం అవుతుంది.

కేసు : నంబెరుమాళ్ Vs వీరపెరుమాళ్ అనే కేసులో మద్రాసు హైకోర్టు వారు ఇండియన్ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 2(డి) ప్రకారము పూర్వ ప్రతిఫలం కూడా క్రమమైన ప్రతిఫలమే అయినప్పటికీ వ్యభిచారం "పరదారాగమనం"(adultery) కాబట్టి అది ఇండియన్ పీనల్ కోడ్ చేత నిషేధించబడటం వలన ఆ కాంట్రాక్టులు చెల్లవని చెప్పినారు.

(iii) భవిష్యత్తులో అక్రమ సంబంధం ఏర్పరచుకునే ఉద్దేశ్యంతో చేసుకున్న ఒప్పందం న్యాయ విరుద్ధమైనది, అవినీతికరమైనది కనుక అది చెల్లని ఒప్పందం అవుతుంది.

## 6.2 భార్యభర్తలను విడదీయటానికి అగ్రిమెంట్లు :

వీటిని రెండు రకములుగా విభజించవచ్చును.

1. భార్యాభర్తలు అప్పుడే విడిపోవడానికి సంబంధించినవి.
2. భార్యభర్తలు భవిష్యత్తులో విడిపోవడానికి సంబంధించి చేసుకున్న అగ్రిమెంట్లు.

భార్యభర్తలు అప్పుడే విడిపోవడానికి సంబంధించి చేసుకున్న అగ్రిమెంట్లు సక్రమమైనవి కనుక అవి అమలుపరచవచ్చును.

భార్యభర్తలు భవిష్యత్తులో విడిపోవడానికి సంబంధించి చేసుకున్న అగ్రిమెంట్లు అవినీతికరమైనవి కనుక అవి చెల్లని అగ్రిమెంట్లు.

ఉదా : A, B లు భార్యభర్తలు. B తన నుండి విడాకులు తీసుకుంటే ఆమెకు డబ్బు ఇస్తానని 'A' చేసుకునే కాంట్రాక్టు చెల్లదు.

## 6.3 వైవాహిక దళారీ కాంట్రాక్టులు :

డబ్బు కోసం వివాహం చేసుకుంటాననే అగ్రిమెంట్లు, డబ్బు ఇస్తే వివాహం కుదురుస్తాననే అగ్రిమెంట్లు అవినీతికరమైన అగ్రిమెంట్లు. ఇటువంటి కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు.

కేసు : హెర్మన్ ఛార్లెస్ వర్త్ : ఈ కేసులో పత్రికా సంపాదకుడు అయిన పెళ్ళిళ్ళ పేరయ్య డబ్బు చెల్లిస్తే పెళ్ళి కుమారులకు - పెళ్ళి కుమార్తెలను, పెళ్ళి కుమార్తెలకు - పెళ్ళి కుమారులను చూస్తానని ప్రకటించాడు. ఈ ప్రకటనపై వాది స్పందించి తనకు తగిన వరుని చూడమని అందుకు ప్రతిఫలంగా £ 250 చెల్లిస్తానని ఒప్పందం చేసుకుంటూ £ 52ను బయానాగా చెల్లించింది. ఆ పత్రికా సంపాదకుడు ఒక యువకుని చూపించి మిగిలిన మొత్తం చెల్లించమని ఆమెను కోరినాడు. వాది (ఆమె)

తమ మధ్య ఏర్పడిన కాంట్రాక్టు యొక్క ఉద్దేశ్యము న్యాయవిరుద్ధమైనది, అవినీతికరమైనది కనుక దానికి అనుషంగికంగా ఏర్పాటైన కాంట్రాక్టు (పైకం చెల్లింపు) కూడా చెల్లదని తను ఇచ్చిన £ 52 వాపసు చేయవలసినదని దావా వేసింది.

**తీర్పు :** ఈ రకమైన కాంట్రాక్టులు అవినీతికరములైనవి మరియు కాంట్రాక్టు యొక్క ఉద్దేశ్యము నెరవేరలేదు కనుక వాది కాంట్రాక్టును రద్దు చేసుకోవచ్చునని తీర్పు చెప్పినారు.

**అవినీతికరమైన ఉద్దేశ్యంతో ఏర్పడిన కాంట్రాక్టులకు అనుబంధమైన కాంట్రాక్టులు కూడా చెల్లవు.**

ఇదే అంశాన్ని **పీయర్స్** Vs **బ్రూక్స్** అనే కేసులో వివరించాడు. ఈ కేసులో ఒక వేశ్య తన పడుపు వృత్తిలో విటుల వేటకై ఒక భగ్గీవానితో తనని ఊరు పురవీధులలో తిప్పితే బండికి కిరాయి ఇస్తానన్నది. అందుకు ఒప్పుకొని బండివాడు తన బండిలో ఆమెను తిప్పినాడు. తరువాత ఆమె ఒప్పుకున్న అద్దె ఇవ్వకపోతే అద్దె రాబట్టుకోవడానికై దావా తెచ్చినాడు. అద్దె ఇస్తానన్న కాంట్రాక్టు తన పడుపు వృత్తిలో కాంట్రాక్టుకు అనుషంగికం కనుక ఈ కాంట్రాక్టు కూడా చెల్లని కాంట్రాక్టు అవుతుందని తీర్పు చెప్పినారు.

**ఇటిలియా** Vs **కౌవస్జి** అనే మరో కేసులో ఒక వ్యక్తికి అంగడి నడపడానికి లైసెన్సు ఇస్తే అతను మరొకరితో భాగస్వామ్య కాంట్రాక్టు చేసుకొని వ్యాపారం చేసినాడు.

ఆబ్కారీ చట్టం క్రింద లైసెన్సు వ్యక్తిగతమైనదని దానిలోని హక్కులు బదిలీ చేయకూడదని ఆ బదిలీ శిక్షార్హం అని చెప్పడం జరిగినది. భాగస్వామ్య కాంట్రాక్టు మొదటి కాంట్రాక్టుకు అనుషంగికం కనుక అది కూడా చెల్లని కాంట్రాక్టు అని తీర్పు ఇవ్వడం జరిగింది.

## 6.4 ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశ్యాలు :

న్యాయస్థాన తీర్పులను అనుసరించి "ప్రజా శ్రేయస్సు లేదా క్షేమానికి ఏ ఉద్దేశ్యాలు భంగకరంగా వుంటాయో అట్లాంటి ఉద్దేశాలను ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశాలు'' అని అన్నారు. రకరకములైన ఉద్దేశములను కుదించి కొన్ని నిర్ధిష్టమైన శీర్షికల క్రింద తీర్పులను అనుసరించి వాటిని రూపొందించారు. సాధారణంగా లోగడ గుర్తింపు పొందేందుకు శీర్షికలలోనికి వస్తేనే ఈ ప్రమేయంలో వున్నట్లు గుర్తిస్తారు.

**కేసు :** ఘెరులాల్ Vs మహదేవ్ దాస్ అను కేసులో మన సుప్రీంకోర్టు వారు కూడా ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశాలను నిర్ధిష్టమైన శీర్షికల క్రింద అమర్చడం జరిగిందని వీటిని అధిగమించడానికి నిషేధం ఏదీ లేకపోయినా ఏవో బలమైనటువంటి, ఎంతో నిర్ధిష్టమైనటువంటి పరిస్థితులలోనే వాటిని అధిగమించవలెనని అన్నారు.

**6.4.1 ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశాల శీర్షికలు :** ఇప్పటి వరకూ న్యాయస్థానాలు గుర్తించిన ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశాలను మూడు శీర్షికల కింద విభజించారు. వీటి స్థూల వర్గీకరణను బట్టి పట్టిక - 1లో చూడవచ్చు.

1. పరిపాలనను కలుషితం చేసేవి.
2. న్యాయపరిపాలనకు సంబంధించినవి.
3. వ్యక్తిగత హక్కులకు సంబంధించినవి.




(i) **పరిపాలనను కలుషితం చేసేవి :** ఈ శీర్షిక క్రింద ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశములను ప్రభుత్వ ఉద్యోగాలు, హోదాలు బదిలీ మరియు లంచం కోసం అగ్రిమెంట్లు అని రెండు రకములుగా వర్గీకరించారు.

**ప్రభుత్వ ఉద్యోగాలు, హోదాల బదిలీ :** ప్రభుత్వ ఉద్యోగాలు, హోదాలు, బిరుదులు వ్యక్తిగత ప్రతిభ అర్హతలపై ఆధారపడి ఇవ్వడం జరుగుతుంది. వాటిని మరొకరికి బదలాయించడానికి చేసుకున్న కాంట్రాక్టు అమలు జరిగితే ప్రభుత్వ పరిపాలన సక్రమంగా జరుగదు. కనుక ఆ విధమైన కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు.

**కేసు : (i) స్వామినాథన్ Vs ముత్తుస్వామి :** ఈ కేసులో ఒక ప్రభుత్వ ఉద్యోగి ముందుగా పదవీ విరమణ చేసి తద్వారా మరో వ్యక్తికి ఉద్యోగ స్థానాన్ని కల్పించడానికి చేసిన ప్రామిస్ ప్రభుత్వ విధానానికి విరుద్ధమని, న్యాయవిరుద్ధమని తీర్పు యిచ్చారు.

(ii) **సత్తూలాల్ రాజునారాయణ్ :** ఈ కేసులో ఒక మున్సిపల్ ఎలక్షన్‌లో ఇద్దరు వ్యక్తులు A, B లు పోటీ చేయడం జరిగింది. అందులో A ఎన్నిక గెలవడం మీద సందేహం కలిగి మరొక వ్యక్తి B తో ఒక ఒప్పందం చేసుకున్నాడు. అది ఏమనగా B పోటీ నుండి విరమించుకుంటే నెలకు రూ॥ 250 చొప్పున మూడు సం॥లు చెల్లిస్తానని లిఖిత పూర్వక ప్రతిపాదన చేసినాడు. B ఆ ప్రతిపాదనకు తన స్వీకృతిని తెలిపి పోటీ నుండి విరమించినాడు.

వాగ్దాన అమలు సక్రమంగా జరుగకపోయినందున రెండవ వ్యక్తి B దావా వేయగా వారి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు ప్రభుత్వ విధానానికి విరుద్ధమైనది. కనుక కాంట్రాక్టు చెల్లదని తీర్పు యిచ్చినారు.

**6.4.1.ఎ లంచం కోసం అగ్రిమెంటు :** ప్రభుత్వ ఉద్యోగులు వారి అధికారాన్ని విధులను నిర్వర్తించుటకు "అక్రమ లాభం"(Bribe) ఆశించిన లేదా అధికార దుర్వినియోగం చేయడానికి చేసుకున్న అగ్రిమెంట్లు చెల్లని అగ్రిమెంట్లు అవుతాయి. అటువంటి చర్య ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 161 ప్రకారం నేరం అవుతుంది.

**6.4.2 న్యాయపరిపాలనకు సంబంధించినవి :** న్యాయపరిపాలనకు, సంబంధించిన ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఉద్దేశాలను నేరాలకు సంబంధించిన వ్యవహారములలో రాజీలు, కోర్టు అధికార పరిధులను పూర్తిగా తీసివేసే అగ్రిమెంట్లు, ఇతరుల వ్యాజ్యాలకు మద్దతు ఇస్తామన్న అగ్రిమెంట్లు మరియు వ్యాజ్యాప్తి బేరాలు అని నాలుగు రకములుగా వర్గీకరించటమైనది.

**6.4.2.ఎ. నేరాలకు సంబంధించిన వ్యవహారాలలో రాజీలు :** సివిల్ వ్యాజ్యాలలో రాజీ నిమిత్తం చేసుకునే అగ్రిమెంట్లు సక్రమమైన అగ్రిమెంట్లు. కనుక వీటిని అమలుపరచవచ్చును. క్రిమినల్ వ్యాజ్యాలలో రాజీ నిమిత్తం చేసుకునే అగ్రిమెంట్లు ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమైనవి. అయితే ఈ క్రిమినల్ వ్యాజ్యాలలో రెండు రకములు కలవు. అవి

1. కోర్టు అంగీకారం ద్వారా లేదా జామీను ఇవ్వదగిన వ్యాజ్యాలు. వీటిలో రాజీ నిమిత్తం చేసుకునే అగ్రిమెంట్లు సక్రమమైనవి.
2. మిగిలినవి రాజీ చేసుకో తగనివి. ఇవి చెల్లని కాంట్రాక్టులు అవుతాయి.

**నర్శింహరాజు Vs గురుమూర్తి రాజు** అను కేసులో ఇద్దరు పార్టీలు క్రిమినల్ చర్య ఉపసంహరించు కోవడానికి వారి మధ్య తగాదాను పెద్ద మనుషుల ద్వారా పరిష్కారం చేసుకోవడానికి రాజీ పడి అగ్రిమెంటు చేసుకున్నారు. అయితే ఈ రాజీ అగ్రిమెంటు ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 23 కింద ప్రభుత్వ విధానానికి విరుద్ధమైనదిగా పేర్కొంటూ చెల్లని అగ్రిమెంటు అని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చినది.

**6.4.2.1 కోర్టు అధికార పరిధులను తొలగించే అగ్రిమెంట్లు :** సివిల్ ప్రొసీజర్ కోడ్‌ను అనుసరించి ఏయే దావాలు ఏయే కోర్టుల అధికార పరిధిలోనికి వస్తాయో వాటిలోనే దావా వేయవలెను. కొన్ని సందర్భములలో ఒకే దావా రెండు గానీ అంతకంటే ఎక్కువ కోర్టుల పరిధిలోనికి రావచ్చును. అటువంటప్పుడు పార్టీలు ఒక కోర్టుని ఎంపిక చేసుకొని దానిలో దావా వేయటం ప్రభుత్వ విధానానికి వ్యతిరేకం కాదు. కాని ఏ కోర్టులోనూ దావా తేకూడదు అనే అగ్రిమెంటు మాత్రం ప్రభుత్వ విధానానికి వ్యతిరేకం అవుతుంది. కనుక అటువంటి కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది. అదే విధముగా సెక్షన్ 28 ప్రకారము "పార్టీలు దావాలు తేవలసిన కాల పరిమితిని తగ్గిస్తూ చేసుకున్న అగ్రిమెంటు కూడా చెల్లనిదే".

**మినహాయింపు :** ఏదైనా ఒక కాంట్రాక్టులో ఒక అంశం కింద ఉత్పన్నమైన తగాదాలను గానీ, ముందు ముందు రాబోయే తగాదాలను గానీ న్యాయస్థానాల అధికార పరిధిలో నుంచి తప్పించి వాటిని పెద్ద మనుషుల ద్వారానే తీర్చుకోవడానికి తీసుకున్న అగ్రిమెంట్లు క్రమమైన అగ్రిమెంట్లే.

**6.4.2.సి ఇతరుల వ్యాజ్యాలకు మద్దతు ఇస్తామన్న అగ్రిమెంట్లు :** ఒకరు మరొకరిపై (వ్యక్తి లేదా సంస్థపై) వ్యాజ్యం వేయడమా లేదా మానడమా అన్నది వ్యక్తిగతమైన విషయము. ఆ వ్యక్తిగత విషయాన్ని ఇతరులు ప్రోత్సహించడం గానీ, జోక్యం చేసుకోవడం గానీ ప్రభుత్వ విధానానికి విరుద్ధమైనది కనుక అది చెల్లని అగ్రిమెంటు అవుతుంది.

**6.4.2.డి వాజ్యాప్తి బేరాలు (Champarty) :** ఒక వ్యక్తి మరో వ్యక్తిపై వ్యాజ్యం తీసుకురావడం ద్వారా పొందే లాభంపై బేరాన్ని ఏర్పాటు చేసుకొని అగ్రిమెంటు చేసుకున్నట్లయితే అటువంటి అగ్రిమెంట్లు చెల్లనివి అవుతాయి.

**ఉదా :** A కి B పై వ్యాజ్యం వేసే హక్కు కలదు. C కి B పై ద్వేషం కలదు. అందుకు గానూ C, A ని B పై దావా వేయమని ప్రోత్సహిస్తూ అందుకు కావలసిన సహాయ సంపత్తులు తాను సమకూరుస్తాను అన్నాడు. అందుకు ప్రతిఫలంగా A దావాలో గెలిచిన

ఆస్తిలో కొంత భాగం C కి ఇవ్వడానికి ఒప్పందం జరిగినది. A మరియు C ల మధ్య ఏర్పడిన కాంట్రాక్టు "వ్యాజ్యాస్తి బేరం" అగ్రిమెంటు అంటారు. వ్యాజ్యాన్ని ప్రోత్సహిస్తోంది కనుక A, C ల మధ్య ఏర్పడిన అగ్రిమెంటు చెల్లని అగ్రిమెంటు.

**6.4.3** వ్యక్తిగత హక్కుల గురించి : ఈ శీర్షిక కింద ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమైన ఉద్దేశ్యాలను ఈ క్రింది విధంగా వర్గీకరించారు. (i) తల్లిదండ్రుల అధికార నిరోధక అగ్రిమెంట్లు, (ii) వ్యాపార నిరోధక అగ్రిమెంట్లు (iii) జూదపు ఒప్పందాలు (iv) వైవాహిక నిరోధక అగ్రిమెంట్లుగా వర్గీకరించారు.

**(A) తల్లిదండ్రుల అధికార నిరోధక అగ్రిమెంట్లు :** తల్లిదండ్రులు తమ పిల్లలను తమ వద్దే వుంచుకొని విద్యాబుద్ధులు చెప్పించే హక్కు పూర్తిగా వ్యక్తిగతమైనది. ఈ హక్కులను నిరోధించడం గానీ మరొకరికి బదలాయించడం గానీ చేయకూడదు. ఆ విధంగా చేసినట్లయిన అవి ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన ఒప్పందాలు కనుక అవి చెల్లని కాంట్రాక్టులు అవుతాయి.

**కేసు : అనిబిసెంట్ Vs జిడ్డు నారాయణయ్య :** ఈ కేసులో అనిబిసెంట్ మద్రాసులోని అడయార్‌లో గల థియోసాఫికల్ సొసైటీ ప్రెసిడెంట్. ఆ సొసైటీలోని సభ్యుడు జిడ్డు నారాయణయ్య. అతనికి జిడ్డు కృష్ణమూర్తి మరియు నిత్యానందం అను ఇద్దరు కుమారులు కలరు. ఆ పిల్లలను చూచి ముగ్ధురాలైన అనిబిసెంట్ తల్లిదండ్రుల హక్కులను వదులుకుంటే ఆ పిల్లలను తాను విదేశాలకు పంపి పై చదువులు చదివిస్తానని జిడ్డు నారాయణయ్యతో ప్రతిపాదన చేసినది. అందుకు నారాయణయ్య అంగీకరించి ఇరువురి పిల్లలను ఆవిడకు అప్పగించడమైనది. ఈ దేశంలో చదువులు ముగిశాక ఆమె వారిని ఇంగ్లాండ్‌కు పై చదువుల నిమిత్తం పంపించారు. కొన్ని సం॥లు గడిచాక నారాయణయ్య తన అభిప్రాయాన్ని మార్చుకొని తల్లిదండ్రుల హక్కుల ప్రత్యర్పణ నిమిత్తం దావా తెచ్చినాడు.

మద్రాసు హైకోర్టు తండ్రి వాదాన్ని అంగీకరించి ఆయనను గార్డియన్‌గా నియమించింది. అయితే కేసు ప్రీవీ కౌన్సిల్ దృష్టికి వెళ్ళగా కౌన్సిల్ ముందు జిడ్డు కృష్ణమూర్తి హాజరయి తాను మేజర్ కాబట్టి తనకు సంబంధించిన మేరకు కేసును వదిలి వేయవలసిందిగా చెప్పుకున్నాడు. ఆ మేరకు ప్రీవ కౌన్సిల్ అనుమతిని ఇచ్చినది.

**(B) వైవాహిక నిరోధక ఒప్పందాలు :**

1. సెక్షన్ 26 ప్రకారము ఒక వ్యక్తి వివాహమును నిరోధించే ఉద్దేశముతో చేసుకున్న అగ్రిమెంటు ప్రజావిధానమునకు విరుద్ధము. కనుక అటువంటి ఒప్పందాలు చెల్లని ఒప్పందాలు. కానీ మైనరు వివాహమును మైనారిటీలో నిరోధించుట న్యాయసమ్మతము.
2. వైవాహిక బ్రోకరేజి ఒప్పందాలు చెల్లని ఒప్పందాలు. ఒక వ్యక్తి వివాహమును కుదుర్చుటకు, ప్రతిఫలం చెల్లించుటకు చేసిన వాగ్దానము అమలు పరుచుటకు లేదు.
3. వైవాహిక జీవితమునకు అంతరాయం కలిగించు ఒప్పందాలు చెల్లని ఒప్పందాలు.

**(C) వ్యాపార నిరోధక ఒప్పందాలు :** సాధారణముగా ప్రతి వ్యక్తికి తనకు ఇష్టం వచ్చిన న్యాయసమ్మతమైన వృత్తిని లేదా వ్యాపారమును చేసుకోవడానికి స్వేచ్ఛ కలదు. అటువంటి స్వేచ్ఛను ఏ అగ్రిమెంటు నిరోధించరాదు. తొలి రోజులలో ఇంగ్లాండ్‌లో ఏ అగ్రిమెంటు అయినా ఏ వ్యక్తి యొక్క వ్యాపార నిరోధకంగా చేసినా అవన్నీ చెల్లనివి అని అన్నారు. కాలక్రమేణా అటువంటి నిరోధాలు కొన్ని సందర్భాలలో కాంట్రాక్టు పార్టీల శ్రేయస్సు, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా సముచితంగా వుంటే అవసరమని అటువంటి నిరోధాలను పొందుపరచే అగ్రిమెంట్లు సక్రమమైనవి అవుతాయని చెప్పారు.

వ్యాపార నిరోధక ఒప్పందాలను ఈ క్రింది విధంగా తెలుపవచ్చును.

(i) **యజమాని :** ఉద్యోగి మధ్య జరిగే ఉద్యోగ కాంట్రాక్టు.

ఒక యజమాని తన వ్యాపార సహాయానికి ఒక వ్యక్తిని ఉద్యోగిగా నియమిస్తూ అతను ఉద్యోగం వదిలిన తరువాత అదే తరహా వ్యాపారం ప్రారంభించకూడదని, అదే తరహా వ్యాపారం కొనసాగిస్తున్న తన పోటీదారు వద్ద ఉద్యోగంలో ప్రవేశించకూడదని నిరోధం చేసే అంశాలను కాంట్రాక్టులో చేర్చవచ్చును. ఈ విధమైన అగ్రిమెంటు సక్రమమైన అగ్రిమెంటు.

(ii) **కొనుగోలుదారు - అమ్మకందారు మధ్య కాంట్రాక్టు :** ఒక నడుస్తున్న వ్యాపారాన్ని గుడ్విల్‌తో సహా కొనుగోలు చేసేటప్పుడు అమ్మకపుదారు అదే తరహా వ్యాపారాన్ని నిర్ణీత కాలం వరకు నిర్ణీత ప్రదేశ పరిధిలో ప్రారంభించకూడదు అనే అగ్రిమెంటు చేసుకొనవచ్చును.

(iii) **వ్యాపార కూటమి మధ్య ఒప్పందం :** వస్తువుల ధరలు దిగజారిపోకుండా ఉండడానికి వస్తూత్పత్తి మరియు సరఫరాలను సక్రమంగా పంపిణీ చేసి వ్యాపారంలో సంభవించు ఒడిదుడుకులను నివారించుకునే ఉద్దేశంతో వ్యాపారస్తులు కూటమిగా ఏర్పడి అగ్రిమెంటు చేసుకొనవచ్చును.

**వ్యాపార నిరోధక ఒప్పందాలు - మినహాయింపులు :**

(a) **గుడ్విల్ అమ్మకము :** ఒక అగ్రిమెంటు వ్యాపార నిరోధకమైన అది "ఒక వ్యాపారం తాలూకు గుడ్విల్". అమ్మకం జరిగినప్పుడు ఆ వ్యాపారాన్ని పోటీగా నిర్ణీతమైన ప్రదేశంలో ఆ వ్యాపారం కొన్న వ్యక్తి గానీ, అతని స్థానీయులు గానీ దానిని చేయనని ఒప్పుకోవడం క్రమమైనది అవుతుంది. అటువంటి సందర్భంలో కోర్టువారు ఆ నిర్ణీతమైన నిరోధం అవసరమైన దాని కంటే హెచ్చుగా లేదని అభిప్రాయపడినారు.

**కేసు :**

**(1)** **నార్డెన్ ఫెల్ట్ Vs మేక్సిమ్ నార్డన్ ఫెల్టు వగైరా కంపెనీ (1893) :** ఈ కేసులో తుపాకులు మందుగుండు మొదలైన యుద్ధ సామాగ్రి తయారు చేసే ఒక స్వీడిష్ వ్యాపారస్తుడు. తన వ్యాపారాన్ని దాని ఖార్కానాన్ని దాని గుడ్విల్‌తో మేక్సిమ్ నార్డన్ ఫెల్టు అనే కంపెనీకి భారీ మొత్తంలో అమ్మినాడు. అమ్మకపు అగ్రిమెంట్‌లో తను ఆ తేదీ నుంచి 25 సం॥ల వరకు అటువంటి వ్యాపారాన్ని కొనుగోలుదారు కంపెనీ తరపున తప్ప చేయనని అదీకాక ఆ కంపెనీ చేసే ఏ వ్యాపారంతోనూ పోటీగా వ్యాపారం చేయనని అగ్రిమెంటు చేసినాడు.

మొదటి అంశం గురించి వ్యాపారం అమ్మిన అతను ఉల్లంఘించటానికి ఉద్యుక్తుడు కాగా నిషేధ ఆజ్ఞను కోరుతూ కంపెనీ అతనిపై దావా వేసినది. అతను ఆ దావాలో తను చేసిన అగ్రిమెంటుకు కాల పరిమితి వున్నా ఆవరణ పరిమితి లేదు కనుక అగ్రిమెంటు చెల్లదని వాదించాడు.

తీర్పు : హౌస్ ఆఫ్ లార్డ్స్ వారు అతని వాదన సరియైనది కాదని కాంట్రాక్టు క్రమత్వాన్ని నిర్ణయించే అంశాలు ఆ అగ్రిమెంటు సబబు లేదా బేసబబులపై ఆధారపడి వుంటుందని చెప్పినారు. అటువంటి అగ్రిమెంట్లు క్రమమైన ప్రతిఫలం కోసం, ప్రజాశ్రేయస్సుకు భంగం కలుగకుండా కొనుగోలుదారు ప్రయోజనాలకు అవసరమైనవని అమ్మిన వానిపై అనవసర భారము, ఆంక్షలు కలుగ చేయవని సబబుగా వున్నట్లయితే అవి క్రమమైన అగ్రిమెంట్లు అవుతాయని తీర్పు చెప్పినారు.

**(2)** **కోనార్స్ బ్రదర్స్ లిమిటెడ్ Vs బెర్నార్డ్ కోనార్స్ లిమిటెడ్ (1941) :** ఈ కేసులో ఆధునిక వాణిజ్యము, ప్రసార

మార్గాలు పురోభివృద్ధి చెందడం వల్ల అగ్రిమెంటులో ఉన్న ఆంక్షలు ఒక నిర్ణీతమైన ప్రదేశానికి పరిమితాలై వుండవలెననే పూర్వకాల సూత్రము అసందర్భమైదని తీర్పు చెప్పినారు. అగ్రిమెంటు పార్టీల మధ్య యుక్తమైనది అని ప్రజాశ్రేయస్సుకు భంగకరంగా ఈ నిరోధం లేదని ఋజువు చేసినట్లయితే అది చెల్లుతుంది అని అన్నారు.

(B) **ఉద్యోగ సంబంధమైన అగ్రిమెంట్లు :** ఉద్యోగపు అగ్రిమెంట్లలోని అంశములు ఉద్యోగస్తుని నిరోధించేవి కూడా సబబుగానూ, యుక్తంగానూ ఉండవలెను. అగ్రిమెంటులోని అంశాలు పోటీ లేకుండా చేసుకోవడానికి కాకుండా అతని వ్యాపార రహస్యాలను, వ్యాపార చిట్కాలు వగైరాలు వెల్లడి కాకుండా ఉండే నిమిత్తం నిరోధకాలు పెడితే అవి సక్రమమైన అగ్రిమెంట్లే. ఇదే విషయాన్ని **ఫిచ్ Vs. డ్యూయిస్ (**Fitch Vs Dewes**) 1921** అనే కేసులో చెప్పినారు.

**కేసు : కోర్సు మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ Vs. కొలాక్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ (**Cource Manufacturing Company Ltd., Vs Kolack Manufacturing Company Ltd**) (1958) :** ఈ కేసులో ఒకే తరహా వ్యాపారం చేసే రెండు కంపెనీలలో ఎవరైనా ఉద్యోగి ఉద్యోగం చేస్తూ ఒక కంపెనీ ఉద్యోగం నుండి మానివేసినపుడు అతనిని అయిదు సం॥ల లోపు రెండవ కంపెనీ వారు మొదటి కంపెనీ యొక్క అనుమతి లేకుండా ఉద్యోగంలోనికి తీసుకోకూడదని వారు (రెండు కంపెనీలు) ఒప్పందం చేసుకున్నారు. ఇటువంటి నిరోధం మరీ విస్తృతంగా వున్న కారణం చేత ఆ అగ్రిమెంటు చెల్లదని కోర్టువారు చెప్పినారు.

ఉద్యోగ సంబంధమైన అగ్రిమెంట్లలోని అంశములు యజమానిని ఉద్యోగి అకారణంగా ఉద్యోగం నుండి తొలగించినపుడు చెల్లవని **జెన్‌రల్ బిల్ పోస్టింగ్ కంపెనీ Vs. అట్కిన్‌సన్ కేసులో తీర్పు** చెప్పినారు.

(C) **ధరలు అదుపులో పెట్టడానికి చేసే నిరోధకాలు :** ధరలు అదుపులో పెట్టడానికి చేసుకునే అగ్రిమెంట్ల ద్వారా గుత్తాధిపత్యాన్ని సంపాదించి ప్రజాశ్రేయస్సుకు భంగం కలిగించే ఉద్దేశాలు ఉంటే అవి చెల్లని అగ్రిమెంట్లు అవుతాయి. కానీ ఆ విధమైన అగ్రిమెంట్లు అక్రమమైన పోటీలు నివారించడానికి మరియు ప్రజాశ్రేయస్సు కొరకు ఉద్దేశించినవి అయితే వాటిని అమలు చేయవచ్చును.

**అమలుపరచకలిగిన వ్యాపార నిరోధక ఒప్పందములు :**

**మినహాయింపులు :**

1. భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 27 ప్రకారము మినహాయింపు "ఒక అగ్రిమెంటు వ్యాపార నిరోధకమైన అది 'ఒక వ్యాపారం తాలూకు గుడ్విల్' అమ్మకం జరిగినప్పుడు ఆ వ్యాపారం పోటీగా నిర్మితమైన ప్రదేశంలో ఆ వ్యాపారం కొన్న ఆసామిగానీ అతని స్థానీయులు గానీ, దానిని నడుపుతూ వున్నంత కాలం చేయనని ఒప్పుకోవడం క్రమమైనది అవుతుంది. అటువంటి సందర్భములో కోర్టువారు ఆ నిర్ణీతమైన నిరోధం అవసరమైన దానికంటే హెచ్చుగా లేదని అభిప్రాయపడినపుడు అమలుపరుస్తారు".

2. భారత భాగస్వామ్య చట్టం సెక్షన్ 54 ప్రాకరము భాగస్వామ్య వ్యాపారం రద్దు అయిన తరువాత అందరు గానీ, కొందరు గానీ అదే వ్యాపారాన్ని పరిమిత ప్రదేశంలో చేపట్టకుండా వుండడానికి చేసుకునే ఒప్పందం సక్రమమైనదే అవుతుంది.

3. భాగస్వామ్య చట్టం సెక్షన్ 11(2) ప్రకారం భాగస్తులు అందరూ గానీ, కొందరు గానీ భాగస్వామ్య వ్యాపారం జరుగుతున్నన్నాళ్ళు మరొక వ్యాపారం చేయకుండా ఒప్పుకున్న అగ్రిమెంటు సక్రమమైన అగ్రిమెంటు అవుతుంది.

4. సెక్షన్ 36(2) ప్రకారం విరమించుకుంటున్న భాగస్తుడు వ్యాపారాన్ని కొనసాగిస్తున్న భాగస్తులతో తను భాగస్వామ్య వ్యాపారంతో పోటీ చేసే వ్యాపారాన్ని నిర్ణీత సహేతుక కాలంలోనూ, ప్రదేశంలోనూ చేయనని చేసుకున్న ఒప్పందం సక్రమమైన ఒప్పందం అవుతుంది.

5. కార్మిక సంఘాల తాలూకు సభ్యుల మధ్య చేసుకున్న ఒప్పందాలు వ్యాపార నిరోధక ఒప్పందాలు అయిన అవి కార్మిక సంఘాల చట్టం పరిధిలోనికి వచ్చినట్లయిన వాటిని సక్రమమైన ఒప్పందాలు అంటారు.

**6.4.4 జూదపు ఒప్పందాలు :** జూదం అంటే పందెం వేయడం. ఈ పందెం వేయడం ఏ విషయం గురించి అయినా కావచ్చు. కాంట్రాక్టు చట్టం సెక్షన్ 30 ప్రకారం జూదపు కాంట్రాక్టులు ఈ క్రింది లక్షణములను కలిగి వుండవలెను.

1. జూదపు కాంట్రాక్టులోని అంశం అనుచితమైనది అయి వుండవలెను.

2. కాంట్రాక్టులోని పార్టీలలో ఒకరు సంఘటన జరుగుతుందని వేరొకరు సంఘటన జరుగదు అనే వ్యతిరేక అభిప్రాయమును వ్యక్తం చేయవలెను.

3. జూదపు అగ్రిమెంటులో ఆ పని అయితే ఒకరికి లాభం వేరొకరికి నష్టం వచ్చేటట్లు వుండవలెను.

ఈ విధమైన లక్షణములతో ఏర్పడిన కాంట్రాక్టులను జూదపు కాంట్రాక్టులు అంటారు. ఈ జూదపు కాంట్రాక్టులు అన్ని చెల్లని కాంట్రాక్టులే.

**కేసు : కార్లిల్ Vs కార్బాలిక్స్ స్మోక్ బాల్ కంపెనీ** కేసులో న్యాయమూర్తి ఈ విధంగా తెలియజేసినాడు.

"ఏ ఇద్దరు వ్యక్తులైనా ఒక అనుచిత విషయ సంఘటన గురించి వ్యతిరేక అంచనాలు వుండి వారిద్దరూ పంతానికి వచ్చి ఆ సంఘటన జరగదన్న వ్యక్తి అది జరిగితే ఆ సంఘటన జరుగుతుందన్న వ్యక్తికి కొంత సొమ్ము గానీ మరి ఏ విలువైన వస్తువు కానీ ఇవ్వడానికి, ఆ సంఘటన జరుగని పక్షంలో రెండవ వ్యక్తి మొదటి వ్యక్తికి కొంత సొమ్ము గానీ మరి ఏ ఇతర వస్తువు గానీ ఇవ్వడానికి చేసుకున్న కాంట్రాక్టు జూదపు కాంట్రాక్టు అవుతుంది'', అయితే ఈ అనిశ్చిత సంఘటన జరగడం జరుగకపోవడాలలో వారికి ఈ పణం పెట్టిన డబ్బు రావడమో లేదా పోవడమో తప్ప మరి ఏ ఇతరమైన ప్రయోజనం కానీ, ప్రతిఫలం కానీ వుండకూడదు.

జూదపు కాంట్రాక్టులో అనిశ్చిత సంఘటన జరిగినా లేదా జరుగకపోయినా ఒకరికి లాభం మరొకరికి నష్టం రావాలి. కానీ ఒకరికే లాభం లేదా నష్టం సంభవించకూడదు. ఆ విధంగా సంభవించినట్లయిన అది జూదపు కాంట్రాక్టు కాదు.

**మినహాయింపు :** కాంట్రాక్టు చట్టం సెక్షన్ 30 ప్రకారము జూదపు కాంట్రాక్టుకు ఒక మినహాయింపు కలదు. రూ॥ 500 విలువ పై బడిన బహుమతి గుఱ్ఱపు పందాలలో గెలిచిన గుఱ్ఱం తాలూకు యజమానికి ఇస్తానన్న అగ్రిమెంటు సక్రమమైనది అవుతుంది. ఇదే విషయాన్ని ఎలిస్ మోర్ Vs వేలిస్ కేసులో ధృవపరిచారు.

**జూదపు కాంట్రాక్టు ప్రభావము :** సెక్షన్ 30 జూదపు కాంట్రాక్టులన్ని అన్యాయమైనవి మాత్రమే కాని, న్యాయవిరుద్ధాలు కావు. కనుక జూదపు కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు అయినప్పటికీ వీటికి అనుబంధంగా ఏర్పడిన కాంట్రాక్టులు అమలు జరుపదగిన కాంట్రాక్టులు.

జూదపు కాంట్రాక్టు ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 294A లో చెప్పిన లాటరీ అయినప్పుడు మాత్రం నేరం అవుతుంది. ఆ విధమైన కాంట్రాక్టు న్యాయ విరుద్ధమైనది కనుక అది చెల్లని కాంట్రాక్టు. దానికి అనుబంధంగా ఏర్పడిన కాంట్రాక్టు కూడా చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**ఇన్సూరెన్స్ కాంట్రాక్టులు :** వీటిలో జూదపు కాంట్రాక్టు లక్షణములైన అనుచితమైన సంఘటన, కాంట్రాక్టు పార్టీలలో ఒకరికి లాభం,

మరొకరికి నష్టం కలుగటం వున్నప్పటికినీ వీటిని జూదపు కాంట్రాక్టులుగా కాక నష్టపూరిత కాంట్రాక్టులుగా పరిగణించెదరు. కనుక వీటిని అమలు చేయవచ్చును. ఈ క్రింది లక్షణములు కలిగి వున్న భీమా కాంట్రాక్టులను "నష్టపూరిత కాంట్రాక్టులు"గా పరిగణించవచ్చును.

1. భీమా చేసే వారికి ఆ ఆస్తి లేక విషయంపై భీమా ఆసక్తి వుండవలెను.

2. అగ్ని భీమా మరియు సముద్ర భీమాలలో వాస్తవంగా ఏర్పడిన నష్టమును మాత్రమే భీమా కంపెనీ భర్తీ చేస్తుంది.

3. జీవిత భీమాలో జీవితం విలువ లెక్కించుట సాధ్యం కాదు. కనుక ధృవపరచిన మొత్తంను చెల్లించుట జరుగును.

జూదపు కాంట్రాక్టులలో ఈ లక్షణములు ఉండవు కనుక భీమా కాంట్రాక్టులను నష్టపూరిత కాంట్రాక్టులు అని అందురు.

**వాణిజ్య జూదాలు :** ఇద్దరు పార్టీల మధ్య రాబోయే తేదీ నాడు ఏదైనా ఒక వస్తువు గానీ, వాటాలు గానీ, సెక్యూరిటీలు గానీ ఒక ధరకు అమ్మడానికి, కొనడానికి చేసుకునే కాంట్రాక్టులకు సంబంధించిన వ్యవహారములను వాణిజ్య జూదములు అంటారు. ఈ కాంట్రాక్టుల యొక్క క్రమత్వం ఆ కాంట్రాక్టుల యొక్క ఉద్దేశ్యంపై ఆధారపడి వుంటుంది.

**సక్రమమైన కాంట్రాక్టు :** బొంబాయిలోని ఒక బట్టల మిల్లు వ్యాపారి తనకు కావలసిన ముడి పత్తి కొరకు గుజరాత్‌లోని ప్రత్తి పండించే రైతుతో ఒక ఒప్పందం చేసుకొనెను. మూడు నెలల తరువాత ప్రత్తి రైతు నుండి నిర్ణీత ధరకు ప్రత్తిని కొనుగోలు చేస్తానని ప్రతిపాదించగా రైతు అందుకు అంగీకారం తెలిపెను. నిర్ణీత కాలం తరువాత వారు ఇద్దరూ ఆ కాంట్రాక్టును అమలుపరచుకొనిరి. ఈ కాంట్రాక్టులో వారి ఉద్దేశం తమ భవిష్యత్ అవసరములను నెరవేర్చుకొనుటకు కనుక వారి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు సక్రమమైన కాంట్రాక్టు. ఇదే విషయాన్ని J.H. టాడ్ Vs లక్ష్మీదాస్ (1892) కేసులో ధృవీకరించారు.

**చెల్లని కాంట్రాక్టు :** ఇద్దరు పార్టీలు ఒక రాబోయే తేదీ నాడు ఏదైనా ఒక వస్తువు గానీ, వాటాలు గానీ, సెక్యూరిటీలు గానీ ఒక ధరకు అమ్మడానికి లేదా కొనడానికి కాంట్రాక్టు చేసుకొనెను. కాంట్రాక్టు తేదీ నాడు కాంట్రాక్టు ధరకు, మార్కెట్ ధరకు మధ్య గల వ్యత్యాసములు దృష్టియందుంచుకొని వ్యవహారములు నిర్వహించే ఉద్దేశము కలిగిన కాంట్రాక్టు చెల్లని కాంట్రాక్టు అవుతుంది. వీటినే బొంబాయి మార్కెట్‌లో "తేజ్ మండీ" వ్యవహారములు అని అందురు.

**కాంట్రాక్టు మీద న్యాయవిరుద్ధం తాలూకు ప్రభావం :** ఇండియన్ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 23 ప్రకారం న్యాయసమ్మతం కాని ఉద్దేశాలు గల కాంట్రాక్టులను రెండు రకములుగా వర్గీకరించవచ్చును.

అవి : 1. న్యాయసమ్మతం కానివి.

2. న్యాయ విరుద్ధమైనవి

1. న్యాయసమ్మతం కాని ఉద్దేశం గల కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు అయినప్పటికీ దానికి అనుషంగిక కాంట్రాక్టులు అమలు జరుపదగిన కాంట్రాక్టులు అవుతాయి.

2. న్యాయవిరుద్ధమైన ఉద్దేశ్యంతో ఏర్పాటైన కాంట్రాక్టులు చెల్లవు. వాటికి అనుషంగికంగా ఏర్పడిన కాంట్రాక్టులు కూడా చెల్లని కాంట్రాక్టులే అవుతాయి.

## 6.5 మినహాయింపులు :

1. వాది న్యాయవిరుద్ధ ఉద్దేశ్యం చెప్పనక్కర లేకుండానే తనకు వేరే వ్యాజ్య కారణం వున్నప్పుడు

2. కాంట్రాక్టులో పార్టీలు వారి వారి బాధ్యతలు నెరవేర్చక ముందు ఒక పార్టీ పశ్చాత్తాపడి ఆ కాంట్రాక్టును రద్దు చేసుకుంటూ తను ఇచ్చిన సొమ్మును కానీ, వస్తువును కానీ వాపసు కోరుతూ దావా వేసినప్పుడు. ఉదా : హెర్మన్ Vs ఛార్లెస్ వర్త్ కేసులో కాంట్రాక్టు అవినీతికరమైనది మరియు కాంట్రాక్టు ఉద్దేశం నెరవేరలేదు కనుక వాది కాంట్రాక్టును రద్దు చేసుకోవచ్చునని తీర్పు చెప్పినాడు.

3. కాంట్రాక్టు పార్టీలలో ఇద్దరు పార్టీలు "సమంగా నేరంలో భాగస్తులు కానప్పుడు" ఈ సూత్రం వర్తించదు. అట్కిన్సన్ Vs డెన్బీ(1861) ఈ కేసులో వాది దివాలా పరిస్థితులలో ఉండి తన ఋణదాతలతో రాజీ మాటలు ఆడుతూ వుంటే అందరూ రాజీ షరతులకు ఒప్పుకోగా ఒక ఋణదాత మాత్రం తనకు రాజీ షరతుల కంటే ఎక్కువ ఇస్తానని ఒప్పుకోకపోతే రాజీకి సమ్మతించనన్నాడు. అట్లా ఒక ఋణదాతకు ఎక్కువ ఇవ్వడం దివాలా సూత్రాలు ఒప్పుకోవు. అయినా ఆ కాంట్రాక్టుకు ఈ సూత్రం వర్తించదని అంటూ ఆ ఎక్కువ ఇచ్చిన డబ్బు వాపసు చేయమని దివాలాదారు చేసిన దావాకు న్యాయస్థానం ఆదేశించవచ్చు.

4. సెక్షన్ 57 ప్రకారము పరస్పర ప్రామిస్‌లలో ఒక జత న్యాయసమ్మతమైనవి. మరో జత న్యాయసమ్మతం కానివి చేయవలెనని ఒప్పుకుంటే మొదటి జత ప్రామిస్‌లు సక్రమమైనవి, రెండవ జత ప్రామిస్‌లు చెల్లనివి అని చెబుతుంది.

ఇదే అభిప్రాయాన్ని సెక్షన్ 58లో కూడా ధృవపరచినారు.

ఉదా : A, B కి తన ఇల్లు సాధారణ నివాసానికి అద్దెకు ఇస్తే 10,000ల రూ॥లు చెల్లించాలని, B అదే గృహాన్ని జూదగృహంగా వాడితే 50,000 రూ॥ల అద్దె చెల్లించాలని ఒప్పందం చేసుకుంటే దీనిలో మొదటి భాగము సక్రమమైమైనది, రెండవ భాగము న్యాయవిరుద్ధమైనది. కనుక మొదటి భాగము సక్రమమైన కాంట్రాక్టు అవుతుంది. రెండవది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

## 6.6 చెల్లని కాంట్రాక్టులు :

భారత కాంట్రాక్టు చట్టంలోని వివిధ సెక్షన్లు చెల్లని కాంట్రాక్టులను స్పష్టీకరించాయి.

(i) సెక్షన్ 2(d) ప్రకారము ప్రతిఫలం లేని కాంట్రాక్టులు సాధారణంగా చెల్లనివి అవుతాయి.

(ii) సెక్షన్ 2(e) మైనరు చేసిన కాంట్రాక్టులు చెల్లవు.

(iii) సెక్షన్ 22 ఇద్దరు పార్టీలు ప్రబలమైన వృత్తవిషయక పొరపాటు వల్ల కాంట్రాక్టుకు సమ్మతి ఇచ్చినపుడు ఆ కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది.

(iv) సెక్షన్ 23 కాంట్రాక్టు తాలూకు ఉద్దేశం కానీ ప్రతిఫలం కానీ న్యాయసమ్మతం కాకపోతే అది చెల్లనిది అవుతుంది.

(v) సెక్షన్ 26 వివాహ నిరోధక కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది.

(vi) సెక్షన్ 27 వ్యాపార నిరోధక కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది.

(vii) సెక్షన్ 28 కోర్టు అధికార పరిధిని త్రోసిపుచ్చుతూ దావాలు తేకూడదని నిరోధించే కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది.

(viii) సెక్షన్ 29 కాంట్రాక్టుకు అర్థం లేకపోతే అది చెల్లదు.

(ix) సెక్షన్ 30 జూదపు కాంట్రాక్టులు చెల్లవు.

(x) సెక్షన్ 36 ఆగంతుక కాంట్రాక్టులో ఆగంతుక సంఘటన అసంభవం అయితే అది చెల్లనిది అవుతుంది.

(xi) సెక్షన్ 56 కాంట్రాక్టు బాధ్యతా నిర్వహణ అసంభవం అయితే అది చెల్లనిది అవుతుంది.

(xii) సెక్షన్ 56 కాంట్రాక్టు బాధ్యతా నిర్వహణ కాంట్రాక్టు చేసినపుడు సంభవమైనా తరువాత అసంభవం కానీ, న్యాయ విరుద్ధం కానీ అయితే ఆ కాంట్రాక్టు ఆ విధంగా మారిన క్షణం నుండి చెల్లనిది అవుతుంది.

## 6.7 చెల్లని కాంట్రాక్టులు - పరిహారాలు :

1. ఏదైనా ఒక కాంట్రాక్టు చెల్లనిది అయినప్పుడు కాంట్రాక్టులోని పార్టీలు వారి వారి బాధ్యతలను నిర్వర్తించనక్కరలేదు.
2. చెల్లని కాంట్రాక్టు అమలు జరుగకపోయి వుంటే పార్టీలు కాంట్రాక్టును రద్దు చేయవచ్చును.
3. చెల్లని కాంట్రాక్టు కింద ఒక పార్టీ ఇంకొక పార్టీకి ఏదైనా ఒక వస్తువును కానీ, డబ్బును కానీ ఇస్తే అది రెండవ పార్టీ వాపసు చేయవలసి వుంటుంది. అట్లా వాపసు చేయడానికి వీలు లేకపోతే నష్టపరిహారం అయినా ఇవ్వవలెను. ఈ విషయాన్ని సెక్షన్ 65 ధృవీకరించినది.

## 6.8 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. వైవాహిక దళారీ కాంట్రాక్టులు
2. వ్యాజ్యాస్తి బేరాలు
3. తేజ్‌మండి వ్యవహారాలు
4. అవినీతి అగ్రిమెంట్లు

**10 మార్కుల ప్రశ్నలు :**

1. వర్తక నిరోధకానికి సంబంధించిన అగ్రిమెంటు చెల్లదు. దీనికి గల మినహాయిపులను వివరించండి.
2. ప్రాథమికంగా ఇన్సూరెన్స్ కాంట్రాక్టులు జూదపు కాంట్రాక్టులే వ్యాఖ్యానించండి.
3. అవినీతికరమైన కాంట్రాక్టులను వివరింపుము.
4. వ్యక్తిగత హక్కులను గూర్చి చట్టములో పేర్కొన్న వివిధ శీర్షికల గురించి చర్చించండి.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. ప్రభుత్వ విధానానికి విరుద్ధమైన అగ్రిమెంట్లను చర్చించండి.
2. జూదపు అగ్రిమెంట్లు అంటే ఏమిటీ ? ఆ అగ్రిమెంట్ల న్యాయాత్మక ఫలితములను తెలియజేయండి.
3. కాంట్రాక్టు మీద న్యాయవిరుద్ధం తాలూకు ప్రభావమును మరియు మినహాయింపులను తెలియజేయుము.

## 6.9 చదువదగిన గ్రంథాలు :


1. Mercantile Law - Mc Kuchhal
2. Mercantile and Industrial Law - R.C. Chawla, K.C. Garg
3. వ్యాపార న్యాయశాస్త్రము - ఇ. వెంకటేశం (తెలుగు అకాడమి)
4. వ్యాపార న్యాయశాస్త్రము - (తెలుగు అకాడమి)
5. వ్యాపార న్యాయశాస్త్రాలు - డా॥ రుద్రసాయి బాబా; డా॥ సంతోష్ కేతన్; శ్రీ ఎం. బసవరాజ్; శ్రీమతి ఎస్. మదుసూదన్; శ్రీ కె. కోటేశ్వరరావు.


**- శ్రీమతి పి. సుగుణకుమారి**

పాఠం : 7

# ఆగంతుక కాంట్రాక్టులు

## (Contingent Contracts)

## 7.0 లక్ష్యం :

ఈ పాఠం పూర్తి అయ్యేసరికి మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) ఆగంతుక కాంట్రాక్టులు అనగానేమో తెలియును.

బి) ఆగంతుక కాంట్రాక్టులు యొక్క ముఖ్యాంశములు బోధపడును.

సి) భిన్న సందర్భములలో ఆగంతుక కాంట్రాక్టు అమలు ఏ విధంగా జరుపబడునో తెలియును.

డి) ఆగంతుక కాంట్రాక్టులకు మరియు ఇతర కాంట్రాక్టులకు మధ్య వ్యత్యాసాలు బోధపడును.

## విషయ సూచిక :


7.1 విషయ పరిచయం

7.2 ఆగంతుక కాంట్రాక్టు - ముఖ్యాంశములు

7.3 ఆగంతుక కాంట్రాక్టుకు సంబంధించిన సూత్రాలు

7.3.1 అనుషంగిక సంఘటన అయితేనే అనే కాంట్రాక్టు

7.3.2 సంఘటన జరగకపోవడం అనే కాంట్రాక్టు

7.3.3 వ్యక్తి తాలుకా భవిష్యత్ ప్రవర్తన అనుసంగికం అయినప్పుడు అనే కాంట్రాక్టు

7.3.4 అనుషంగిక సంఘటన నిర్ణీత సమయంలో జరిగితేనే అనే కాంట్రాక్టు

7.3.5 అనుషంగిక సంఘటన నిర్ణీత కాలములో జరగకపోవడం అనే కాంట్రాక్టు

7.3.6 అనుషంగిక సంఘటన అసంభవం అయితే అనే కాంట్రాక్టు

7.4 జూదపు కాంట్రాక్టులు - ఆగంతుక కాంట్రాక్టుల మధ్య పోలికలు

7.5 జూదపు కాంట్రాక్టులు - ఆగంతుక కాంట్రాక్టుల మధ్య వ్యత్యాసములు

7.6 నమూనా ప్రశ్నలు

7.7 చదువవదగిన గ్రంథాలు


## 7.1 విషయ పరిచయం :

ఆగంతుక కాంట్రాక్టును "షరతులతో కూడిన కాంట్రాక్టు" అని కూడా అంటారు. భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్లు 31 నుండి 36 వరకు వీటిని గురించి ప్రస్తావించింది.

**నిర్వచనము :** భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 31 ప్రకారము "కాంట్రాక్టుకు 'అనుషంగికమైన సంఘటన' జరగడం కాని జరగక పోవడం కాని సంభవిస్తేనే కాంట్రాక్టు బాధ్యత క్రింద ఒక పనిచేయడం గాని మానడం గాని జరిగే సందర్భాలలో చేసిన కాంట్రాక్టును ఆగంతుక కాంట్రాక్టు'' అంటారు.

ఉదా : B యొక్క కారు అగ్ని ప్రమాదంలో ధ్వంసమైతే రూ॥ 25,000/- చెల్లింపు చేస్తానని A వాగ్దానం చేసినాడు. ఈ ఉదాహరణలో B యొక్క కారు అగ్నిప్రమాదంలో ధ్వంసం కావడం అనేది అనుషంగికమైన సంఘటన. అది సంభవిస్తేనే B మరియు A ల మధ్య కాంట్రాక్టు బాధ్యత ఏర్పడుతుంది. కనుక ఇది ఒక ఆగంతుక కాంట్రాక్టు.

## 7.2 ఆగంతుక కాంట్రాక్టు - ముఖ్యాంశములు :

1. ఆగంతుక కాంట్రాక్టులో సంఘటన కాంట్రాక్టుకు అనుషంగికంగా వుండవలెను.
2. ఆ సంఘటన కాంట్రాక్టులోని పరస్పర వాగ్దానంలోని అంశంగా ఉండరాదు.
3. ఆగంతుక కాంట్రాక్టులో సంఘటన అనిశ్చితి ఉండవలెను.
4. భవిష్యత్‌లో సంఘటన జరుగుట లేదా జరుగకపోవుటపై కాంట్రాక్టును పూర్తి చేయుట ఆధారపడి వుండవలెను.
5. ఆగంతుక కాంట్రాక్టులో సంఘటన ఒక పార్టీ తాలూకు ఇష్టా ఇష్టాల మీద మాత్రమే ఆధారపడి వుండకూడదు. అట్లా ఆధారపడి ఉన్నట్లు అయితే "ఆగంతుక కాంట్రాక్టు చెల్లనిది'' అవుతుంది.

అదే విధంగా ఇండెమినిటి కాంట్రాక్టులు, గ్యారంటీ కాంట్రాక్టులు. భీమా కాంట్రాక్టులు మరియు జూదపు కాంట్రాక్టులు అన్ని ఆగంతుక కాంట్రాక్టులే. అయితే సెక్షన్ 30 ప్రకారం జూదపు కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు అవుతాయి. మరియు పరస్పరం షరతుల ద్వారా చేసుకొన్న కాంట్రాక్టులు ఆగంతుక కాంట్రాక్టులు కావు.

ఉదా : A అనే వ్యక్తి C అనే వ్యక్తికి 10 బస్తాల ధాన్యాన్ని సరఫరా చేస్తే C రూ. 8,000లు ఇస్తానని చేసుకున్న అగ్రిమెంటు "షరతులతో కూడిన అగ్రిమెంటు అవుతుంది''. ఇందులో A ధాన్యం ఇవ్వడం జరిగితే C రూ. 8,000/- ఇవ్వడం జరుగుతుంది. సంఘటన నిశ్చితం మరియు అనుషంగికం కాదు కనుక యిది ఆగంతుక కాంట్రాక్టు కాదు.

## 7.3 ఆగంతుక కాంట్రాక్టు అమలుకు సంబంధించిన సూత్రాలు :

**7.3.1 "అనుషంగిక సంఘటన అయితేనే కాంట్రాక్టు" :** సెక్షన్ 32 ప్రకారం (భవిష్యత్‌లోని ఒక అవాంఛనీయమైన సంఘటన జరిగినప్పుడే ఆగంతుక కాంట్రాక్టు కింద ఒక పని చేయడం గాని చేయకపోడం గాని ఉద్దేశించినపుడు ఆ సంఘటన జరిగేవరకూ ఆ కాంట్రాక్టును న్యాయశాస్త్రము ప్రకారం అమలు చేసే వీలు లేదు. ఆ సంఘటన జరగడం అసంభవం అయినప్పుడు ఆ కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది''.

**ఉదా :** A C తో H ని వివాహం చేసుకుంటే రూ. 10,000/- ఇస్తానని వాగ్ధానం చేశాడు. H, G ని వివాహం చేసుకున్నది. కనుక A తాలూకు కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది.

**7.3.2 సంఘటన జరగకపోవడం అనే కాంట్రాక్టు :** సెక్షన్ 33 ప్రకారము "భవిష్యత్‌లో ఒక సంఘటన జరిగినప్పుడే ఆగంతుక కాంట్రాక్టు క్రింది ఒక పని చేయడం గాని చేయకుండా ఉండడం గాని జరుగుతుంది. కాని అంతకుముందుగా అమలు జరిపేందుకు వీలులేదు.

**ఉదా :** X, Y తో తన ఓడ బొంబాయి రేవుకు చేరకపోతే 1,00,000/- ఇస్తానన్నాడు. ఆ ఓడ సముద్రంలోని అలజడికి గల్లంతు కాగానే Y, X పై కాంట్రాక్టు అమలు చేయవచ్చును.

**7.3.3 వ్యక్తి తాలూకు భవిష్యత్ ప్రవర్తన అనుషంగికం అయినప్పుడు అనే కాంట్రాక్టు :** సెక్షన్ 34 ప్రకారం అనిర్ణీతమైన భవిష్యత్ కాలంలో ఒక వ్యక్తి ఒక నిర్దిష్టమైన పనిని చేయడానికి ఆగంతుక కాంట్రాక్టు ఏర్పాటు చేసుకున్నప్పుడు ఆ వ్యక్తి మరొక పనిని చేయడం వలన ఈ నిర్దిష్టమైన పనిని ఒక నిర్ణీత కాలంలో చేయడం అసంభవం అయితే లేదా మరికొన్ని ఆగంతుక సంఘటనలు జరగడం వలన నిర్దిష్టమైన ఆ పని అసంభవమనే భావించాలి.

**ఉదా :** X Y తో Y Z ను వివాహం చేసుకుంటే కొంత డబ్బు ఇస్తానన్నాడు. కాని Z A ను వివాహం చేసుకున్నది. అటువంటప్పుడు Y Z ను వివాహం చేసుకోవడం అసంభవం అని భావించాలి. కాని Z విడాకులు తీసుకోవచ్చు. A మరణించవచ్చు అప్పుడు Y Z ను పెండ్లాడవచ్చునని అనడానికి వీలులేదు.

**7.3.4 అనుషంఘిక సంఘటన నిర్ణీత కాలములో జరిగితేనే అనే కాంట్రాక్టు :** సెక్షన్ 35(1) ప్రకారము "ఒక నిర్ణీత కాలములో నిర్దిష్టమైన అనుచితమైన సంఘటన జరిగినట్లు అయితే ఏదైనా ఒక పని చేయడానికి లేదా చేయకుండా ఉండడానికి ఉన్న ఆగంతుక కాంట్రాక్టులు ఆ కాలము ముగిసేలోపు ఆ సంఘటన జరుగకపోయినా ఆ నిర్ణీత కాలానికి ముందుగా ఆ సంఘటన అసంభవం అయినా చెల్లనివి అవుతాయి.

**ఉదా :** ఒక సంవత్సరం లోగా ఒక ఓడ తిరిగి వస్తే E కి కొంత సొమ్ము చెల్లిస్తానని F వాగ్దానం చేశాడు. ఆ ఓడ సంవత్సరం లోగా తిరిగి వస్తే ఆ కాంట్రాక్టు అమలు జరుపవలెను. ఆ సంవత్సరంలోగానే ఆ ఓడ అగ్ని ప్రమాదంలో ధ్వంసం అయితే కాంట్రాక్టు అమలు జరుపుటకు వీలులేదు. అదే విధముగా ఓడ తిరిగిరావడం సంవత్సర కాలం దాటిపోతే అమలు చేయుటకు వీలులేదు.

**7.3.5 అనుషంగిక సంఘటన నిర్ణీత కాలంలో జరగకపోతే :** సెక్షన్ 35(2) ప్రకారం "ఒక అనుచితమైన సంఘటన ఒక నిర్ణీతమైన కాలంలో జరగకుండా వుంటే ఒక పనిచేయడానికి లేదా మాని వేయడానికి కాంట్రాక్టు చేసుకొని వుంటే అటువంటి కాంట్రాక్టు ఆ సంఘటన జరగకుండా నిర్ణీత కాలం దాటిపోయినా లేక ఆ నిర్ణీత కాలంలోనే ఆ సంఘటన అసంభవము అని తేలినా అది చెల్లు కాంట్రాక్టు అవుతుంది.

**ఉదా :** ఒక ఓడ సంవత్సర కాలంలో తిరిగి రాకపోతే కొంత సొమ్ము చెల్లిస్తానని E, F కి వాగ్దానం చేశాడు. ఆ ఓడ సంవత్సర కాలంలో తిరిగి రాకపోయినా లేదా అది ప్రమాదంలో పోయినా ఆ కాంట్రాక్టును అమలు చేయవచ్చునన్నారు.

**7.3.6 అనుషంగిక సంఘటన అసంభవము అయితే అనే కాంట్రాక్టు :** సెక్షన్ 36 ప్రకారం "ఏదైనా అసంభవం అయితే అనుషంగిక సంఘటన మీద ఆధారపడి ఆగంతుక ఒప్పందం చేసుకుంటే ఆ సంఘటన అసంభవం అని పార్టీలకు ఆ అగ్రిమెంట్ చేసుకున్నప్పుడు తెలిసినా తెలియకపోయినా అవి చెల్లని అగ్రిమెంట్లు అవుతాయి.

**ఉదా :** P, Q తో రెండు సమాంతర రేఖలను కలిపితే రూ. 1,000/- ఇస్తానంటే అది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

**జూదపు కాంట్రాక్టులు :** భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 30 ప్రకారం కాంట్రాక్టులోని అంశము అనిశ్చతమైనది అయివున్నప్పుడు కాంట్రాక్టులోని పార్టీలలో ఒకరు సంఘటన జరుగుతుందని వేరొకరు సంఘటన జరుగదు అనే వ్యతిరేక అభిప్రాయం వ్యక్తం చేసినప్పుడు ఆ పని జరిగితే పార్టీలలో ఒకరికి లాభం, మరియొకరికి నష్టం సంభవించే అంశములు కల్గిన కాంట్రాక్టులను జూదపు కాంట్రాక్టులు అని అంటారు.

## 7.4 జూదపు కాంట్రాక్టు - ఆగంతుక కాంట్రాక్టుల మధ్య పోలికలు :

1. ఈ రెండు కాంట్రాక్టులు భవిష్యత్‌లో ఒక సంఘటన జరుగుట లేదా జరుగకపోవుటపై ఆధారపడి వుండును.
2. భవిష్యత్ సంఘటన అనిశ్చితమై వుండవలెను.
3. సంఘటన కాంట్రాక్టుకు అనుషంగికంగా వుండవలెను.

## 7.5 జూదపు కాంట్రాక్టులు - ఆగంతుక కాంట్రాక్టుల మధ్య వ్యత్యాసములు :

| జూదపు కాంట్రాక్టులు | ఆగంతుక కాంట్రాక్టులు |
|---|---|
| 1. ఈ కాంట్రాక్టులలో పరస్పర వాగ్దానాలు కలవు. | 1. వీటిలో పరస్పర వాగ్దానములు లేవు. |
| 2. ఇవి చెల్లని కాంట్రాక్టులు | 2. కొన్ని సందర్భములలో మినహా ఇవి క్రమమైన కాంట్రాక్టులు. |
| 3. వీటికి ఆగంతుక కాంట్రాక్టుల స్వభావం కలదు. | 3. వీటికి జూదపు కాంట్రాక్టుల స్వభావం లేదు. |
| 4. వీటిలో కాంట్రాక్టు విషయంపై ఆసక్తి వుండదు. | 4. ఇరు పార్టీలకు కాంట్రాక్టు విషయంపై ఆసక్తి వుండును. |
| 5. భవిష్యత్‌లో సంఘటన ప్రధాన అంశము. | 5. భవిష్యత్‌లో సంఘటన అనుచంత అంశము. |

## 7.6 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. ఆగంతుక కాంట్రాక్టులు
2. జూదపు కాంట్రాక్టులు

**10 మార్కుల ప్రశ్నలు**

1. ఆగంతుక కాంట్రాక్టులను నిర్వచించి ముఖ్యాంశములను తెల్పుము.
2. ఆగంతుక కాంట్రాక్టులకు మరియు జూదపు కాంట్రాక్టులకు మధ్య వ్యత్యాసాలను వివరింపుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. ఆగంతుక కాంట్రాక్టును నిర్వచించి భారత కాంట్రాక్టు చట్టంలోని ఆగంతుక కాంట్రాక్టు అమలుకు సంబంధించిన సూత్రములను సోదాహరణముగా వివరింపుము ?

## 7.7 చదవదగిన గ్రంథాలు :


1. Mercantile Law - Mc Kuchhal
2. Mercantile and Industrial Law - R.C. Chawla, K.C. Garng
3. వ్యాపార న్యాయశాస్త్రము - ఇ. వెంకటేశం (తెలుగు అకాడమి)
4. వ్యాపార న్యాయశాస్త్రము - (తెలుగు అకాడమి)
5. వ్యాపార న్యాయశాస్త్రాలు - డా॥ రుద్రసాయి బాబా, డా॥ సంతోష్ కేతన్
డా॥ ఎం బసవరాజ్, శ్రీమతి ఎస్. మదుసూదన్,
శ్రీ కె. కోటేశ్వరరావు.


*శ్రీమతి పి. సుగుణకుమారి*

పాఠం : 8

# కాంట్రాక్టు బాధ్యతా విమోచనము

## (Discharge of Contract)

## 8.0 లక్ష్యం :

ఈ పాఠం పూర్తి అయ్యేసరికి మీరు ఈ క్రింది విషయములు తెలుసుకుంటారు.

1) కాంట్రాక్టు బాధ్యతా విమోచనము ఏ విధంగా జరుగునో తెలియును.

2) పార్టీల ప్రవర్తన వలన కాంట్రాక్టు బాధ్యత విమోచనము ఏ విధంగా సంభవించునో తెలుసుకొనవచ్చునన్నారు.

3) న్యాయ ప్రవృత్తి వలన కాంట్రాక్టు బాధ్యతా విమోచనం ఏ విధంగా సంభవించునో తెలియును.

4) భిన్న సందర్భములలో భిన్న కేసులలో న్యాయస్థానముల నిర్ణయములను ఆధారము చేసుకొని కల్గు కాంట్రాక్టు బాధ్యతా విమోచనం గూర్చి తెలియును.

5) జాయింట్ ప్రామిసర్‌లు, జాయింట్ ప్రామిసీలు, సమిష్టి హక్కులు, సమిష్టి బాధ్యతలు గూర్చి తెలియును.

## విషయ సూచిక :


8.1 పరిచయం

8.2 కాంట్రాక్టులోని పార్టీల ప్రవర్తన వలన బాధ్యతా విమోచనము

8.2.1 కాంట్రాక్టు బాధ్యతను షరతుల ప్రకారము నెరవేర్చుట

8.2.2 నెరవేర్చడానికి సంసిద్ధత

8.2.3 నిర్ణీత కాలానికి ముందే చేయనని చెప్పుట

8.2.4 పరస్పరము ప్రామిస్‌లు

8.2.5 హక్కులు విడుదల చేస్తే రాజీ

8.2.6 పాత కాంట్రాక్టు స్థానే కొత్త కాంట్రాక్టు

8.2.7 ఉపసంహరించుకోవడానికి హక్కు వున్న ఉపసంహరణ

8.3 న్యాయప్రవృత్తి కలిగిన బాధ్యతా విమోచనం

8.3.1ఎ పార్టీల మరణం

8.3.1బి సమిష్టి హక్కు బాధ్యత సంక్రమణము

8.3.2 కాంట్రాక్టు ఉద్దేశం తరువాత కాలంలో న్యాయసమ్మతి కాకపోవడం

8.3.3 కాంట్రాక్టు బాధ్యత నెరవేర్చడం అసంభవం కావడం

8.4 నమూనా ప్రశ్నలు

8.5 చదువదగిన గ్రంథాలు

## 8.1 పరిచయము :

భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 10లో నిర్వచించినట్లుగా ఇద్దరు పార్టీల మధ్య ఏర్పడిన కాంట్రాక్టు ద్వారా వారి మధ్య న్యాయాత్మకమైన బంధం ఏర్పడుతుంది. ఆ విధముగా ఏర్పడిన బంధాన్ని న్యాయాత్మకంగా విడిపించడాన్ని "విమోచన" (Discharge) అని అంటారు. ఈ కాంట్రాక్టు బాధ్యతా విమోచనా విధానమును భారత కాంట్రాక్టు చట్టం, 1872 సెక్షన్ 31 నుంచి 67 వరకు స్పష్టముగా విశదీకరించినది. వీటిని స్థూలంగా రెండు రకములుగా వర్గీకరించవచ్చును. అవి : 1. పార్టీల ప్రవర్తనవలన బాధ్యతా విమోచనము 2. న్యాయప్రవృత్తి వలన కలిగిన బాధ్యతా విమోచనము.

## 8.2.I. పార్టీల ప్రవర్తన వలన బాధ్యతా విమోచనము :

1) కాంట్రాక్టు బాధ్యతను కాంట్రాక్టు షరతుల ప్రకారం నెరవేర్చడం.

   i) అగంతుక కాంట్రాక్టులు (సెక్షన్ 31 - 36(బి)).

   ii) చేయవలసిన కాలము, స్థలము, విధము (సెక్షన్ 46 నుండి 50 మరియు సెక్షన్ 55(సి))

   iii) చెల్లింపుల వినియోగం (సెక్షన్ 59 నుండి 61)

2) నెరవేర్చడానికి సంసిద్ధత (సెక్షన్ 38)

3) నిర్ణీత కాలానికి ముందే చేయను అని చెప్పడము (సెక్షన్ 39)

4) పరస్పర ప్రామిస్‌లు (సెక్షన్ 51 నుంచి 54)

5) హక్కులు విడుదల చేస్తూ రాజీ (సెక్షన్ 63)

6) పాత కాంట్రాక్టు స్థానే కొత్త కాంట్రాక్టు (సెక్షన్ 62)

7) ఉపసంహరించుకోవడానికి హక్కు వున్న ఉపసంహరణ (సెక్షన్ 64 నుండి 66)

## II న్యాయ ప్రవృత్తి కల్గిన బాధ్యతా విమోచనము :

1. ఎ) పార్టీల మరణం (సెక్షన్ 37(2))

   బి) సమిష్టి హక్కు బాధ్యతల సంక్రమణం (సెక్షన్ 40 నుండి 45)

2. కాంట్రాక్టు ఉద్దేశ్యము తరువాత కాలములో న్యాయసమ్మతం కాకపోవడం. (సెక్షన్ 57)

3. కాంట్రాక్టు బాధ్యత నెరవేర్చడం అసంభవం కావడం (సెక్షన్ 56)

**8.2.1 కాంట్రాక్టు బాధ్యతలను కాంట్రాక్టు షరతుల ప్రకారము నెరవేర్చడం :** సెక్షన్ 37(1) ప్రకారము కాంట్రాక్టులోని పార్టీలు వారి వారి బాధ్యతలను నిర్వర్తిస్తే వారు ఆ కాంట్రాక్టు నుంచి విముక్తులు అవుతారు. ఈ విధమైన కాంట్రాక్టు విమోచనను 'సాధారణ విమోచన' అని అంటారు.

(i) **ఆగంతుక కాంట్రాక్టులు :** కాంట్రాక్టు బాధ్యతలు ఎప్పుడు నెరవేర్చవలెను అనేది కాంట్రాక్టులో అంశముగా ఉన్నప్పుడు దానిని ఆగంతుక కాంట్రాక్టు అని అంటారు. ఈ కాంట్రాక్టులను సెక్షన్ 31-36 వరకు స్పష్టముగా విశదీకరించాయి.

(ii) **కాంట్రాక్టు బాధ్యతను పూర్తి చేయవలసిన కాలము, స్థలము, విధము :** సెక్షన్ 46 ప్రకారం కాంట్రాక్టులో ప్రామిసీ అడగకుండానే ప్రామిసర్ తన బాధ్యతను నెరవేర్చవలసి వున్నప్పుడు కాంట్రాక్టులో కాల నియమం లేనప్పుడు ఆ ప్రామిసర్ "యుక్తమైన కాలములో" కాంట్రాక్టు బాధ్యతను నెరవేర్చవలెను. అయితే యిక్కడ "యుక్తమైన కాలమును" సందర్భానుసారముగా నిర్ణయించవలెను.

సెక్షన్ 47 ప్రకారము కాంట్రాక్టులో ప్రామిసి అడగకుండానే ప్రామిసర్ తన బాధ్యతను నిర్ణీతమైన రోజుని చేయవలెనని నిర్దేశించి వున్నట్లు, అయితే ప్రామిసర్ ఆ రోజున ఆ బాధ్యతను ఎక్కడ నిర్వర్తించవలెనో అక్కడ, "సాధారణముగా వ్యాపారం జరిగే సమయంలో" నిర్వర్తించవలెను.

సెక్షన్ 48 ప్రకారం కాంట్రాక్టు పూర్తి చేయవలసిన విధము ప్రామిసీ అడిగినప్పుడు చేయవలసి వుండి దానిని నెరవేర్చడానికి ఒక రోజు నిర్ణయించుకొన్నప్పుడు, "ఆ నిర్ణయించిన రోజున సాధారణముగా వ్యాపారము జరిగే కాలములో యుక్తమైన స్థలములో నెరవేర్చమని" ప్రామిసీ అడగవలెను. అయితే ఈ సెక్షన్ ప్రకారము యుక్తమైన స్థలము, సమయము అనునవి సందర్భానుసారముగా నిర్ణయించవలెను.

సెక్షన్ 49 ప్రకారము కాంట్రాక్టులో ప్రామిసి కోరకుండానే ప్రామిసర్ తన బాధ్యతను తానే నెరవేర్చవలసి వుండి, ఎక్కడ నెరవేర్చవలెనో కాంట్రాక్టులో లేనప్పుడు ప్రామిసిని అడిగి అతని ఆదేశము ప్రకారము నెరవేర్చవలెను.

సెక్షన్ 50 ప్రకారము ప్రామిసి నిర్ణయించిన ప్రకారము ప్రామిసర్ తన బాధ్యతను నెరవేర్చవలసి వుంటుంది. ఆ విధముగా నిర్ణయించిన ప్రదేశము, సమయము యుక్తమైనదని చెప్పవలెను.

స్థూలముగా కాంట్రాక్టులోని పార్టీలు కాంట్రాక్టులో బాధ్యతను పూర్తి చేయవలసిన సమయము. ప్రదేశము మరియు విధానముల గురించి వారు రూపొందించుకున్నట్లుగా వాటిని పూర్తి చేసి కాంట్రాక్టు నుండి విమోచన పొందవలెను. ఒక వేళ కాంట్రాక్టు బాధ్యతను నిర్వర్తించవలసిన సమయం, ప్రదేశము మరియు విధానముల గురించి స్పష్టత లోపించినపుడు యుక్తమైన సమయము ప్రదేశము మరియు విధానముల ప్రకారము కాంట్రాక్టును పూర్తి చేసే విమోచన పొందవలెను. **ఈ యుక్తమైన సమయము, ప్రదేశము మరియు విధానములను నిర్ణయించేటప్పుడు "సందర్భానుసారముగా"** నిర్ణయించవలెను.

సెక్షన్ 55 ప్రకారము కాంట్రాక్టులో బాధ్యత నిర్వర్తించడానికి ఒక సమయము నిర్ణయిస్తే ఆ సమయము దాటిపోతే కాంట్రాక్టు మీద ఆ కాలహరణానికి ఎటువంటి ప్రభావం ఉంటుందనేది పార్టీల యొక్క ఉద్దేశము మీద ఆధారపడి వుంటుంది. వస్తు విక్రయ కాంట్రాక్టుల విషయంలో కాంట్రాక్టు బాధ్యతా నిర్వహణకు కాలము నిర్ణయిస్తే సాధారణముగా "ఆ కాలము కాంట్రాక్టు యొక్క సారము" (Time is the essence of contract)గానే భావిస్తారు. కాని స్థిరాస్తికి సంబంధించిన కాంట్రాక్టులలో వుంటే అది ప్రభావము కాదని భావిస్తారు.

**కేసు : జమ్ సెష్ Vs భరోజ్** అను కేసులో పార్టీలు 'ఒక అమ్మకపు అగ్రిమెంటు' వ్రాసుకొన్నారు. అందులో క్రయ వ్యవహారము 2 మాసాలలో పూర్తి చేసుకోవాలని అట్లా చేయనినాడు ఆ ఆస్తి హక్కుదారు తన యిష్టము వచ్చిన మరియొకనికి అమ్ముకోవచ్చునని వ్రాసుకొన్నారు. కొనుగోలుదారు నియమిత కాలము పూర్తి అయిన కొద్ది మాసాలకు ఆ ఆస్తిని అమ్మకపు అగ్రిమెంటు ప్రకారము అమ్మమని దావా వేసినాడు.

**తీర్పు :** ప్రీవీ కేన్సులు వారు స్థిరాస్తి క్రయ విక్రయ వ్యవహారాలలో నిర్ణయించిన సమయం సాధారణముగా **కాంట్రాక్టు సారము** కాదని చెప్పినారు.

మన భారత కాంట్రాక్టు చట్టము కూడా ఇదే సూత్రాన్ని బలపరిచినది. కానీ సమయము కాంట్రాక్టు సారము అయినప్పుడు దానిని నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే ఆ కాంట్రాక్టు పాలనావశ్యకత ప్రామిసీ యిష్టముపై ఆధారపడి ఆ కాంట్రాక్టు మొత్తము బాధ్యతగాని లేదా శేషించిన బాధ్యత గానీ, చెల్లకూడని కాంట్రాక్టు బాధ్యతగా మారుతుంది.

అదే విధముగా కాంట్రాక్టు బాధ్యత నిర్వర్తించకపోవడం వలన ప్రామిసికి ఏర్పడిన నష్టమునకు నష్టపరిహారమును కోరవచ్చును. ఒక వేళ నిర్ణీత కాలములో కాంట్రాక్టును పూర్తి చేయకుండా నిర్ణీత కాలము పూర్తి అయిన కొంత కాలమునకు కాంట్రాక్టును నిర్వర్తించుటకు ప్రయత్నించినప్పుడు ప్రామిసీ తన అంగీకారమును తెలియజేసినట్లు అయితే తరువాత నష్టపరిహారమును కోరుటకు అవకాశం లేదు.

(iii) **చెల్లింపుల వినియోగము :** ఒక వ్యక్తి మరొక వ్యక్తి వద్ద అప్పు తీసుకొని దానిని తిరిగి సక్రమముగా చెల్లింపు చేయడం వలన కాంట్రాక్టు బాధ్యతా విమోచనం జరుగుతుంది. అయితే ఒక వ్యక్తి మరొక వ్యక్తి వద్ద భిన్న సందర్భములలో (సమయములలో) భిన్న మొత్తములలో అతని బాధ్యతా విమోచనమును గూర్చి సెక్షన్ 59 నుంచి 61 వరకు స్పష్టీకరించాయి.

1. సెక్షన్ 59 ప్రకారము అప్పు తీసుకున్న వ్యక్తి (ఋణగ్రస్తుడు) ఒకే ఋణదాత (అప్పు ఇచ్చిన వ్యక్తి) వద్ద ఒకటికి మించి ఎక్కువ మొత్తాలు అనేక సందర్భములలో ఋణముగా తీసుకొని వాటిని తిరిగి చెల్లించేటప్పుడు స్పష్టముగా లేదా భావగర్భితము ఫలానా అప్పు తాలుకా జమా అని తెలియచేసినప్పుడు ఋణదాత ఆ అప్పుకే జమ చేసుకోవలెను.

**ఉదా :** ఎ, బి అనే వ్యక్తి నుండి రూ. 500, 1000, 487లను అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపు ఈ క్రింది విధముగా చేసెను. అతను రూ. 1000ను తిరిగి చెల్లిస్తూ రెండవ బాకీని రద్దు చేయమని ఋణదాత అయిన బి కి స్పష్టముగా తెలియజేసినప్పుడు ఋణదాత ఆ రెండవ ఋణమునకే అసలు జమ చేయవలెను.

ఋణగ్రస్తుడు రూ. 487లను యిచ్చి ఏమీ చెప్పకుండా వుంటే ఋణదాత అతను యిచ్చిన రూ. 487 ఋణమునకు ఈ మొత్తమును జమ చేసుకొనవలెను. అనగా ఋణగ్రస్తుడు భావగర్భితముగా ఈ బాకీని తీర్చినట్టు భావించవలెను.

సెక్షన్ 60 ప్రకారము ఋణగ్రస్తుడు స్పష్టముగా గాని, భావగర్భితముగా గాని చెప్పకుండా కొంత మొత్తమును ఋణదాతకు చెల్లిస్తే అతడు దానిని తనకు యిష్టము వచ్చిన బాకీ కింద జమ చేసుకోవలెను. మరొక ముఖ్య అంశము **"ఋణగ్రస్తుడు ఏమీ చెప్పకపోతే ఋణదాత కాలదోషము పట్టిన బాకీనైనా ఆ మొత్తమును జమ చేసుకోవచ్చును".**

సెక్షన్ 61 ప్రకారము ఋణదాత మరియు ఋణగ్రస్తుల మధ్య వ్యవహారము జరిగినప్పుడు (అప్పు ఇవ్వడం - చెల్లింపు చేయడం) ఋణగ్రస్తుడు చేసిన చెల్లింపు ఏ అప్పు తాలుకో చెప్పనప్పుడు ఆ విధంగా వసూలు అయిన మొత్తము ఋణదాత ఏ అప్పు కింద జమచేసినది చెప్పనప్పుడు **"మొదట చేసిన చెల్లింపు మొదటిసారి తీసుకొన్న ఋణమునకు జమ కట్టవలెను".** అదే విధముగా "రెండవసారి చేసిన చెల్లింపు రెండవసారి తీసుకొన్న ఋణమునకు జమ చేయవలెను". ఈ సందర్భములో కూడా "కాలదోషమును గురించి" ఆలోచన చేయనవసరం లేదు.

**ముఖ్యాంశము :** ఒకే వ్యక్తి వద్ద ఒకటికి మించిన అప్పులను ఒకే రోజు తీసుకున్నప్పుడు ఋణగ్రస్తుడు చేసిన చెల్లింపును "దామాషా" (Praportionately) ప్రకారం వినియోగపర్చవలెను.

ఉదా : A అను వ్యక్తి B వద్ద 1-4-2004న ఉదయం 10 గంటలకు 9000/-ను అదే రోజుని సాయంత్రం 4 గంటలకు 1000/-ను ఋణముగా తీసుకున్నాడు. రెండు నెలలు తరువాత అతను బాకీ చెల్లింపు నిమిత్తము రూ. 1000 జమ చేసినాడు.

A జమ చేసిన రూ. 1000లను B అతని యొక్క ఋణముల దామాషా ప్రకారము (9000 : 1000) 9 : 1 నిష్పత్తిలో అతను జమ చేసిన రూ. 1,000లను సర్దుబాటు చేయవలెను. అనగా మొదట బాకీ రూ. 9,000లకు 900/-లను జమ చేయలెను. అదే విధంగా రెండవ బాకీ 1000/-లకు 100/-లను జమ చేయవలెను.

**8.2.2 నెరవేర్చడానికి సంసిద్ధత సెక్షన్ 38 :** సెక్షన్ 38 ప్రకారము కాంట్రాక్టు బాధ్యత నెరవేర్చడానికి ఒక పార్టీ సంసిద్ధుడైనప్పుడు రెండవ పార్టీ దానిని స్వీకరించకపోతే, మొదటి పార్టీ ఆ కాంట్రాక్టు బాధ్యత నుండి విముక్తుడవుతాడు. కాంట్రాక్టు బాధ్యత నెరవేర్చడానికి "సంసిద్ధత చూపడాన్ని" Tender అని కూడా అంటారు.

**సెక్షన్ 38 ప్రకారము కాంట్రాక్టు బాధ్యత విమోచన ముఖ్యాంశములు :** సెక్షన్ 38(1) ప్రకారము సంసిద్ధత బేషరతుగానూ, సమగ్రంగానూ వుండవలెను.

సెక్షన్ 38(2) ప్రకారము ఉచితమైన స్థలంలోను ప్రామిసీకి ప్రామిసర్ తన కాంట్రాక్టు బాధ్యతనంతా సమగ్రంగా అప్పుడే అక్కడే చేయడానికి సంసిద్ధుడైనాడన్న భావము కలిగేటటువంటి పరిస్థితులలో చేయవలెను.

సెక్షన్ 38(3) ప్రకారము నెరవేర్చవలసిన బాధ్యత క్రింద ఏదైనా వస్తువులు అప్పగించవలసి వుంటే ప్రామిసీ ఆ వస్తువులు కాంట్రాక్టు వస్తువులు అవునో కాదో చూచుకొనే అవకాశము ఇవ్వవలెను. అదే విధముగా కాంట్రాక్టు బాధ్యత విమోచన సంసిద్ధత జాయింట్ ప్రామిసీలల్లో ఏ ఒక్కరికి చేసినా అది క్రమ సంసిద్ధత అవుతుంది. సంసిద్ధత కాంట్రాక్టు మొత్తం బాధ్యత నెరవేర్చడానికై ఉండవలెను. అట్లుగాక బేషరతుగా లేదా కొంత పైకం చెల్లించడానికి సిద్ధపడినట్లు అయినా అది క్రమమైన టెండరు కాదు. కాని ప్రామిసీ అంగీకారముతో చెల్లించడానికి సిద్ధపడితే అది క్రమమైన టెండరుగా తీసుకోవలెను.

చెక్కు ద్వారా పైకం చెల్లించడానికి తెలియజేసిన సంసిద్ధత క్రమమైన టెండరు కాదు. కానీ ప్రామిసీ చెక్కును ఒప్పుకొని తీసుకుంటే కాంట్రాక్టు బాధ్యతా విమోచనం జరుగుతుంది.

**8.2.3 నిర్ణీత కాంట్రాక్టు భంగము లేదా నిర్ణీత కాలానికి ముందే చేయనని చెప్పడం :** సెక్షన్ 39 ప్రకారము ఏదైనా కాంట్రాక్టులో ప్రామిసర్ తన బాధ్యతను నిర్ణయించిన రోజుకు ముందే నిర్వర్తించునని చెప్పిన, నిర్వర్తించడానికి అతనికి వీలులేని పరిస్థితులను సృష్టించుకొన్న ప్రామిసీ వెంటనే ఆ కాంట్రాక్టు భంగపడినట్లే భావించవచ్చును లేదా ప్రామిసీ మాటల రూపంలోగాని చేతల రూపంలోగాని కాంట్రాక్టు వున్నట్లే తాను భావిస్తున్నట్లు తెల్పవచ్చును.

**వివరణ :** ఈ నిర్వచనమును అధ్యయనం చేయగా రెండు విషయములు గమనించవచ్చును. 1. కాంట్రాక్టు భాగాన్ని రెండవ పార్టీ అంగీకరించినప్పుడు. 2. కాంట్రాక్టు భాగాన్ని రెండవ పార్టీ అంగీకరించకపోయినప్పుడు.

కాంట్రాక్టు పార్టీలో ఒకరు కాంట్రాక్టు నిర్వహించడానికి నిర్ణీత తేదీకి ముందే ఆ కాంట్రాక్టును నిర్వర్తించనని ఎదుట పార్టీకి తెలియజేసినప్పుడు వారు అంగీకరించినట్లు అయినా కాంట్రాక్టు బాధ్యత నుండి విమోచన పొందవచ్చును. కానీ కాంట్రాక్టు బాధ్యతా విమోచనము నిర్ణీత కాలానికి ముందే జరిగినప్పుడు ఈ క్రింది సందర్భములు ఉత్పన్నమవుతాయి.

1. **కాంట్రాక్టు భాగాన్ని రెండవ పార్టీ అంగీకరించినపుడు :** కాంట్రాక్టులోని ఇరువురి పార్టీలలో ఒక పార్టీ కాంట్రాక్టును అమలుపర్చలేని సందర్భములలోను లేదా కాంట్రాక్టును రద్దుపర్చవలెనని భావించి కాంట్రాక్టు అమలుకు ముందే ఈ విషయమును రెండవ పార్టీకి తెలియజేసినప్పుడు రెండవ పార్టీ అనుమతిస్తే ఆ రోజు ఆ క్షణము నుండి ఇరువురి పార్టీలు కాంట్రాక్టులోని బాధ్యత నుండి విమోచన పొందుతారు. అయితే ఈ సందర్భంలో ఏర్పడిన నష్టమును భర్తీ చేసుకోవడానికి రెండవ పార్టీకి అధికారము కలదు.

**నష్టపరిహారము :** పై సందర్భములలో రెండవ పార్టీకి ఏర్పడిన నష్టమును ఈ క్రింది విధముగా భర్తీ చేసుకోవలెను. కాంట్రాక్టు రద్దు అయిన రోజున వున్న మార్కెట్ ధరకు కాంట్రాక్టు వస్తువులను కొనుక్కొని కాంట్రాక్టు ధరకు ఆ రోజున వున్న మార్కెట్ ధరకు మధ్య గల వ్యత్యాసమును నష్టపరిహారముగా కోరవచ్చును. అయితే రెండవ పార్టీ తనకు కలిగే నష్టము ఎక్కువ కాకుండా చూడవలసిన బాధ్యత కలదు.

2. **కాంట్రాక్టు భాగాన్ని రెండవ పార్టీ అంగీకరించకపోతే (తిరస్కరిస్తే) :** కాంట్రాక్టులోని ఇరు పార్టీలలో ప్రామిసర్ కాంట్రాక్టు అమలుకు ముందే దానిని రద్దు చేయవలనని భావించినప్పుడు ప్రామిసి అంగీకరించకపోతే ఆ కాంట్రాక్టు నిలచి వున్నట్లు భావించవచ్చును. గడువు తేదీని ప్రామిసర్ తన బాధ్యతను నెరవేర్చడానికి సిద్ధపడినప్పుడు ప్రామిసి దానిని స్వీకరించవలెను. కాంట్రాక్టులోని బాధ్యతను మొదట ప్రామిసర్ నెరవేర్చమని తెలియజేసినప్పుడు ప్రామిసి తన అంగీకారాన్ని తెలియజేయకుండా వుంటే ఆ కాంట్రాక్టు నిలిచి వుంటుంది. ఆ సందర్భములో ప్రామిసర్ గడువు తేదీన తన బాధ్యతను నెరవేర్చడానికి సిద్ధపడినప్పుడు ప్రామిసీ దానిని రద్దు చేయమని కోరలేడు. అందు నిమిత్తము ఏర్పడిన నష్టపరిహారమును చెల్లింపు చేయమని కూడా కోరలేదు.

**కేసు : ఏవరీ Vs బౌడెన్ (Avery Vs Bowden) (1856) :** ఈ కేసులో ప్రతివాది తాలూకు ఓడను ఒక రష్యన్ హార్బర్‌లో 45 రోజులు లోగా సరుకులు రవాణా చేయడానికి అప్పగించే కాంట్రాక్టు చేసినాడు. ఆ సమయం కాకముందే చాలాసార్లు ప్రతివాదితో తన సరుకును ఓడ పైకి చేర్చలేనని ఓడను తీసుకోమని చెప్పినాడు. ఎన్నిమార్లు చెప్పినా వినకుండా ఆ రేవులోనే వాది ఓడను పెట్టుకొని ప్రతివాదిని సరుకులును వేయమని అడుగుతున్నాడు. ఇట్లా గడిచిన తరువాత 35 రోజులు గడిచిన తరువాత ఇంగ్లాండు, రష్యాల మధ్య యుద్ధము వచ్చినది. దాని వలన ఆ కాంట్రాక్టు బాధ్యత నెరవేర్చడం అసంభవమైనది. అట్లా అసంభవమైన తరువాత వాది కాంట్రాక్టు భంగానికి నష్టపరిహారం కోరుతూ ఈ దావా తెచ్చినాడు.

**తీర్పు :** ప్రతివాది కాంట్రాక్టు అమలుకు ముందే కాంట్రాక్టు భంగం చేస్తానని చెప్పినా దానిని వాది స్వీకరించకపోవడం వలన కాంట్రాక్టు ఇద్దరి పార్టీల మధ్య వున్నట్లుగానే భావించడమైనది. చెలామణిలో వున్న కాంట్రాక్టు యుద్ధము రావడం చేత దాని క్రింది బాధ్యతలు నెరవేర్చడం అసంభవం కనుక కాంట్రాక్టు బాధ్యతల నుంచి పార్టీలు విమోచనాలు పొందినారని, విమోచనమైన కాంట్రాక్టుకు కాంట్రాక్టు భంగం లేదు కనుక దావాను కొట్టివేస్తూ నష్టపరిహారము చెల్లించనక్కరలేదని తీర్పు చెప్పినారు.

**8.2.4 పరస్పర ప్రామిస్‌లు (సెక్షన్ 51 - 54) :** 1773 సంవత్సరములో లార్డ్ మెన్స్ ఫీల్డ్ (Lard Mansfield) అను ప్రముఖ న్యాయశాస్త్రవేత్త కింగ్‌స్టన్ Vs ప్రెస్టన్ (Kingston Vs Preston) అను కేసులో ఉభయపక్ష కాంట్రాక్టలను మూడు విధాలుగా విభజించెను.

1. ఒకదానిపై యింకొకటి ఆధారపడే పరస్పర కాంట్రాక్టులు
2. ఒకదానిపై యింకొకటి ఆధారపడని స్వతంత్రమైన పరస్పర కాంట్రాక్టులు.
3. ఏకకాలిక పరస్పర కాంట్రాక్టులు.

భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 51 ప్రకారము "ఒక కాంట్రాక్టులో ఏకకాలములో వారి వారి బాధ్యతలు నిర్వర్తించవలసిన పరస్పర ప్రామిసీలు ఉంటే ఏ ప్రామిసరు అయినా తన ప్రామిసీ అతని బాధ్యతను నిర్వర్తించడానికి సంసిద్ధుడుగా లేకపోతే తన ప్రామిస్‌ను తాను కూడా నెరవేర్చనక్కరలేదు''.

**ఉదా :** X అను వ్యక్తి Y అను వ్యక్తికి బస్తా మినుములు రూ. 1000లకు విక్రయిస్తానని ఒప్పందం చేసుకొనెను. అదే విధముగా Y, X అను వ్యక్తికి బస్తా పెసలు అమ్ముతానని చెప్పగా X దాని ఖరీదును రెండు వాయిదాలలో చెల్లిస్తానని మరొక ఒప్పందం చేసుకొనెను. మొదటి ఒప్పందంలో X మినుములను అమ్ముటకు సిద్ధపడగా Y రూ. 1000 పైకమును చెల్లించవలెను. అప్పుడే వారి మధ్య ఆ ఒప్పందం అమలు చేయవచ్చును. రెండవ ఒప్పందములో Y పెసలు పంపుటకు సిద్ధపడగా X మొదటి వాయిదా మొత్తం చెల్లించుటకు సిద్ధపడినట్లు అయినా వారి మధ్య ఈ ఒప్పందం అమలు చేయవచ్చును.

సెక్షన్ 52 ప్రకారము "పరస్పర కాంట్రాక్టులలో ఏ పార్టీ ముందు తన బాధ్యతను నెరవేర్చవలెనన్న విషయం కాంట్రాక్టు అంశముగా వుంటుందో ఆ ప్రకారమే బాధ్యతలను నెరవేర్చవలెను. కాంట్రాక్టులో బాధ్యతలను నెరవేర్చుట నిర్ణయించుకోనప్పుడు ఆ వ్యవహారం తాలూకు సంగతి, సందర్భమును బట్టి ఆ నెరవేర్చే క్రమం తేల్చవలెను".

**ఉదా :** P ఒక ఇంటిని Q కోసం కట్టడానికి దాని కొరకు Q, P కి రూ. 1,00,000 చెల్లింపు చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. ఈ కాంట్రాక్టులో P మొదట ఇంటిని కట్టవలెను. తరువాత అతనికి సొమ్ము చెల్లించవలెను.

సెక్షన్ 53 ప్రకారము "పరస్పర కాంట్రాక్టులలో ఒక పార్టీ ఎదరి పార్టీ బాధ్యత నిర్వర్తించకుండా అడ్డుతగిలితే అట్లా నివారించబడిన పార్టీ యిష్టం మీద ఆ కాంట్రాక్టు చెల్లకూడని కాంట్రాక్టు అవుతుందని, అట్లా నివారించబడడం వలన ఆ పార్టీ ఏదైనా నష్టానికి గురైతే ఆ నివారించిన పార్టీ నుంచి నష్టపరిహారం కోరవలెను.

**ఉదా :** A, B తో ప్రహరీగోడ రెండు వైపులా నిర్మించాలని ఒప్పందం చేసుకొన్నాడు. B తన సంసిద్ధతను తెల్పుతూ ఉదయమే ప్రహరీగోడ నిర్మాణ నిమిత్తము A యింటికి రాగా A తను నిర్మించ దలచిన ప్రహరిగోడ వివరములు B కి తెలియజేయకుండా రోజంతా తాత్సారము చేసెను. ఈ సందర్భములో B, A తో చేసుకున్న ఒప్పందము రద్దు చేసుకుంటూ తనకు సంభవించిన నష్టము (రోజు కూలీ) కొరకు దావా వేయవచ్చును.

సెక్షన్ 54 ప్రకారము పరస్పర ప్రామిసలలో మొదటి పార్టీ తన బాధ్యతను నిర్వర్తించినదే, అతడు రెండవ పార్టీని బాధ్యత నిర్వర్తించమని అడగడానికే వీలుండకపోవడమే కాకుండా అట్లాంటి పార్టీకే తను బాధ్యత నిర్వర్తించకపోవడం వలన ఏదైనా నష్టము సంభవిస్తే ఆ నష్టానికి పరిహారం కూడా ఇవ్వడానికి బాధ్యుడగును.

**ఉదా :** A, B తో ఒక టేబుల్ చేయడానికి ఒప్పందం చేసుకున్నాడు. A కలప ఇస్తే గాని B టేబుల్ చేయలేడు. A కలప ఇవ్వకపోతే B టేబుల్ చేయనవరం లేదు. ఈ సందర్భములో వారి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు విమోచనం జరిగినట్లుగా భావించవచ్చును. A చర్యమున B కి ఏదైనా నష్టము సంభవించినప్పుడు నష్టపరిహారాన్ని చెల్లింపజేయమని B కోరవచ్చును.

**8.2.5 హక్కును విడుదల చేస్తూ రాజీ (సెక్షన్ 63) :** భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 63 ప్రకారము "ప్రామిసీ ప్రామిసార్‌కు చెందిన కాంట్రాక్టు బాధ్యత అంతాగాని, కొంతగాని మాపుచేయడం, బాధ్యత నిర్వాహణకు గడువు ఇవ్వడం. అతనికి నచ్చిన మరి ఏ యితర ప్రామిసార్ చర్యలను అయినా కాంట్రాక్టు బాధ్యత నిర్వర్తించడం క్రింది తీసుకోవడం గాని చేయవచ్చును".

**ఉదా : 1.** X, Y కి ఒక బొమ్మ గీస్తానని ఒప్పుకుంటాడు. తరువాత Y, X తో బొమ్మ గీసి ఇవ్వనక్కరలేదంటే X కాంట్రాక్టు నుండి విమోచనం పొందుతాడు.

**2.** C, D కి చెల్లించవలసిన రూ. 10,000 బాకీ తాలూకు స్ఫూర్తి పరిష్కారంగా C 6000/- చెల్లిస్తానని చెప్పగా D అంగీకరించినట్లు అయినా మొత్తం బాకీ తాలుకూ బాధ్యతా విమోచనం C కి కలుగుతుంది.

**కేసు : కపూర్ చంద్ Vs హిమాయిత్ ఆలీఖాన్ (1963) :** ఈ కేసులో నైజాం రాజకుమారుడు బొంబాయి నగల వర్తకుల నుండి వాయిదాలలో రూ. 27,00,000/-ల నగలను కొనుగోలు చేశాడు. ఇందు నిమిత్తము రాజకుమారుడు ప్రోనోటు రాసి ఇచ్చారు. ఆ ప్రోనోటు అమలులో ఉండగానే నైజాం రాజ్యము సైనిక పరిపాలనలోకి రాగా మిలటరీ గవర్నర్ "రాజకుమారుల ఋణ ఖాతాలను తీర్చే సంఘం'' ఒక దానిని వేశారు. కమిటీ వారు 27,00,000/- బాకీ మొత్తానికి గాను పూర్తి పరిష్కారముగాను 20,00,000/- సొమ్మును తీసుకోవలసిందిగా సూచించారు. నగల వర్తకుడు కొద్ది ఆక్షేపణలు మినహా రెండు సార్లుగా వారు ఇచ్చిన 20,00,000/- స్వీకరించాడు. తనకు యింకను 7,00,000/- బాకీ రావలసి వున్నారని దానిపై వడ్డీ 3,00,000/- మొత్తం 10,00,000/- యింకను రాజకుమారుడు చెల్లించవలసినదని అతను దావా వేసినాడు.

తీర్పు : ఏ ఆక్షేపణా లేకుండా బేషరతుగా బాకీ పూర్తి పరిష్కారముగా 20,00,000/- వాది స్వీకరించినందున ప్రతివాది కాంట్రాక్టు బాధ్యతల నుండి విమోచన పొందినాడని సెక్షన్ 63 ప్రకారము అమలు జరపదగిన విమోచన అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినారు.

**లల్లూభాయి పటేల్ Vs లాల్‌భాయి త్రికములాల్ మిల్స్ (1958) :** ఈ కేసులో సెక్షన్ 63 క్రింద గడువు పొడిగించు హక్కును సుప్రీంకోర్టు విశదీకరించినది.

వస్తు విక్రయ కాంట్రాక్టులలో వస్తువులను అప్పగించడానికి నిర్ణయించిన కాలము ఇద్దరి పార్టీలు సమ్మతిపైనే పొడిగించవచ్చును. ప్రామిసీ ఒక్కడే స్వలాభం కోసం ఆ గడువు పొడిగిస్తూ ప్రామిసర్ అనుమతి లేకుండా వాయిదా వేయడం సమంజసం కాదన్నారు.

**8.2.6 పాత కాంట్రాక్టు స్థానే కొత్త కాంట్రాక్టు (Novation See 62) :** సెక్షన్ 62 ప్రకారం "కాంట్రాక్టు పార్టీలు వారి మధ్య వున్న కాంట్రాక్టుకు బదులు మరో కాంట్రాక్టును చేసుకుందామనుకున్నా లేదా వారి కాంట్రాక్టును రద్దు చేసుకోవడానికి గానీ అగ్రిమెంట్ చేసుకుంటే మొదటి కాంట్రాక్టు బాధ్యతలు నెరవేర్చనక్కరలేదు. దీనినే నవీకరణ (Novation) అంటారు. అనగా ఇద్దరి పార్టీలు మధ్య ఏర్పాటైన కాంట్రాక్టు వారి అంగీకారంతో నూతనంగా మరికొన్ని అంశములు చేర్చుతావా లేదా వున్నవాటిలో మార్పులు చేసుకొంటూ లేదా కొత్త వ్యక్తిని కాంట్రాక్టులో చేర్చుకొంటూ చేసుకునే నూతన కాంట్రాక్టు వలన మొదటి కాంట్రాక్టు యొక్క బాధ్యత నుండి విమోచన పొందుతారు.

**ఉదా :** A, D కి 10,000/- బాకీ వున్నాడు. ఆ మొత్తం రెండు నెలల్లో చెల్లిస్తానని అంగీకరించినాడు. కాని E నుండి తనకు రావలసిన 10,000/- సకాలములో రాకపోయినందున అతడు D కి చెల్లించవలసిన 10,000/- చెల్లించలేకపోయినాడు. ఈ విషయాన్ని A, D తో మనవి చేసి తనకు E నుండి రావలసిన 10,000/-లను వసూలు చేసుకోవలసినదిగా కోరినప్పుడు D అందుకు అంగీకారం తెలియజేసినాడు. కనుక A, D కి మరియు E కి మధ్య ఒక కొత్త కాంట్రాక్టును ఏర్పాటు చేసి తన యొక్క బాధ్యత నుండి విముక్తి పొందినాడు. ఆ తేదీ నుండి D మరియు E ల మధ్య ఏర్పడిన కాంట్రాక్టు సక్రమమైన కాంట్రాక్టు. దీనిని అమలు జరపవచ్చును. కాని A, D ల మధ్య ఏర్పడిన కాంట్రాక్టు విమోచన జరిగినది కనుక వారి మధ్య ఎటువంటి బాధ్యత హక్కు లేవు.

**8.2.2 ఉపసంహరణ (సెక్షన్ 64 నుంచి 66) :** సెక్షన్ 64 ప్రకారం కాంట్రాక్టులో ఒక పార్టీకి ఉపసంహరణ హక్కు వుండి అట్లాంటి "ఉపసంహరణ'' చేసుకుంటే కాంట్రాక్టు విమోచన సంభవిస్తుంది. **ఒక పార్టీకే ఇటువంటి హక్కు వున్న కాంట్రాక్టులను చెల్లకూడని కాంట్రాక్టులు అంటాము. ఈ ఉపసంహరణ మూడవ పార్టీ హక్కులు ఏర్పడక ముందే చేసుకోవలెను.** సెక్షన్ 65 ప్రకారం "కాంట్రాక్టు చెల్లనిదైతే లేదా చెల్లదని తరువాత తెలిసినా 64లో చెప్పిన విధముగానే పార్టీలు ఏవైనా లాభాలు పొందితే వాటిని ఎవరి నుంచి స్వీకరించారో వారికి తిరిగి ఇచ్చి వేయవలెను.

అనగా కాంట్రాక్టు చెల్లనిది కావడం వల్లగాని, చెల్లకూడని కాంట్రాక్టులో హక్కు వున్న పార్టీ ఉపసంహరణ చేసుకొన్నప్పుడు

గాని ఆ కాంట్రాక్టుల క్రింద ఏదైనా లాభాలు కాంట్రాక్టు పార్టీలకు ప్రాప్తిస్తే వారు వాటిని వదులుకొని "ఇద్దరు పార్టీలు కాంట్రాక్టు జరిగే ముందు ఉన్న స్థితిలో వుండేటట్లు చూడవలెను".

**ఉదా :** X, Y కి తన కుమార్తెను వివాహము చేసుకుంటే రూ. 50,000/- ఇస్తానని 50,000/- ఇచ్చాడు. కాని X కుమార్తె వివాహామునకు ముందే మరణించినది. కనుక X, Y ల మధ్య కాంట్రాక్టు అమలు పర్చలేరు కనుక Y 50,000/- తిరిగి X కి చెల్లించవలెను.

సెక్షన్ 66 ప్రకారము కాంట్రాక్టు ఉపసంహరణ సమాచారాన్ని ప్రతిపాదనా ఉపసంహరణ సమాచారం లాగానే తెలియపర్చవలెను. సెక్షన్ 68 ప్రకారము ప్రామిసీ అవతల పార్టీ బాధ్యతలు నిర్వర్తించడానికి అవకాశాలు తన చేతిలో ఉంచుకొని అట్లాంటి వాటిని నెరవేర్చక నిర్లక్ష్యము చేసిన, నిరాకరించిన ప్రామిసర్ ఆ కారణము వలన తన బాధ్యత నెరవేర్చకలేకపోయి వుంటే అంతమట్టుకు తన బాధ్యత నుండి విముక్తుడగును.

**ఉదా :** X, Y యింటిని మరమ్మత్తును చేయడానికి ఒప్పుకుంటే ఎక్కడెక్కడ మరమ్మత్తులు చేయవలెనో చూపటానికి Y నిర్లక్ష్యం చేసినా, నిరాకరించినా X తను మరమ్మత్తులు చేయవలసిన కాంట్రాక్టు బాధ్యత నుండి విముక్తుడగును.

## 8.3 న్యాయప్రవృత్తి కల్గిన బాధ్యతా విమోచనము :

**8.3.1.A పార్టీల మరణం (See 37) :** సెక్షన్ 37 ప్రకారము "కాంట్రాక్టు చేసుకొనేటప్పుడు పార్టీలే స్వయంగా బాధ్యతలు నిర్వర్తించవలెనన్న ఉద్దేశ్యము ఉన్నా లేదా కాంట్రాక్టు విషయం తాలూకు స్వశక్తి, నిపుణత, గుణాలకు సంబంధించినప్పుడు అటువంటి పార్టీ మరణిస్తే కాంట్రాక్టు బాధ్యతా విమోచన కల్గుతుంది.

**ఉదా :** M, F కి ఒక చిత్రం గీసి నిర్ణీత తేదీన ఇస్తానని అందుకుగాను F, M కు 10,000/- చెల్లించేటట్లు కాంట్రాక్టు ఏర్పాటు చేసుకున్నారు. గడువుతేదీకి ముందే M మరణిస్తే M వారసులు F కు చిత్రం వేసి ఇవ్వవలసిన బాధ్యత లేదు. F వారికి 10,000/- ఇవ్వనవసరం లేదు.

కాని కాంట్రాక్టు పార్టీ మరణించినంత మాత్రాన కాంట్రాక్టు బాధ్యత విమోచనం కాదు. వారసులకు సంక్రమించతగిన కాంట్రాక్టు హక్కు బాధ్యతలను పార్టీలు మరి ఒకరికి అసైన్ చేయవచ్చును. ఈ హక్కు బాధ్యతలను పార్టీలు దివాలా తీసినప్పుడు కూడా దివాలా న్యాయసూత్రాల ప్రకారము "అఫిషియల్ రిసీవర్" లేదా అఫిషియల్ అసైనీకి చెందుతాయి.

**ఉదా :** P కొన్ని వస్తువులను Q కు ఒక నిర్ణీతమైన రోజున 50,000/- అమ్ముతానని కాంట్రాక్టు చేసుకొన్నాడు. నిర్ణీతమైన రోజుకు ముందే P చనిపోయాడు. అతని మరణానంతరం అతని వారసులు నిర్ణీతమైన రోజున వస్తువుల అందజేయవలసిన బాధ్యతలను నెరవేర్చవలెను. Q ఆ వస్తువులను తీసుకొని వారికి రూ. 50,000/- చెల్లించవలసిన బాధ్యత కల్గి వుండును.

**8.3.1B సమిష్టి హక్కు బాధ్యతల సంక్రమణము (సెక్షన్ 40-45) :** సాధారణముగా కాంట్రాక్టు పార్టీలలో ఒకే ప్రామిసీ వుంటే ఆ పార్టీలలో ఎవరు మరణించిన వారి యొక్క హక్కు బాధ్యతలు వారి వారి వారసులకు సంక్రమిస్తాయి. అయితే కాంట్రాక్టులో అనేక మంది ప్రామిసార్‌లు, ప్రామిసీలు ఉన్నప్పుడు వారి హక్కు బాధ్యతల విషయంలో కొంత సందిగ్ధత ఏర్పడుతుంది.

**బాధ్యత :** ఋణగ్రస్తుడు ఋణదాత వద్ద తీసుకొన్న పైకము చెల్లింపునే ఋణగ్రసు&తనకు గల "బాధ్యత" అంటారు.

**హక్కు :** ఋణదాత ఋణగ్రస్తు నుండి ఋణ మొత్తమును వసూలు చేసుకొనుటను ఋణదాతకు గల హక్కు అంటారు.

**సమిష్టి బాధ్యతలు :** సమిష్టి బాధ్యతల విషయములలో మన న్యాయశాస్త్రమునకు, ఇంగ్లాండు న్యాయశాస్త్రమునకు మధ్య వ్యత్యాసం కలదు. ఇంగ్లాండు న్యాయశాస్త్రము ప్రకారము కాంట్రాక్టులోని "జాయింట్ ప్రామిసర్"లు సమిష్టిగా బాధ్యులు.

**ఉదా :** A, B లు ఇద్దరు కలసి 10,000/-లను C వద్ద ఋణంగా తీసుకుని ఆ మొత్తం తామిద్దరం కలసి చెల్లిస్తామని ప్రామిసరీనోటు రాస్తే వారిద్దరు సమిష్టిగా బాధ్యులు అవుతారు. C తనకు రావలసిన మొత్తం రాబట్టుకొనుటకు A, B ఇద్దరి పైనా దావా తీసుకురావలెను. ఏ ఒక్క పార్టీని వదిలివేసినా దావా కొట్టివేస్తారు.

భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 42, 44లో వివరించిన ప్రకారముగా కాంట్రాక్టు బాధ్యతను నెరవేర్చుటలో జాయింట్ ప్రామిసర్‌లు అందరూ వ్యక్తిగతముగాను, సమిష్టిగాను బాధ్యులు అవుతారు.

**ఉదా :** A, B లు ఇద్దరూ కలసి C వద్ద 10,000/- ఋణంగా తీసుకొని ఆ మొత్తం తామిద్దరు కలసి చెల్లిస్తామని ప్రోనోటు వ్రాస్తే గడువు తేదీన వారిద్దరు కలసి చెల్లించవచ్చును లేదా C ఆ మొత్తం రాబట్టుకొనుటకు A పై దావా తేవడం వల్ల గాని, B పై దావా తేవడం వల్ల గాని, A, B లపై దావా తేవడం వల్ల గాని ఋణాన్ని రాబట్టుకొనవచ్చును. అదే విధముగా ఋణాన్ని పూర్తిగా C కి చెల్లించిన ప్రామిసర్ తన సహ ప్రామిసర్‌పై అతని వాటా రాబట్టుకొనుటకు దావా తేవచ్చును.

**సమిష్టి హక్కులు :** కాంట్రాక్టు పార్టీలలో ఒక ప్రామిసీ మరియు ఒక ప్రామిసర్ ఉన్నప్పుడు వారిలో ఎవరు మరణించిన వారి హక్కులు వారి వారసులకు సంక్రమిస్తాయి. కాంట్రాక్టు చట్టం సెక్షన్ 45 ప్రకారము కాంట్రాక్టు పార్టీలలో ఒకరి కంటే ఎక్కువ మంది ప్రామిసీలుగా వుంటే వారందరూ, అందులో ఎవరైనా చనిపోతే వారి వారసులు మిగిలిన వారితోనూ, అందరూ చనిపోతే అందరి వారసులు సమిష్టిగాను ఆ హక్కులు అనుభవించడానికి అర్హులు అని తెలియజేస్తుంది.

**పార్టీలు చేత కాంట్రాక్టు బాధ్యతల అసైన్‌మెంట్ :** కాంట్రాక్టులోని పార్టీలు బాధ్యతలను నిర్వర్తించవలెను అంటే సాధారణ న్యాయ సూత్రాలు వర్తిస్తాయి. కాని కాంట్రాక్టులోని బాధ్యతలను పార్టీలే నిర్వర్తించవలెనన్న నిబంధన వున్నట్లు అయితే వాటిని పార్టీలే నిర్వర్తించాలి. బాధ్యతల నిర్వర్తనకు సంబంధించి ఎటువంటి నిబంధనలు లేకపోయినట్లు అయినా వారసత్వం వలన అవి వారసులకు సంక్రమిస్తాయి. వీటిని పార్టీల చర్యల మూలముగా కూడా అసైన్ చేయవచ్చును.

**బాధ్యతల అసైన్‌మెంట్ :** ప్రముఖ న్యాయశాస్త్రవేత్త ఏన్సన్ ప్రకారము ప్రామిసర్ "తనంతట తాను చేసిన పనులనే తప్ప, తన కాంట్రాక్టు బాధ్యతా నిర్వహణ క్రింద ఇతరుల చేత చేయించిన పనులను తాను చేసినట్లుగా అంగీకరించమని ప్రామిసీని వత్తిడి చేయలేదు".

**కేసు : రాబిన్స్ మరియు సార్ఫీస్ Vs డ్రమెండ్ :** ఈ కేసులో రాబిన్స్ మరియు సార్ఫీ భాగస్తులు. వీరికి ఒక బగ్గీ కలదు. భాగస్తులలో ఒకరైన సార్ఫీ ఆ బగ్గీని బాడుగకు డిమాండ్‌కు అద్దెకు ఇస్తూ ఒక ఒప్పందం చేసుకున్నాడు. కాంట్రాక్టు ప్రకారం బగ్గీ యొక్క మరమ్మత్తులు మరియు రంగు తాను వేసేటట్లు, సంవత్సరానికి అద్దె డ్రమెండ్ చెల్లించవలసినదిగా నిబంధన చేసుకున్నారు. అయితే ఏడాది తరువాత భాగస్వామ్యం నుండి విడిపోతూ డ్రమెండ్‌కు ఒక సూచన చేశాడు తన బాధ్యతను రాబిన్స్ నిర్వర్తిస్తాడని అతనికి అద్దె చెల్లించవలసినదిగా కోరినాడు.

డ్రమెండ్ సార్ఫీ సూచనలు అంగీకరించక బగ్గీని వాపస్సు చేయగా రాబిన్స్ కోర్టును ఆశ్రయించినాడు. డ్రమెండ్ బగ్గీ వాపసు చేయుట సబబేనని కాంట్రాక్టులోని బాధ్యతలను మరొకరికి బదిలీ చేయుటకు అవకాశం లేదని తీర్పు యిచ్చినారు.

**మినహాయింపులు :** కాంట్రాక్టులోని బాధ్యతలను సాధారణముగా బదిలీ చేయుటకు అవకాశం లేదు అనే సూత్రమునకు కొన్ని మినహాయింపులు కలవు.

1. కాంట్రాక్టు అంశము యొక్క ప్రాముఖ్యతను అనుసరించి కాంట్రాక్టు బాధ్యతను ప్రామిసర్ నిర్వర్తించినాడా లేదా మరొకరు నిర్వర్తించినారా అనే విషయం అప్రస్తుతమైనప్పుడు కాంట్రాక్టు బాధ్యతను ఎవరికైనా అసైన్ చేయవచ్చును.

2. కాంట్రాక్టు చట్టం సెక్షన్ 62 ప్రకారం కాంట్రాక్టు పార్టీలు వారి మధ్య వున్న కాంట్రాక్టుకు బదులు మరో కాంట్రాక్టుకు చేసుకుందామనుకున్నా లేదా వారి కాంట్రాక్టును రద్దు చేసుకోవడానికి గాని, మార్పిడి చేసుకోవడానికి అగ్రిమెంటు చేసుకుంటే మొదటి కాంట్రాక్టు బాధ్యతలు నెరవేర్చనక్కరలేదు. దీనినే నవీకరణ అంటారు.

3. "భూమితోపాటు సంక్రమించే కాంట్రాక్టు బాధ్యతలు మరో మినహాయింపు". ఉదా : A తాలూకు వాడుక నీరు Y తన జాగా నుండి పోనివ్వవలసిన బాధ్యత ఉండేటట్లు A, Y లు ఒక కాంట్రాక్టు చేసుకుంటే Y తన జాగాను Z కు విక్రయించినప్పుడు Z కి A తాలుకా వాడుక నీరు తన జాగా నుండి పోనివ్వవలసిన బాధ్యత ఏర్పడును.

పై మూడు మినహాయింపు సందర్భాలలో మినహా సాధారణ సందర్భములలో కాంట్రాక్టు యొక్క బాధ్యతలను పార్టీలు మాత్రమే నిర్వర్తించాలి కాని యితరులకు అసైన్‌మెంట్ చేయరాదు.

## కాంట్రాక్టు ఆచరణ న్యాయ సమ్మతి కాకపోవడం :

**8.3.2 కాంట్రాక్టు ఉద్దేశం తరువాత కాలములో న్యాయసమ్మతం కాకపోవడం :** సెక్షన్ 57 ప్రకారం కాంట్రాక్టులో పార్టీలు పరస్పరము ప్రామిస్‌లు ప్రత్యామ్నాయముగా చేసుకొంటే అందులో ఒక పరస్పర ప్రామిస్‌ల జత న్యాయమైనవి. వాటికి ప్రత్యామ్నాయముగా చేసుకొన్న మరొక సమూహము న్యాయ విరుద్ధమైనవి. అయితే మొదటి సమూహము సక్రమమైనదిగాను ప్రత్యామ్యాయమైన రెండవ జత కాంట్రాక్టులు చెల్లనివి అవుతాయి.

**ఉదా :** A తన యింటిని Z కు నివాస నిమిత్తమైతే 10,000/- అద్దెకు ఇస్తానని లేదా జూదగృహముగా వినియోగించేటట్లు అయితే రూ. 50,000/-లకు అద్దెకు ఇస్తానని ప్రతిపాదన చేసి స్వీకృతి పొందితే వాటిలో 10,000/- అద్దె చెల్లించడానికి A, Z ల మధ్య ఏర్పడే కాంట్రాక్టు క్రమమైనది అవుతుంది. రెండవది చెల్లని కాంట్రాక్టు అవుతుంది.

సెక్షన్ 58 ప్రకారము "కాంట్రాక్టులో ప్రత్యామ్నాయ ప్రామిస్‌లు చేసి అందులో ఒకటి న్యాయ సమ్మతం, రెండవది న్యాయ విరుద్ధమైతే న్యాయసమ్మతమైనది క్రమమైనది అవుతుంది".

**ఉదా :** R, S కి 10,000/- ఇవ్వడానికి బదులుగా 20 బస్తాల ధాన్యము గాని లేదా 1 కిలో నల్లమందు గాని ఇస్తానని కాంట్రాక్టు చేసుకుంటే 10,000/- రూపాయలకు 20 బస్తాల ధాన్యము ఇచ్చే కాంట్రాక్టు సక్రమమైనది అవుతుంది. కాని 10,000-కు ఒక కిలో నల్లమందు ఇవ్వడం న్యాయవిరుద్ధమమైనది కావున చెల్లదు.

**8.3.3 కాంట్రాక్టు బాధ్యతను నెరవేర్చడం అసంభవం కావడం :** కాంట్రాక్టు బాధ్యతను నెరవేర్చడంలో అసంభవమును రెండు రకములుగా వర్గీకరించవచ్చును.

1. సర్వకాల సర్వావస్థలో అసంభవాలు కొన్ని. ఈ సందర్భంలో ఏర్పడే కాంట్రాక్టులు మొదట నుండి చెల్లని కాంట్రాక్టులు అవుతాయి.

2. కాంట్రాక్టులోని పార్టీల మధ్య వున్న సంగతి సందర్భాలను బట్టి అసంభవమైనది కొన్ని. ఈ సందర్భములో ఏర్పాటు అయిన కాంట్రాక్టులు క్రమత్వము మీద వేరు వేరు ప్రభావాలు కల్గి వుంటాయి.

సాధారణముగా కాంట్రాక్టు పార్టీలు కాంట్రాక్టు అంశమును నెరవేర్చడం అసంభవం అయినప్పుడు పార్టీలకు కాంట్రాక్టు

బాధ్యతా విమోచనం కలుగుతుంది. ఈ బాధ్యతా విమోచనం కలుగు సందర్భములను కాంట్రాక్టు చట్టం సెక్షన్ 56 స్పష్టముగా పేర్కొన్నది.

సెక్షన్ 56(1) ప్రకారము ఒక కాంట్రాక్టు బాధ్యతా నిర్వహణ, ఆ బాధ్యతా స్వభావం బట్టి అసంభవం అయితే అటువంటి కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది.

**ఉదా :** E, F తో మేజిక్ ద్వారా నిధిని చూపెడతామని అందుకు ప్రతిఫలముగా 10,000/- చెల్లించాలని చేసుకునే ఒప్పందం చెల్లని ఒప్పందం అవుతుంది. సెక్షన్ 56(2) ప్రకారము "కాంట్రాక్టు చేసుకొన్న తరువాత ఆ బాధ్యతా నిర్వహణ అసంభవము అయిన ప్రామిసరుకు తగు చేస్తానని పని చేయడం అనివార్య కారణాల వలన న్యాయనిషిద్ధమైన ఆ తేదీ నుండి ఆ కాంట్రాక్టు చెల్లనిది అవుతుంది''.

**ఉదా :** A, B తో ఒక ఒప్పందం చేసుకొనెను. తన కుమార్తె C ని వివాహమాడితే 50,000/- ఇస్తానని అన్నాడు. అయితే C అప్పటికే D ని వివాహం చేసుకున్నది. ఈ విషయం A, B లకు తెలియదు. కనుక కాంట్రక్టు బాధ్యతలను నిర్వరించలేరు.

సెక్షన్ 56(3) ప్రకారము ప్రామిసర్‌కు కాంట్రాక్టు క్రింద చేయవలసిన పని అసంభవమని కాని, అన్యాయముగాని తెలిసినా, లేదా యుక్తమైన జాగ్రత్తతో మెలిగితే ఆ విషయం ప్రామిసీకి తెలియకుండా వుంటే అట్లాంటి కాంట్రాక్టు బాధ్యత ప్రామిసర్ నెరవేర్చలేకపోవడం వలన రెండవ పార్టీకి నష్టపరిహారం చెల్లించవలసి వుంటుంది.

కాంట్రాక్టు బాధ్యతలను పార్టీలు నెరవేర్చవలెను. కాంట్రాక్టు నిర్దిష్టముగా వుంటే వాటిని అమలు చేయునట్లు కోర్టులకు కూడా కేసు తాలూకా సంగతి సందర్భములను బట్టి కాంట్రాక్టు అంశము, భావార్థకంగా వున్నట్లు భావించే అర్హత కూడా ఇచ్చినారు. దానినే భావార్థక కాంట్రాక్టు అంశ సిద్ధాంతం (Doctrone Implied Term,) అని అన్నారు. కాంట్రాక్టులో ఎటువంటి షరతులు లేకపోయినప్పటికీ, కోర్టులు మాత్రము క్రింద ఉదహరించిన సందర్భములో పార్టీలు కాంట్రాక్టు బాధ్యతా విమోచనాలకు సమ్మతమని భావించవలెను. అవి :

1. కాంట్రాక్టు విషయ నాశనం కావడం.
2. పార్టీ మరణించడం లేదా బాధ్యతా నిర్వహణకు అశక్తుడు కావడం.
3. కాంట్రాక్టు చేసుకొన్న తరువాత న్యాయవిరుద్ధం కావడం.
4. యుద్ధ ప్రకటన చేయడం.
5. ఊహించిన విధముగా అంశాలు ఉండకపోవడం.
6. ఆశాభంగ సిద్ధాంతము.

1. **కాంట్రాక్టు విషయ నాశనం కావడం :** ప్రామిసర్ తప్పు లేకుండానే కాంట్రాక్టు విషయం లేదా వస్తువు నాశనం అయితే కాంట్రాక్టు పార్టీలు బాధ్యతా విమోచనం పొందినట్లే.

**కేసు : టైలర్ Vs కాడ్‌వెల్ (1863) :** ఈ కేసులో వాది ప్రతివాదుల మధ్య ఒక ఒప్పందం జరిగినది. కొన్ని నిర్దిష్టమైన తేదీలలో A, B తాలుకా థియేటర్లలో పాటలు పాడడానికి ఒప్పందం జరిగింది. కాని నిర్దిష్టమైన తేదీ నాటికి థియేటరు కాలిపోయినది. కనుక వారి మధ్య ఏర్పడిన కాంట్రాక్టు ఆ తేదీ నుండి అమలు పర్చలేరు కనుక బాధ్యతా విమోచనం కల్గినదని తీర్పు చెప్పడం జరిగినది.

2. **పార్టీ మరణించడం లేదా బాధ్యతా నిర్వహణకు అశక్తుడు కావడం :** వాగ్దానం చేసిన వ్యక్తి కాంట్రాక్టు అమలు పరచవలసి వున్నప్పుడు అతడు మరణించినా లేదా బాధ్యతా నిర్వహణకు అతడు అశక్తుడు అయినా బాధ్యతా విమోచనం కలుగుతుంది.

**కేసు : రాబ్సన్ డెవిసన్ (Robson Vs Devison 1871) :** ఈ కేసులో ఒక పియానో వాద్యకారునితో థియేటర్ యజమాని ఒక ఒప్పందమును చేసుకొనెను. తన థియేటరులో అతను నిర్ణీత తేదీ నాడు కచేరి చేయవలెను అని, కాని ఆ తేదీ నాటికి వాద్యకారునికి అనారోగ్యము కల్గినది కనుక అతడు తన బాధ్యతను నిర్వర్తించలేకపోయాడు. వాద్యకారుడు కాంట్రాక్టు బాధ్యత నిర్వర్తించలేనందున థియేటరు యజమాని దావా వేసినాడు.

**తీర్పు :** కాంట్రాక్టులోని ఒక పార్టీ అశక్తత వలన (అనారోగ్యం కారణంగా బాధ్యత నెరవేర్చకపోవుట జరిగినది) కనుక ఈ కాంట్రాక్టులో ప్రతివాది బాగుంటేనే నెరవేర్చుతాను అనే ప్రత్యన్న షరతు వున్నది. కావున ఆ కాంట్రాక్టు భంగానికి పరిష్కారం చెల్లించనవసరం లేదని తీర్పు చెప్పినారు.

3. **కాంట్రాక్టు చేసుకున్న తరువాత న్యాయవిరుద్ధం కావడం :** కాంట్రాక్టు ఏర్పడిన తరువాత జారీ అయిన చట్టం కారణంగా కాంట్రాక్టు అమలు చేయడం నిషిద్ధమైనప్పుడు, పార్టీలు కాంట్రాక్టును అమలు చేసే బాధ్యత నుండి విముక్తులు అవుతారు.

**కేసు : బెయిలీ Vs డిక్రెస్పిగ్నీ (Baily Vs Decrespigny, 1871) :** ఈ కేసులో D తన జాగాలో ఒక భాగం అద్దెకు ఇస్తూ మిగిలిన భాగంలో పెద్ద కట్టడాలు కట్టనని ఒప్పుకున్నాడు. కాని తరువాత పార్లమెంటు చట్టం చేస్తూ D తాలుకా మిగతా భాగం రైల్వే కంపెనీ తీసుకొని దానిలో ఒక పెద్ద రైల్వేస్టేషన్ కట్టినారు. B, D మీద కాంట్రాక్టు భంగానికి దావా వేస్తే వారు కాంట్రాక్టు చేసుకున్న పిమ్మట చేసిన న్యాయసూత్రాల మార్పిడి వలన కాంట్రాక్టు బాధ్యత నుండి విముక్తుడైనాడని చెప్తూ వాది దావా కొట్టివేసినారు.

4. **యుద్ధ ప్రకటన :** యుద్ధం ప్రకటించిన క్షణం నుండి ఒక దేశ ప్రజలు శత్రు దేశ ప్రజలతో చేసుకున్న కాంట్రాక్టులు చెల్లని కాంట్రాక్టులు అవుతాయి. అయితే యుద్ధమునకు పూర్వమే క్రమమైన కాంట్రాక్టు ఏర్పడిన దాని అమలు రెండు రకములుగా వుంటుంది. యుద్ధం స్వల్పకాలం వున్నట్లు అయిన కాంట్రాక్టు అమలును తాత్కాలికంగా ఆపివేసి తరువాత అమలు చేసుకోవచ్చును. యుద్ధము కనుక దీర్ఘకాలము కొనసాగినట్లు అయిన కాంట్రాక్టులోని పార్టీలు తమ బాధ్యతలనుండి విముక్తులు అవుతారు.

**కేసు : మెట్రోపొలిటిన్ వాటర్ బోర్డ్ Vs డిగ్ కెర్ అండ్ కంపెనీ లిమిటెడ్ :** ఈ కేసులో ఆరు సంవత్సరములలో ఒక రిజర్వాయిర్ కట్టడానికి 1914లో ఒక కాంట్రాక్టు ఏర్పటు చేసుకున్నారు. యింతలో మొదటి ప్రపంచ యుద్ధం వచ్చి 1915లో కాంట్రాక్టు అమలు నిలుపు చేయవలసి వచ్చింది. తరువాత కాంట్రాక్టు భంగానికి నష్టపరిహారం ఇవ్వమని దావా వేస్తే యుద్ధకాలంలో కొన్ని సంవత్సరాలపాటు కాంట్రాక్టు అమలు నిలుపుచేయడం వలన కాంట్రాక్టు స్వభావం చాలా వరకు మారిపోయిందని యిప్పుడు ఆ కాంట్రాక్టు అమలు చేస్తే ఆ పాత కాంట్రాక్టు అమలుకాక మరో కొత్త కాంట్రాక్టు అమలు చేసినట్లు అవుతుందని అందుచేత మొదటి కాంట్రాక్టు నెరవేర్చడం అసంభవం కనుక ఆ కాంట్రాక్టు విమోచనం పొందినదని తీర్పు చెప్పినారు.

5. **ఊహించిన విధముగా కాంట్రాక్టు విషయాలు ఉండకపోవడం లేదా జరగకపోవడం :** ఒక సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీలు చేసుకొన్న కాంట్రాక్టులలో ఊహించని విధముగా మార్పులు సంభవించినా లేదా యథాతథముగా ఆ సందర్భము లేకపోయినా ఆ కాంట్రాక్టు బాధ్యత నుండి విముక్తులవుతారు.

కేసు : క్రెల్ Vs హెన్రీ (Krell Vs Henery, 1903) : ఈ కేసులో H అనే వ్యక్తి 7వ అడ్వర్డ్‌రాజు యొక్క పట్టాభిషేక ఊరేగింపు మహోత్సవాలను చూసేందుకు K యొక్క మేడ గదిని అద్దెకు తీసుకుంటూ కాంట్రాక్టు చేసుకున్నాడు. కాని రాజుగారి అనారోగ్యము వలన ఊరేగింపు రద్దు అయినది. ఆ కారణముగా H ఆ గదిని వినియోగించలేదు కాని K అద్దె చెల్లింపు చేయమని H దావా తెచ్చినాడు.

తీర్పు : K మరియు H లపై ఏర్పడిన కాంట్రాక్టు యొక్క ఉద్దేశ్యం రాజు గారి పట్టాభిషేక ఉత్సవాన్ని తిలకించడం. కనుక వారి మధ్య కాంట్రాక్టుకు ప్రాతిపదిక అయిన ఊరేగింపు కార్యక్రమం ఊహించని విధంగా అమలు జరగలేదు కనుక కాంట్రాక్టు బాధ్యతల అమలు నుండి యిరుపార్టీలు విముక్తులు అయినారని తీర్పు చెప్పినారు.

6. **ఆశాభంగ సిద్ధాంతము :** ఈ సిద్ధాంతము 19వ శతాబ్దంలో ఇంగ్లాండు న్యాయస్థానాలు ప్రతిపాదించాయి. ఒక కాంట్రాక్టులోని అంశము కాంట్రాక్టు అమలు జరిగేవరకూ యధావిధిగా వుంటుందనే భావన మీద చేస్తే ఆ అంశములో ఊహించని కారణములచే మార్పులు సంభవించినప్పుడు ఆ కాంట్రాక్టు విమోచన జరుగుతుంది. దీనిని వివిధ కేసులలో ఇంగ్లాండు న్యాయస్థానాలు ధృవీకరించాయి. దీనినే పార్టీలు కాంట్రాక్టు జరిగేటప్పుడు ఉన్న సంగతి సందర్భాలు అట్లాగే వుంటాయన్న "భావనతో చేసినారన్న సిద్ధాంతం'' (Theory of Explained Term) అని ఆశాభంగ సిద్ధాంతమని అంటారు.

ఇండియన్ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 56 సమగ్రమైనదని ఇంగ్లాండు న్యాయశాస్త్రములో ఆశాభంగ సిద్ధాంతము వలన జరిగిన మార్పులేవి మనకు వర్తించవని మన సుప్రీంకోర్టు వారు "సత్యప్రతాప్ పోష్ Vs మంగీరాం, బంగూరు అండ్ కంపెనీ'' కేసులో స్పష్టం చేశారు.

ఈ కేసులో ఒక పెద్ద నివేశన స్థలాన్ని యిళ్ళ ప్లాట్ల కింద విభజించి దానిలో కాలువలు, రోడ్లు, పార్కులు వగైరాలు కట్టించడానికి లేక్ కాలనీ స్కీము అనే పథకము వేసి అందులో ఇళ్ళ స్థలాలను సరసమైన ధరకు సులభమైన వాయిదాలలో యిస్తాననే ప్రతివాది కంపెనీ ప్రకటించింది. ఆ ప్రకటన చూచి చాలా మంది దరఖాస్తు పెట్టుకొని మొదటి వాయిదా డబ్బు పంపినారు. అట్లా పంపిన వారికి చాలా మందికి స్థలాలు కూడా కేటాయించినారు. ఆ విధముగా కొన్న ఒక ఆసామి తన తాలూకు స్థలము మీద హక్కులు వాదికి పరివర్తనం చేసినాడు.

ఇలా వుండగా మిలటరీ వుంచడానికి అని గవర్నమెంట్ ఆ మొత్తం నివేశన స్థలం అద్దెకు బలవంతంగా తీసుకున్నారు. మళ్ళీ వాళ్ళు ఎప్పుడు ఖాళీ చేస్తారో తెలియని కారణము చేత ప్రతివాది స్థలాలు ఇచ్చిన అందరికి ఉత్తరాలు వ్రాసి వాళ్ళు యిచ్చిన బయానాలు వాపసు చేస్తూ కాంట్రాక్టు "ఆశాభంగం'' వలన విమోచనం అయినదని తెలియజేసినారు. ఆ నోటీసు అందుకొని వాది మాత్రము కాంట్రాక్టు రద్దుకు ఒప్పుకోకుండా గవర్నమెంటు ఎప్పుడు ఖాళీ చేస్తే అప్పుడే ఈ కాంట్రాక్టు అమలు పర్చమని వాదించాడు. వాది వాదన ఒప్పుకొంటూ ఈ కాంట్రాక్టులో ఆశాభంగం లేదని, అందుచేత కాంట్రాక్టు విమోచనా లేదంటూ వాదికి డిక్రీ ఇచ్చినారు. కనుక మనదేశంలో సెక్షన్ 56 సమగ్రమైనదని చెప్పడమైనది.

## 8.4 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. పార్టీల అంగీకారం
2. కాంట్రాక్టు భంగం

3. ఉపసంహారణ
4. ఆగంతుక కాంట్రాక్టు
5. పాత కాంట్రాక్టు స్థానే కొత్త కాంట్రాక్టు
6. సత్యప్రతాప్ గోష్ Vs మంగీరామ్, బంగూర్ అండ్ కంపెనీ కేసు

**10 మార్కుల ప్రశ్నలు :**

1. కాంట్రాక్టు షరతులను నెరవేర్చడంలో కాలము, స్థలము, విధానమునకు సంబంధించి న్యాయసూత్రాలను తెల్పుము.
2. పరస్పర ప్రామిసులు నెరవేర్చడానికి భారత కాంట్రాక్టు చట్టము యొక్క నిబంధనలను ఉదాహరణ పూర్వకంగా వ్రాయుము.
3. చెల్లింపుల వినియోగంను విశదీకరించుము.
4. నిరీక్షిత కాంట్రాక్టు భంగమును వివరింపుము.
5. సమిష్టి హక్కు, బాధ్యతలను వివరింపుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. కాంట్రాక్టు బాధ్యత విమోచనానికి గల వివిధ మార్గములను క్లుప్తీకరించుము.
2. పార్టీల ప్రవర్తన వలన బాధ్యతా విమోచనం కల్గు ఏదైనా 4 సందర్భాలను సోదాహరణముగా విశదీకరించుము.
3. న్యాయప్రవృత్తి కల్గిన బాధ్యతా విమోచనమును వివరింపుము.
4. "కాంట్రాక్టు షరతులు నెరవేర్చకుండా ఉండడానికి అసంభవనియము ఒక నిబంధనగా క్షమార్హం కాదు". చర్చించండి.
5. కాంట్రాక్టు ఎప్పుడు ఆశాభంగం అవుతుంది ? ఆశాభంగం యొక్క న్యాయాత్మక ఫలితలు ఏమిటి ?

## 8.5 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Mercantile Law | - | Mc Kuchhal |
| 2. | Mercantile and Industrial Law | - | R.C. Chawla, K.C. Garg |
| 3. | వ్యాపార న్యాయశాస్త్రము | - | ఇ. వెంకటేశం (తెలుగు అకాడమి) |
| 4. | వ్యాపార న్యాయశాస్త్రము | - | (తెలుగు అకాడమి) |
| 5. | వ్యాపార న్యాయశాస్త్రాలు | - | డా॥ రుద్రసాయిబాబా, డా॥ సంతోష్ కేతన్<br>శ్రీ ఎం. బసవరాజ్, శ్రీమతి ఎస్. మధుసూదన్,<br>శ్రీ కె. కోటేశ్వరరావు. |


– డాక్టర్ కె. రామచంద్రమూర్తి

పాఠం : 9

# కాంట్రాక్టు భంగం - నష్టపరిహారాలు

## 9.0 లక్ష్యం :

ఈ పాఠం పూర్తి అయ్యేసరికి మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) కాంట్రాక్టు భంగం వలన బాధితుడికి చట్టం కలుగచేసిన నివారణోపాయాలు తెలియును.

బి) నష్టపరిహారాలను అంచనా వేయడానికి అమలులో వున్న న్యాయసూత్రాలు తెలియును.

సి) శాస్తి పరిహారాలు, పూర్వ నిర్ధారిత పరిహారాలు తెలియును.

## విషయ సూచిక :


9.1 విషయ పరిచయము

9.2 కాంట్రాక్టు భంగానికి పరిహారాలు

9.2.1 కాంట్రాక్టు రద్దు

9.2.2 షరతుల ప్రకారం కాంట్రాక్టు అమలుకు దావా వేయడం

9.2.3 యోగ్యతను బట్టి నష్టపరిహారానికి దావా వేయడం

9.2.4 ఇంజక్షన్ లేదా నిషేధపు ఉత్తర్వుకు గాను దావా వేయడం

9.2.5 నష్టపరిహారాలకు దావా వేయడం

9.3 నష్టపరిహార రకాలు

9.4 నష్టపరిహారాలు అంచనా వేయడానికి సూత్రాలు

9.5 శాస్తి పరిహారాలు, పూర్వ నిర్ధారిత పరిహారాలు

9.6 కఠిన పదాలు

9.7 నమూనా ప్రశ్నలు

9.8 చదువదగిన గ్రంథాలు


## 9.1 విషయ పరిచయము :

క్రమబద్ధమైన కాంట్రాక్టు పార్టీలపై న్యాయాత్మక బాధ్యతలను విధిస్తుంది. కాంట్రాక్టుకు చెందిన పార్టీలు తమ బాధ్యతలను, విధులను తాము అంగీకరించిన విధంగా నిర్వర్తించవలసి వుంటుంది. ఏ పార్టీ అయినా కాంట్రాక్టు నిర్వర్తించడంలో అశక్తత చూపినట్లు అయితే కాంట్రాక్టు అమలుకు భంగం వాటిల్లుతుంది. అంటే కాంట్రాక్టుకు చెందిన పార్టీలు వారి వారి విధులను నెరవేర్చకపోవడం

వల్ల కాంట్రాక్టుకు ఏర్పడే అవాంతరాన్నే కాంట్రాక్టు భంగం అంటారు. కాంట్రాక్టు భంగంకు కారకుడైన వ్యక్తి రెండవ వ్యక్తికి నష్టపరిహారం చెల్లించుకోవలసిన బాధ్యత ఏర్పడుతుంది.

## 9.2 కాంట్రాక్టు భంగానికి పరిహారాలు :

మనదేశంలో Specific Relief Act 1963లో సెక్షన్లు 73 నుండి 75 వరకు, ఈ నష్టపరిహారాల గురించి తెలియచేస్తున్నాయి. కాంట్రాక్టు భంగమైనప్పుడు కాంట్రాక్టుకు చెందిన రెండవ పార్టీ అంటే గాయపడిన వ్యక్తికి ఈ దిగువ పేర్కొన్న నివారణోపాయాలు లభ్యమవుతాయి.

1. కాంట్రాక్టు రద్దు (Recission of Contract)
2. కాంట్రాక్టును నిర్దిష్ట విధంగా పూర్తి చేయడానికి దావా వేయడం (Suit for Specific Performance of Contract)
3. యోగ్యతను బట్టి నష్టపరిహారానికి దావా వేయడం (Suit Upon Quantum ` Meruit)
4. ఇంజక్షన్ లేదా నిషేదాజ్ఞ కొరకు దావా వేయడం (Suit for Injunction)
5. నష్ట పరిహారాలకు దావా (Suit for Damages)

**9.2.1 కాంట్రాక్టు రద్దు (Recission of Contract ) :** కాంట్రాక్టు భంగం జరిగినప్పుడు బాధితుడైన పార్టీ కాంట్రాక్టు రద్దు కొరకు దావా వేయవచ్చును. కాంట్రాక్టును రద్దు చేసినప్పుడు, కాంట్రాక్టు బాధ్యతల నిర్వర్తింపు నుండి బాధితుడైన పార్టీ విముక్తి పొందుతాడు. అంతేగాక తనకు కలిగిన నష్టాన్ని భర్తీ చేసుకొనుటకు నష్టపరిహారానికి దావా వేయవచ్చును.

అయితే క్రింది సందర్భాలలో కోర్టు కాంట్రాక్టును రద్దుపరచకపోవచ్చును.

1) వాది ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంట్రాక్టును ఆమోదించడం. ఉదా : డివిడెండును పొందుతూ కంపెనీ వాటాలు కొనుగోలు చేయడానికి చేసుకున్న ఒప్పందాన్ని రద్దు పరచుకునే ప్రయత్నాలు నెరవేరవు.

2) కాంట్రాక్టు కొంత మేరకు మాత్రమే రద్దు పరచమని కోరడం వలన మిగతా కాంట్రాక్టు పనిని వేరుపరచే అవకాశం వుండకపోవచ్చును.

3) కాంట్రాక్టు ఏర్పరచుకోవడానికి ముందు నెలకొన్న పరిస్థితులు ప్రస్తుతం ఉండకపోవడం. ఇరుపార్టీల పొరపాట్లు లేనప్పటికీ కాంట్రాక్టు నిర్వర్తనలో మారిన పరిస్థితులు కాంట్రాక్టు రద్దుకు వీలు కలిగించకపోవచ్చును.

4) కాంట్రాక్టు అమలులో వున్న కాలంలో కాంట్రాక్టుపై నమ్మకంతో, కాంట్రాక్టు విలువను పరిరక్షించుటకు మూడవ పార్టీ ఆ కాంట్రాక్టులో హక్కులు పొందినట్లు అయితే కాంట్రాక్టు రద్దు సాధ్యం కాదు.

**9.2.2 కాంట్రాక్టును నిర్దిష్ట విధంగా పూర్తి చేయడానికి దావా వేయడం (Suit for Specific Performance of Contract) :** షరతుల ప్రకారం కాంట్రాక్టు అమలుకు బాధితుడైన పార్టీ దావా వేయవచ్చును. నష్టపరిహారము సరియైన పరిహారం కానప్పుడు ఆ కాంట్రాక్టును నిర్దిష్ట విధంగా పూర్తి చేయమని కోర్టు ఉత్తర్వులు జారీ చేయవచ్చును. అటువంటి పరిస్థితులలో భంగం చేసిన పార్టీ కాంట్రాక్టు షరతుల ప్రకారము తన బాధ్యతను నిర్వర్తించవలెను. దీనినే కాంట్రాక్టును నిర్దిష్ట విధంగా పూర్తి చేయడం అంటారు. అటువంటి ఉత్తర్వును జారీ చేయడం కోర్టు వారి ఇష్టా ఇష్టాలపై ఆధారపడి వుంటుంది. నిర్దిష్ట విధంగా కాంట్రాక్టును అమలు చెయ్యడమనేది అనేక పరిమితులకు లోబడి వుంటుంది. ఇది అన్ని సందర్భాలలోను సాధ్యపడదు. ఈ క్రింది సందర్భాలలో నిర్దిష్ట విధంగా కాంట్రాక్టును అమలు చేయవలెననే ఉత్తర్వును కోర్టు జారీ చేయదు.

1) ద్రవ్యరూపంలో నష్టపరిహారం చెల్లించడం సరిపోయినప్పుడు

2) కాంట్రాక్టు వ్యక్తిగత సేవలకు అయినప్పుడు

3) కాంట్రాక్టు నిర్దిష్టముగా లేనప్పుడు

4) కాంట్రాక్టు ఉపసంహరించుకొనుటకు వీలుగా వున్నప్పుడు

5) కోర్టు కాంట్రాక్టు అమలు పర్యవేక్షించవలసినప్పుడు

6) రెండు పార్టీ వాగ్దానములు పరస్పరం అమలుపరుచుటకు వీలులేనప్పుడు

7) పార్టీలలో ఒకరు మైనరు అయినప్పుడు

**9.2.3 యోగ్యతను బట్టి నష్ట పరిహారానికి దావా వేయడం (**Suit Upon Quantum Meruit**) :** యోగ్యతను బట్టి నష్టపరిహారం అంటే సంపాదించిన మేరకు ప్రతిఫలంను పొందడం. బాధితుడైన పార్టీ తను పనిచేసినంతవరకు సొమ్ము చెల్లించవలసినదని దావా వేయవచ్చును. ఒక పార్టీ తన కాంట్రాక్టు బాధ్యతను కొంతవరకు నెరవేర్చిన తరువాత, రెండవ పార్టీ కాంట్రాక్టు భంగము చేసినచో ఇటువంటి దావా వేయవచ్చును. ఈ హక్కు చేసిన పనికి చెల్లింపు జరగాలనే ప్రచ్ఛన్నమైన అగ్రిమెంటు ద్వారా సంక్రమిస్తుంది. ఈ క్రింది సందర్భాలలో ఈ హక్కు లభిస్తుంది.

1) కాంట్రాక్టు చెల్లదని తెలిసినప్పుడు

2) ఉచితముగా చేయు ఉద్దేశము లేకుండా కొంత పనిచేసినప్పుడు

3) ఒక పార్టీ కాంట్రాక్టు బాధ్యతను నెరవేర్చుటకు నిరాకరించినప్పుడు

4) కాంట్రాక్టు బాధ్యతలను విడదీయుటకు వీలైనప్పుడు

**కేసు : ప్లాంచ్** Vs **కాల్‌బర్న్ (**Planch Vs Collaburn**) :** ఒక వారపత్రికలో, ఒక నవలను సీరియల్‌గా వ్రాసేందుకు X,Y ని నియమించాడు. కొన్ని వారాలు వ్రాసిన తరువాత ఆ పత్రిక ఆగిపోయినది. తాను వ్రాసిన మేరకు Y సొమ్మును వసూలు చేసుకోవచ్చునని కోర్టు వారు తీర్పు యిచ్చారు.

**9.2.4 ఇంజక్షన్ లేదా నిషేదాజ్ఞ కొరకు దావా వేయడం (**Suit for Injunction**) :** కోర్టు ఆర్డరును ఇంజక్షన్ అంటారు. ఒక పార్టీ ఒక పని చేయకుండుటకు కాంట్రాక్టు ఏర్పరుచుకుంటే, అలా చేయకుండా వుండుటకు కోర్టు నుండి తెచ్చిన ఉత్తర్వును 'ఇంజక్షన్' అంటారు. ఇంజక్షన్ తాత్కాలికమైనది కావచ్చును లేదా శాశ్వతమైనది కావచ్చును. కోర్టు కాంట్రాక్టు అమలును పర్యవేక్షించజాలనప్పుడు ఇంజక్షన్‌ను మంజూరు చేయవచ్చును.

**కేసులు :**

1. **వార్నర్ బ్రదర్స్** Vs **నెల్సన్ (**Warner Brothers Vs Nelson**) :** ఈ కేసులో 'నెల్సన్' అనే నర్తకి ఒక సంవత్సరంపాటు వార్నర్ బ్రదర్స్ థియేటరులో నాట్యప్రదర్శనలు ఇచ్చుటకు ఒప్పందం జరిగినది. తరువాత ఆమె ఆ సంవత్సరంలోనే X అనే వ్యక్తి తరపున నాట్య ప్రదర్శనలు ఇచ్చుటకు ఒప్పందము చేసుకున్నది. వార్నర్‌బ్రదర్స్ ఆమె అలా ప్రదర్శనలు ఇవ్వకుండా నిషేధపు ఉత్తర్వుకు దావా వేసినారు. కోర్టువారు ఇంజక్షన్ మంజూరు చేసినారు.

2. **మెట్రోపాలిటన్ ఎలక్ట్రిక్ సప్లయ్ కంపెనీ** Vs **గిండర్ (**Metropolitan Electric Supply Company Vs Ginder**) :** ఈ

కేసులో A అనే వ్యక్తి తనకవసరమయిన విద్యుత్‌ను మరెవ్వరి నుండి కాక మెట్రోపాలిటన్ కంపెనీ నుండి మాత్రమే తీసుకుంటానని వాగ్దానము చేసినాడు. తరువాత వేరొక కంపెనీ నుండి విద్యుత్‌ను A తీసుకొనుచుండగా ఈ దావా తెచ్చినారు. A అలా వేరొక కంపెనీ నుండి విద్యుత్ తీసుకొనుటను నిషేధిస్తూ కోర్టువారు ఇంజక్షన్ ఉత్తర్వు మంజూరు చేసినారు.

**9.2.5 నష్టపరిహారాలకు దావా (Suit for Damages) :** కాంట్రాక్టు భంగం జరిగినప్పుడు బాధితుడయిన పార్టీ నష్టపరిహారాలకు దావా వేయవచ్చును. బాధితుడయిన పార్టీకి సంబంధించిన నష్టాన్ని భర్తీ చేయుటకు ద్రవ్యరూపంలో కోర్టు యిచ్చే పరిహారాన్ని 'నష్టపరిహారం' అంటారు. నష్టపరిహారం ఇవ్వడంలో ఉద్దేశ్యం కాంట్రాక్టు భంగపరచిన పార్టీని శిక్షించడం కోసం కాదు. కాంట్రాక్టు భంగపరచకుండా నెరవేర్చియుండిన పక్షంలో రెండవ పార్టీ ఏ స్థితిలో వుంటాడో, ఆ స్థితిలో అతనిని వుంచడానికి నష్టపరిహారం ఇస్తారు.

## 9.3 నష్టపరిహార రకాలు :

నష్టపరిహారాలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చును.

1. సాధారణ నష్టపరిహారాలు (Ordinary Damages)
2. ప్రత్యేక నష్ట పరిహారాలు (Special Damages)
3. కక్షతో కూడుకున్న నష్టపరిహారాలు (Vindictive Damages)
4. నామమాత్రపు నష్టపరిహారాలు (Nominal Damages)

వీటిని ఈ క్రింద వివరించడమైనది.

1) **సాధారణ నష్టపరిహారాలు (Ordinary Damages) :** వీటినే 'సామాన్య నష్టపరిహారాలని' లేదా 'వాస్తవ నష్టపరిహారాలని' కూడా అంటారు. కాంట్రాక్టు భంగము వలన సామాన్య పరిస్థితులలో ప్రత్యక్షంగా, సహజంగా కలిగే నష్టానికై నష్టపోయిన పార్టీకి చెల్లించే పరిహారాలను 'సాధారణ నష్టపరిహారాలు' అంటారు. కాంట్రాక్టు భంగానికి సుదూర లేదా పరోక్ష ఫలితాలకు ఈ నష్టపరిహారాలు చెల్లించరు. ఈ నష్టపరిహారాల మొత్తాలను కాంట్రాక్టు భంగము జరిగిన తేదీ నాటికి లెక్కిస్తారు. తరువాత పరిస్థితిలో ముఖ్యమైన మార్పుల వలన నష్టము పెరిగినా, తగ్గినా పరిగణించరు.

**కేసులు :**

1. **స్మిత్ Vs గ్రీన్ (Smith Vs Green) :** ఈ కేసులో గ్రీన్ అనే వ్యక్తి ఆవును రోగాలు ఏమీ లేవనే హామీపై స్మిత్‌కు అమ్మినాడు. కాని ఆ ఆవు వాస్తవంగా 'గాలికుంటు' అనే అంటువ్యాధితో బాధపడుతున్నది. ఆ వ్యాధి వలన ఆ ఆవు చనిపోవుటయేగాక ఇతర ఆవులు కూడా చనిపోయినవి. నష్టపరిహారానికి స్మిత్, గ్రీన్‌పై దావా వేసినాడు. మొత్తం నష్టపరిహారానికి పరిహారము చెల్లించవలెనని కోర్టు తీర్పు యిచ్చినది.
2. **ఇజాక్ ఇల్లాహి Vs ఈస్టు ఇండియా రైల్వే కంపెనీ (Izak Illahi Vs East India Railway Company) :** ఈ కేసులో కాన్పూరు నుండి అలహాబాదుకు దీపావళి పండుగకు గాను టపాకాయలు పార్సిల్‌ను పంపడం జరిగింది. అయితే ఆ పార్సిల్ పండుగ గడచిన పిమ్మట అలహాబాదుకు చేరింది. అందువలన పోగొట్టుకొనిన లాభాలకు నష్టపరిహారం చెల్లింపుకై దావా వేయబడింది. నష్టపరిహారాన్ని యదార్థ నష్టానికి మాత్రమే చెల్లించవలసి వున్నదని, పోగొట్టుకొన్న

లాభాలకు చెల్లించనవసరం లేదని కోర్టు తీర్పు యిచ్చింది. కొనుగోలు ధరకు వాటిని అమ్మిన ధరకు గల తేడాను యదార్థ నష్టంగా పరిగణించారు.

2) **ప్రత్యేక నష్టపరిహారాలు** (Special Damages) : కాంట్రాక్టు ఏర్పరచుకునే సమయంలో రెండు పార్టీలకు తెలిసిన ప్రత్యేక పరిస్థితుల వలన సంభవించే కాంట్రాక్టు భంగం ద్వారా కలిగే నష్టానికై, నష్టపోయిన వారికి చెల్లించే పరిహారాలను 'ప్రత్యేక నష్టపరిహారాలు' అంటారు. ఈ నష్టపరిహారాలు సుదూరమైన, పరోక్షమైన ఫలితాలకు కూడా చెల్లిస్తారు. ఎందువలనంటే కాంట్రాక్టు భంగము వలన ఏర్పడే పరిణామాలు ముందుగా పార్టీలకు తెలిసి వుంటాయి. లాభార్జనావకాశాన్ని పోగొట్టుకోవడం మొదలైన సందర్భాలలో ఈ విధమైన నష్టపరిహారాన్ని క్లెయిమ్ చేయడం జరుగుతూ వుంటుంది.

**కేసులు :**

1. **హేడ్లీ** Vs **బాక్సెండేల్** (Hadly Vs Baxandale) : ఈ కేసులో ఒక మిల్లులోని ఒక యంత్ర భాగం విరిగిపోయింది. మిల్లు యజమాని విరిగిపోయిన యంత్రభాగాన్ని ఒక రవాణాదారునికి ఇచ్చి ఆ నమూనాలో కొత్తది చేయించి పట్టుకొని వచ్చుటకు కాంట్రాక్టు చేసుకొన్నారు. రవాణాదారుని అశ్రద్ధ వలన ఆ యంత్రభాగాన్ని తయారు చేసేవారికి చాలా ఆలస్యంగా అందచేసినాడు. ఆ కారణంగా యజమాని మిల్లును అనుకొన్న దానికంటే చాలా రోజులు మూసివేయాల్సి వచ్చింది. లాభాలను పొగొట్టుకొనవలసి వచ్చింది. ఈ విధంగా పోయిన లాభాలకు ప్రత్యేక నష్టపరిహారాన్ని కోరుతూ మిల్లు యజమాని, రవాణాదారునిపై దావా వేసినారు. అయితే ఆ యంత్రభాగము లేకపోతే మిల్లు పనిచేయడానికి వీలుండదనే విషయాన్ని రవాణాదారునికి తెలియజేయలేదు.

తీర్పు : ఆ యంత్రభాగం లేకపోతే మిల్లు పని చేయడానికి వీలుండదనే విషయాన్ని రవాణాదారునికి తెలియజేయలేదు. కనుక ప్రత్యేక నష్టపరిహారాన్ని కోరే హక్కు యజమానికి లేదని తీర్పు చెప్పినారు. సాధారణ నష్టపరిహారాన్ని చెల్లించమని రవాణాదారునిని కోర్టు ఆదేశించింది. ఈ సిద్ధాంతాన్నే ఇండియన్ కాంట్రాక్టు చట్టము సెక్షన్ 73 విశదీకరించినది.

2. సింప్సన్ Vs లండన్ నార్త్ వెస్టర్న్ రైల్వే కంపెనీ (Simpson Vs London North Western Railway Company): ఈ కేసులో సింప్సన్ పశుగ్రాసం వ్యాపారి. రైలు ద్వారా అతను కొన్ని శాంపుల్స్‌ను ఒక ప్రదేశానికి వ్యవసాయిక ప్రదర్శనలో ప్రదర్శించేందుకు పంపినాడు. ఆ ఉద్దేశాన్ని రైల్వే కంపెనీకి తెలియజేసినాడు. అయినప్పటికీ వ్యవసాయిక ప్రదర్శన అయిపోయిన తరువాతగాని ఆ శాంపిల్స్ చేరలేదు. ప్రదర్శనశాల వద్ద అతను పొగొట్టుకున్న లాభాలపై సింప్సన్ నష్టపరిహారాన్ని కోరుతూ దావా వేసినాడు. ప్రత్యేక పరిస్థితులు పార్టీలు కాంట్రాక్టులో ప్రవేశించేటపుడు వివరంగా తెలియజేయడం జరిగింది. కావున ప్రత్యేక నష్టపరిహారాన్ని ఇవ్వవలెనని కోర్టు తీర్పుయిచ్చినది. అనగా పొగొట్టుకున్న లాభాన్ని భర్తీ చేయవలెనని అర్థం.

3. మద్రాసు రైల్వే కంపెనీ Vs గోవిందరావు (Madras Railway Company Vs GovindaRao) : ఈ కేసులో ఒక సంతకు పంపించడానికి కొంత గుడ్డనూ, కుట్టుమిషన్‌ను ఒక టైలరు రైల్వే కంపెనీకి అప్పగించినాడు. అయితే ఆ వస్తువులు సంత అయిపోయిన తర్వాత చేరినవి. టైలర్ ప్రత్యేక నష్టపరిహారానికి దావా వేసినాడు. ప్రత్యేక పరిస్థితులను టైలర్ రైల్వే కంపెనీకి తెలియజేయలేదు. కాబట్టి, ప్రత్యేక నష్టపరిహారాన్ని ఇవ్వవలసిన అవసరం లేదని కోర్టు తీర్పు యిచ్చినది.

3) **కక్షతో కూడుకున్న నష్టపరిహారాలు** (Vindictive Damages) : ఈ నష్టపరిహారాలనే శిక్షాత్మక నష్టపరిహారాలని

కూడా అంటారు. కాంట్రాక్టు భంగం చేసిన వ్యక్తులను శిక్షించే ఉద్దేశంతో విధించే నష్టపరిహారాలనే కక్షతో కూడుకున్న నష్టపరిహారాలు అంటారు. ఈ నష్టపరిహార మొత్తం చాలా ఎక్కువ పరిమాణంలో వుంటుంది. కాంట్రాక్టు చెందిన పార్టీలు కాంట్రాక్టును భంగ పరచడను నిరుత్సాహపరచడానికి ఈ నష్టపరిహారం చాలా పెద్ద మొత్తంగా నిర్ణయిస్తారు. కక్షతో కూడుకున్న నష్టపరిహారంను ఈ దదిగువ పేర్కొన్న సందర్భాలలో వసూలు చేయవచ్చును.

1. వైవాహిక ఒప్పందములను భంగం చేయడం

2. ఖాతాదారుడి పేర బ్యాంకులో సరిపోయే నిల్వ వున్నప్పుడు కూడా చెక్కును బ్యాంకు నిరాకరించినప్పుడు, చెక్కు మొత్తం ఎంత స్వల్పమేతే, నష్టపరిహారం అంత అధికంగా వుంటుంది. ఈ విషయాన్ని మార్గెట్ Vs. విలియమ్స్ (Marget Vs Williams) కేసులో ధృవీకరించినారు.

4) **నామమాత్రపు నష్టపరిహారాలు** (Nominal Damages) : కాంట్రాక్టును భంగపరచడం వలన ఎదుటి పార్టీకి ఎలాంటి నష్టం కొన్ని సందర్భాలలో జరగకపోవచ్చును. అయితే పార్టీ యొక్క హక్కును గుర్తించడానికి, పరిరక్షించడానికి స్వల్ప మొత్తంను నష్టపరిహారంగా చెల్లిస్తారు. ఈ స్వల్ప నష్టపరిహార మొత్తాన్ని నామమాత్రపు నష్టపరిహారం అంటారు.

## 9.4 నష్టపరిహారాలు అంచనా వేయడానికి సూత్రాలు (Rules for Measuring Damages) :

కాంట్రాక్టు భంగం చేసినప్పుడు దానికి బాధ్యుడైన పార్టీ పై ఎదుట పార్టీ నష్టపరిహారం కోరుతూ దావా వేసినప్పుడు, ఎంత సొమ్ము పరిహారం కింద ఇవ్వవలెననే సమస్య సాధారణంగా ఉత్పన్నమవుతుంది. కొన్ని నష్టాలు కాంట్రాక్టు భంగానికి సుదూరంగా వుంటాయి. అటువంటి నష్టాలకు పరిహారం ఇవ్వనక్కరలేదు. కాంట్రాక్టు భంగం కారణంగా వున్న నష్టాలను గాని ఆ నష్టాలు పార్టీల దృష్టిలో వున్నవి గాని అయితేనే పరిహారం ఇవ్వవలెనని సాధారణ న్యాయసూత్రాలు పేర్కొంటున్నాయి. భారత కాంట్రాక్టు చట్టం సెక్షన్ 73 ప్రకారం “కాంట్రాక్టు పార్టీ ఆ కాంట్రాక్టు బాధ్యత నెరవేర్చకపోతే దాని వల్ల ప్రత్యక్షంగా రెండవ పార్టీకి కలిగిన నష్టాన్ని గాని, పార్టీలు కాంట్రాక్టు చేసుకునేటప్పుడు దాని భంగం వల్ల వారి దృక్పథంలో వున్న నష్టాన్ని గాని పూరించమని అడగవచ్చును. హేడ్లీ Vs బాక్సండేల్ కేసులో నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో పాటించవలసిన సూత్రాలను కోర్టు నిర్దేశించినది. ఈ సూత్రాలను ఆధారంగా ఇంగ్లండులోను, భారతదేశంలోను న్యాయస్థానాలు నష్టపరిహారాలను నిర్ణయిస్తున్నాయి. భారత కాంట్రాక్టు చట్టంలోని 73, 74, 75 సెక్షన్లు నష్టపరిహారాలను నిర్ణయించుటలో పాటించవలసిన సూత్రాలను పేర్కొన్నవి. నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో ఈ క్రింది న్యాయసూత్రాలను పరిగణనలోనికి తీసుకోవలెను.

1. కాంట్రాక్టు భంగపరచడం వలన పార్టీకి నష్టం వాటిల్లితే ఆ పార్టీ ఆర్థికంగా కాంట్రాక్టు భంగం జరగకపోతే వుండే పరిస్థితులలో ఉండేటట్లు చూడవలెను. అంటే కాంట్రాక్టు భంగం వలన ఎదుటి పార్టీకి ఆర్థికంగా ఎటువంటి నష్టం రాకూడదు.

2. కాంట్రాక్టు చేసుకున్నప్పుడే ఆ కాంట్రాక్టును భంగం చేస్తే జరిగే నష్టాన్ని ఊహించినప్పుడు లేదా కాంట్రాక్టు భంగం ఆ నష్టానికి సమీప కారణం అయినప్పుడు నష్టపరిహారం చెల్లించవలెను. ఒక వేళ నష్టానికి సుదూర కారణాలు వున్నప్పుడు నష్టపరిహారం చెల్లించనవసరం లేదు.

3. కాంట్రాక్టుకు భంగం వాటిల్లినప్పుడు నష్టపరిహారం కోరే హక్కు నష్టపోయిన వ్యక్తికి వుంటుంది. నష్టం కలగజేసిన వ్యక్తి, నష్టపోయిన వ్యక్తికి పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఏర్పడుతుంది.

4. కాంట్రాక్టు భంగం వల్ల ఏర్పడిన అసౌకర్యాన్ని దృష్టిలో వుంచుకొని నష్టాన్ని అంచనా వేయాలి. తాను నష్టపరిహారంను పొందటానికి చేసిన వ్యయాలను తిరిగి కాంట్రాక్టు భంగంకు కారకుడైన వ్యక్తి నుండి పొందవచ్చును.

5. నష్టపరిహారం చెల్లింపు అనేది కాంట్రాక్టు బాధ్యుడైన వ్యక్తిని శిక్షించడం కోసం కాదు. నష్టపరిహారం, వాస్తవంగా ఆ పార్టీ నష్టపోయిన మొత్తానికి మాత్రమే సరిపడా వుండాలి. గాయపడిన వ్యక్తి యొక్క నిరుత్సాహాన్ని, దెబ్బతిన్న మనోభావాలను పరిగణించరు. అయితే ఈ అంశాలను వైవాహిక కాంట్రాక్టులలో; ఖాతాదారు, బాంకరు కాంట్రాక్టులలో మాత్రమే పాటిస్తారు.

6. కాంట్రాక్టును భంగపరచడం వల్ల వాస్తవ నష్టం ఏమీ వాటిల్లకుంటే, ఎదుటి పార్టీ హక్కును పరిరక్షించడానికి స్వల్ప మొత్తంను నష్టపరిహారంగా చెల్లింపు చేస్తారు.

7. వస్తువుల అమ్మకం, కొనుగోలు కాంట్రాక్టులలో నష్టం ఒప్పందపు ధర, మార్కెట్ ధరకు గల వ్యత్యాసాల ఆధారంగా నిర్ణయిస్తారు. కావున నిర్ణీత తేదీన వస్తువులను సరఫరా చేయకున్నా లేదా ఇతరత్రా కాంట్రాక్టు భంగం వాటిల్లితే కొనుగోలుదారుడు ఎంత వరకు ధర వ్యత్యాసం చెల్లించవలసి వస్తుందో, ఆ మేరకు నష్టాన్ని నిర్ధారిస్తారు.

8. ఒక నిర్దిష్ట తేదీన తీసుకున్న మొత్తం వాపసు చేసే సమయంలో కాంట్రాక్టుకు భంగం వాటిల్లితే, చెల్లింపు వాయిదా తేదీ నుండి ఆ సొమ్ము చెల్లింపు జరిగే వరకు అసలు మొత్తంపై వడ్డీని కూడా లెక్కించాలి. ఈ వడ్డీ సొమ్మును నష్టపరిహారంగా పరిగణిస్తారు.

9. సేవ కాంట్రాక్టు భంగం విషయంలో, యజమాని నిర్ణీత కాలం కంటే ముందుగానే ఉద్యోగిని తొలగించవచ్చు. లేదా ఉద్యోగి గడువు కాలం కంటే ముందుగానే తన ఉద్యోగంకు రాజీనామా చేయవచ్చు. ఈ సందర్భంలో యజమాని అయినా, ఉద్యోగి అయినా, ఆ పూర్తికాని కాంట్రాక్టు కాలంకు మామూలుగా తీసుకునే జీతం ఆధారంగా నష్టపరిహారం నిర్ణయిస్తారు.

10. కాంట్రాక్టు భంగం జరిగితే ఎంత నష్టపరిహారం ఇవ్వాలో ముందుగా నిర్ణయించుకుంటే, అంతమేరకు నష్టపరిహారం చెల్లించాలి. ఆ నిర్ణీత మొత్తం కంటే ఎక్కువ మొత్తంను నష్టపరిహారంగా చెల్లించడం సాధ్యం కాదు.

11. ఊహాతీతమైన, జూద సంబంధ వ్యవహారాలపై నష్టపరిహారాల చెల్లింపు వుండదు.

12. వస్తువులను చేరవేసే వాహనాలు సకాలంలో రాకపోవడం వల్ల వస్తు నాణ్యత కోల్పోవచ్చు, సరుకు చెడిపోవచ్చు, మార్కెట్ పరిస్థితులు మారవచ్చు. ఇలాంటి సందర్భాలలో నష్టపోయిన వ్యక్తి ఆ సంబంధిత వ్యక్తి లేదా సంస్థ నుండి నష్టపరిహారం పొందవచ్చు.

## 9.5 శాస్తి పరిహారాలు, పూర్వ నిర్ధారిత పరిహారాలు (Penalty and Liquidated Damages) :

సాధారణంగా కాంట్రాక్టుకు భంగం వాటిల్లినప్పుడు నష్టపోయిన వ్యక్తి కోర్టులో దావా వేసుకున్నప్పుడు న్యాయస్థానములు నష్టపరిహారంను నిర్ణయిస్తాయి. కాని కాంట్రాక్టు కుదుర్చుకునే వ్యక్తులు, ఒప్పందం జరిగేటప్పుడు పార్టీలలో ఎదురు కాంట్రాక్టును భంగం చేసినను ఎంత మొత్తం నష్టపరిహారంగా చెల్లించాలో నిర్ణయించుకోవచ్చు. కాంట్రాక్టు ఒప్పందంలో ముందుగా నిర్ణయించుకున్న ఈ నష్టపరిహారంను రెండు రకాలుగా పేర్కొనవచ్చు.

ఎ) శాస్తి పరిహారం (Penalty)

బి) పూర్వ నిర్ధారిత పరిహారం (Liquidated Damages)

**1) శాస్తి పరిహారం (**Penalty**) :** దీనిని 'అపరాధ పరిహారము' లేదా 'శిక్షాపూర్వక పరిహారము' లేదా 'ప్రాయశ్చిత్త

పరిహారము' అని కూడా అంటారు. కాంట్రాక్టు భంగము వలన ఏర్పడటానికి వీలున్న నష్టాన్ని సమంజసంగా ముందుగా అంచనా వేసి నిర్ణయించకపోయినట్లయితే, అలాంటి పరిహారాన్ని శాస్తి పరిహారము అంటారు. ఈ పరిహారము వాస్తవంగా వచ్చిన నష్టానికంటే అనేక రెట్లు అధికంగా వుండవచ్చు. పరిహారము అమానుషంగాను, దుబారాగా కూడా ఉండవచ్చు. దీని ఉద్దేశము పార్టీలు కాంట్రాక్టు బాధ్యతను భంగము చేయకుండా భయపెట్టడమే. ఇది ఒక విధమైన బలప్రయోగమే.

2) **పూర్వ నిర్ధారిత పరిహారాలు (Liquidated Damages) :** కాంట్రాక్టు భంగము వలన ఏర్పడటానికి వీలున్న నష్టాలను సమంజసంగాను, సహేతుకంగాను ముందుగా అంచనా వేసి నిర్ణయించిన మొత్తాన్ని "పూర్వ నిర్ధారిత పరిహారము" అంటారు. యుక్తంగాను, సహేతుకంగాను, సమంజసంగాను, న్యాయంగాను పరిహారము వుంటే, అది పూర్వ నిర్ధారిత పరిహారమవుతుంది. అందుచే ఈ పరిహారము సమంజస పరిహారము అవుతుంది.

**శాస్తి పరిహారమునకు, పూర్వ నిర్ధారిత పరిహారమునకు తేడాలు :** ఈ రెండు రకాల పరిహారాలు కాంట్రాక్టు భంగమైనప్పుడు చెల్లించాల్సి వుంటుంది. ఈ రెండు రకాల పరిహారాల మధ్య ఈ క్రింది తేడాలు కలవు.

| శాస్తి పరిహారము | పూర్వనిర్ధారిత పరిహారము |
|---|---|
| 1. కాంట్రాక్టు భంగము వలన ఏర్పడే యదార్థ నష్టానికన్నా చాలా ఎక్కువగా వుంటుంది. | 1. కాంట్రాక్టు భంగము వలన ఏర్పడే యదార్థ నష్టానికి సమానంగా లేదా రమారమీగా వుంటుంది. |
| 2. కోర్టు శాస్తి పరిహారాన్ని తగ్గించుటకు అవకాశం కలదు. | 2. కోర్టు పూర్వ నిర్ధారిత పరిహారాన్ని తగ్గించుటకు వీలులేదు. |
| 3. ఇది న్యాయాత్మకంగా ఉండదు. | 3. ఇది న్యాయాత్మకంగా వుంటుంది. |
| 4. శాస్తి పరిహారపు మొత్తము ఎక్కువగాను, కొన్ని పరిస్థితులలో నెరవేర్చుటకు కష్టముగాను ఉంటుంది. | 4. ఇది సమంజసముగాను, వ్యక్తిని బాధించే స్థాయిలో వుండదు. |
| 5. వడ్డీ వ్యాపారంలో, వడ్డీ చక్రవడ్డీగాను, సాధారణ వడ్డీ కంటే ఎక్కువగా వుంటుంది. | 5. వడ్డీ వ్యాపారంలో వడ్డీ సామాన్య వడ్డీగా వుంటుంది. |
| 6. ఇది ఒక రకమైన బలప్రయోగం. | 6. ఇది బలప్రయోగం కోవకు చెందదు. |

**ఇంగ్లీషు న్యాయశాస్త్రము :** ఇంగ్లీషు న్యాయశాస్త్రము ప్రకారము పూర్వ నిర్ధారిత పరిహారాలను అమలు చేయవచ్చు. కాని శాస్తి పరిహారాలను అమలు పరచటానికి వీలులేదు. శాస్తిగా వుంచిన పరిహారాన్ని "ఈక్విటీ సూత్రాలు" అమలు పరచకూడదన్నాయి. అందుచే శాస్తి పరిహారంగా పేర్కొనిన సొమ్మును కాంట్రాక్టు భంగం అయితే ఎదురుపార్టీ కోరినా న్యాయస్థానాలు డిక్రీ ఇవ్వవు.

**కేసులు :**

1. **డన్‌లప్ న్యూ మేటిక్ టైరు కంపెనీ Vs న్యూగారేజి మోటారు కంపెనీ :** ఈ కేసులో డన్‌లప్ కంపెనీ వారు టైరులు, ట్యూబులు ఉత్పత్తి చేసి మోటారు కంపెనీ వారికి అమ్ముచుండిరి. మోటారు కంపెనీ వారు ఆ వస్తువులను ఇతరులకు కేటలాగు ధరకు తక్కువ అమ్మకూడదని, అలా ఒక వేళ అమ్మితే అమ్మిన ప్రతిటైరుకు 5 పౌనుల చొప్పున నష్టపరిహారము ఇవ్వడానికి ఒప్పందము చేసుకొనినారు. ఈ 5 పౌనులు పూర్వ నిర్ధారిత పరిహారముగానే వ్రాసుకొన్నారు. తరువాత మోటారు కంపెనీవారు కాంట్రాక్టు భంగము చేస్తూ 2 టైర్లు అమ్మినారు. అందుమీదట డన్‌లప్ కంపెనీ 10 పౌనులు పరిహారము కోరుతూ మోటారు కంపెనీ మీద దావా వేసినారు. ఆ సొమ్ము పూర్వ నిర్ధారిత పరిహారంగానే భావిస్తూ డిక్రీ యిచ్చినారు. ఈ కేసులో తీర్పు చెబుతూ రెండు రకాల పరిహారాలకు తేడా

చెప్పినారు. ఆ సొమ్ము శాస్తిగా పరిహారం అని వ్రాసుకుంటే అది అమలుపరచకూడదని చెప్పినారు. అట్లాకాక పూర్వ నిర్ధారిత పరిహారంగా వ్రాసుకుంటే అది అమలుపరచవచ్చునని చెప్పినారు.

2. **కెంబల్ Vs ఫారెస్ :** ఈ కేసులో ఒక్కొక్క రాత్రికి 4 పౌనులు ఇచ్చే విధంగా వాది, ప్రతివాదిని హోస్యగానిగా నియమించినారు. కాంట్రాక్టు షరతులను ఉల్లంఘిస్తే 1000 పౌనులు లిక్విడేటెడ్ పరిహారాలుగా చెల్లించుకోవలెనని కాంట్రాక్టులో వుంది. దానిని కోర్టువారు పెనాల్టీగా భావించి దావాను కొట్టివేసినారు.

**భారతీయ న్యాయశాస్త్రము :** భారతీయ న్యాయశాస్త్రములో శాస్తి పరిహారాలకు, పూర్వ నిర్ధారిత పరిహారాలకు బేధము లేదు. కాంట్రాక్టు చట్టము సెక్షన్ 74 ప్రకారము పార్టీలు కాంట్రాక్టులో ఏర్పాటు చేసుకొన్న మొత్తాన్ని మించకుండా కోర్టువారు సముచితమైన నష్టపరిహారాన్ని మంజూరు చేయవచ్చును. పార్టీలు నిర్ణయించుకొనిన నష్టపరిహారము కన్న ఎక్కువ ఇవ్వకూడదు. కాని తక్కువ యివ్వవచ్చును. ఈ సిద్ధాంతాన్ని సుప్రీంకోర్టువారు పతీచంద్ Vs బాలకృష్ణదాస్ కేసులో ధృవీకరించారు.

వడ్డీ గురించి చేసుకున్న కాంట్రాక్టులో ఫలానా తేదీకి సొమ్ము వాపసుచేయకపోతే, ఎక్కువ వడ్డీ రేటు చొప్పున ఇస్తారనే కాంట్రాక్టు అంశము శాస్తి పరిహారము కిందనే భావించబడుతుందని నాగేశ్వరస్వామి Vs విశ్వసుందరరావు కేసులో తీర్పునిచ్చారు. అదే విధంగా విపరీతంగా ఎక్కువ వడ్డీరేటు పెట్టడం శాస్తి పరిహారం అవుతుందని కృష్ణచరణ్ Vs సనత్‌కుమార్ అనే కేసులో తీర్పు ఇచ్చినారు.

కాని కోర్టుముందు హాజరు కావడానికి గాని, శాంతిని కాపాడటానికి గాని వ్రాతమూలకంగా కోర్టులకు ఇచ్చిన "జామీను పత్రాలలో" గాని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చేసుకున్న కాంట్రాక్టు పత్రాలలోగాని చేస్తానన్న పనిచేయ్యలేకపోతే ఇస్తామన్న సొమ్ములు శాస్తి పరిహారం తాలూకు స్వభావము కలవైనా, అలాంటి సొమ్ము మాత్రం వసూలు చేయవచ్చును. ఉదా : 'A' అనే వ్యక్తి కోర్టుకు ఫలానా తేదీన హాజరవుతానని, అట్లా హాజరు కాకపోతే రూ. 5,000/- చెల్లిస్తానని జామీను పత్రం (Bail Bond) వ్రాస్తే, ఆ రోజున హాజరు కాకపోతే రూ. 5,000/- వసూలు చేయవచ్చును.

## 9.6 కఠిన పదాలు (Glossary) :

1. **ఇంజక్షన్ (Injunction) :** ఒక పార్టీ ఒక పనిచేయకుండా ఉండుటకు కాంట్రాక్టు ఏర్పరచుకుంటే అలా చేయకుండా వుండుటకు కోర్టు ఇచ్చిన ఆర్డరును 'ఇంజక్షన్' అంటారు.

2. **శాస్తి పరిహారము (Penalty) :** దీనినే ప్రాయశ్చిత పరిహారము అంటారు. కాంట్రాక్టు భంగము వలన ఏర్పడటానికి వీలున్న నష్టాన్ని సమంజసంగా ముందుగా నిర్ణయించనప్పుడు అటువంటి పరిహారాన్ని శాస్తి పరిహారమంటారు.

3. **పూర్వ నిర్ధారిత పరిహారాలు (Liquidated Damages) :** కాంట్రాక్టు భంగం వలన ఏర్పడటానికి వీలున్న నష్టాలను సమంజసంగా ముందుగా అంచనా వేసి నిర్ణయిస్తే, అటువంటి మొత్తాన్ని పూర్వ నిర్ధారిత పరిహారమంటారు.

## 9.7 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. కాంట్రాక్టును రద్దు పరచడం.

2. కక్షతో కూడుకున్న నష్టపరిహారం అంటే ఏమిటీ ?

3. నామమాత్రపు నష్టపరిహారం అంటే ఏమిటీ ?

4. ఇంజక్షన్ అంటే ఏమిటీ ?

**10 మార్కుల ప్రశ్నలు :**

1. శాస్తి పరిహారం, పూర్వ నిర్ధారిత పరిహారం అంటే ఏమిటీ ? వీటి మధ్య గల వ్యత్యాసాలను తెలియచేయుము.

2. Hardly Vs Bayandale కేసులోని సూత్రాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించి, అది మన దేశంలో ఎంతవరకు వర్తిస్తుందో వివరించుము.

3. నష్టపరిహారాలను అంచనా వేయడానికి పాటించవలసిన సూత్రాలేంటి ?

**20 మార్కుల ప్రశ్నలు :**

1. కాంట్రాక్టు భంగం జరిగినప్పుడు బాధితుడైన పార్టీకి లభించే వివిధ నష్టపరిహారాలు ఏమిటో వివరించండి.

## 9.8 చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Bare Act | - | Indian Contract Act, 1872 |
| 2. | Elements of Mercantile Law | - | N.D. Kapoor |
| 3. | Mercantile Law | - | R.C. Chawla & K.C. Garg |
| 4. | వ్యాపార న్యాయశాస్త్రము | - | సాయిబాబా, ఖేతన్, బసవరాజా, శ్రీప్రభ |
| 5. | వ్యాపార న్యాయశాస్త్రము | - | తెలుగు అకాడమి |


– డాక్టర్ యస్. నరహరికుమార్

పాఠం : 10

# వస్తు విక్రయ చట్టం, 1930

## లక్ష్యం :

ఈ పాఠం పూర్తి అయ్యేసరికి మీరు ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

ఎ) భారతీయ వస్తు విక్రయ చట్టం, 1930 యొక్క విశిష్టతలు,

బి) అమ్మకం కాంట్రాక్టు యొక్క ఆవశ్యకాలు తెలుస్తాయి.

సి) అమ్మకం కాంట్రాక్టుకు, ఇతర అంశాలకు పోలికలు - వ్యత్యాసాలు అర్థమవుతాయి.

డి) ఈ చట్టంలో పేర్కొనబడిన ప్రచ్ఛన్న షరతులు - పూచీలు

ఇ) వస్తుస్వామ్యం బదిలీ; డెలివరీ నిబంధనలు

ఎఫ్) యజమానులు కానివారు సరుకులను అమ్మటం;

జి) అమ్మకందారు, కొనుగోలుదారుల విధులు, హక్కులు

హెచ్) చెల్లింపు జరగని అమ్మకందారు యొక్క ప్రత్యేక హక్కులు;

ఐ) వేలం అమ్మకానికి చెందిన నియమాలు విశదమవుతాయి

## విషయ సూచిక :


10.1 విషయ పరిచయము

10.2 వస్తు విక్రయ చట్టం యొక్క ప్రత్యేకతలు

10.3 వస్తువులు

10.3.1 ప్రస్తుత వస్తువులు

10.3.2 భవిష్యత్తు వస్తువులు

10.3.3 ఆగంతుక వస్తువులు

10.4 అమ్మకం కాంట్రాక్టు - ఆవశ్యకాలు

10.4.1 రెండు పార్టీలు

10.4.2 ధర

10.4.3 వస్తుస్వామ్యం బదిలీ

10.4.4 వస్తువులు

10.4.5 ఇతర అంశాలు

10.5 అమ్మకానికి, అమ్మకం నిమిత్తం ఒప్పందానికి వ్యత్యాసాలు

10.6 అమ్మకానికీ, ఇతర అంశాలకు పోలికలు - వ్యత్యాసాలు

10.6.1 అమ్మకం - ఏజెన్సీ

10.6.2 అమ్మకం - బెయిల్‌మెంట్

10.6.3 అమ్మకం - అద్దె కొనుగోలు ఒప్పందం

10.7 షరతులు - పూచీలు

10.7.1 షరతు

10.7.2 పూచీ

10.7.3 షరతు ఉల్లంఘన పూచీ ఉల్లంఘనగా భావించడం

10.7.4 ప్రచ్ఛన్న షరతులు

10.7.5 ప్రచ్ఛన్న పూచీలు

10.8 'కొనుగోలుదారే జాగ్రత్త వహించాలి' అనే సిద్ధాంతం

10.8.1 మినహాయింపులు

10.9 వస్తుస్వామ్యం బదిలీ

10.9.1 స్వామ్యంతోపాటు నష్టభయం బదిలీ

10.10 యజమానులు కాని వారు వస్తువులు అమ్మటం

10.10.1 మినహాయింపులు

10.11 అమ్మకపు కాంట్రాక్టును నెరవేర్చటం

10.11.1 డెలివరీకి సంబంధించిన నిబంధనలు

10.12 అమ్మకందారు బాధ్యతలు, హక్కులు

10.12.1 అమ్మకందారు విధులు

10.12.2 అమ్మకందారు హక్కులు

10.13 కొనుగోలుదారు బాధ్యతలు హక్కులు

10.13.1 కొనుగోలుదారు విధులు

10.13.2 కొనుగోలుదారు హక్కులు

10.14 చెల్లింపు జరగని అమ్మకందారుకున్న ప్రత్యేకమైన హక్కులు

10.14.1 చెల్లింపు జరగని అమ్మకందారు లీన్ హక్కు

10.14.2 రవాణాలో నిలుపుదల హక్కు

10.14.3 తిరిగి అమ్మే హక్కు

10.15 వేలం అమ్మకము

10.16 నమూనా ప్రశ్నలు

10.17 చదువదగిన గ్రంథాలు

## 10.1 విషయ పరిచయము :

ప్రతి వ్యక్తి ప్రతిరోజూ పాలు, కూరగాయలు, మందుల వంటి వస్తువులను కొనుగోలు చేస్తాడు, వినియోగించుకుంటాడు. వాటిలో ఎదురయ్యే కష్టనష్టాలను తన అనుభవం ప్రకారం పరిష్కరించుకుంటాడు. వస్తు విక్రయానికి సంబంధించిన న్యాయాత్మక విషయాలు అన్ని రకాల ప్రజలకు చాలా అవసరం. వస్తు విక్రయానికి సంబంధించిన న్యాయసూత్రాలు భారత కాంట్రాక్టు చట్టం 1872 యొక్క అధ్యాయం VII లో వుండేవి. కాలక్రమేణా వస్తు విక్రయాలు అధికమై, వాటికి సంబంధించిన పై నిబంధనలు అపరిపూర్ణంగా పరిణమించేసరికి వాటిని రద్దుచేసి ప్రత్యేకంగా 1930వ సంవత్సరంలో వస్తు విక్రయ చట్టం రూపొందించారు. దీనిని ప్రధానంగా ఇంగ్లీషు వస్తు విక్రయ చట్టం 1893 ఆధారంగా తయారు చేశారు. అవసరమైన చోట్ల మన దేశానికి అవసరమైన మార్పులు, చేర్పులు ప్రవేశపెట్టారు.

వస్తు విక్రయ చట్టం, 1930లో 66 సెక్షన్లు వున్నాయి. ఇది జమ్మూ & కాశ్మీర్ రాష్ట్రం మినహా మిగిలిన దేశమంతటా వర్తిస్తుంది. ఈ చట్టం భారతీయ కాంట్రాక్టు చట్టానికి అనుబంధం అయినదే కాని స్వతంత్రమైనది కాదు. కాంట్రాక్టు చట్టంలోని కాంట్రాక్టు ఆవశ్యకాలు అమ్మకపు కాంట్రాక్టుకు కూడా అవసరమే. ముఖ్యంగా పార్టీల అర్హత, స్వేచ్ఛా సమ్మతి వుండడం, వర్తక నిరోధక ఒప్పందాలు, జూదపు ఒప్పందాలు కాకపోవటం, నష్టపరిహారాల చెల్లింపు విషయంలో నిబంధనలు వస్తువుల అమ్మకం విషయంలో కూడా వర్తిస్తాయి.

## 10.2 వస్తు విక్రయ చట్టం యొక్క ప్రత్యేకతలు :

వస్తువుల అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాలలో 1930 సం॥పు వస్తు విక్రయ చట్టం ప్రధానమైన మార్పులను తీసుకొచ్చింది. వాటిలో ముఖ్యమైనవి :

ఎ) అమ్మకం (Sale), అమ్మకం నిమిత్తం ఒప్పందం (agreement to sell)ల మధ్య వ్యత్యాసాలను ఈ చట్టం స్పష్టం చేసింది.

బి) వస్తువులపై స్వామ్యం అమ్మకందారు నుంచి, కొనుగోలుదారుకు ఎప్పుడు బదలాయింపు అవుతుంది అనే దానికి ఈ చట్టం అత్యంత ప్రాధాన్యమిచ్చింది. ఒకవేళ పార్టీలు తమలోతాము ఈ విషయమై స్పష్టమైన సూత్రాలు అంగీకరించి కాంట్రాక్టులో వ్రాసుకోకపోతే ఏ సూత్రాలు పాటించవలసి వుంటుందో వస్తు విక్రయ చట్టం వివరిస్తుంది.

సి) షరతు (condition)లకు, పూచీ(warranty)లకు వున్న విభేదం ఈ చట్టం విశదీకరిస్తుంది.

డి) వస్తువులు రవాణాలో వుండగా చెల్లింపుజరగని అమ్మకందారు వాటిని ఆపేయటం అనే హక్కును, వేలం అమ్మకానికి సంబంధించిన సూత్రాలను ఈ చట్టం విపులీకరించింది.

ఇ) అమ్మకందారు యజమాని కాకపోయినా ఏ ఏ సందర్భాలలో అతడు చేసిన వస్తు విక్రయం కొనుగోలుదారుకు పూర్తి యాజమాన్యపు హక్కులను సంక్రమింపచేస్తుందో అనే విషయాలకు సంబంధించిన సూత్రాలన్నీ ఒకే చోట పేర్కోనడం జరిగింది.

## 10.3 వస్తువులు :

వస్తు విక్రయచట్టం సెక్షన్ 2(7) ప్రకారం వస్తువులు అంటే "వ్యాజ్య సంపాద్యహక్కులు" (Actionable Claims), మరియు ద్రవ్యం మినహా స్టాకులు, షేర్లు, పెరుగుతున్న పంటలు, గడ్డి, అమ్మకానికి పూర్వంగాని, అమ్మకపు కాంట్రాక్టు కింద గాని భూమి

నుంచి వేరు చేసి అమ్మకం చేయటానికి వీలుగా వుండి, భూమికి అంటుకొని గాని, భూమిలో భాగంగా గాని వున్న వస్తువులతో సహా అన్ని రకాలైన **చరాస్తులు** అని నిర్వచించడం జరిగింది.

వ్యాజ్య సంపాద్యహక్కులు మరియు ద్రవ్యం నిజానికి సరుకులు కావు. వ్యాజ్య సంపాద్య హక్కు అనగా కోర్టు ద్వారా వుపయోగించుకోదగిన హక్కు. ఒక వ్యక్తి నుంచి రావలసిన బాకీని వేరొకరు వ్యాజ్య సంపాద్య హక్కుగా మాత్రమే పరిగణించగలరు. సరుకులవలే అమ్మలేరు. ఇతరులకు బదలాయింపు మాత్రమే చేయగలరు. ద్రవ్యం విషయంలో విదేశీ ద్రవ్యాన్ని వస్తువుగా భావించవచ్చు.

ఒప్పందం ప్రకారం అమ్మకం నిమిత్తం కొట్టి వేసిన చెట్లు కూడా వస్తువులే. అంతేగాక నీరు, విద్యుచ్ఛక్తి, గ్యాస్ కూడా వస్తువులే అని గుర్తించవలెను. సరుకులు లేక వస్తువులను ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చును.




**10.3.1 ప్రస్తుత వస్తువులు :** అమ్మకం జరిగే సమయానికి అమ్మకందారు యొక్క స్వంతమై వుండి, అతని స్వాధీనంలో ప్రస్తుతం వున్న వస్తువులను ప్రస్తుత వస్తువులు అంటారు. వీటిని తిరిగి మూడు విధాలుగా విభజించవచ్చును.

ఎ) **నిర్దిష్ట వస్తువులు (Specific goods) :** అమ్మకం సమయానికి గుర్తించిన మరియు అంగీకరించిన వస్తువులను నిర్దిష్ట వస్తువులు అంటారు. ఉదా : రామ్ వద్ద 3 బజాజ్ స్కూటర్లు పాతవి వున్నాయి. వాటిలో AP7D 5850 అనే స్కూటరును కొనటానికి శ్యామ్ ఒప్పందం చేసుకున్నాడు. ఇది నిర్దిష్ట వస్తువుల కొనుగోలు కొరకై ఒప్పందము.

బి) **వేరుపరచిన వస్తువులు (Ascertained goods) :** సామాన్య అర్థంలో నిర్దిష్ట వస్తువులకు, వేరు పరచిన వస్తువులకు వ్యత్యాసం లేదు. కాని అమ్మకం కాంట్రాక్టు ఏర్పరచిన తరువాత వస్తువులను గుర్తించటం, వేరు పరచటం జరుగుతుంది. ఉదాహరణకు రామ్ వద్ద 4 కొత్త సైకిళ్ళు వున్నాయి. వాటిలో ఏదో ఒక సైకిల్ కొనటానికి శ్యామ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం తరువాత రామ్ ఒక సైకిల్‌ను వేరు చేశాడు. ఆ సైకిల్ వేరుపరచిన వస్తువు.

సి) **వేరుపరచని వస్తువులు (Unascertained goods) :** అమ్మకం చేసే సమయానికి నిర్దిష్టంగా గుర్తించబడని వస్తువులను వేరుపరచని వస్తువులు అంటారు. ఉదా : రామ్ వద్ద బిపిటి ధాన్యం వున్నాయి. వాటిలో మూడు బస్తాల ధాన్యాన్ని కొనటానికి శ్యామ్ ఒప్పందం చేసుకున్నాడు. ధాన్యపు రాశి నుంచి మూడు బస్తాలను తూకం వేసి ప్యాకింగ్ చేసే వరకు అవి వేరుపరచని వస్తువులే.

**10.3.2 భవిష్యత్తు వస్తువులు :** అమ్మకం సమయానికి అమ్మకందారు వద్ద లేని వస్తువులను భవిష్యత్తు వస్తువులు అంటారు. వీటిని అమ్మకందారు తయారు చేయటంగాని, సేకరించటంగాని చేయవలెను. ఉదా : రామ్ రాబోయే సీజన్‌లో తన తోటలో పండించబోయే మామిడి కాయలను అమ్మటానికి శ్యామ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఇది భవిష్యత్తు వస్తువులకు సంబంధించినది.

**10.3.3 ఆగంతుక వస్తువులు :** అనిశ్చితమైన ఘటన జరగటం లేక జరగకపోవటం ఆధారంగా అమ్మకం ఆధారపడి వుండే వస్తువులను ఆగంతుక వస్తువులు అంటారు. ఉదా : రామ్ ఒక అపురూప వజ్రాన్ని ప్రస్తుత యజమాని నుంచి సేకరించిన తరువాత శ్యామ్‌కు అమ్ముతానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. అపుడు వజ్రం ఆగంతుక వస్తువు. దానిని రామ్ సేకరిస్తేనే శ్యామ్‌కు అమ్మకం చేయగలుగుతాడు.

## 10.4 అమ్మకం కాంట్రాక్టు - ఆవశ్యకాలు :

సాధారణ కాంట్రాక్టు న్యాయసూత్రాలు అమ్మకం కాంట్రాక్టుకు కూడా వర్తిస్తాయి. అమ్మకపు కాంట్రాక్టులలో ప్రతిపాదన, స్వీకృతులు వుండాలి. కాంట్రాక్టులలోకి ప్రవేశించే అర్హత, స్వేచ్ఛా సమ్మతి పార్టీలకు వుండాలి. ధర ప్రతిఫలంగా వస్తు యాజమాన్యం బదిలీ కావాలి. వస్తు విక్రయ చట్టం సెక్షన్ 5 ప్రకారం అమ్మకపు కాంట్రాక్టు ఈ క్రింది పద్ధతులలో వుండాలి.

ఎ) వస్తువులు ఒక ధరకు కొనటానికి, అమ్మటానికి ప్రతిపాదన, స్వీకృతి వుండాలి.

బి) వస్తువులు తక్షణమే అప్పగించటానికి గాని, అమ్మకపు సొమ్ము తక్షణమే చెల్లించటానికి గాని, లేదా

సి) వస్తువుల అప్పగింత, అమ్మకపు సొమ్ము వాయిదాల వారీగా చెల్లించటానికి గాని లేదా వస్తువులను అప్పగించటం, అమ్మకపు సొమ్ము చెల్లింపు రెండూ భవిష్యత్తులో జరిగేటట్లుగానీ కాంట్రాక్టులో ఏర్పాటు వుండవచ్చు.

వస్తు విక్రయ చట్టం సెక్షన్ 4 ప్రకారం "అమ్మకందారు కొనుగోలుదారుకు ఒక ధరకు వస్తువులలో స్వామ్యం బదిలీ చేస్తూ లేదా తర్వాత బదిలీ చేయటానికి ఖరారు చేసుకునే కాంట్రాక్టే అమ్మకపు కాంట్రాక్టు. ఇందులో అమ్మకపు కాంట్రాక్టు అనే అంశం విస్తృత అర్థంలో వుంటుంది. ఈ పదంలోకి అమ్మకం, అమ్మకం నిమిత్తం ఒప్పందం అనే రెండు పదాలు వస్తాయి.

నిర్ణీత ధరకు వస్తువులలోని స్వామ్యం బదిలీ కావడం అమ్మకపు కాంట్రాక్టు నిర్వచనంలో కీలకమైన అంశం. సరుకుల అమ్మకానికి చేసుకునే కాంట్రాక్టు ముఖ్యాంశాలు ఈ విధంగా వున్నాయి.

**10.4.1 రెండు పార్టీలు :** అమ్మకపు కాంట్రాక్టులో యాజమాన్యం యొక్క మార్పు ఇమిడి వుంటుంది. కనుక అమ్మకందారు, కొనుగోలుదారు వేర్వేరు వ్యక్తులై వుండాలి. ఒక వ్యక్తి తనకు తానే సరుకులను అమ్ముకోలేడు. **ఉదా :** ఒక భాగస్వామ్య సంస్థ రద్దయింది. సరుకు నిల్వతో సహా మిగులు ఆస్తులన్నిటినీ భాగస్తులు పంచుకున్నారు. భాగస్తులందరూ ఉమ్మడి యజమానులు కనుక యిది అమ్మకంలోకి రాదని తీర్పు వెలువడింది. (స్టేట్ ఆఫ్ గుజరాత్ Vs రమణ్‌లాల్ & కం (1965)).

అయితే ఒక సహభాగస్వామి (part owner) మరొక సహభాగస్వామికి తన వాటాను అమ్మకం చేయవచ్చు. ఉదా : రామ్, శ్యామ్‌లు ఒక కారుకు ఉమ్మడి యజమానులు. కారులో తన వాటాను రామ్, శ్యామ్‌కు అమ్మవచ్చు. అపుడు శ్యామ్ స్వంత యజమాని అవుతాడు.

ఒకే వ్యక్తి ఒకేసారి కొనుగోలుదారుడు, అమ్మకం దారుడు కాలేడనే సూత్రానికి కొన్ని మినహాయింపులున్నాయి.

ఎ) ఏదైనా డిక్రీ అమలు చేయటంలో భాగంగా ఎవరివైనా సరుకులు అమ్మకం అవుతుంటే, అతనికిష్టమైతే అతనే కొనుక్కోవచ్చు.

బి) తాకట్టు పెట్టుకున్న వ్యక్తి. డబ్బు రానందువల్ల తాకట్టులో వున్న వస్తువులను అమ్ముతుంటే, తాకట్టు పెట్టిన వ్యక్తి కావాలంటే తన వస్తువులను తానే కొనుక్కోవచ్చు.

**10.4.2 ధర :** అమ్మకపు కాంట్రాక్టులో ప్రతిఫలం ధర. ఇది ఎప్పుడూ ద్రవ్యరూపంలోనే వుండాలి. వస్తువుల కోసం వస్తువులను మార్చుకోవటం వస్తుమార్పిడి అవుతుంది కానీ అమ్మకం కాదు. అయితే, ప్రతిఫలం కొంతమేరకు వస్తువులలోను, కొంతమేరకు ద్రవ్యంలోను వుండడానికి అభ్యంతరం లేదు. ఉదా : A, B కి 100 క్వార్టర్ల బార్లీని ఒక క్వార్టరుకు కొంత రేటు చొప్పున అమ్మేందుకు, అందుకుగాను 52 ఎద్దులను నిర్ణీత ధర ప్రకారం బదిలీ చేసి మిగిలిన మొత్తానికి నగదు చెల్లిస్తాననడం అమ్మకం కాంట్రాక్టు అవుతుందని న్యాయస్థానం నిర్ణయించింది. (ఆల్ డ్రిడ్జి Vs జాన్సన్ (1857)).

**10.4.3 వస్తుస్వామ్యం బదిలీ :** వస్తు విక్రయ చట్టానికి ప్రాణం వంటిది వస్తుస్వామ్యం బదిలీ. ఇక్కడ స్వామ్యం అంటే యాజమాన్యం. వస్తువుల స్వాధీనంతో సంబంధం లేకుండా యాజమాన్యపు హక్కును బదిలీ చేయడం గాని, బదిలీ చేస్తాననటం గాని వుంటేనే అమ్మకపు కాంట్రాక్టు ఏర్పడుతుంది.

**ఉదాహరణలు :**

ఎ. రామ్ శ్యామ్‌కు తన స్కూటర్‌ను 10,000కు అమ్మి, తన యాజమాన్యపు హక్కును వదులుకుంటానన్నాడు. ఇది అమ్మకపు ఒప్పందం.

బి. సురేష్ రమేష్‌కు తన స్కూటర్‌ను ఒక వారం రోజులపాటు ఉపయోగించటానికి అనుమతి యిచ్చాడు. ఇది వస్తువుల స్వాధీనపు బదిలీయే గానీ యాజమాన్యపు బదిలీకాదు. కనుక అమ్మకపు ఒప్పందం కాదు.

**10.4.4 వస్తువులు :** అమ్మకపు కాంట్రాక్టుకు సంబంధించిన అంశాలు వస్తువులై వుండాలి. అవి ఒకరి నుంచి మరొకరికి బదిలీ కావాలి. కదిలించటానికి వీలులేని వస్తువులు వస్తు విక్రయ చట్టం పరిధిలోకి రావు. అట్టి స్థిరాస్తులు, ఆస్తుల బదలాయింపు చట్టం కిందకు వస్తాయి.

**10.4.5 ఇతర అంశాలు :** ప్రస్తుతం అమలులో వున్న న్యాయశాస్త్ర అంశాలకు లోబడి అమ్మకపు కాంట్రాక్టు లిఖిత పూర్వకంగా వుండవచ్చు లేదా ప్రచ్ఛన్నమైనదిగా వుండవచ్చు. చెల్లుబాటు అయ్యే కాంట్రాక్టుకు వుండవలసిన అన్ని షరతులు అమ్మకపు కాంట్రాక్టుకు కూడా వుండాలి.

## 10.5 అమ్మకానికీ, అమ్మకం నిమిత్తం ఒప్పందానికి వ్యత్యాసాలు :

వస్తు విక్రయ చట్టం సెక్షన్ 4 ప్రకారం "అమ్మకందారు, కొనుగోలుదారుకు ఒక ధరకు వస్తువులలోని స్వామ్యం బదిలీ చేస్తూ, లేదా తరువాత బదిలీ చేయటానికి ఖరారు చేసుకునే కాంట్రాక్టును" అమ్మకపు కాంట్రాక్టు అంటారు.

సెక్షన్ 4(3) ప్రకారం "వస్తువులలోని స్వామ్యం వెంటనే అమ్మకందారు నుంచి కొనుగోలుదారుకు బదిలీ కాకుండా భవిష్యత్తులో బదిలీ అయ్యే ఏర్పాటున్నప్పుడు లేదా అనుకున్న షరతులు అమలు తరువాతనే ఆ బదిలీ జరగవలెననుకొన్నప్పుడు దానిని అమ్మకం నిమిత్తం ఒప్పందం అని మాత్రమే" అంటారు. వస్తువులలోని స్వామ్యం బదిలీకావటానికి అనుకున్న కాలవ్యవధి తీరిపోతేగాని, అనుకున్న షరతులు అమలు జరిగితే గాని అప్పుడు అమ్మకం నిమిత్తం అగ్రిమెంట్, అమ్మకపు కాంట్రాక్టుగా మారుతుంది. (సెక్షన్ 4(4)).

అమ్మకానికి, అమ్మకం నిమిత్తం అగ్రిమెంట్‌కు వున్న ప్రధానమైన భేదం మొదటి దానిలో వస్తువుల యాజమాన్యం వెంటనే అమ్మకందారు నుంచి కొనుగోలుదారుకు బదిలీ కావటం, రెండవ దానిలో అలా జరగక పోవటమేనని గుర్తించవచ్చు. ఇదే విషయాన్ని **సేల్స్ టాక్స్ ఆఫీసర్, ఫిలిబిత్ బుధప్రకాష్ జయప్రకాష్ (1954)** అనే కేసులో స్పష్టం చేశారు. అమ్మకం నిమిత్తం ఒప్పందం, అమ్మకపు కాంట్రాక్టు కాదు కనుక దానిపై అమ్మకం పన్ను కట్టనవసరం లేదని తీర్పు యిచ్చినారు.

అమ్మకం కాంట్రాక్టుకూ, అమ్మకం నిమిత్తం అగ్రిమెంట్‌కూ వున్న ప్రధానమైన వ్యత్యాసం వస్తువులస్వామ్యం బదిలీ కావటం గురించే అయినప్పటికీ అనుబంధంగా వున్న యితర విషయాలు కూడా గమనించదగినవి.

ఎ) **కాంట్రాక్టు స్వభావం :** అమ్మకపు కాంట్రాక్టు అనేది అమలు జరిగిన ప్రతిఫలయుక్తమైన కాంట్రాక్టు కాగా అమ్మకం నిమిత్తం అగ్రిమెంట్ అనేది అమలు జరపవలసి వున్న ప్రతిఫలయుక్తమైన కాంట్రాక్టు.

బి) **వస్తుస్వామ్యం బదిలీ :** అమ్మకం కాంట్రాక్టులో వస్తువులపై యాజమాన్యపు హక్కు అమ్మకందారు నుంచి కొనుగోలుదారుకు తక్షణమే బదిలీ అవుతుంది. కాని అమ్మకం నిమిత్తం ఒప్పందంలో వస్తువులపై యాజమాన్యం భవిష్యత్తులో ఏదో ఒక తేదీనాడు బదిలీ అవుతుంది.

సి) **హక్కుల స్వభావం :** అమ్మకం వలన కొనుగోలుదారుకు సర్వాన్వయ హక్కులు (Rights in rim) ఏర్పడతాయి కాని అమ్మకం నిమిత్తం అగ్రిమెంట్‌లో వ్యక్తి అన్వయ హక్కులు (Rights in personam) మాత్రమే ఏర్పడుతాయి.

డి) **సరుకు నష్టం :** సెక్షన్ 26 ప్రకారం యాజమాన్యపు హక్కులను వెన్నంటి నష్టభయం వుంటుంది. కనుక అమ్మకం వ్యవహారంలో వస్తువులు అమ్మకందారు స్వాధీనంలో వున్నప్పటికీ వాటిపై యాజమాన్యపు హక్కు కొనుగోలుదారునిదవటం వల్ల ప్రమాదవశాత్తూ అవి నశిస్తే ఆ నష్టాన్ని కొనుగోలుదారే భరించవలెను.

అమ్మకం నిమిత్తం ఒప్పందం విషయంలో యాజమాన్యపు హక్కు అమ్మకందారు వద్దనే వుంటుంది కనుక వస్తువులు కొనుగోలుదారు స్వాధీనంలో వున్నప్పటికీ ప్రమాదవశాత్తూ అవి నశిస్తే ఆ నష్టం అమ్మకందారే భరించవలెను.

ఇ) **అమ్మకందారుచే కాంట్రాక్టు భంగం :** అమ్మకం కాంట్రాక్టు విషయంలో ఒక వేళ అమ్మకందారు సరుకులను డెలివరీ చేయనంటే వస్తువుల కోసం కొనుగోలుదారు దావా తేవచ్చును. ఈ విషయం తెలిసిన మూడవ వ్యక్తికి అమ్మకందారు సరుకులను అమ్మినచో అలాంటి వ్యక్తి నుంచి కొనుగోలుదారు సరుకులను స్వాధీనపరచుకోవచ్చు. అయితే మూడవ వ్యక్తి మంచి నమ్మకంతో కొనుగోలు చేస్తే మాత్రం మొదటి కొనుగోలుదారుకు భర్తీ అవకాశం వుండదు.

అమ్మకం నిమిత్తం ఒప్పందం విషయంలో అమ్మకందారు కాంట్రాక్టు భంగానికి పాల్పడితే కొనుగోలుదారు నష్టపరిహారానికి మాత్రమే దావా తేగలడు కాని వస్తువుల స్వాధీనానికి దావా తేలేడు.

ఎఫ్) **కొనుగోలుదారుచే కాంట్రాక్టు భంగం :** అమ్మకం కాంట్రాక్టు వ్యవహారంలో కొనుగోలుదారు కాంట్రాక్టు భంగానికి పాల్పడితే అమ్మకందారు వస్తువుల ధర నిమిత్తం దావా తేవచ్చు. అమ్మకం నిమిత్తం ఒప్పందం విషయంలో కొనుగోలుదారు కాంట్రాక్టు భంగానికి పాల్పడితే అమ్మకందారు ధర నిమిత్తం కాక నష్టపరిహారం కోసం మాత్రమే దావా తేగలడు.

జి) **తిరిగి అమ్మే హక్కు :** అమ్మకం కాంట్రాక్టు విషయంలో అమ్మకందారు వస్తువులను తిరిగి అమ్మలేడు. ఒక వేళ అమ్మితే మొదటి కొనుగోలుదారుడు దావా వేసి సరుకులను స్వాధీనం చేసుకోవచ్చు. అమ్మకం నిమిత్తం ఎగ్రిమెంట్ విషయంలో పూర్తి అమ్మకం జరిగేలోగా అమ్మకందారు వేరొక కొనుగోలుదారుకు అమ్మకం చేయవచ్చు. కొత్త కొనుగోలుదారుకు దీనివల్ల మంచి హక్కులు కూడా వస్తాయి. మొదటి కొనుగోలుదారు నష్టపరిహారాలకు మాత్రమే కోర్టును ఆశ్రయించగలడు.

**హెచ్) అమ్మకందారు దివాలా :** అమ్మకం విషయంలో అమ్మకందారు దివాలా తీసినచో కొనుగోలుదారు దివాలా తీసిన అమ్మకం దారు న్యాయప్రతినిధుల నుంచి తాను కొనుగోలు చేసిన వస్తువులను పొందగలడు.

అమ్మకం నిమిత్తం ఒప్పందం వ్యవహారంలో కొనుగోలుదారు ధర చెల్లించినప్పటికీ ఋణదాతవలే దామాషా చెల్లింపు ఎంత వస్తే అంత రాబట్టుకోగలడు కాని వస్తువుల అప్పగింత కోరలేడు.

ఐ) **కొనుగోలుదారు దివాలా :** అమ్మకం కాంట్రాక్టు కొనుగోలుదారు దివాలా తీసినచో అతని న్యాయప్రతినిధులు అమ్మకందారు నుంచి సరుకుల డెలివరి కోరగలరు. వస్తువుల ధర యింకా చెల్లించనిచో కొనుగోలుదారు ఎస్టేటు నుంచి దామాషా చెల్లింపు కోసం అమ్మకందారును అడుగగలడు.

అమ్మకం నిమిత్తం ఒప్పందం విషయంలో కొనుగోలుదారు అమ్మకపు సొమ్ము చెల్లించకుండా దివాలా తీస్తే అతనికి వస్తువులు అప్పగించనని అమ్మకందారు చెప్పవచ్చును. కొనుగోలుదారు తరపున పనిచేసే అఫీషియల్ రిసీవర్ పూర్తి క్రయ ధనం చెల్లిస్తేనే వస్తువుల అప్పగింత కోరగలడు.

జె) **అమ్మకపు పన్ను :** అమ్మకం పూర్తి అయింది కనుక అమ్మకం కాంట్రాక్టులో అమ్మకం పన్ను విధిస్తారు. అమ్మకం నిమిత్తం ఒప్పందం విషయంలో అమ్మకం పూర్తి కాలేదు కనుక అమ్మకపు పన్ను విధించరు.

## 10.6 అమ్మకానికీ ఇతర అంశాలకు పోలికలు - వ్యత్యాసాలు :

అమ్మకపు కాంట్రాక్టునూ, అమ్మకం నిమిత్తం ఒప్పందాన్ని పోల్చినట్లుగానే అమ్మకం కాంట్రాక్టును కొన్ని యితర కాంట్రాక్టులతో పోల్చటానికి వీలున్నది. అలాంటి వాటిలో ఏజెన్సీ కాంట్రాక్టు, బెయిల్‌మెంట్ కాంట్రాక్టు, అద్దె, కొనుగోలు ఒప్పందాలతో పోలికలు గమనించదగినవి.

**10.6.1 అమ్మకం - ఏజెన్సీ** : అమ్మకపు కాంట్రాక్టు వేరు, ఏజెన్సీ కాంట్రాక్టు వేరు. అమ్మకపు సొమ్ము చెల్లించి గాని, చెల్లిస్తానని వాగ్దానము చేసిగాని, వస్తుస్వామ్యం బదిలీ పొందితే అది అమ్మకం అవుతుంది. ఏజెన్సీలో కూడా వస్తు బదిలీ వుంటుంది గాని ఆ వస్తువులను అమ్మటానికి మాత్రమే ఏజెంట్‌కు ప్రిన్సిపల్ నుంచి హక్కు సంక్రమిస్తుంది. అసలైన యాజమాన్యం ప్రిన్సిపల్ వద్దనే వుంటుంది. వాటిని అమ్మిన ఏజెంట్‌కు అమ్మకపు సొమ్మును ప్రిన్సిపల్‌కు లెక్కచెప్పి అప్పగించవలసిన బాధ్యత వుంటుంది. అందుచేత ఎవరు కొనుగోలుదారో, ఎవరు ఏజెంటో అనే విషయం కాంట్రాక్టులోని షరతులననుసరించి నిర్ణయించవలసి వుంటుంది.

**10.6.2 అమ్మకం - బెయిల్‌మెంట్ :** అమ్మకము, బెయిల్‌మెంట్ వేరు వేరు వ్యవహారాలు.

అమ్మకపు కాంట్రాక్టు జరిగితే వస్తువుల స్వామ్యం అమ్మకందారు నుంచి కొనుగోలుదారుకు బదిలీ అవుతుంది. బెయిల్‌మెంట్ కాంట్రాక్టు కింద, అట్లాగాక, ఒక వ్యక్తి తన వస్తువులను ఏదో ఒక ప్రయోజనానికి తాత్కాలికంగా మరొకరికి అప్పగించి, ఆ ప్రయోజనం కాగానే వాటిని తిరిగి తన స్వాధీనం చేసుకుంటాడు. మరొక విధంగా చెప్పవలెనంటే అమ్మకపు కాంట్రాక్టులో వస్తు స్వామ్యము బదిలీ కాగా బెయిల్‌మెంట్‌లో వస్తుస్వాధీనం మాత్రమే బదలాయింపు అవుతుంది. అమ్మకపు కాంట్రాక్టులో వస్తువులను కొన్నవారు కొన్ని వస్తువులను స్వేచ్ఛగా ఉపయోగించుకునే వీలుండగా, బెయిల్‌మెంట్ కాంట్రాక్టులో వస్తువులను పొందిన బెయిలీ, బెయిలర్ యిచ్చిన సూచనలకు లోబడి మాత్రమే వస్తువులను వినియోగపరచవలెను. అంతేగాక, ఒకసారి అమ్మిన వస్తువులను సాధారణంగా వాపస్‌చేసే ప్రసక్తి వుండదు. బెయిల్‌మెంట్‌లో మాత్రం అనుకొన్న ప్రయోజనము లేదా కాల వ్యవధి అయిపోగానే వస్తు ధరలను బెయిలర్‌కు స్వాధీనపరచవలెను.

**10.6.3 అమ్మకము - అద్దె కొనుగోలు ఒప్పందము :** అద్దె కొనుగోలు కాంట్రాక్టులో వస్తువులను అద్దెకు తీసుకుంటారు. కొన్ని

వాయిదాలు చెల్లించి, ఆఖరు వాయిదా చెల్లించిన తర్వాత కొనుగోలుదారుడు స్వంతదారుడవుతాడు. మొదట అద్దె చెల్లిస్తూ, ఆఖరికి కొనుగోలుచేస్తాడు. అద్దె చెల్లించేటప్పుడు వస్తువులు తన స్వాధీనంలో వున్నా, వాటిని యితరులకు అమ్మి అట్లా కొన్నవారికి హక్కు సంక్రమింపచేయగల శక్తి అతనికి వుండదు.

అద్దె కొనుగోలు కాంట్రాక్టు, అమ్మకపు కాంట్రాక్టు ఒక దానినొకటి పోలివున్నా రెండూ ఒకటి కాదు. రెండింటికి ఈ దిగువ బేధాలున్నాయి.

ఎ) అమ్మకపు కాంట్రాక్టు చేసుకోగానే వస్తువుల స్వామ్యము కొనుగోలుదారుకు బదిలీ అవుతుంది. అద్దె కొనుగోలు కాంట్రాక్టులో అట్లాగాక చివరి వాయిదా మొత్తంగాని, అనుకొన్న మరే మొత్తంగాని ఆఖరున చెల్లించిన తరువాతనే వస్తుస్వామ్యము కొనుగోలుదారుకు సంక్రమిస్తుంది.

బి) అద్దె - కొనుగోలు కాంట్రాక్టులో రెండు భావాలున్నాయి.

1) వస్తువులు కొనుగోలుదారుకు స్వాధీనపరచటం జరుగుతుంది గనుక బెయిల్‌మెంట్ వుంటుంది.

2) కొనుగోలుదారు తనకిచ్చిన హక్కును వినియోగించుకున్న తరువాత అది అమ్మకపు కాంట్రాక్టుగా మారుతుంది. ఈ హక్కును వినియోగించుకోనంతవరకు, కొనుగోలుదారు కేవలం అద్దెకు పుచ్చుకొన్న వాని హోదాలోనే వుంటాడు. ఆ కాలంలో వస్తువులు బెయిల్‌మెంట్ కింద అతని స్వాధీనంలో వుంటాయి.

## 10.7 షరతులు - పూచీలు :

కిషోర్, నరేష్ అనే టీవీ డీలర్ నుండి ఒక కలర్ టీవీ కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చి చూచిన తర్వాత దానిలో తనకు కావలసిన ఛానల్ రావడం లేదని తెలుసుకున్నాడు. అతడు యింకేమీ చేయలేడు.

మరొక సందర్భం కిషోర్, నరేష్ అనే టీవీ డీలర్‌తో తనకు కావలసిన ఛానల్ వచ్చే కలర్ టీవీ కోరాడు. నరేష్ టీవీని అమ్మగా కిషోర్ ఇంటికి తీసుకువచ్చి చూస్తుండగా, టీవీ పనిచేయటం మానేసింది. ఇప్పుడు కిషోర్ టీవీని వాపస్ చేసి ధరను పొందవచ్చు. అంతేగాక పరిశీలించగా కిషోర్ కొనుక్కున్న టీవీలో వున్న పిక్చర్ ట్యూబ్ పాతదని తేలింది. ఇది వాగ్దాన భంగం. చెల్లించిన ధరకు నష్ట పరిహారాన్ని కోరే వీలుంది.

కొనుగోలు విషయంలో సాధారణ సూత్రం ఏమంటే "కొనుగోలుదారే జాగ్రత్త వహించాలి". కాని అమ్మకందారు స్పష్టమైన షరతు లేక పూచీని యిచ్చినపుడు దానికతడు కట్టుబడి వుండాలి. అట్టి షరతులు లేక పూచీల ప్రకారం వస్తువులు లేని పక్షంలో అమ్మకందారు బాధ్యత వహించాలి. అమ్మకందారు వైపు నుంచి స్పష్టమైన ఆదేశాలు లేనప్పటికీ చట్టరీత్యా, వస్తువుల విషయంలో కొన్ని ప్రచ్ఛన్నమైన షరతులు, పూచీలు వుంటాయి. వాటిని ఉల్లంఘిస్తే అమ్మకందారుకు డబ్బు వాపస్ తప్పదు.

వస్తు విక్రయచట్టం షరతులను, పూచీలను వేరు వేరు అంశాలుగా గుర్తించింది. రెండింటిని అమ్మకందారే చేసినప్పటికీ వాగ్దాన స్వభావంలో వ్యత్యాసం వుంది. ఒప్పందానికి ఆధారమైన అంశాన్ని షరతుగాను, అనుబంధమైన అంశాన్ని పూచీగాను భావించాలి.

## షరతులు - పూచీలు - నిర్వచనము :

**10.7.1 షరతు :** వస్తు విక్రయ చట్టం సెక్షన్ 12(2) ప్రకారం కాంట్రాక్టు యొక్క ప్రధాన ప్రయోజనానికి అవసరమైన అంశాన్ని షరతు అంటారు. దీనిని ఉల్లంఘిస్తే కొనుగోలుదారుకు భర్తీ చేయలేని నష్టం ఏర్పడుతుంది. అందుచేత కాంట్రాక్టును రద్దుచేసి సరుకులను వాపసు చేసి చెల్లించిన ధరను తిరిగి పొందటానికి కొనుగోలుదారుకు వీలుంటుంది.

ఉదాహరణకు ఆనంద్, బలరామ్ అనే మోటారుసైకిల్ డీలర్‌తో ఎక్కువ మైలేజి వచ్చే మోటారుసైకిల్ కావాలని చెప్పగా బలరామ్ పల్సర్ అనే మోడల్‌ను సూచించాడు. అతని మాట ప్రకారం ఆనంద్ పల్సర్ మోటార్‌సైకిల్ కొన్నాడు. కొన్న తరువాత మైలేజి విషయంలో, తీసుకున్నది మంచి మోడల్ కాదని తెలుసుకున్నాడు. ఇక్కడ ఎక్కువ మైలేజి రావడం ప్రధాన షరతు కనుక ఆనంద్ పల్సర్‌ను వాపసు చేసి డబ్బు వాపస్ పొందవచ్చు.

**10.7.2 పూచీ :** వస్తు విక్రయ చట్టం సెక్షన్ 12(3) ప్రకారం కాంట్రాక్టు ప్రయోజనానికి అనుబంధంగా వుండే విషయాన్ని పూచీ అంటారు. పూచీని ఉల్లంఘించడం వల్ల కాంట్రాక్టును రద్దే చేయడంకాక నష్టపరిహారం మాత్రమే కోరే వీలుంటుంది.

ఉదాహరణకు తానొక ఆరోగ్యమైన ఆవును కొనదలిచానని ఆనంద్ బలరామ్‌తో అన్నాడు. అప్పుడు బలరామ్ ఒక ఆవును చూసి అది ఆరోగ్యకరమైనదని, అయిదు లీటర్ల పాలను యిస్తుందనీ చెప్పాడు. తీరా కొనుగోలు చేసిన తరువాత ఆవు మూడు లీటర్ల పాలు మాత్రమే యిస్తుందని తేలింది. కొనుగోలుదారు యొక్క ముఖ్య విషయం ఆరోగ్యమైన ఆవును కొనటం. అతడు అడగకుండానే అమ్మకందారు పాల విషయం పేర్కొన్నాడు. కనుక యిది ద్వితీయశ్రేణి ప్రాధాన్యత గల అంశం. పూచీ భంగంగా దీనిని భావించవచ్చు.

**కాంట్రాక్టులో ఏదైనా అంశం షరతు అవుతుందా లేక పూచీ అవుతుందా అనే విషయం కాంట్రాక్టు నిర్మాణంలోని సందర్భాన్ని బట్టి ఆధారపడుతుంది.** పార్టీలు ఏ పదాలు వాడారు అనే దానిపై ఆధారపడి వుండదు. కాంట్రాక్టులో పూచీగా భావించే అంశం నిజానికి షరతు కావచ్చు. (దూధియా ఫారెస్ట్ కోఆపరేటివ్ లేబరర్స్ అండ్ ఆర్డినెన్స్ కంపెనీ లిమిటెడ్ Vs మహమ్మద్ సయీద్ అండ్ అబ్దుల్ రహమాన్ కంపెనీ(1980)).

**10.7.3 షరతు ఉల్లంఘన పూచీ ఉల్లంఘనగా భావించడం :** కొన్ని సందర్భాలలో షరతు ఉల్లంఘన జరిగినా, దానిని పూచీ ఉల్లంఘనగానే భావించవలసిన అవసరమేర్పడుతుందని వస్తువిక్రయ చట్టం సెక్షన్ 13లో పేర్కొనడం జరిగింది.

ఎ) ఉల్లంఘించబడిన అంశం షరతే అయినా దాని ఉల్లంఘన వలన నష్టపడేవ్యక్తి కాంట్రాక్టును రద్దుచేసుకునే హక్కు వుండి కూడా అందుకు పూనుకోక నష్టపరిహారంతో మాత్రమే సరిపెట్టుకోవచ్చు. ఇది కొనుగోలుదారు ఇష్టంపై ఆధారపడి వుంటుంది. అయితే ఒకసారి ఈ విధంగా హక్కు వదులుకుంటే తిరిగి పొందలేడు.

బి) అమ్మకపు కాంట్రాక్టు అవిభాజ్యంగా వుండి, దాని కింద అన్నీగాని, కొన్నిగానీ వస్తువులను కొనుగోలుదారు అంగీకరించినపుడు అమ్మకందారు షరతును ఉల్లంఘించినా అదిపూచీ ఉల్లంఘనగానే భావింపబడి నష్టపరిహారం కోరవచ్చుగానీ కాంట్రాక్టు రద్దు చేసుకోలేడు.

**10.7.4 ప్రచ్ఛన్న షరతులు - పూచీలు :** పార్టీలు తమ కాంట్రాక్టులో స్పష్టమైన షరతులను, పూచీలను ఎన్నింటినైనా చేర్చుకోవచ్చు. అయితే ప్రతి అమ్మకం కాంట్రాక్టులోను వస్తు విక్రయచట్టం కొన్ని షరతులను, పూచీలను ప్రచ్ఛన్నంగా ఏర్పరచింది. వాటిని సెక్షన్లు **14** నుంచి **17** వరకు పొందుపరచడం జరిగింది.

1. **హక్కులకు సంబంధించిన షరతు (సెక్షన్ 14(ఎ)) :** అమ్మకపు కాంట్రాక్టు చేసుకున్నప్పుడు అమ్మిన వస్తువులపై హక్కు అమ్మకందారుకు వున్నదనేది ప్రచ్ఛన్నమైన షరతు. అలాగే అమ్మకం నిమిత్తం ఒప్పందం విషయంలో వస్తువులపై స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ అయ్యేటప్పటికీ అమ్మకందారుకు ఆ హక్కు సంక్రమించి వుంటుందనేది ప్రచ్ఛన్నమైన షరతు. ఇది నిజంకాదని ఋజువు అయితే షరతు ఉల్లంఘన జరుగుతుంది. దాంతో కాంట్రాక్టు రద్దవుతుంది.

**కేసులు :**

(ఎ) రోలెండ్ Vs. దివాల్ **(1923)** అనే కేసులో D అనే వ్యక్తి నుంచి R ఒక కారును కొన్నాడు. **4** మాసాలపాటు ఉపయోగించాడు. ఆ కారు పై D కి హక్కులేదు. అసలు యజమానికి R కారును వాపసు చేయవలసి వచ్చింది. హక్కుకు సంబంధించిన ప్రచ్ఛన్నమైన షరతుకు భంగం కలిగినందువల్ల **4** నెలలపాటు కారు వాడుకున్నప్పటికీ చెల్లించిన డబ్బును తిరిగి పొందే హక్కు R కుందని కోర్టు తీర్పునిచ్చింది.

(బి) నిబ్లెట్ లిమిటెడ్ Vs. కన్‌ఫెక్షనర్స్ మెటీరియల్స్ కంపెనీ **(1921)** అనే కేసులో A 3000 టిన్నుల పాలను యు.ఎస్.ఎ నుంచి కొనుగోలు చేసెను. వీటిలో 1000 టిన్నులపై "నిస్‌లీ" బ్రాండ్ వున్నది. పాలను "నెస్లే" బ్రాండ్ పేరుతో అమ్మకం చేసే పాల ఉత్పత్తిదారు తన ట్రేడ్ మార్కుకు భంగం కలిగిందని క్లైయిమ్ చేయగా, టిన్నులపై వున్న లేబుళ్ళనన్నింటినీ తొలగించి పాలను తక్కువ రేట్లకు అమ్మవలసి వచ్చింది. అమ్మకందారు సరుకులపై అమ్మకం హక్కు కలదనే షరతును ఉల్లంఘించినాడని కోర్టు తీర్పునిచ్చింది.

(సి) కాంట్రాక్టు ఏర్పాటు సమయంలో అమ్మకపుదారునికి హక్కు లేనప్పుడు, తర్వాత హక్కు సంక్రమించినపుడు మరియు హక్కులో లోపం వున్నప్పుడు హక్కులోపం ప్రథమ కొనుగోలుదారుకు మరియు తరువాతి కొనుగోలుదారులకు వర్తిస్తుంది (**బటర్ వర్త్** Vs. **కింగ్స్‌వే మోటార్స్ (1954)**).

2. **వర్ణన ద్వారా అమ్మకం (సెక్షన్ 15) :** సరుకులను వర్ణించి అమ్మినపుడు సరుకులు ఆ వర్ణనకు సరిపోవాలనేది ప్రచ్ఛన్నమైన షరతు. వస్తువులను వర్ణిస్తూ ఏదైనా అంశం అమ్మకపు కాంట్రాక్టులో వున్నచో అది ప్రచ్ఛన్న షరతును ఏర్పరుస్తుంది. **ఉదాహరణకు** "గింజలు లేని ద్రాక్ష" సప్లయ్ చేయటానికి ఒప్పందం కుదిరిన తరువాత, అమ్మిన ద్రాక్షలో గింజలుంటే, కొనుగోలుదారుకు వాపసు చేసే హక్కుంటుంది. వర్ణన ద్వారా అమ్మకంలో దిగువ అంశాలు కలవు.

(ఎ) కొనుగోలు చేయు వ్యక్తి సరుకులను చూడకుండా అమ్మిన వ్యక్తి వర్ణనపై ఆధారపడి సరుకులను కొనుగోలుచేసినప్పుడు, ఆ సరుకులు వర్ణనకు భిన్నంగా వున్నప్పుడు ఆ సరుకులను వాపస్ చేయవచ్చును. వోర్లే Vs విప్ (1900) అనే కేసులో 'V' అను వ్యక్తి 'W'కు ఒక యంత్రం అమ్మినాడు. 'W' ఆ యంత్రాన్ని చూడలేదు. 'V' ఆ యంత్రం నూతన యంత్రమని వర్ణించి చెప్పెను. కాని వాస్తవంగా అది పాత యంత్రం. 'W' ఆ యంత్రాన్ని వాపస్ చేసి ప్రతిఫలాన్ని తిరిగి పొందవచ్చునని న్యాయస్థానం తీర్పునిచ్చెను.

(బి) కొనుగోలుదారుడు సరుకులను చూసినప్పటికీ అమ్మకందారుని వర్ణనపై ఆధారపడి కొనుగోలు చేసినప్పుడు, ఆ సరుకులు వర్ణనకు భిన్నంగా వున్న యెడల వాటిని వాపస్ చేయవచ్చు. **నికోల్సన్ మరియు వెన్** Vs. **స్మిత్ మారియెట్ (1947)** అనే కేసులో 'S' వేలం ద్వారా నాప్‌కిన్స్ మరియు టేబుల్ బట్టలను 17వ శతాబ్దానికి చెందినవని వర్ణించి అమ్మినాడు. ఆ వర్ణనను నమ్మి 'B' వాటిని కొనుగోలు చేసినాడు. ఆ తరువాత అవి 18వ శతాబ్దానికి చెందినవని తెలిసింది. 'B' ఆ కాంట్రాక్టును రద్దు చేయవచ్చునని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

(సి) సరుకుల ప్యాకింగ్ వర్ణనలో భాగమైనపుడు వ్యత్యాసం వున్న యెడల వాటిని వాపసు చేయవచ్చును. **మూర్ అండ్ కంపెనీ Vs లాండోవర్ అండ్ కంపెనీ (1921)** అనే కేసులో 'M', 'L' కు 3000 టిన్నుల పండ్లను, ఒక్కొక్క కేసులో 30 టిన్నులు వుండేలా ప్యాకింగ్ చేసి అమ్ముతానని చెప్పాడు. కానీ వాస్తవంగా సగం కన్నా ఎక్కువ కేసులలో 24 టిన్నులు మాత్రమే వుండెను. 'L' సరుకులను వాపసు చేయవచ్చునని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

3. **నమూనా (Sample) ద్వారా అమ్మకం (సెక్షన్ 17) :** అంగీకరించిన నమూనా ప్రకారం సరుకులను సప్లయ్ చేయవలసివచ్చినపుడు క్రింద పేర్కొనిన షరతులు ప్రచ్ఛన్నంగా వుంటాయి.

ఎ) నమూనాలో ప్రకారం వున్న నాణ్యతతో మొత్తం సరుకులు సరిపోవాలి.

బి) సరుకుల్ని సరిచూచుకునే సబబైన అవకాశం కొనుగోలుదారుకివ్వాలి.

సి) సముచితమైన రీతిలో పరీక్షించగా, సరుకులో విక్రయార్హత కోల్పోయేటంతటి లోపాలేవి వుండకూడదు.

**డ్రమ్మండ్ అండ్ సన్స్ Vs. వాన్ ఇన్‌జన్ (1887)** అనే కేసులో 'S' మిశ్రమ ఉన్ని కోట్ క్లాత్‌ను నమూనా ద్వారా 'B'కి అమ్మెను. తరువాత పరిశీలించగా క్లాత్‌లో వున్న అంతర్గత లోపం వల్ల కోటు కుట్టించుకోవటానికి పనికి రాకుండా పోయింది. కొనుగోలుదారు క్లాత్‌ను వాపస్ చేయవచ్చునని కోర్టుతీర్పునిచ్చింది.

4. **నమూనా ద్వారా, మరియు వర్ణన ద్వారా అమ్మకం (సెక్షన్ 15) :** నమూనా ద్వారా, వర్ణన ద్వారా సరుకుల్ని అమ్మినపుడు అటు నమూనాతోను, ఇటు వర్ణనతోను సరిపోయినట్లుగా సరుకులు వుండాలి. లేని యెడల వాటిని వాపస్ చేయవచ్చు.

**వాలిస్ Vs ప్రాట్ (1911)** అనే కేసులో ఒక వ్యక్తి మార్కెట్‌కు పోయి శాంపిల్ చూపిస్తూ తనకు 'ఇంగ్లీష్ శెయిన్ ఫాయిన్' విత్తనాలు కావలెనని అడిగినాడు. అమ్మకందారు విత్తనాలు యిచ్చినాడు. ఇచ్చేటపుడు ఏమీ వర్ణించలేదు. కాని కొన్నతరువాత అవి 'జెయింట్ శెయిన్ ఫాయిన్' విత్తనాలని తేలింది. శాంపిల్, వర్ణనలకు అనువైన విత్తనాలను అమ్మకందారు యివ్వలేదు కనుక షరతు ఉల్లంఘన జరిగిందని కోర్టువారు, కొనుగోలుదారు కాంట్రాక్టును రద్దుచేసి నష్టపరిహారం కోరవచ్చునని తీర్పు యిచ్చినారు.

5. **విక్రయార్హత (Merchantability) సెక్షన్ 16(2) :** సరుకులకు విక్రయార్హత లక్షణం వుండవలెను. అనగా అవి మార్కెట్‌లో ఆ పేరుతో చలామణి అగుటకు అర్హతను కలిగి వుండాలి. అయితే కొనుగోలుదారుడు సరుకులను పరీక్షించినపుడు లోపాలు తెలిసే అవకాశం వున్న ఎడల ఈ ప్రచ్ఛన్న షరతు వర్తించదు.

**జాక్సన్ Vs రోటెక్స్ మోటార్‌సైకిల్ అండ్ కంపెనీ లిమిటెడ్ (1910)** అనే కేసులో కొనుగోలుదారుడు కొన్ని మోటారు హారన్లు కొనుగోలు చేశాడు. వాటిలో చాలా వరకు సరైన ప్యాకింగ్ లేని కారణంగా వంకరలు తిరిగిపోయి, మిగిలినవి అజాగ్రత్తగా తయారుచేయడం వల్ల పాలిష్ పోయి వున్నాయి. ఆ వస్తువులకు విక్రయార్హత నాణ్యము లేదని, అందువల్ల కొనుగోలుదారు హారన్లు వాపసు చేసి నష్టపరిహారము పొందవచ్చని కోర్టు తీర్పునిచ్చింది.

**గ్రాంట్ Vs ఆస్ట్రేలియాన్ నిట్టింగ్ హుల్స్ (1936)** అనే కేసులో 'G', 'A' కంపెనీ నుంచి 'అండర్‌పాంట్లు' కొన్నాడు. వాటిని వేసుకోగా వాటిని తయారుచేసిన గుడ్డపై వున్న కొన్ని విషపదార్థాల వలన అతనికి చర్మవ్యాధి

వచ్చింది. అమ్మిన వస్తువులకు విక్రయార్హత లేదని, అందువలన అమ్మిన కంపెనీ కొనుగోలుదారుకు నష్టపరిహారం చెల్లించవలెనని కోర్టు తీర్పునిచ్చింది.

**టార్‌నెట్ Vs బీర్స్ అండ్ సన్స్ (1919)** అనే కేసులో 'T' కొవ్వు (glue) కొనటానికి 'B' గోదాముకు వెళ్ళినాడు. B కొవ్వును పీపాలలో నింపి వుంచినాడు. వాటిని చూసి పరీక్షించి చూసుకుని నిర్ణయించుకోమని B చెప్పినాడు. కాని, T ఆ పీపాల మూతను తీయకుండానే పైపైనే పరీక్షించి వస్తువులు కొన్నాడు. తరువాత సరుకు తాను అనుకున్న నాణ్యత కాదని, వాపసు తీసుకోమని దావా తెచ్చినాడు. సరుకు నాణ్యత పరీక్షించకపోవడం 'T' అశ్రద్ధ వల్ల జరిగింది కాబట్టి విక్రయార్హత షరతు ఉల్లంఘన జరగలేదని కోర్టు తీర్పు యిచ్చింది.

6. **కిరాణా వస్తువులకు వినియోగానుకూలత :** భారతీయ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 111 ప్రకారం కిరాణా వస్తువులను అమ్మినపుడు అవి భోజనానికి అనుకూలంగా వుండవలెననే నిబంధన వున్నది. తినటానికి కొనే వస్తువులు, అట్లాంటి వస్తువులను తయారుచేసే పదార్థాలు (నూనె, పప్పు, పిండి మొదలైనవి) అమ్మేటపుడు, ఆ వస్తువులు మనుషులు తినటానికి తగిన స్థితిలో ఆరోగ్యదాయకంగా వున్నాయనే ప్రచ్ఛన్నమైన షరతు వుంటుంది. కొన్న తర్వాత వాటి నాణ్యతలేదని తెలిస్తే కొన్న వ్యక్తి కాంట్రాక్టు రద్దు చేసుకొని నష్టపరిహారం పొందవచ్చు.

**ఫ్రాస్ట్ Vs ఎయిల్స్ బరీ డెయిరీ కంపెనీ లిమిటెడ్ (1905)** అనే కేసులో 'A' అనే డెయిరీ ఓనర్ నుంచి 'F' పాలను కొన్నాడు. ఆ పాలను త్రాగి 'F' భార్య సుస్తీ చేసి చనిపోయింది. ఆహారపదార్థాలు వినియోగానుకూలంగా వుండాలనే ప్రచ్ఛన్నమైన షరతుకు భంగం కలిగింది. 'A' నష్టపరిహారం చెల్లించాలని తీర్పు వెలువడింది.

**చెప్రనీరీ Vs మేసన్ (1905)** అనే కేసులో 'C' ఒక బేకరీషాపు నుంచి బన్ను కొనుగోలు చేశాడు. అందులో చిన్న రాయి వుండడం వలన అతడు తినుచున్నపుడు అతని పన్ను విరిగిపోయింది. బేకరీ షాపు నుంచి నష్టపరిహారం 'C' కోరవచ్చునని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

7. **సాంప్రదాయం ప్రకారం షరతు : సెక్షన్ 16(3) :** వర్తక సాంప్రదాయం ప్రకారం గాని, ఆచారం ప్రకారం గాని వస్తువులకు వుండవలసిన లక్షణాలను అమ్మకందారు కాంట్రాక్టులో ప్రవేశపెట్టే అవకాశం వుంది.

**10.7.5 ప్రచ్ఛన్న పూచీలు :** కాంట్రాక్టులో భిన్నంగా వ్రాసుకుంటే తప్ప దిగువ పేర్కొనిన పూచీలు అమలులో వున్నట్లు భావించవలసి వుంటుంది.

1. **శాంతియుత స్వాధీనానుభవ పూచీ (సెక్షన్ 14(బి)) :** కొనుగోలుదారు, కొన్న వస్తువులను నిర్నిబంధ, శాంతియుత స్వాధీనానుభవం పొందే హక్కులో వుంటాడు. ఈ హక్కు భంగమైనప్పుడు అతడు అమ్మకపుదారుని నుంచి నష్టపరిహారమును పొందవచ్చు.

   **మేసన్ బర్మింగ్‌హామ్ (1949)** అనే కేసులో ఒక సెకండ్ హాండ్ టైపురైటర్‌ను 'B' 'S' నుంచి కొనుగోలు చేశాడు. దానిని ఉపయోగించుకుంటూ అవసరమైన మరమ్మత్తులకు ఖర్చు కూడా చేశాడు. తీరా ఆ టైప్‌రైటర్ దొంగిలించబడినదని తేలింది. అసలు యజమానికి దానిని B వాపసు చేయవలసి వచ్చింది. దాని ధరతోపాటు మరమ్మత్తు ఖర్చులను కూడా 'B' పొందవచ్చని కోర్టు తీర్పునిచ్చింది.

2. **ఛార్జి తాకట్టు లేదనే ప్రచ్ఛన్నపూచి (సెక్షన్ 14(సి)) :** కాంట్రాక్టు చేసుకునేముందుగాని, కాంట్రాక్టు చేసుకునే

సమయానికిగాని కొనుగోలుదారుకు తెలియని లేదా తెలుపని ఛార్జీలుగాని, తాకట్టుగాని సరుకుల మీద లేవని ప్రచ్ఛన్నమైన పూచీ వుంటుంది.

3. **ప్రమాదకర వస్తువులు :** వస్తువులు ప్రమాదకరమైనవి అయితే, ఆ సరుకుల ప్రమాదకరస్థితి గురించి కొనుగోలుదారుకు వివరించాలి. అలా హెచ్చరించికపోతే వస్తువుల ప్రమాదకర స్వభావరీత్యా కొనుగోలుదారు గాయపడితే అందుకు అమ్మకందారు నష్టపరిహారం చెల్లించాలి.

## 10.8 'కొనుగోలుదారే జాగ్రత్త వహించాలి' అనే సిద్ధాంతం ('Caveat emptor' Let the buyer Beware):

"కేవియట్ ఎమ్టార్" అనేది లాటిన్ పదము. దీని అర్థము కొనుగోలుచేయు వ్యక్తి అతిజాగ్రత్తగా సరుకులను కొనుగోలు చేయవలెను. సరుకులలో లోపాలు వున్నప్పుడు లేదా ప్రత్యేకమైన ఉద్దేశానికి సరిపోనప్పుడు లేదా తప్పుడు సరుకులను ఎంపిక చేసినపుడు కొనుగోలుదారుడు తనను తప్ప వేరే వ్యక్తిని బాధ్యునిగా చేయుటకు అవకాశం లేదు. వస్తువులను కొనేటప్పుడు తన అవసరాలకు తగినట్లుగా ఆ వస్తువులు వున్నాయో లేదోనని కొనుగోలుదారే చూచుకోవాలి.

స్మిత్ Vs హ్యూస్ (1871) అనే కేసులో 'H' ఓట్లు అనే ధాన్యాన్ని 'S' నుంచి శాంపిల్ చూసుకొని కొనుగోలు చేశాడు. అవి పాతవని పొరపాటుగా H అనుకున్నాడు. నిజానికి ఆ ధాన్యం కొత్తవి. ఒప్పందాన్ని H కాదనలేడని కోర్టు తీర్పునిచ్చింది.

వార్డ్ Vs హాబ్స్ (1878) అనే కేసులో 'H' వేలం ద్వారా అమ్ముటకుగాను 32 పందులను మార్కెట్‌కు పంపాడు. వాటిని 'W'కు లోపాలు, పొరపాట్లతో సహా అమ్మకం చేశారు. అమ్మిన పందులకు జబ్బు వున్నదని తెలిసినప్పటికీ H వెల్లడి చేయలేదు. అయినప్పటికీ ఈ అమ్మకం వేలం ద్వారా బహిరంగంగా జరిగింది గనుక కొనుగోలుదారుడే బాధ్యతగా భావించి ఏ విధమైన నష్టపరిహారాన్ని H చెల్లించనవసరం లేదని తీర్పునిచ్చారు.

**10.8.1 మినహాయింపులు :** కొనుగోలుదారే జాగ్రత్త వహించాలి అనే సూత్రానికి క్రింద పేర్కొనిన మినహాయింపులు వున్నాయి.

ఎ) **ప్రత్యేకమైన ఉపయోగానికి కొన్నప్పుడు :** కొనుగోలుదారుడు తాను కొనే వస్తువులు నిర్దిష్ట ఉపయోగానికి అనువుగా వుండాలని అమ్మకందారుకు తెలియపరచినపుడు, కొనుగోలుదారు కోరిన ఉపయోగానికి తగినట్లుగా వస్తువులుండాలనే ప్రచ్ఛన్న షరతు వుంటుంది. అయితే వస్తువులను పేటెంట్ ద్వారా గాని, వ్యాపారనామంతోగాని అమ్మినపుడు ఈ షరతు వర్తించదు.

బి) **వర్ణన ద్వారా అమ్మకం :** వస్తువులను అమ్మకందారు నుంచి వర్ణన ద్వారా కొన్నప్పుడు వస్తువుల విక్రయార్హత నాణ్యతతో వుండాలనే ప్రచ్ఛన్నమైన షరతు వుంటుంది.

సి) **వర్తక ఆచారం :** వ్యాపార సాంప్రదాయాన్ని, ఆచారాన్ని అనుసరించి ఏదైనా వస్తువు నాణ్యత, యోగ్యతల గురించి ప్రచ్ఛన్నమైన షరతు వుంటే ఈ సిద్ధాంతం వర్తించదు.

డి) **అసత్యవర్ణన, మోసం వలన సమ్మతి :** అమ్మకందారును, కొనుగోలుదారు మోసం చేసి సమ్మతి పొందితే 'కొనుగోలుదారే జాగ్రత్త వహించాలి' అన సూత్రం వర్తించదు అంటే అమ్మకందారు అసత్యవర్ణనకు లోబడి కొని కొనుగోలుదారు నష్టాలు పొందినప్పుడు మోసం చేసే అమ్మకందారుకు ఈ సూత్రం కింద రక్షణ వుండదు.

## 10.9 వస్తుస్వామ్యం బదిలీ (Transfer of Ownership) :

అమ్మకపు కాంట్రాక్టులో సరుకులపై యాజమాన్యపు బదిలీ ముఖ్యమైన అంశము. ఎందుచేతనంటే కాంట్రాక్టు భగ్నమైనప్పుడు ఇవ్వవలసిన పరిహారాల విషయాన్ని ఈ అంశం నిర్ధారిస్తుంది.

వస్తుస్వామ్యపు బదిలీ ప్రధానంగా పార్టీల అభిప్రాయాలను బట్టి జరుగుతుంది. మనదేశంలో ఎక్కువ అమ్మకాలు, కొనుగోళ్ళు చాలా వరకు వ్రాతపూర్వక కాంట్రాక్టుల ద్వారా కాక, మౌఖికంగా జరుపుకుంటూ వుంటారు. అందువల్ల వస్తుస్వామ్యపు బదిలీ ఎప్పుడూ అయిందనేది నిర్ధారణ చేసే బాధ్యత కోర్టు తీసుకోవలసి వుంటుంది. ఈ బాధ్యతా నిర్వహణలో తోడ్పాటుగా వుండటానికి వస్తు విక్రయ చట్టం సెక్షన్ 20 నుంచి 24 వరకు వున్న సెక్షన్లలో కొన్ని సూత్రాలు ప్రతిపాదించినారు. పార్టీలు తమంతతాము ఈ విషయమై స్పష్టంగా వ్రాసుకొన్నప్పుడు ఈ సూత్రాలు అమలులోకి వస్తాయి.

**ఎ) అనిర్దిష్ట వస్తువుల అమ్మకం :** సెక్షన్ 18 ప్రకారం అనిర్దిష్ట వస్తువుల అమ్మకం విషయంలో అవి నిర్ధారింపబడే వరకు ఆ వస్తువులలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీకాదు. P.S.N.S. అంబలవనచెట్టియార్ Vs ఎక్స్‌ప్రెస్ న్యూస్ పేపర్స్ లిమిటెడ్ (1968) అనే కేసులో పెద్దస్టాకుగా వున్న వస్తువులలో ఒక భాగం మాత్రం కొనుగోలుదారు కొన్నప్పుడు ఆ భాగాన్ని అమ్మకందారు వేరుపరిచే వరకు వాటిలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీకాదని తీర్పునిచ్చారు.

**బి) నిర్దిష్ట వస్తువుల అమ్మకం :** సెక్షన్ 19 ప్రకారం నిర్దిష్ట వస్తువుల అమ్మకం జరిగినపుడు, పార్టీలు వ్యక్తపరచిన అభీష్టాన్ని అనుసరించి వస్తువుల స్వామ్యము కొనుగోలుదారుకు బదిలీ అవుతుంది. పార్టీల అభీష్టం తెలుసుకోవటానికి కాంట్రాక్టు షరతులు, వారి నడవడి సంబంధిత యితర విషయాలు తెలుసుకోవాలి. ఇతరత్రా అభిప్రాయం వ్యక్తం కానప్పుడు సెక్షన్ 20 నుంచి సెక్షన్ 24 వరకు వున్న సూత్రాలను బట్టి వస్తుస్వామ్యపు బదిలీని గురించి నిర్ణయించాలి.

1) **నిర్దిష్ట వస్తువులు డెలివరీకి సిద్ధంగా వున్నప్పుడు (సెక్షన్ 20) :** వస్తువులు నిర్దిష్టమై వున్నప్పుడు, అప్పగింతకు సిద్ధంగా వున్నప్పుడు అమ్మకపు కాంట్రాక్టు చేసుకోగానే వస్తువుల స్వామ్యము కొనుగోలుదారుకు బదిలీ అవుతుంది. అమ్మకపు సొమ్ము అప్పుడే చెల్లించినా, చెల్లించకపోయినా, అప్పగింత వెంటనే జరిగినా, జరగకపోయినా కూడా స్వామ్యం బదిలీ కావటానికి ఏమీ అభ్యంతరం వుండదు.

ఉదాహరణకు, A ఒక పుస్తకాల షాపులోకి వెళ్ళి ధరలు ముద్రించబడిన కొన్ని పుస్తకాలు ఎంపిక చేసి, డబ్బు చెల్లించి తన నౌకరును పంపుతానని, వాటిని అప్పగించమని చెప్పి వెళ్ళినాడు. ఆ రోజునే జరిగిన అగ్నిప్రమాదంలో పుస్తకాలు తగలబడిపోయాయి. స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ అయింది గనుక నష్టాన్ని అతడే భరించాలి.

2) **నిర్దిష్ట వస్తువులు డెలివరీకి సిద్ధంగా లేనప్పుడు (సెక్షన్ 21) :** నిర్దిష్టంగా వున్న వస్తువులే అయినా వాటిని అప్పగించే స్థితిలో పెట్టటానికి అమ్మకందారు ఆ వస్తువుల విషయంలో ఇంకా చేయవలసినది ఏమైనా వుంటే ఆ పని చేసి కొనుగోలుదారుకు నోటీసు యిచ్చేవరకు ఆ వస్తువులలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ కాదు.

ఉదాహరణకు, కొనుగోలుదారు ఒక డైనింగ్ టేబుల్‌ను కొని దానిని మళ్ళీ పాలిష్ చేసిన తరువాత తీసుకువెడతానని చెప్పి అమ్మకందారు వద్దనే వుంచినప్పుడు కొనుగోలుదారు కోరినట్లుగా పాలిష్‌వేసి కొనుగోలుదారుకు కబురంపే వరకూ వస్తువులపై స్వామ్యం బదిలీ కాదు.

3) **నిర్దిష్టమైన వస్తువుల ధర తెలియనప్పుడు (సెక్షన్ 22) :** నిర్దిష్టంగా వుండి, వెంటనే అప్పగింతకు వీలుగా వున్న వస్తువులను అమ్మటానికి కాంట్రాక్టు చేసుకున్నప్పటికీ, వాటి ధర మొత్తం అమ్మకపు సొమ్ము నిర్ణయించటానికి అమ్మకందారు వాటిని తూయటం, కొలవడం, పరీక్షించడం మొదలైన పనులను చేయవలసివున్నప్పుడు, ఆయా పనులు చేసి, అట్లా చేసినట్లుగా కొనుగోలుదారుకు నోటీసు యివ్వనంత వరకు ఆ వస్తువులోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీకాదు.

శశిమోహన్ Vs నోబోక్రిస్టో (1879) అనే కేసులో ఒక గోదాములో వున్న బియ్యం రాశి నుంచి 975 క్వింటాల్స్ బియ్యం నిర్ణయించుకున్న ధర ప్రకారం అమ్మకందారు అమ్మగా పూర్తి అమ్మకపు సొమ్ము చెల్లించి, ఒక నిర్ణీత తేదీలోగా వాటిని అమ్మకందారు తూచి, సిద్ధపరచిన తరువాత అప్పగింత చేసుకుంటానని కొనుగోలుదారు చెప్పివెళ్ళినాడు. ఆ విధంగా సిద్ధపరచిన బియ్యం బస్తాలు కొన్నింటిని కొనుగోలుదారు పట్టుకెళ్ళిన తరువాత, మిగతావి ప్రమాదవశాత్తూ నశింపయినాయి. ఈ పరిస్థితిలో వస్తువుల స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ అయింది కనుక నష్టాన్ని కొనుగోలుదారు భరించవలసి వుంటుందని తీర్పు చెప్పినారు.

**4) భవిష్యత్ వస్తువులను వర్ణన ద్వారా అమ్మినప్పుడు (సెక్షన్ 23) :** అనిర్దిష్టమైన లేదా భవిష్యత్తులో ఉత్పత్తి అయ్యే వస్తువులను వాటి వర్ణన ద్వారా అమ్మినప్పుడు, ఆ వర్ణనకు సరిపోయే వస్తువులను

అ) కొనుగోలుదారు సమ్మతితో అమ్మకందారు గాని

ఆ) అమ్మకందారు సమ్మతితో కొనుగోలుదారు గాని బేషరతుగా 'కాంట్రాక్టుకు అనుగుణంగా వినియోగపరిస్తే' ఆ వస్తువులోని స్వామ్యం ఆ వెంటనే కొనుగోలుదారుకు బదిలీ అవుతుంది.

కాంట్రాక్టుననుసరించి అమ్మకందారు కొనుగోలుదారుకు వస్తువులను అప్పగించినా లేదా వస్తువులను రవాణా వారికిగాని, బెయిలీకి గాని, స్వాధీనపరచి తనకై ఏ హక్కును అట్టిపెట్టుకోకపోయినా అతడు బేషరతుగా 'వస్తువులను' కాంట్రాక్టుకు అనుగుణంగా వినియోగించినట్లు అవుతుంది. అట్కిన్‌సన్ Vs బెల్ (1828) అనే కేసులో అమ్మకందారు తయారుచేసిన యంత్రాలు కొనటానికి ఒక కొనుగోలుదారు కాంట్రాక్టు చేసుకున్నాడు. అమ్మకందారు యంత్రాలను ప్యాకింగ్ చేసి వాటిని లారీపైనా, రైలు ద్వారానా, ఏ పద్ధతిలో పంపమన్నావని కొనుగోలుదారును అడిగినాడు. కొనుగోలుదారు సమాధానమివ్వలేదు. కాంట్రాక్టుకనుగుణంగా వినియోగపర్చటం జరగలేదు. కనుక వస్తువులలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ కాలేదని కోర్టు తీర్పునిచ్చింది.

**5) ఆమోదం మీద లేక అమ్మకం / వాపస్ పద్ధతిలో వస్తువుల అమ్మకం (సెక్షన్ 24) :** వస్తువులను ఆమోదం మీద అట్టే పెట్టుకోవటానికో (an approval) లేదా 'అమ్మటమో, తిరిగి పంపటమో' (on sale or return) అనే షరతుతోనో లేదా అట్లాంటి మరే యితర షరతుతోనో అమ్మకందారు, కొనుగోలుదారుకు అప్పగించినపుడు, ఆ వస్తువులలోని స్వామ్యం క్రింది సందర్భాలలో బదిలీ అవుతుంది.

అ) కొనుగోలుదారు తన ఆమోదాన్ని తెలియపరచినప్పుడు గాని

ఆ) కొనుగోలుదారు తన ఆమోదాన్ని తెలియచేసే మరే చర్య అయినా తీసుకున్నప్పుడుగాని

ఇ) అతడు అట్లాంటి ఆమోదాన్ని తెలియచేయకుండా, తిప్పి పంపుతాననే నోటీసు ఇవ్వకుండా అట్టేపెట్టుకుంటే

ఎఫ్) కాలవ్యవధి నిర్ణయమై వున్నచోట ఆ కాలవ్యవధి అయిపోగానే

జి) అట్లాంటి కాలవ్యవది నిర్ణయం చేసినప్పుడు యుక్తమైన కాలవ్యవధి కాగానే ఆ వస్తువులలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ అవుతుంది.

**ఉదాహరణ 1** : A, B కి వస్తువులను 'అమ్మటమో లేదా వాపసు చేయటమో' అనే షరతు మీద పంపినాడు. B అదే షరతు మీద వాటిని C కి, C అదే షరతు మీద D కి ఆ వస్తువులను అప్పగించినారు. D వద్ద వుండగా ఆ వస్తువులను ఎవరో

దొంగిలించినారు. A, B ల మధ్య, B, C ల మధ్య అమ్మకం పూర్తి అయింది. C, D ల మధ్య కాలేదు. అందువల్ల C, D నుంచి నష్టాన్ని రాబట్టుకోలేడు. కాని C, B కి, B, A కి నష్టాన్ని చెల్లించాల్సి వుంటారు.

**ఉదాహరణ 2 :** A కొన్ని నగలను 'అమ్మటమో లేదా తిరిగి పంపటమో' అనే షరతుపై B కి పంపినాడు. B వాటిని C కి తాకట్టు పెట్టినాడు. B పెట్టిన తాకట్టు వల్ల A, B ల మధ్య అమ్మకపు కాంట్రాక్టు పూర్తి అయింది కనుక నగలలోని స్వామ్యం B కి బదిలీ అయింది.

**10.9.1 స్వామ్యంతోపాటు నష్టభయం బదిలీ (సెక్షన్ 26) :** వస్తు స్వామ్యంతోపాటు నష్ట భయం కూడా బదిలీ అవుతుంది. వస్తువులు నశించినపుడు లేదా చెడిపోయినపుడు లేదా నష్టం కలిగినపుడు ఆ సమయంలో ఎవరు యజమానిగా వుంటారో వారే భరించాలి. బయట వ్యక్తుల చర్యల వలన వస్తువులు చెడిపోయినా ఆ వ్యక్తులపై చర్య తీసుకునే అధికారం యజమానికే వుంటుంది. వస్తువులపై స్వామ్యం కొనుగోలుదారుకు సంక్రమించినప్పటి నుంచి నష్టభయం కొనుగోలుదారే భరించాలి. సొమ్ము చెల్లించడం, వస్తువులు స్వాధీనంలో వుండటమనేది ముఖ్యం కాదు.

**ఉదాహరణ :** 'A' నుంచి 50 లీటర్ల బత్తాయి రసాన్ని కొనటానికి B కాంట్రాక్టు చేసుకున్నాడు. A బత్తాయిల నుంచి రసం తీసి సీసాలలో పట్టి డెలివరీకి సిద్ధంగా వుంచినాడు. కాని డెలివరీ తీసుకోవటానికి 'B' అనవసర కాలయాపన చేసినాడు. అందువల్ల రసం కుళ్ళి పాడైపోయింది. A కి B పూర్తి అమ్మకపు సొమ్ము చెల్లించవలసిన బాధ్యతతో వుంటాడు.

యాజమాన్యంతోపాటు నష్టభయం బదిలీ అనే సాధారణ సూత్రానికి కొన్ని మినహాయింపులున్నాయి.

పార్టీల మధ్య పరస్పరం అంగీకారం వల్ల యాజమాన్యం బదిలీ అయినప్పటికీ అమ్మకందారే నష్టభయాన్ని స్వీకరించవచ్చు.

అప్పగింత లేక స్వీకరణ చేయటానికి ఆలస్యం ఎవరివల్ల జరిగితే వారే నష్టాన్ని భరించాలనే నిబంధన పెట్టుకోవచ్చు.

అమ్మకందారు, కొనుగోలుదారుల మధ్య బెయిల్‌మెంట్ ఏర్పడినపుడు వస్తువులు తమ ఆధీనంలో వుంచుకున్నవారు బెయిలీగా ఎంత బాధ్యత స్వీకరించవలెనో ఆ మేరకు మాత్రమే బాధ్యత వహించాలి.

## 10.10 యజమానులు కాని వారు వస్తువులు అమ్మటం :

'తనకున్న హక్కు కంటే ఎక్కువ హక్కును ఎవరూ సంక్రమింప జేయలేరు' (No one can convey a better title than what he has) అనేది సాధారణ సూత్రము. దీనినే లాటిన్‌లో 'నెమో డాట్ క్యాడ్ నాన్ హాబెట్' (Nemo dat quad non habet) అంటారు.

ఒక వ్యక్తి తనకు చెందని వస్తువులను మరొకరికి బదిలీ చేస్తే బదిలీ పొందిన వ్యక్తి హక్కు మూలాల్ని పొందలేడు. సాధారణంగా తనకు లేని మంచి హక్కు మూలాన్ని అమ్మకందారు, కొనుగోలుదారుకు అందివ్వలేడు. మరో విధంగా చెప్పవలెనంటే అమ్మకందారుకున్న హక్కు మూలం కంటే కొనుగోలుదారు మంచి హక్కు మూలాన్ని ఆర్జించలేడు.

దొంగిలించిన సొమ్మును దొంగ వద్ద కొన్నవానికి, దొంగ యొక్క హక్కులే వస్తాయి గాని మంచి హక్కులు రావు. కొనుగోలుదారు సద్భావంతో సొమ్ము చెల్లించి వస్తువులను కొన్నప్పటికీ అమ్మకందారు హక్కుమూలం లోపభూయిష్టమైతే కొనుగోలుదారు హక్కు మూలం కూడా లోపభూయిష్టమే అవుతుంది.

సెక్షన్ 27లో ఈ సూత్రాన్ని ప్రతిపాదించినారు. "ఈ చట్టంలోని ఇతర నిబంధనలకూ, ఇంకా అమలులో వున్న ఇతర

చట్టంలోని నిబంధనలకూ లోబడి యజమాని కాని వ్యక్తి, ఆ యజమాని యిచ్చిన అధికారంలో గాని, యజమాని తరఫున గాని కాకుండా, స్వతంత్రంగా వస్తువులను అమ్మినపుడు అమ్మినవానికున్న హక్కుకన్నా మించిన హక్కు కొన్నవారికి సంక్రమించదు''.

10.10.1 **మినహాయింపులు :** సెక్షన్ 27లో ప్రతిపాదించిన సూత్రానికి దిగువ మినహాయింపులున్నాయి. ఈ క్రింది సందర్భాలలో యజమానులు కానివారు, సొమ్ము చెల్లించిన కొనుగోలుదారుకు మంచి హక్కు మూలాన్ని సంక్రమింపజేయగలరు.

ఎ) **వ్యాపార ఏజెంట్ ద్వారా అమ్మకం :** తాను యజమాని కాకపోయినా అసలు యజమాని సమ్మతి పొంది ఏజెంట్ వస్తువులను అమ్మితే కొన్నవారికి పూర్తి హక్కు బదిలీ అవుతుంది. ఈ మినహాయింపుకు గల ముఖ్యాంశాలు యివి.

అ) అమ్మే వ్యక్తి వ్యాపార ఏజెంట్ అయి వుండాలి. మామూలు ఏజెంట్ అమ్మి వుండరాదు. బ్రోకర్లు, ఫాక్టరు ఏజెంట్లు, వేలందార్లు అంతా వ్యాపార ఏజెంట్లు క్రిందికే వస్తారు.

ఆ) వ్యాపారపు ఏజెంటు యజమాని అనుమతితో వస్తువులకు సంబంధించిన హక్కు పత్రాలు తన స్వాధీనంలో వుంచుకోవాలి. ఇవి నౌకాభార పత్రము, గిడ్డంగి రశీదు, రైల్వే రశీదు మొదలైనవి.

ఇ) వ్యాపార ఏజెంట్ సాధారణ వ్యాపార సరళిలోనే వస్తువిక్రయం జరపాలి.

ఈ) కొనుగోలుదారు సదుద్దేశంతో కొనాలి. అమ్మేవానికి హక్కు లేదన్న విషయం కొనుగోలుదారుకు తెలిసి వుండరాదు.

బి) **సహయజమానిచే అమ్మకం :** వస్తువులకు ఒకరికంటే ఎక్కువ మంది యజమానులున్నప్పుడు వారిని సహయజమానులంటారు. వారిలో ఏ ఒక్క వ్యక్తి వద్దనైనా మిగిలిన వారి అంగీకారంతో వస్తువులు వున్న యెడల, అట్టి వ్యక్తి నుండి, కొనుగోలుదారు సదుద్దేశంతో, అమ్మే వ్యక్తి పూర్తి హక్కుదారుడని విశ్వసించి కొన్నప్పుడు అతనికి పూర్తి హక్కు సంక్రమిస్తుంది (సెక్షన్ 28).

సి) **చెల్లకూడని అగ్రిమెంట్ కింద వస్తువుల స్వామ్యం పొందిన వాని చేత అమ్మకం :** బలప్రయోగం వల్ల గాని, అనుచిత ప్రభావంలో గాని, మోసం వల్ల గాని, అసత్య వర్ణనతోగాని కాంట్రాక్టు ఏర్పడితే అది చెల్లకూడని కాంట్రాక్టు అవుతుంది. అట్లాంటి కాంట్రాక్టు క్రింద సరుకులు పొందిన వ్యక్తి, ఆ కాంట్రాక్టు రద్దు అయ్యేలోగా వాటిని అమ్మితే కొన్న వ్యక్తి సదుద్దేశంతోను, అమ్మేవాని హక్కులోని లోపాన్ని తెలియక కొనుక్కుంటే అతనికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి.

వస్తువులను చెల్లకూడని అగ్రిమెంట్ క్రింద పొందినపుడు మాత్రమే మినహాయింపు వర్తిస్తుంది. వస్తువులను చెల్లని న్యాయవిరుద్ధమైన అగ్రిమెంట్ క్రింద పొందినపుడు వర్తించదు (సెక్షన్ 29).

డి) **అమ్మకమైపోయిన వస్తువులు తన స్వాధీనంలోగల అమ్మకందారుచే తిరిగి అమ్మకం :** ఒకసారి అమ్మకమైపోయిన వస్తువులు అమ్మకందారు స్వాధీనంలోనే ఉన్నప్పుడు లేదా వాటికి సంబంధించిన హక్కుపత్రాలు అతని వద్దనే ఉన్నప్పుడు మళ్ళీ అమ్మితే కొనుగోలుదారుకు ఆ వస్తువులపై సక్రమమైన హక్కు మూలం సంక్రమిస్తుంది. అయితే కొన్న వ్యక్తి సదుద్దేశంతో అమ్మేవాని హక్కుకు ఏ లోపం లేదన్న విశ్వాసంతో కొనవలెను (సెక్షన్ 30(1)). ఒకవేళ ఆ సరుకులు అమ్మకందారు ఆధీనంలో, బెయిలీ హోదాలోగాని, అద్దెకు పుచ్చుకొన్నవాని హోదాలోగాని వున్నప్పుడు కొంటే, కొన్నవానికి హక్కులు రావు.

ఇ) **వస్తువులు స్వాధీనంలో వున్న కొనుగోలుదారుచేసే అమ్మకం :** అమ్మకం పూర్తికాకముందే అమ్మకందారు అనుమతితో స్వాధీనం పొందిన కొనుగోలుదారు వస్తువులను తిరిగి విక్రయిస్తే ఏదా హామీ పెడితే సక్రమమైన హక్కుమూలాన్ని

సంక్రమింప చేయవచ్చు. వస్తువులు స్వీకరించే వ్యక్తి సదుద్దేశంతో వస్తువులలోని హక్కులోపం తెలియక కొనుగోలు చేస్తేనే అతనికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి (సెక్షన్ 30(2)).

అమ్మకందారుని సమ్మతి మోసం ద్వారా గాని, అసత్య వర్ణన వల్ల గాని సంపాదించినా పై సెక్షన్ వర్తిస్తుంది. అయితే, చేసిన మోసం వల్ల ఏ వ్యక్తికి అమ్మినాడో అనే విషయంఅమ్మిన వ్యక్తి పొరపాటు బడినప్పుడు మాత్రం ఈ సెక్షన్ వర్తించదు.

ఎఫ్) **చెల్లింపు జరగని అమ్మకందారుచే అమ్మకం :** చెల్లింపు జరగని అమ్మకందారు తన లీన్ హక్కును, రవాణాలో వున్న వస్తువులను నిలుపుదల చేసే హక్కును వినియోగించి అవే వస్తువులను తిరిగి వేరొకరికి అమ్మితే అప్పుడు కొనుగోలు చేసే వ్యక్తికి సక్రమమైన హక్కు లభిస్తుంది (సెక్షన్ 54).

జి) **తాకట్టు పెట్టుకొన్న వ్యక్తి, పోయిన వస్తువులు దొరికిన వ్యక్తులచే సరుకుల అమ్మకం :** భారతీయ కాంట్రాక్టు చట్టం సెక్షన్ 176 కింద తాకట్టు పెట్టుకొన్న వస్తువులను తాకట్టు పెట్టుకొన్న వ్యక్తి అమ్మినా, సెక్షన్ 169 కింద, పోయిన వస్తువులు దొరికిన వ్యక్తి అట్లా దొరికిన వస్తువులను అమ్మినా, కొన్న వానికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి.

హెచ్) **'ఎస్టోపెల్' సూత్రం ప్రకారం హక్కు సంక్రమణ :** ఇది సెక్షన్ 27లోనే అంతర్భాగంగానే వున్నది. యజమాని తన ప్రవర్తన పట్ల అమ్మిన వారి అధికారాన్ని కాదని లేకపోయేటపుడు కొన్నవారికి హక్కు సంక్రమిస్తుంది.

ఉదాహరణకు A, C వింటుండగా, B తో తాను వస్తువుల యజమానినని చెప్పినాడు. నిజానికి వస్తువుల యజమాని C, అతడు A చెప్పిన మాటలు విన్నాడు. అయినా ఖండించకుండా ఊరుకున్నాడు. A మాటలను నమ్మి B ఆ వస్తువులను A వద్ద కొన్నాడు. ఇపుడు A కి లేని పూర్తి హక్కు B కి సంక్రమిస్తుంది. తాను ఖండించగల స్థితిలో వుండికూడా ఖండించక C ఊరుకున్నాడు. కనుక అతనికి ఆ తరువాత B కి హక్కు రాలేదని వారించే హక్కుపోయింది.

ఐ) **ఇతర సందర్భాలు :** క్రింద పేర్కొనిన వేర్వేరు చట్టాల ప్రకారం యజమానులు కాని వారు అమ్మినప్పటికీ కొనుగోలుచేసిన వారికి మంచి హక్కులు లభిస్తాయి.

అ) నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టంలోని కాలక్రమ హోల్డర్

ఆ) సివిల్ ప్రొసీజర్ కోడ్ ఆర్డర్ క్రింద కోర్టు రిసీవర్

ఇ) ఇన్సాల్వెన్సీ చట్టాల ప్రకారం అఫీషియల్ రిసీవర్లు

ఎఫ్) కంపెనీల చట్టప్రకారం లిక్విడేటర్

జి) వీలునామాను అమలుపరచే ఎక్జిక్యూటర్లు, ఎడ్మినిస్ట్రేటర్లు

## 10.11 అమ్మకపు కాంట్రాక్టును నెరవేర్చటం :

అమ్మకపు కాంట్రాక్టును నెరవేర్చటం అంటే అమ్మకందారు వస్తువులను కొనుగోలుదారుకు అప్పగించటమే. వస్తువుల అప్పగింత (Delivery), వాటి ధర చెల్లించడమనేది ఏక కాలంలో పూర్తయ్యే షరతులు. కాంట్రాక్టులో వేరే విధంగా లేకపోతే కొనుగోలుదారు ధర చెల్లించటం, అమ్మకందారు సరుకులను డెలివరీ చేయడం ఒకేసారిగా చేయాలి.

సెక్షన్ 2(2) ప్రకారం డెలివరీ అంటే "ఒక వ్యక్తి బుద్ధిపూర్వకంగా వస్తువులను వేరొకరికి స్వాధీనం చేయటం". అమ్మిన వస్తువులను కొనుగోలుదారుకు అప్పగించటం మూడు రకాలుగా వుండవచ్చును.

అ) **వాస్తవిక అప్పగింత :** వస్తువులను ప్రత్యక్షంగా, భౌతికంగా కొనుగోలుదారునికి లేక అతని ఏజెంటుకు యిచ్చినపుడు వాస్తవిక డెలివరీ అవుతుంది.

ఆ) **సూచన మాత్రపు అప్పగింత :** వాస్తవిక అప్పగింత సాధ్యంకానప్పుడు ఈ పద్ధతిని పాటిస్తారు. ఉదాహరణకు గిడ్డంగిలో వున్న వస్తువుల విషయంలో గిడ్డంగి తాళం చెవిని కొనుగోలుదారుకు అందజేయటాన్ని సూచనప్రాయమైన డెలివరీ అంటారు.

ఇ) **సంభావిత అప్పగింత :** బెయిలీ హోదాలో మూడవ వ్యక్తి, కొనుగోలుదారు తరపున సరుకులను కలిగి వున్నానని ప్రకటిస్తే దానిని నిర్మాణాత్మక అప్పగింత లేక సంభావిత అప్పగింత అంటారు. కొనుగోలుదారు అనుమతితో అమ్మకందారు వద్దనే సరుకులున్నప్పుడు కూడా సంభావిత అప్పగింత ఏర్పడుతుంది.

**10.11.1 డెలివరీకి సంబంధించిన నిబంధనలు :**

సరుకుల డెలివరీకి సంబంధించిన నియమాలు వస్తు విక్రయ చట్టం సెక్షన్ 33 నుంచి సెక్షన్ 39 వరకు పేర్కొనబడ్డాయి.

అ) **డెలివరీ పద్ధతి :** వస్తువుల డెలివరీ కొనుగోలుదారుకు గాని, అతని ఏజెంట్‌కు గాని ప్రత్యక్షంగా లేదా గిడ్డంగి తాళంచెవి యివ్వడం ద్వారా లేదా మూడవ వ్యక్తి ద్వారా పూర్తి చేయవచ్చును.

ఆ) **పాక్షిక డెలివరీ :** పాక్షికంగా సరుకులను డెలివరీ చేసినప్పుడు అది పూర్తి డెలివరీలో భాగంగా పరిగణించబడును. కాని పాక్షిక డెలివరీని పూర్తి డెలివరీ నుండి విడదీయుటకు చేసినప్పుడు అది పూర్తి డెలివరీలో భాగం కాదు.

ఇ) **కొనుగోలుదారుడు డెలివరీ కోసం అడగటం :** కాంట్రాక్టులో మరో విధంగా లేకపోతే, డెలివరీ కోసం కొనుగోలుదారు అడగనిదే అమ్మకందారు డెలివరీ చేయనక్కరలేదు. డెలివరీ డిమాండును సరైన పనికాలంలో చేయాలి.

ఎఫ్) **డెలివరీ స్థలము, సమయము :** వ్యతిరేకంగా కాంట్రాక్టు లేకపోతే అమ్మకపు అగ్రిమెంట్ జరిగే సమయానికి వస్తువులు వున్న ప్రదేశంలోను, లేదా అప్పటికి వస్తు తయారీ జరిగి వుండకపోతే, ఆ వస్తువులు ఉత్పత్తి అయ్యే ప్రదేశంలోను అమ్మకందారు ఆ వస్తువుల్ని డెలివరీ చెయ్యాలి. వాటిని పంపటానికి కాల నిర్ణయం లేనప్పుడు, అమ్మకందారు వాటిని సమంజసమైన కాలంలోగా పంపాలి.

జి) **డెలివరీ ఖర్చులు :** మరొక విధమైన అంగీకారం వుంటే తప్ప సరుకులను డెలివరీ చేసే స్థితిలోకి తెచ్చేటందుకు అయ్యే ఖర్చు అమ్మకందారు భరించాలి. డెలివరీని స్వీకరించేటందుకు అయిన ఖర్చులను కొనుగోలు చేసిన వ్యక్తి భరించాలి.

హెచ్) **తప్పు పరిమాణంలో డెలివరీ :** తక్కువ పరిమాణంతో డెలివరీ చేసినపుడు కొనుగోలుదారు ఆ డెలివరీని నిరాకరించవచ్చు లేదా స్వీకరించవచ్చు. స్వీకరించినప్పుడు అతడు ఆ మేరకు ప్రతిఫలం చెల్లించవలెను. నిరాకరించినపుడు, నిర్ణీత కాల వ్యవధిలో అమ్మకందారు సరుకు మొత్తాన్ని డెలివరీ చేయాలి.

అధిక పరిమాణంలో డెలివరీ చేసినప్పుడు, కొనుగోలుదారు కాంట్రాక్టులో సూచించిన మేరకు వాటిని ఆమోదించి, మిగతా వాటిని నిరాకరించవచ్చు లేదా మొత్తం వస్తువులన్నింటినీ నిరాకరించవచ్చు.

ఇతర సరుకులలో కలిపి డెలివరీ చేసినపుడు, కొనుగోలుదారుడు, కాంట్రాక్టు ప్రకారం అందిన వాటిని ఆమోదించి మిగతావాటిని నిరాకరించవచ్చు లేదా మొత్తం వస్తువులను నిరాకరించవచ్చు.

ఐ) **వాయిదాలలో డెలివరీ :** ఇంకోవిధంగా ఒప్పుకుంటే తప్ప కొనుగోలుదారు వస్తువులను వాయిదాల ప్రకారం డెలివరీకి అంగీకరించనక్కరలేదు.

రెండు పార్టీలు అంగీకరించినప్పుడు సరుకులను వాయిదాలలో డెలివరీ చేయవచ్చు. అయితే కాంట్రాక్టులో తెలియపర్చిన విధంగానే అమ్మిన వ్యక్తి డెలివరీ చేయాలి.

జె) **రవాణా సంస్థకు డెలివరీ :** అమ్మిన వ్యక్తి సరుకలను రవాణాలో వేయగానే అది కొనుగోలుదారుకు రవాణాగా భావించవలెను. ఇందుకు అతడు రవాణా చేయు వ్యక్తితో కొనుగోలుదారు తరపున ఒప్పందం చేసుకోవలెను. దీని ప్రకారం

ఎ) సరుకులను భద్రంగా రవాణా చేయవలెను.

బి) అజాగ్రత్త వలన సరుకులు నష్టమైనపుడు కొనుగోలుదారు ఆ సరుకులను నిరాకరించవచ్చును లేదా అమ్మిన వ్యక్తిపై నష్టపరిహారానికి దావా వేయవచ్చును.

సముద్రంపై ఓడలలో సరుకు పంపేటప్పుడు, సాధారణంగా అట్లాంటి సరుకును భీమా చేసే అలవాటు వున్నపుడు, అట్లా భీమా చేసుకోవలసిందిగా సమాచారాన్ని అమ్మకందారు, కొనుగోలుదారుకు యివ్వాలి. అలా చెప్పకపోతే సరుకుల విషయంలో ఏర్పడే నష్టభయాన్ని అమ్మకందారే భరించాలి. ఇందుకు భిన్నంగా కాంట్రాక్టు షరతులుంటే ఆ షరతులు అమలులోకి వస్తాయి.

## 10.12 అమ్మకందారు విధులు, హక్కులు :

అమ్మకందారుకు కొన్ని విధులు, హక్కులు వున్నాయి.

**10.12.1 అమ్మకందారు విధులు :** వస్తువుల అమ్మకందారు విధులు ఈ క్రింది విధంగా వున్నాయి.

ఎ) **వస్తువుల అప్పగింత :** అమ్మకపు కాంట్రాక్టుననుసరించి వస్తువులను డెలివరీ చేయటం అమ్మకందారు బాధ్యత. అది వాస్తవికమైనదిగాని, సూచనమాత్రంగాగాని, నిర్మాణాత్మకంగా గాని వుండవచ్చును.

బి) **డెలివరీ చేయకపోతే నష్టపరిహారాలు :** వస్తువులను డెలివరీ చేయటం అక్రమంగా ఉపేక్ష చేసినందుకు లేదా నిరాకరించినందుకు కొనుగోలుదారు అమ్మకందారుపై నష్టపరిహారానికి దావా తేవచ్చు.

సి) **నిర్దిష్టమైన అమలు :** నిర్దిష్ట రిలీఫ్ చట్టంలోని నిబంధనలకు లోబడి, తగిన సందర్భాలలో నిర్దిష్టమైన లేదా ప్రత్యేకించి వస్తువుల డెలివరీ కాంట్రాక్టు విషయంలో కాంట్రాక్టు షరతులను గురించి దానిని అమలు చేయమని కోర్టు ఆదేశించవచ్చు.

**అమ్మకందారు హక్కులు :** వస్తువుల అమ్మకందారుకు ఈ క్రింద పేర్కొనిన హక్కులు వున్నాయి.

**10.12.2** ఎ) **అమ్మకపు సొమ్ముకై దావా :** కొనుగోలుదారుకు వస్తుస్వామ్యము బదిలీ అయిపోయిన తరువాత, అతడు అమ్మకపు సొమ్మును చెల్లించ నిరాకరించినప్పుడు, అమ్మకపు సొమ్ము కోసం అమ్మకపుదారు దావా తీసుకొని రావచ్చును.

వస్తువుల స్వామ్యము కొనుగోలుదారుకు సంక్రమించకపోయినా, డెలివరీతో సంబంధం లేకుండా, అమ్మకపు సొమ్ము చెల్లించటానికి కొనుగోలుదారు అంగీకరించి అట్లా చెల్లించనప్పుడు, అమ్మకందారు అమ్మకం సొమ్ము చెల్లింపుకు, వస్తువులను అప్పగించకుండానే కొనుగోలుదారుపై దావా తీసుకొని రావచ్చు.

బి) **కొనుగోలుదారు నుంచి నష్టపరిహారం :** బేసబబుగా, వస్తువులను స్వీకరించుకోవటానికి గాని, అమ్మకపు సొమ్ము చెల్లించటానికి గాని, కొనుగోలుదారు అంగీకరించకపోతే అమ్మకందారు అతని నుంచి నష్టపరిహారాన్ని కోరవచ్చు.

**బంగోస్టీల్ ఫర్నిచర్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1967)** అనే కేసులో భారత ప్రభుత్వము, బంగోస్టీల్ ఫర్నీఛర్ కంపెనీతో స్టీల్ పెట్టెల నిర్మాణానికి ఒప్పందం చేసుకుంది. కొన్ని స్టీల్ పెట్టెల నిర్మాణం, కంపెనీ పూర్తి చేసిన తరువాత ప్రభుత్వం కాంట్రాక్టును రద్దు చేసింది. ఇంకా తయారు చేయవలసి వున్న స్టీలు పెట్టెల విషయంలో స్వామ్యము, ప్రభుత్వానికి బదిలీ కాలేదు. గనుక అమ్మకపుసొమ్ము అడగకుండా, వాటి విషయంలో కంపెనీ ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందవలసి వుంటుందని కోర్టు తీర్పునిచ్చింది.

సి) వడ్డీ : అమ్మకపు సొమ్ము కోసం అమ్మకందారు దావా వేసే సందర్భాలలో చెల్లించవలసిన తేదీ నుంచి వడ్డీ గూడా అమ్మకందారు కోరవచ్చు.

## 10.13 కొనుగోలుదారు బాధ్యతలు - హక్కులు :

కొనుగోలుదారుకు కొన్ని విధులు హక్కులు వున్నాయి.

### 10.13.1 కొనుగోలుదారు విధులు :

ఎ) **సొమ్ము చెల్లింపు :** వస్తువుల డెలివరీ, అమ్మకపు సొమ్ము చెల్లింపు ఒకేసారిగా జరగవలసిన విషయాలు కనుక వస్తువుల డెలివరీ కాగానే అమ్మకపు సొమ్ము చెల్లించటానికి కొనుగోలుదారు సిద్ధంగా వుండాలి.

బి) నష్ట పరిహారం : డెలివరీ స్వీకరించటాన్ని తప్పుగా తిరస్కరిస్తే కొనుగోలుదారు, అమ్మకందారుకు నష్టపరిహారం చెల్లించాలి.

సరైన కాలవ్యవధిలో వస్తువులను కొనుగోలుదారు డెలివరీ తీసుకోకపోతే అందువల్ల అమ్మకందారుకు కలిగే యావత్తు నష్టానికి కొనుగోలుదారు బాధ్యత వహించాలి.

సి) **లోపాలకు, తరుగుదలకు బాధ్యత :** వస్తువులు అమ్మిన సమయంలో అవి వున్న ప్రదేశంలో కాకుండా వేరేచోట అమ్మకందారు తన బాధ్యత మీద వాటిని డెలివరీ చేయటానికి అంగీకరించి వుంటే, ఇంకో విధంగా ఒప్పందం జరిగి వుంటే తప్ప రవాణా జరుగుతున్న సమయంలో దానికి సంబంధించిన తరుగుదల ఏదైనా వస్తువులలో వస్తే దానిని కొనుగోలుదారు భరించాలి.

### 10.3.2 కొనుగోలుదారు హక్కులు :

ఎ) డెలివరీ తీసుకునే / తిరస్కరించే హక్కు : కొనుగోలుదారుకు వస్తువులను డెలివరీ తీసుకునే హక్కు వుంది. తాను కోరిన విధంగా డెలివరీ జరగకపోతే దానిని తిరస్కరించే హక్కు కూడా వుంది. కోరిన వస్తువుల కంటే ఎక్కువగా గాని, తక్కువగా గాని, వేరే వస్తువులతో కలిపిగాని అమ్మకందారు పంపినప్పుడు కొనుగోలుదారుకుండే ఈ హక్కు ముఖ్యమైనది.

బి) పరీక్షించే హక్కు : వస్తువులను అమ్మకందారు అప్పగించినపుడు, లేదా అప్పగించబూనినప్పుడు అవి కాంట్రాక్టులో వ్రాసుకున్న పద్ధతిలో వున్నాయా లేదా అనే విషయం నిర్ధారించుకోవటానికి వీలుగా వాటిని పరీక్ష చేసే అవకాశం యివ్వవలసిందిగా కొనుగోలుదారు కోరవచ్చు.

సి) **వాయిదాల వారీగా వస్తువులు :** కాంట్రాక్టులో షరతు లేకుండా, కొనుగోలుదారు యిష్టం లేకుండా వాయిదాల వారీగా వస్తువులను సప్లయ్ చేస్తానంటే కొనుగోలుదారు అంగీకరించవలసిన పనిలేదు.

ఒక వేళ కాంట్రాక్టులోనే వాయిదాల వారీగా వస్తువుల సప్లయ్, వాయిదాల వారీగా పైకం చెల్లింపు నియమాలుంటే, కొన్ని వాయిదాల వస్తువుల సప్లయ్ బకాయిపడినా, కొన్ని వాయిదాల సొమ్ము చెల్లింపు బకాయి పడినా కాంట్రాక్టు రద్దయిపోతుందా లేక నష్టపరిహారాన్ని కోరవలసి వుంటుందా అనేది కాంట్రాక్టు షరతుల మీద, ఇతర పరిస్థితుల మీద ఆధారపడి వుంటుంది.

డి) **అమ్మకం లేదా వాపసు పద్ధతి :** అమ్మకమో లేదా వాపస్ చేయటమో అనే పద్ధతి మీద అమ్మకందారు వస్తువులను కొనుగోలుదారుకు పంపినప్పుడు వాటిని అతడు

అ) కాలనిర్ణయం లోపల అమ్మకందారుకు చెప్పి వాటిని అట్టే పెట్టుకోవచ్చు.

ఆ) కాలనిర్ణయం తెలియజెయ్యకపోతే సబబైన కాలవ్యవధి తరువాత నిరాకరించకగాని, నిరాకరిస్తున్నట్లు వర్తమానం పంపకుండా గాని వస్తువులను అట్టేపెట్టుకోవచ్చు.

ఇ) ఆ వస్తువులపై అమ్మకందారుకున్న యాజమాన్యం పోయే మరే విధంగానైనా ప్రవర్తించిగాని, ఆ సరుకును కొనుగోలుదారు స్వంతం చేసుకోవచ్చు (ఉదా : వేరొకరికి అమ్మటం లేదా తాకట్టు పెట్టడం ద్వారా).

ఇ) **తెలియచేస్తే చాలు :** నిరాకరించే హక్కు వుండి, కొనుగోలుదారు వస్తువులను నిరాకరించినప్పుడు, ఆ విషయం అమ్మకందారుకు తెలియపరిస్తే సరిపోతుంది. తాను బాధ్యత పెట్టుకుని ఆ వస్తువులను తిప్పి పంపనవసరం లేదు. వాటిఇన తీసుకు వెళ్ళవలసిన బాధ్యత అమ్మకందారుదే.

ఎఫ్) **పూచీ భంగం :** ఇచ్చిన పూచీ భగ్నమైనప్పుడు కొనుగోలుదారుకు క్రింది హక్కులు సంక్రమిస్తాయి.

అ) ధరను తగ్గించవచ్చు లేదా అసలే చెల్లించకుండా వుండవచ్చు లేదా

ఆ) పూచీ భగ్నానికి నష్టపరిహారం కోసం దావా వేయవచ్చు. లేదా

ఇ) పూచీ భగ్నం కావడం వలన ధర చెల్లించకపోయినా, ఇంకా ఇతర విధాల నష్టాలు సంభవిస్తూ వుంటే ఆ నష్టాల పరిహారం కోరటానికి చర్యలు తీసుకోవచ్చు.

జి) **నిరీక్షిత కాంట్రాక్టు భంగం :** నిరీక్షిత కాంట్రాక్టు భంగం జరిగినప్పుడు కొనుగోలుదారు, కాంట్రాక్టు ఇంకా అమలులోనే వున్నట్లుగా భావించవచ్చు లేదా దానిని రద్దుపరచి నష్టపరిహారానికి దావా తీసుకొని రావచ్చు.

హెచ్) **వడ్డీతో సహా పరిహారాలు :** అమ్మకందారు వస్తువులను డెలివరీ చేయటంలో లోపం చేస్తే అమ్మకపు సొమ్ము చెల్లించిన తేదీ నుంచి, కోర్టు వారికి న్యాయమని తోచిన రేటుతో లెక్కకట్టిన వడ్డీతో సహా తిరిగి యివ్వమని కొనుగోలుదారు కోరవచ్చు.

## 10.14 చెల్లింపు జరగని అమ్మకందారుకున్న ప్రత్యేకమైన హక్కులు :

సెక్షన్ 45(1) ప్రకారం అమ్మకందారు, "చెల్లింపు జరగని అమ్మకందారు"గా పరిగణించవలెనంటే

ఎ) అమ్మకపు సొమ్ము మొత్తం చెల్లింపు జరగకుండా వుండవలెను. లేదా దానిని చెల్లించే ప్రయత్నమన్నా జరగకుండా వుండాలి.

బి) వినిమయ పత్రం లేదా ఏ ఇతర నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్‌నైనా ఏదైనా షరతుకు లోబడి చెల్లింపుగా పొంది, అది అనాదరణ పొందటం ద్వారా గాని, మరి ఏ ఇతర కారణాల వల్ల గాని అనుకున్న షరతు అమలు జరగకుండా వుండాలి.

అంతేగాక

అ) అమ్మకపు సొమ్ము ఇంత అని నిర్ధారణ అయి వుండవలెను.

ఆ) అమ్మకపు సొమ్ము కోసం వెంటనే చర్య తీసుకునే హక్కు అమ్మకందారుకు వుండవలెను.

ఇందులో అమ్మకందారు అనే పదం అమ్మకందారు స్థితిలో వున్న వ్యక్తికే వర్తిస్తుంది. ఉదాహరణకు లేడింగ్ బిల్ ఎండార్స్ అయిన అమ్మకందారు ఏజెంట్; సొమ్ముకు ప్రత్యక్షంగా బాధ్యుడైన చెల్లించబడిన ఏజెంట్ లేదా కన్‌సైనర్.

చెల్లింపు జరగని అమ్మకందారు హక్కులను రెండు రకాలుగా పేర్కొనవచ్చును.

1. వస్తువులకు సంబంధించి తీసుకునే చర్యలు

2. కొనుగోలుదారుపై తీసుకునే చర్యలు

వస్తువుల మీద చర్య తీసుకునేటప్పుడు వాటిలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ కాకపోతే ఆ వస్తువుల బదిలీ అమ్మకందారు ఆపేయవచ్చు. ఒకవేళ వస్తువులు రవాణాలో వుంటే అవి కొనుగోలుదారుకు చేరకముందే ఆపవచ్చు.

ఇక వస్తువులలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ అయిపోయిన సందర్భంలో మూడు హక్కులు చెల్లింపు జరగని అమ్మకందారుకు వుంటాయి.

ఎ) లీన్ (Lein) బి) మార్గమధ్యంలో ఆపుదల(Stoppage in transit) సి) తిరిగి అమ్మకం (Resale)

కొనుగోలుదారుపై తీసుకునే చర్యలలో సొమ్ముకోసం లేక నష్టపరిహారం కోసం దావా వేసే హక్కులు ముఖ్యమైనవి.

**10.14.1 చెల్లింపు జరగని అమ్మకందారు లీన్ హక్కు (సెక్షన్ 46 నుండి 49)** : సరుకుల ప్రతిఫలం వసూలు కానంతవరకు సరుకులను ఉపయోగించుకొనుటకు గల హక్కును లీన్ హక్కు అంటారు. చెల్లింపుకాని అమ్మకందారుడు సరుకులను కల్గివుండి, దిగువ సందర్భాలలో ఈ హక్కును ఉపయోగించవచ్చు.

1) సరుకులను అరువుపై అమ్మినపుడు, గడువుతేదీ అయిన తరువాత

2) అరువు ఇచ్చే షరతు లేకుండా వస్తువులను అమ్మినపుడు

3) కొనుగోలుదారు దివాలా తీసినపుడు

కొనుగోలుదారు తరపున ఏజెంటుగా గాని, బెయిలీగా గాని అమ్మకందారు ఉన్నప్పటికీ కూడా ఈ 'లీన్' హక్కును అమ్మకందారు వినియోగించుకోవచ్చును.

చెల్లింపు జరగని అమ్మకందారు అనుభవించేది ప్రత్యేక లీన్ హక్కు. అది వ్యక్తిగతంగా తాను అనుభవించవచ్చుగాని, ఇతరులకు సంక్రమింపచేసే వీలు లేదు. ఇది విభజించటానికి వీలులేని హక్కు కూడా అయినందువల్ల కొనుగోలుదారు కొంత కొంత అమ్మకపు సొమ్ము ఇచ్చి, ఆ మేరకు వస్తువులు డెలివరీ చేయమని కోరే హక్కులేదు.

సరుకులను కలిగి వున్నంతవరకు అమ్మకందారుడు లీన్ హక్కును వినియోగించుకోవచ్చు. సరుకుల హక్కు పత్రాలు

అతని వద్ద లేనప్పటికి ఈ హక్కుకు ఎటువంటి అంతరాయం ఏర్పడదు. లీన్ హక్కును సరుకుల ప్రతిఫలానికి మాత్రమే ఉపయోగించవలెను. ఇతర ఖర్చులకు ఉపయోగించుటకు వీలులేదు. సరుకులను పాక్షికంగా డెలివరీ చేసి వుంటే మిగిలిన సరుకులపై లీన్ హక్కును ఉపయోగించవచ్చు.

**లీన్ హక్కు పరిసమాప్తి :** చెల్లింపు జరగని అమ్మకందారుకు వున్న ఈ లీన్ హక్కు దిగువ పరిస్థితులలో రద్దవుతుంది.

ఎ) రవాణా చేసేవానికి గాని, బెయిలీకి గాని వస్తువులను అమ్మకందారు అప్పగించినపుడు

బి) కొనుగోలుదారుగాని, అతని తరపున నియమితుడైన ఏజెంట్ గాని న్యాయబద్ధంగా వస్తువులను స్వాధీన పరుచుకొన్నప్పుడు.

సి) అమ్మకందారే, తానై 'లీన్' హక్కును వదులుకొన్నప్పుడు

డి) 'లీన్' హక్కును వదులుకొన్నట్లు సూచించే విధంగా కొనుగోలుదారుకు వస్తువులలో కొన్నిటిని అప్పగించినపుడు.

**10.14.2 రవాణాలో నిలుపుదల హక్కు (సెక్షన్ 50 - 52) :** చెల్లింపు జరగని అమ్మకందారుకు వున్న ప్రత్యేక హక్కులలో ఇది రెండవది. వస్తువుల కొనుగోలుదారు దివాలా తీసినపుడు ఆ వస్తువులు కొనుగోలుదారుకు రవాణా అవుతుండగా, రవాణా అయ్యే వాహనం నుంచి అమ్మకందారు ఆ వస్తువులను స్వాధీనం చేసుకోవచ్చు. దీనినే రవాణాలో నిలుపుదల చేసే హక్కు అంటారు.

ఈ హక్కును ఉపయోగించుటకు లీన్ హక్కు రద్దు అయి వుండవలెను. సరుకులు అమ్మకందారుని ఆధీనంలో లేకుండా, కొనుగోలుదారుని ఆధీనంలో లేకుండా మధ్యలో రవాణా వారి స్వాధీనంలో వుండవలెను. రవాణా సంస్థ సరుకులను, అమ్మకందారుని ఏజెంట్‌గా, కొనుగోలుదారుని ఏజెంట్‌గా లేక తన స్వంత పేరుపై రవాణా ప్రక్రియలో వుండవచ్చును.

'లీన్' హక్కుకు, రవాణాలో వున్న వస్తువులు ఆపే హక్కుకు కొన్ని వ్యత్యాసాలు వున్నాయి.

అ) చెల్లింపు జరగని అమ్మకందారు స్వాధీనంలో వస్తువులున్నంత కాలమే వాటిపై 'లీన్' హక్కు వుంటుంది. రెండవది అయిన రవాణాలో ఆపే హక్కు ఆ స్వాధీనంలో పోయిన తరువాత అమలుపరచేదిగా వుంటుంది.

ఆ) కొనుగోలుదారు దివాలా తీసినప్పుడే రవాణాలో వున్న వస్తువులను ఆపే హక్కు వినియోగంలోకి వస్తుంది. కాని 'లీన్' హక్కు వినియోగించటానికి కొనుగోలుదారు దివాలా తీయనక్కరలేదు.

ఇ) 'లీన్' హక్కు వున్న స్వాధీనాన్ని నిలబెట్టుకోవటానికి కాగా రవాణాలో ఆపే హక్కు పొగొట్టుకున్న స్వాధీనాన్ని తిరిగి పొందటానికి ఉద్దేశించినది.

ఎఫ్) వస్తువులను పాక్షికంగా డెలివరీ చేసినప్పటికీ 'లీన్' హక్కు వుంటుంది. మిగిలిన వస్తువులను రవాణాలో నిలుపుదల చేసే హక్కు వుంటుంది. అయితే పాక్షికంగా డెలివరీ చేయటం మొత్తం వస్తువుల స్వాధీనాన్ని సూచిస్తుంటే మాత్రం నిలుపుదల హక్కు వుండదు.

రవాణాలో వస్తువులను ఆపే హక్కుకు సంబంధించిన నిబంధనలకు ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చును.

ఎ) అమ్మకందారు చెల్లింపు జరగని అమ్మకందారుగా వుండవలెను.

బి) కొనుగోలుదారు దివాలా తీసి వుండవలెను.

సి) అమ్మకందారు వస్తుస్వాధీనం పోగొట్టుకొని వుండవలెను.

డి) వస్తువులు రవాణా వారి చేతిలోనే వుండవలెను.

ఎంత కాలము వస్తువులు రవాణాలో వున్నట్లు అనే ప్రశ్నకు సమాధానం ఈ క్రింది విధంగా వివరించవచ్చును.

ఎ) ఒక రవాణా ఏజెన్సీకి వస్తువులు అప్పగించగానే రవాణా ప్రారంభమవుతుంది. అవి కొనుగోలుదారుకు గాని, అతని ఏజెంట్‌కు గాని స్వాధీనంలోకి వస్తే రవాణా అంతటితో పూర్తి అయినట్లే.

బి) కొనుగోలుదారు తరపున బెయిలీగా రవాణా ఏజెన్సీ సరుకులను అట్టిపెట్టుకున్నప్పుడు కూడా రవాణా పూర్తి అయినట్లే.

సి) అనుకున్న చోటికి వస్తువులు చేరిన తరువాత, కొనుగోలుదారుగాని, అతని ఏజెంట్ గాని సరుకుల డెలివరీకి నిరాకరించటం వల్ల, వస్తువులు రవాణా ఏజెన్సీ స్వాధీనంలోనే వుంటే రవాణా కొనసాగుతున్నట్లే.

డి) కొనుగోలుదారు ఏర్పరచుకొన్న ఓడపై వస్తువుల రవాణా సాగుతూ వుంటే అవి రవాణా ఏజెన్సీ వద్ద వున్నాయా లేక కొనుగోలుదారు తరపున ఏజెంట్‌గా ఓడ యజమాని వద్ద వున్నాయా అనే అంశం సందర్భాన్ని బట్టి నిర్ణయించవలసి వుంటుంది.

ఇ) రవాణాదారు, కొనుగోలుదారుకు వస్తువులను డెలివరీ చేయటానికి అక్రమంగా నిరాకరిస్తే, రవాణా కాలం ముగిసినట్లు అవుతుంది. అమ్మకందారు తన హక్కును కోల్పోతాడు.

**'దివాలాదారు' అనే పదం ఇక్కడ ఆర్థికంగా దెబ్బతిన్న వ్యక్తిని సూచిస్తుంది.** రవాణాలో వున్న వస్తువులను నిలుపుదల చేసే హక్కును వినియోగించకముందు న్యాయస్థానం కొనుగోలుదారును దివాలాదారుగా ప్రకటించనక్కరలేదు.

అమ్మకందారు వస్తువులను వాస్తవంగా స్వాధీనపరచుకోవటం ద్వారా, లేదా తనకు మళ్ళీ డెలివరీ చేయమని రవాణాదారుకు నోటీసు యివ్వటం ద్వారా, వస్తువులను స్వాధీనం చేసుకోవచ్చు. అట్టి నోటీసును అందుకున్న తరువాత రవాణాదారు అమ్మకందారుకుగాని, అతని ఏజెంట్‌కుగాని వస్తువులను మళ్ళీ డెలివరీ చేయాల్సి వుంటుంది. మళ్ళీ డెలివరీ చేయటంలో అయ్యే రవాణా ఖర్చులను అమ్మకందారే భరించాలి.

**జి.ఐ.పి. రైల్వే Vs హనుమాన్ దాస్ (1889)** అనే కేసులో వస్తువుల అమ్మకందారు రైల్వే కంపెనీకి రవాణా కోసం పంపినాడు. అవి గమ్యం చేరాయి. కొనుగోలుదారుడు డెలివరీ తీసుకున్నాడు. బళ్ళను పిలిచి వాటిపైకి ఆ వస్తువులను ఎక్కించినాడు. బళ్ళు యింకా రైల్వేస్టేషన్ ఆవరణలో వుండగా, కొనుగోలుదారు దివాలా తీసినట్లు తెలిసి వాటి అప్పగింతను ఆపమని అమ్మకందారు నుంచి స్టేషన్ మాస్టర్‌కు తంతి వార్త వచ్చింది. ఈ తంతి వార్త వచ్చేసరికే రవాణా పూర్తయింది కనుక రవాణాలో వున్న సరుకును నిలుపుదల చేసే హక్కు అమలు చేయటానికి వీలులేదని కోర్టు తీర్పునిచ్చింది.

**10.14.3 తిరిగి అమ్మే హక్కు (సెక్షన్ 54) :** వస్తువులను స్వాధీనంలో వుంచుకున్న చెల్లింపు జరగని అమ్మకందారు వాటిని తిరిగి అమ్మవచ్చు. వాటి నిబంధనలు ఇవి :

ఎ) వస్తువులకు భౌతికంగానే కాక వాణిజ్య పరంగా కూడా నశించే స్వభావం వున్నప్పుడు తిరిగి అమ్మవచ్చు.

బి) లీన్ హక్కు వినియోగించుకొన్నప్పుడుగాని, రవాణా మధ్యలో ఆపినప్పుడు గాని, కొనుగోలుదారుకు నోటీసు ద్వారా, తాను తిరిగి ఆ వస్తువులను అమ్మబోతున్నానని తెలియపరచి తిరిగి అమ్మవచ్చు. అలా అమ్మినపుడు నష్టం వస్తే ఆ నష్టాన్ని మొదటి కొనుగోలుదారు నుంచి రాబట్టుకోవచ్చు. లాభం వస్తే మొదటి కొనుగోలుదారుకు అడిగే హక్కులేదు.

సి) 'లీన్' హక్కు గాని, రవాణా మధ్యలో ఆపివేసే హక్కుగాని వినియోగించిన చెల్లింపుజరగని అమ్మకందారు మళ్ళీ అమ్మితే, కొన్న వానికి వస్తువులపై పూర్తి హక్కులు సంక్రమిస్తాయి.

డి) కొనుగోలుదారు పైకము చెల్లించక తప్పిదము చేసినప్పుడు, అమ్మకందారు తిరిగి అమ్మితే మొదటి అమ్మకం రద్దయిపోతుంది. అయినప్పటికీ అమ్మకందారు మొదటి కొనుగోలుదారు నుంచి పరిహారం కోరే హక్కును కలిగి వుంటాడు.

## 10.15 వేలం అమ్మకము (Auction Sale) (సెక్షన్ 64) :

వస్తువులను అమ్మకం చేయటానికి వున్న పద్ధతులలో వేలం అమ్మకం ఒకటి. దీనినే హర్రాజు అమ్మకం అంటారు. వేలంలో పాల్గొనుటకు అనేక మంది కొనుగోలుదారులు హాజరుకావచ్చును. వారిలో వస్తువులను కొనదలచినవారు ఒకరికంటే మరొకరు హెచ్చు ధరకు వేలం పాడెదరు. వేలం పూర్తి కాక ముందు హెచ్చు ధర పలికిన వ్యక్తికి సరుకులు అమ్మబడును. ఇందుకు సంబంధించిన న్యాయసూత్రాలు ఈ విధంగా వున్నాయి.

అ) వేలం వేసే వస్తువులను ఒకే రాశిగా గాని, వేరు వేరు రాశులుగా గాని పెట్టవచ్చును. వేలం పాట జరుగుతుందని చేసిన ప్రకటన, ప్రతిపాదన కాదు. ప్రతిపాదనకు ఆహ్వానం మాత్రమే.

ఆ) పాట పాడే వ్యక్తి చేసేది ప్రతిపాదన. దానిని వేలందారు అంగీకరించినప్పుడు స్వీకృతి అయి వేలం ద్వారా అమ్మకపు కాంట్రాక్టు ఏర్పడుతుంది.

ఇ) వేలం వేయటానికి ప్రకటించిన వస్తువులను, పాట ప్రారంభానికి పూర్వం పాడే వ్యక్తి వేలం పాట నుంచి తొలగించవచ్చును.

**హారిస్ Vs నికర్సన్ (1873)** అనే కేసులో కొంత ఫర్నిచర్ వేలం వేస్తున్నారని ప్రకటించినారు. అది చూచి 'H' కొంత ప్రయాణం ఖర్చు పెట్టుకుని వేలం పాట స్థలానికి వెళ్ళినాడు. తీరా అక్కడికి వెళ్ళాక, అతడికి కావలసిన వస్తువును వేలం పాట నుంచి తొలగించారు. ప్రయాణపు ఖర్చులకై 'H' దావా తేగా, న్యాయస్థానం ప్రయాణపు ఖర్చులను చెల్లించనవసరం లేదని తీర్పునిచ్చారు.

ఈ) వేలం పాట పాడే వ్యక్తి, తన పాటను వేలందారు అంగీకరించక పూర్వం దానిని ఉపసంహరించి రద్దు పరచుకోవచ్చు. పై పాట రాగానే క్రింది పాట దానంతటదే రద్దవుతుంది.

**రాజా ఆఫ్ బొబ్బిలి Vs ఆకెళ్ళ సూర్యనారాయణ రావు** అనే కేసులో, కోర్టు వేలంలో ఒక పెద్ద ఆస్తిని బొబ్బిలిరాజా 3,25,000కు పాట పాడినాడు. మరొకరు 1,000 అదనం పాటపాడినారు. ఆ తరువాత పాట వాయిదా పడింది. మళ్ళీ పాట పాడేలోగా అదనపు పాట పాడిన వ్యక్తి మరణించినాడు. మళ్ళీ పెట్టిన వేలంలో రాజాకు అనుకూలంగా పాటను కొట్టివేసినారు. అందుకు తన బాధ్యత లేదని రాజా వాదించినాడు. పై పాట పాడగానే, తక్కువ పాట రద్దవుతుంది గనుక మొదటి పాటనాడే రాజా పాట రద్దయిందని, రాజా నష్టపరిహారం చెల్లించనవసరం లేదని కోర్టు తీర్పునిచ్చింది.

ఎఫ్) వేలం పాట పూర్తి కాగానే వేలందారు సంప్రదాయం ప్రకారం 1, 2, 3 అనటమో, మరే యితర ఆచారాన్ని అనుసరించి అయినా పాట పూర్తి చేయవచ్చు.

డెన్నాంట్ Vs స్కిన్నర్ **(1948)** అనే కేసులో 'B' ఒక కారును వేలంలో కొనుగోలు చేసి ఒక చెక్కునిచ్చాడు. చెక్కు పైకం వసూలయ్యే దాకా వస్తువులలోని హక్కులు బదిలీ కావని ఒప్పందంలో ఒక క్లాజు వున్నది. చెక్కు అనాదరణ పొందింది. అమ్మకపు ఒప్పందంలోని క్లాజులతో సంబంధం లేకుండా వేలంపాట పూర్తి అయింది కనుక వస్తువులలోని స్వామ్యం కొనుగోలుదారుకు బదిలీ అయిందని కోర్టు తీర్పునిచ్చింది.

జి) వస్తువుల యజమాని తాను గూడా పాడదలచుకుంటే ఆ హక్కును ప్రత్యేకంగా ప్రకటించుకొనటం ద్వారా రిజర్వు చేసుకోవాలి. కేవలం పాటను పెంచాలనే దురుద్దేశంతో వస్తువుల యజమాని పాటలో పాల్గొంటే కొనుగోలుదారు పాటను రద్దు చేసుకోవచ్చు.

హెచ్)వేలంపాట, సర్కారు వారి పాట (Reserve or upset price)కు లోబడి జరుగుతుందని ప్రకటించవచ్చు.

ఐ) పాట పాడదలచిన వారు తమలోతాము అంగీకారాన్ని కుదుర్చుకొని పోటీ లేకుండా చేసుకొని, వారందరి తరపున ఒకరిచేత పాడించటం, ఆ తరువాత వస్తువులను పంచుకోవడం (Knockout agreement) న్యాయబద్ధమైన చర్యగానే గుర్తించారు. పాటపాడే వ్యక్తి హడలుగొట్టడం, అబద్ధపు మాటలు చెప్పి వస్తువులకు లేని లోపాలు వున్నాయని చెప్పి, పాట పెరగకుండా చూడటం వంటి చర్యలను న్యాయశాస్త్రం నిషేధిస్తున్నది.

## 10.16 నమూనా ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. సరుకులు
2. నిర్దిష్టమైన సరుకులు
3. ఆగంతుక వస్తువులు
4. అమ్మకం నిమిత్తం ఒప్పందం
5. పోయిన వస్తువులు కనుగొన్న వ్యక్తి
6. వేలం అమ్మకం
7. డెలివరీ
8. శాంపిల్ ద్వారా అమ్మకం
9. నష్టభయం బదిలీ
10. చెల్లింపు జరగని అమ్మకందారు
11. స్వామ్యపు బదిలీ
12. వర్ణన ద్వారా అమ్మకం

**10 మార్కుల ప్రశ్నలు :**

1. అమ్మకానికి, అద్దె కొనుగోలుకు వ్యత్యాసాలు
2. అమ్మకపు కాంట్రాక్టు యొక్క ముఖ్య లక్షణాలు
3. షరతులకు, పూచీలకు గల తేడాలను వ్రాయుము.
4. వస్తువుల డెలివరీకి సంబంధించిన నిబంధనలేవి.
5. వస్తువులు అమ్మకందారు యొక్క విధులను, హక్కులను వివరింపుము.
6. వస్తువు కొనుగోలుదారు యొక్క విధులను, హక్కులను వివరింపుము.
7. అమ్మకందారు యొక్క హక్కులను, విధులను వివరింపుము.
8. రవాణాలో నిలుపుదల హక్కు గురించి వ్రాయుము.

9. వేలం అమ్మకంలోని నిబంధనలను వ్రాయుము.
10. వస్తువులపై లీన్ హక్కు గురించి వ్రాయుము.

**20 మార్కుల ప్రశ్నలు :**

1. అమ్మకానికీ, అమ్మకం నిమిత్తం అగ్రిమెంట్‌కూ వున్న వ్యత్యాసాలను వ్రాయుము.
2. అమ్మకపు కాంట్రాక్టులో వున్న ప్రచ్ఛన్నమైన షరతులను, పూచీలను వివరింపుము.
3. అమ్మకందారు నుంచి కొనుగోలుదారుకు వస్తువుల స్వామ్యం బదిలీకి సంబంధించిన నిబంధనలు పేర్కొనుము.
4. 'కొనుగోలుదారు జాగ్రత్త వహించాలి' అనే సిద్ధాంతాన్ని వివరించి, మినహాయింపులను పేర్కొనుము.
5. 'తనకు వున్న హక్కు కంటే మంచి హక్కును అమ్మకందారు, కొనుగోలుదారుకు సంక్రమింప చేయలేడు' ఈ సూత్రాన్ని విశదీకరించి, మినహాయింపులను పేర్కొనండి.
6. 'చెల్లింపు జరగని అమ్మకందారు' అంటే ఎవరు ? అతనికి గల హక్కులను వివరించుము.
7. వస్తు విక్రయ చట్ట ప్రకారం సరుకులలో స్వామ్యం అమ్మకందారు నుంచి కొనుగోలుదారుకు ఎప్పుడు సంక్రమిస్తుంది.
8. అమ్మకందారు, కొనుగోలుదారుల హక్కులను, విధులను వివరింపుము.

## 10.17 చదవవలసిన గ్రంథాలు :

| | | | |
|---|---|---|---|
| 1. | Elements of Mercantile Law | - | N.D. Kapoor |
| 2. | Mercantile Law | - | Rohini Goel |
| 3. | The Sale of Goods Act, 1930 (Bare Act) | | |
| 4. | వ్యాపార చట్టాలు | - | తెలుగు అకాడమి |
| 5. | వ్యాపార, పారిశ్రామిక, ఆర్థిక న్యాయశాస్త్రాలు | - | రుద్ర సాయిబాబా |
| | | - | సంతోష్‌కుమార్ ఖేతాన్ |
| | | - | ఆర్. సదానందం |
| | | - | సిహెచ్. సత్యానారాయణరెడ్డి |
| | | - | సిహెచ్. షణ్ముఖస్వామి |
| | | | ఎస్.ఎస్. లక్ష్మీ |
| 6. | వ్యాపార న్యాయశాస్త్రం | - | డా॥ వై. అరుణవల్లి, |
| | | - | డా॥ జి. ప్రసాదు |

**– డాక్టర్ కె. వెంకటేశ్వర్లు**

## పాఠం – 11

# వినియోగదారుల పరిరక్షణ చట్టం 1986 & సవరణలు 2019

**లక్ష్యం :**

ఈ పాఠం చదివిన తరువాత ఈ క్రింది విషయాలు తెలుసుకుంటారు.

- ఎవరిని వినియోగదారులుఅంటారు?
- వినియోగదారులు ఏవిధంగా మోసపోతున్నారు?
- వినియోగదారుల పరిరక్షణ చట్టం ఎందుకు అవసరము?
- వినియోగదారులు ఏ బాధ్యతలను తప్పనిసరిగా పాటించవలెను.
- వినియోగదారుల హక్కులు ఏమిటి?
- వినియోగదారుల రక్షణకు మార్గాలు,
- వినియోగదారుల చట్టంతో చూపబడిన పరిష్కార సంస్థలు,
- వినియోగదారుల రక్షణ చట్టం 2019 ముఖ్యంశాలు

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**

11.1 విషయ పరిచయం

11.2 వినియోగదారుల రక్షణ చట్టం అవసరము

11.3 వినియోగదారుల అర్థం

11.4 వినియోగరక్షణ – ఆవశ్యకత

11.5 వినియోగదారుల హక్కులు, ఖాద్యతలు

11.6 వినియోగదారులహక్కులరక్షణకు మార్గాలు

11.7 వినియోగదారుల చట్టంలో చూపుడిన పరిష్కార సంస్థలు

11.8 తాజా వినియోగదారు రక్షణ చట్ట సవరణలు 2019 యొక్క ముఖ్యాంశాల

11.9 వివిధ దేశాలలో వినియోగదారుల రక్షణ చట్టం అమలు

11.10 భారతదేశంలో వినియోగదారుల పరిరక్షణ చట్టం విజయవంతం కాకపోవడానికి గల కారణాలు

11.11 ముగింపు

11.12 సారాంశం

11.13 ముఖ్య పదకోశం

11.14 స్వీయ మదింపు ప్రశ్నలు

11.15 ఉపయుక్త గ్రంథాలు

## 11.1 పరిచయం :

మహాత్మాగాంధీ ప్రకారం ఏ రకమైన వ్యాపారానికైనా కస్టమర్ ముఖ్యమైన వ్యక్తి. కస్టమర్ లేకుండా ఎటువంటి వ్యాపారం ఉనికిలో ఉండదనే సందేహం లేదు. కానీ ఈరోజు ఏం జరుగుతోంది. అనేక వ్యాపారాల ద్వారా కస్టమర్ దోపిడీకి గురవుతున్నారు. పాల నుంచి పెట్రోలు వరకు ప్రతి వస్తువు కలుషితమై ఉంటుంది. భారతదేశంలో ఈ కల్తీ వ్యాపారం సంవత్సరానికి సుమారు 1000 కోట్లు. ప్రపంచంలో ఏటా 22 లక్షల మంది ఈ కల్తీ ఉత్పత్తులను వినియోగిస్తూ మూల్యం చెల్లిస్తున్నారు. ఇటీవలి కాలంలో 200 రకాల వ్యాధులకు కల్తీ ఆహార పదార్థాలను కలుషితమే కారణం.

## 11.2 వినియోగదారుల రక్షణ చట్టం అవసరం :

1960ల వరకు, భారతదేశం బ్లాక్ మార్కెటింగ్, అసంజసమైన తూకం మరియు ఆహార కల్తీ వంటి అనేక కేసులతో బాధపడేది. ఉత్పత్తులను కలుషితం చేయడం, MRP కంటే ఎక్కువ ధరలను వసూలు చేయడం మరియు ధృవీకరించని ఉత్పత్తులను మార్కెట్‌లోకి డంప్ చేయడం ద్వారా వినియోగదారులను తయారీదారులు మరియు విక్రేతలు దోపిడీ చేస్తున్నారు. తయారీదారులు, విక్రయదారుల అక్రమాలతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. కావునతమ హక్కులను కాపాడుకోవడం కోసం తమ గొంతును బలంగా వినిపించారు.వినియోగదారుల ఉద్యమం 1960లలో ప్రారంభమైంది మరియు 1970లలో ఊపందుకుంది.వినియోగదారులు అసంతృప్తిని వ్రాతపూర్వకంగా మరియు కథనాలు మరియు వార్తాపత్రికల ద్వారా ప్రదర్శించడం ప్రారంభించారు.

విక్రేతలు మరియు తయారీదారులతో అసంతృప్తి స్థాయి మరియు వారి అభ్యాసాల ఫలితంగా వినియోగదారులు తమ స్వరాన్ని పెంచారు. తత్ఫలితంగా, 24 డిసెంబర్ 1986న వినియోగదారుల రక్షణ చట్టాన్ని అమలు చేయడం ద్వారా వినియోగదారుల రక్షణకు గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వినియోగదారుల హక్కులను పరిరక్షించడం మరియు మార్కెట్‌లో స్వేచ్ఛా వాణిజ్యం, పోటీ మరియు ఖచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండేలా ఈ చట్టం ఉద్దేశించబడింది.

మన దైనందిన జీవితంలోఅనేక రకాలవస్తువులు కొంటుంటాం. దానిని వినియోగించడం ద్వారా సంతృప్తి చెందుతాం. కాని కొన్ని సందర్భాలలో మనం కొన్న వస్తువులు మనకు సంతృప్తినీయవు. నాణ్యత లోపం, ఎక్కువ మొత్తాలు వసూలు, పరిమాణం తక్కువగా ఉండటం, తప్పు దోవపట్టించే ప్రకటనలు మొదలైనవి ఈ అసంతృప్తికి కారణం కావచ్చు. అదే విధముగా వినియోగదారుడు తాను చెల్లించి కొనుగోలు చేసిన వస్తు, సేవల ద్వారా పూర్తిగా సంతృప్తి చెందలేకపోతున్నాడు. ఆ సందర్భంలో వినియోగదారుల పరిరక్షణ చట్టంచాల అవసరం. అసలు

వినియోగదారుడు అంటే ఎవరు? అసలు వినియోగదారులు హక్కులు అంటే ఏమిటి? వాటిని ఎలా పరిరక్షించుకోవాలి?

## 11.3 వినియోగదారులు– అర్థం :

ఒక వ్యక్తి ఎవరైతే వస్తువులు వినియోగము కోసం లేక సేవలు పొందువాడే వినియోగదారుడు అని పిలువబడుతాడు. వస్తువులు ప్రధానంగా గోధుమపిండి, ఉప్పు, చక్కెర, పండ్లు వంటి వినియోగ వస్తువులు కావచ్చు లేదా టి.వి, రిఫ్రిజిరేటర్, టోస్టర్, మిక్సర్, సైకిల్లాంటి మన్నికగల వస్తువులు కావచ్చు. అదే విధముగా పలువిధాలైన సేవలు విద్యుత్తు, వంటగ్యాసు, టెలిఫోను, రవాణా, సినిమాలుమొదలగునవి సేవలుగా గుర్తింపబడతాయి. ఈ విధంగా వస్తు సేవలు వినియోగించడం వలన ఒక వ్యక్తి వినియోగదారుడు అవుతాడు. అయితే చట్టము దృష్టిలో ఎవరైతే వస్తువులను కొనుగోలు చేస్తాడో, సేవలను పొందుతాడో, అతను మాత్రమేగాక ఆ వస్తు సేవలను కొనుగోలుదారుని అనుమతితో ఉపయోగించే వ్యక్తికి కూడా రక్షణ కల్పిస్తుంది.

**ఎవరిని వినియోగదారు అంటారు?**

వినియోగదారుని రక్షణ చట్టం 1986 ప్రకారం వస్తువులకు, సేవలకు సంబంధించి వేర్వేరుగా నిర్వచనాన్ని ఇవ్వడం జరిగింది.

ఎ) వస్తువుల విషయంలో క్రింది తరహా వ్యక్తులను వినియోగదారుడు అంటారు.

- వస్తువులు కొనుగోలుదారు,
- ప్రతిఫలాన్ని చెల్లించడం ద్వారా లేదా చెల్లిస్తానని తెల్పడం ద్వారా వస్తువుల కొనుగోలు చేస్తానని హామి చేసినవారు.
- పూర్తి లేదాపాక్షిక ప్రతిఫలాన్ని చెల్లించి వస్తు సేవలను కొనుగోలు చేసినవారు
- వస్తువులను కొనుగోలుదారుని అంగీకారంతో ఉపయోగించేవారు.

  (గమనిక : వాణిజ్య నిమిత్తం లేదా తిరిగి అమ్మే నిమిత్తం వస్తువులను కొనేవారిని కొనుగోలుదారుగా పరిగణించరాదు).

బి) సేవల విషయంలో, క్రింది తరహా వ్యక్తులను వినియోగదారుడు అంటారు.

- ప్రతి ఫలానికి సేవలను పొందేవారు లేదా అద్దెకు పొందేవారు.
- సేవలను కొనుగోలుదారుని అంగీకారంతో ఉపయోగించేవారు.

పూర్వ కాలంలో "కేవియట్ ఎంప్టర్" అను సిద్ధాంతమునకు లోబడి కొనుగోలుదారుడు మరియు అమ్మకందారులకు మధ్య మంచి సంబంధబాంధవ్యములు ఉండేవి. బహిరంగ మార్కెట్లు ఉన్న కాలములో కొనుగోలుదారుడు మరియు అమ్మకపుదారుడు ముఖాముఖితో అమ్మకపుదారుడు ప్రదర్శించే వస్తువులను కొనుగోలుదారుడు క్షుణ్ణంగా పరిశీలించి ఆవస్తువులను కొనుగోలు చేసేవాడు. ఈ వ్యాపారవ్య వహారములో అడుగు పెట్టే

ముందు తగు జాగ్రత్తలు పాటించి, నైపుణ్యంతో వినియోగదారుడు పాటించినట్లు గ్రహించగలరు. వస్తువు యొక్క నాణ్యత బట్టబయలు చేసే నియమము నుంచి అమ్మకపుదారునికి వెసులుబాటు కల్పించబడినది. అంతే కాకుండా కొనుగోలుదారునికి మరియు అమ్మకపుదారునికి ఉన్న సంబంధాలు ఎక్కువ ప్రభావము కలిగి వుండేవి.

ప్రపంచీకరణ, వ్యాపార అభివృద్ధి ఎక్కువైన ఈ రోజులలో పై నియమము అమలులో లేదని చెప్పవచ్చు. వినియోగదారుడు తాను కొనదలచిన వస్తువులను ముందుస్తుగా పరీక్షించుకొనుటకు అవకాశమే ప్రస్తుత పరిస్థితులలో సాధ్యపడదు. ప్రతి వ్యాపారలావాదేవీలు ఉత్తర ప్రత్యుత్తరాల (ఇంటర్నెట్ / ఈ-కామర్స్) ద్వారా నడుపబడుతున్నది. సులభతరం కాని క్లిష్టమైన ఈ పరిస్థితులలో ఉత్పత్తిదారుడు మాత్రమే తన సరుకులు నాణ్యత గురించి హామీ ఇస్తున్నాడు. బాగా వ్యవస్థీకరించబడిన ఉత్పత్తి కార్యక్రమాల ద్వారా అమ్మకందారుడు ఒక బలీయమైన శక్తిగా ఎదిగినారు. కాని ఇలాంటి పరిస్థితులు వినియోగదారులకు లేక ఇంకనూ బలహీన స్థితిలో ఉన్నారు. సమాచార సాంకేతిక విజ్ఞానంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, కొత్తగా ప్రవేశ పెట్టబడిన ఈ-కామర్స్ విధా ల వలన వినియోగదారుని హక్కులు హరించబడుతున్నవి. దీని పర్యవసానంగా కొనుగోలుదారుడు నిత్యము మోసానికి గురి అవుతున్నాడు.

ప్రస్తుతం మన దేశంలో అసంఖ్యాక వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలలో ఆయన వినియోగదారుల విషయంలో పేర్కొన్న ఈ దిగువ సూత్రాలు పొందు పరచిన బోర్డులు దర్శనమిస్తాయి.

"మన వద్దకు వచ్చే అందరు వ్యక్తులలో వినియోగదారుడు అందరికంటే ముఖ్యమైనవాడు. అతను మనపై ఆధారపడి జీవించడంలేదు మనమే అతనిపై ఆధారపడుతున్నాము. అతను మన కార్యకలాపాలకు ఆటంకం కాదు. మనము చేసే పనులన్నీ అతని కోసమే. మన వ్యాపారానికి సంబంధించి అతను బయటి వ్యక్తికాదు. అతనే మన వ్యాపారంలో ముఖ్యభాగస్వామి. అతనికి సేవలు అందించడం ద్వారా మనం అతనికి ఏదో మేలు చేస్తున్నట్లుగా భావించరాదు. సేవలు అందించే అవకాశం మనకు కల్పించడం ద్వారా అతనే మనకు ఎంతో మేలు చేస్తున్నాడు".

**వినియోగదారులు ఏవిధంగా మోసపోతున్నారు, వారిరక్షణ :**

వినియోగదారుల ఆసక్తిని, హక్కులను పరిరక్షించడాన్ని వినియోగదారీ రక్షణ అంటారు. వ్యాపార సంస్థల అనుచిత చర్యలను అరికట్టడానికి, వినియోగదారులు ఇబ్బందులను నివారించడం ద్వారా వినియోగదారులను రక్షించడాన్ని వినియోగదారీ రక్షణగా చెప్పవచ్చు. వినియోగదారులు ఏ విధంగామోసపోతున్నారు?

ఎ) కల్తీ వస్తువుల అమ్మకం, అమ్మే వస్తువులకు నాసిరకమైన వస్తువులు కలపడం.

బి) నకిలీ వస్తువులు, అసలు వస్తువు కన్నా తక్కువ విలువగల వస్తువులను అమ్మడం.

సి) తక్కువ ప్రమాణం గల వస్తువులను అమ్మడం నిర్ధారిత ప్రమాణాలను పాటించని వస్తువుల అమ్మకం.

డి) నకలు వస్తువుల అమ్మకం.

ఇ) తూనికలు, కొలతలలో లోపం.

ఎఫ్) అక్రమ నిల్వ, నల్లబజారు, ఈ చర్యల వలన వస్తువుల కొరత, ధరలో పెరుగుదల ఏర్పడతాయి.

జి) గరిష్ఠ రిటైల్ధర (ఎం.ఆర్.పి) కన్నా ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయడం.

హెచ్) లోప భూయిష్టమైన వస్తువుల సరఫరా.

ఐ) తప్పు దోవపట్టించే ప్రకటనలు, వస్తువులకు లేని నాణ్యత, తప్పు గ్రేడింగ్ ప్రమాణాలను చూపడం.

జె) చౌకబారు సేవల సప్లై, అంగీకరించిన నాణ్యత కన్నా తక్కువ నాణ్యత గల సేవలను అందించడం.

వస్తు సేవలకు సంబంధించి వినియోగదారుడు పై చర్యల ద్వారా మోసానికి, దోపిడీకి గురవుతున్నాడు.

## 11.4 వినియోగదారుని రక్షణ – అవశ్యకత :

ఆధునిక ప్రపంచంలో వాణిజ్య సంస్థలు చక్కగా వ్యవస్థీకరించబడి, పూర్తి సమాచారము పొంది చక్కటి ఆధిపత్యాన్ని కలిగివుండుట ద్వారా వినియోగదారులు దోపిడీకి గురవుతున్నాడు. ఈ వాణిజ్య సంస్థలకు ఎక్కువగా వినియోగదారులే బలి అవుతున్నారు. కాబట్టి వీరిని కాపాడవలసిన అవసరం ఎంతైనా వున్నది కాబట్టే వినియోగదారుల రక్షణ అతి ఆవశ్యకము.

1. **వినియోగదారుల వ్యవస్థీకరణము :** భారతదేశంలో వినియోగదారులను ఒక పెద్ద సమూహంగా చెప్పవచ్చు. కాకుంటే వారు అసంఘటితంగా ఉన్నారు. వారిని సరిగా ఒక వ్యవస్థ నీడలోనికి తీసుకురావలెను. వారు శక్తి హీనులు కాబట్టే వర్తకులు / వ్యాపారస్తులు వీరిని దోచుకుంటున్నారు. ఇక్కడ వినియోగదారులకు రక్షణ చాలా అవసరము.

2. **మార్కెట్ సమాచారము పై అవగాహన :** వస్తువులు నాణ్యత గురించి గాని, ప్రత్యేకతలు, విలువ మరియు ఇతర మార్కెట్ వెసలుబాట్లు గురించి వినియోగదారునికి సరైన సమాచరం లేదు. వస్తువుల పూర్వాపరాల గురించి అవగాహన లేని కారణమున వీరు నష్టాలకు గురవుతున్నారు.

3. **భౌతిక భద్రత:** భారతీయ మార్కెట్లు అనేక రకాల వస్తూత్పత్తులతో నిండిపోయి వున్నది. వస్తువులు కల్తీ చేయడం వలన లేనిపోని ఆరోగ్య సమస్యలు తలలెత్తు . వినియోగదారుల ప్రాణాలకు సైతము భద్రత కరువైనది. కాబట్టి వినియోగదారుల రక్షణ ఎంతైనా అవసరము.

4. **ఏకస్వామ్య ఆధిపత్య నిర్మూలన :** ఏకస్వామ్య ఆధిపత్యము నిర్మూలించుటకు వినియోగదారుల రక్షణ చాలా ముఖ్యము. ప్రస్తుత మార్కెట్టు విధానాల వలన ఇది ప్రధాన స్థానము ఆక్రమించి వున్నది. ఎన్ని అవరోధాలు కల్పించబడినప్పటికీ అనేక వ్యవస్థలు ఏకస్వామ్య ధోరణిని అవలంభిస్తున్నాయి. ఇది వినియోగదారుల పై ఎక్కువ ప్రభావము చూపుతున్నవి. కాబట్టి వారి రక్షణ ఎంతైనా అవసరము**.**

5. **అవినీతి చర్యల అదుపు / నిర్మూలన :** ప్రస్తుత మార్కెట్లో అవినీతి లేదా నీతిబాహ్య పనులు ఎక్కువగా వున్నవి. వర్తకులు అసమంజసమైన పద్ధతులలో, నిలువరించలేని పద్ధతులలో ఏకస్వామ్య ధోరణులు అవలంభిస్తు . ఈ పరిస్థితులలో వినియోగదారుల రక్షణ ఎంతో ముఖ్యము.

6. **కాలుష్య నిర్మూలన :** ప్రతిదేశము కాలుష్యమును ఒక తీవ్ర సమస్యగా పరిగణిస్తున్నది. ఇటు వినియోగదారులకే కాక పౌరులను కూడా ఈ కాలుష్యము ప్రభావితము చేసి ఆరోగ్యము మరియు మానసికంగా కృంగదీస్తున్నది. ఈ కాలుష్యపు బారి నుండి ప్రజలను కాపాడవలసిన అవసరము ఎంతైనా వున్నది.

7. **మోసపూరిత ప్రకటనలు :** చాలా వ్యాపార వ్యవస్థలు మోసపూరిత ప్రకటనలు గుప్పిస్తూ బహిరంగంగా వినియోగదారులను దోచుకుంటున్నాయి. కాబట్టి వీరి దోపిడీని అరికట్టి వినియోగదారులకు రక్షణ కల్పించాలి.

8. **వినియోగదారుల ప్రాథమిక హక్కులు గురించి వారిలో అవగాహన కల్పించుట :** చాలా మంది వినియోగదారులకు వస్తువులపై సరియైన అవగాహన లేదు. వారి హక్కుల గురించి కూడా వారికి సరియైన అవగాహన లేదు. వినియోగదారుల ఉద్యమాల వలన వారి హక్కులు గురించి, వారి హక్కులను ఎలా కాపాడుకోవలయునో అవగాహన కల్పించాలి.

**11.5 వినియోగదారుల హక్కులు, బాధ్యతలు :** వ్యాపారులు తమ యొక్క సామాజిక బాధ్యతల గురించి పూర్తిగా అవగాహన కలిగివున్నప్పటికీ అనేక చోట్ల వినియోగదారుడు దోపిడీకి గురి అవుతున్నాడు. ఆ కారణమున భారతప్రభుత్వం వినియోగదారులు చట్టపరిధిలో దిగువ తెలిపిన వినియోగదారుల హక్కులను పొందుపరచడమైనది. అవి :

1. **భద్రత హక్కు :** తమ ప్రాణమునకు గాని, ఆస్తులకుగాని ప్రమాదకరమైన వస్తువులు లేక సేవల వినియోగంనుండి భద్రత, వినియోగదారుల హక్కుగా పరిగణించబడినది. దీని వలన భద్రమైన జీవనము సాగించుటకు వీలు కల్పించబడినది.

2. **సమాచార హక్కు:** వస్తువులు మరియు సేవలకు సంబంధించిన నాణ్యత, పరిమాణము స్వచ్ఛతల గురించి పూర్తి సమాచారము పొందు హక్కు కల్పించబడినది. కాబట్టి ఉత్పత్తిదారుడు దీనికి సంబంధించిన పూర్తి సమాచారము వినియోగదారునికి ఇవ్వవలెను.

3. **ఎంపిక హక్కు :** తన ఇష్టమునకు సరితూగే విధముగా వస్తువుల కొనుగోలు, సేవలు పొందే హక్కు వినియోగదారునికి ఇవ్వబడినది. పంపిణీదారులు వారి ఇష్టప్రకారము వినియోగదారులకు వస్తువులు అమ్మరాదు. వినియోగదారులను బలవంతము చేయరాదు. తన ఇష్టానుసారముగా వస్తువులను ఎంపికచేసుకునే స్వేచ్ఛ వినియోగదారునికి ఉన్నది.

4. **వినియోగదారులకు అవగాహన కల్పించు హక్కు :** ఒక వస్తువు గురించి సరియైన అవగాహన, నైపుణ్యము కలిగించుకొనే హక్కు వినియోగదారునికి కల్పించబడినది. అక్షరాస్యులైన వినియగదారులు వారి హక్కులు తెలుసుకుని, ఆ హక్కులకు భంగం కలిగినప్పుడు ఎలాంటి చర్యలు ఎలాంటి చర్యలు

తీసుకోవాలనే జ్ఞానము కలిగి ఉంటారు.

5. **సమస్యల పరిష్కార హక్కు :** తనకు జరిగిన దోపిడి మరియు మోసానికి పరిష్కారము పొందుటకు, వ్యాపారస్తుల దోపిడి నుండి నష్టపరిహారము పొందు హక్కు కల్పించబడినది. ఈ హక్కు ద్వారా దోపిడి నుండి న్యాయము ప్రసాదించబడుతుంది. వినియోగదారుడు తనకు జరిగిన అన్యాయము గురించి విన్పించుటకు, వ్రాతపూర్వకముగా విన్నవించుకొనుటకు వినియోగదారునికి హక్కు ఉన్నది. తాను కొనుగోలు చేసిన వస్తువులు లోపభూయిష్టంగా వున్ననూ, తనకు అందించిన సేవలలో వ్యత్యాసమున్ననూ వినియోగదారుల మాటలను వినవలెను.

**వినియోగదారుని బాధ్యతలు :** వినియోగదారుల ప్రయోజనాలను కాపాడుటకు ప్రభుత్వముగాని, స్వచ్ఛంద సంస్థలుగాని ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వినియోగదారుడు తనకు తానుగా వ్యాపారుల దోపిడీ నుండి రక్షించుకొనుటకు ముందుకు రావలెను. కాబట్టి దిగువ తెలిపిన బాధ్యతలను స్వీకరించవలెను. తప్పని సరిగా పాటించవలెను.

1. **వస్తువుల నాణ్యతపై అవగాహన :** ఉత్పత్తిదారుల నీతిబాహ్యమైన చర్యల నుండి, కల్తీలను నిరోధించుటకుగాను తాము కొనదలచిన వస్తువుల నాణ్యతపై వినియోగదారుడు కొంత అవగాహన కలిగియుండుట అతని బాధ్యత. ఆ వస్తువులపై వున్న నాణ్యత ప్రమాణాలను ధృవీకరణ చేయు ఐ.ఎస్.ఐ (ISI), అగ్మార్క్, FPO, వూల్మార్క్, ఎకో–మార్క్, హల్మార్క్ కలిగి వున్నవా గమనించవలెను.

2. **తప్పు దారి పట్టించే ప్రకటన గురించి జాగ్రత్త :** వస్తువుల నాణ్యత గురించి అతిశయోక్తిగా ఇవ్వబడే ప్రకటనలపై ఆధారపడ కూడదు. ఇతర వినియోగదారులు ఎవరైతే వీటిని ఇది వరకే ఉపయోగిస్తున్నారో వారి నుండి సమాచారము పొందవలెను.

3. **ఎంపిక చేసుకునే ముందు వివిధ రకాలైన వస్తువులను పరీక్షించు బాధ్యత :** ఈ విధంగా పరీక్షించిన తరువాత తాము వస్తువులను కొనుటకు ముందు నాణ్యతను గురించి, విలువ, మన్నిక, కొన్న తరువాత వ్యాపారి అందించే సేవలను గురించి తెలుసుకోవలెను.

4. **వినియోగదారుడు అమ్మకందారునితో జరిగిన వ్యవహారంనకు ఋజువును సంపాదించడం :** వీరి ఇద్దరి మధ్య జరిగిన వ్యాపారలావాదేవీల గురించి సరియైన వ్రాతపూర్వక ధృవీకరణను స్వీకరించి దానిని జాగ్రత్తగా భద్రపరచవలెను. ఒకవేళ ఆవస్తువుపై ఫిర్యాదు చేయవలసినప్పుడు అది ఉపయోగపడుతుంది. సాధారణంగా వాడే వస్తువులకు వ్యాపారస్తుడు వారంటీ లేక గ్యారంటీ పత్రము కొనుగోలు చేసిన వస్తువులో జతచేయబడి వుంటుంది. వాటి పై వ్యాపారస్తుడు సరిగా సంతకము చేసియున్నాడా? లేదా? అని గమనించవలెను. అందులో వ్యాపార సంస్థ సీలు, తేదీ ఉండునట్లు చూడవలెను. ఆ కాలపరిమితి ఉన్నంతవరకు భద్రపరచవలెను.

5. **వినియోగదారుడు తన హక్కుల గురించి తెలుసుకోవాలి :** వస్తువుల కొనుగోలులో గాని, సేవల ఉపయోగంలో గాని పైన తెలిపిన హక్కుల గురించి సరియైన అవగాహన కలిగి, అవసరమైనపుడు అవి ఉపయోగించవలెను. తాము కొనుగోలు చేసిన వస్తువులలో ఎలాంటి లోపాలు లేకుండా వాటికి సంబంధించిన సమాచారము మొత్తము గ్రహించి నాణ్యతను కూడా గమనించి కొనుగోలు చేయవలెను.

6. **వాస్తవమైన లోపానికి ఫిర్యాదు చేయుట :** ఒక వినియోగదారునిగా మీరు కొన్న వస్తువుపై అసంతృప్తి ఉన్నట్లయితే దానిని పరిష్కరించ వలసినదిగా కోరవచ్చును. ఈ విషయంగా మొదటగా మీరు ఆ వ్యాపారస్తునికి మీకు కావలసిన పరిష్కారము కొరకు విన్నవించవలెను. ఆ వ్యాపారస్తుడు మీ ఫిర్యాదుకు స్పందించని యెడల మీరు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించ వచ్చును. వాస్తవముగా మీకు కలిగిన నష్టము మరియు మీరు కోరుతున్న పరిహారం సమర్ధనీయంగా ఉండవలెను. అవాస్తవ ఫిర్యాదులు చేయకూడదు. బలమైన కారణము లేనిచో ఫోరం మీకు అపరాధరుసుము వేయవచ్చును.

7. **వస్తు సేవలను సరిగా వినియోగించుకోవడం :** వినియోగదారులు కూడా ఈ వస్తువుల వినియోగమును జాగ్రత్తగా సరియైన పద్ధతిలో వినియోగించవలెను. గ్యారంటీ పరిమితి కాలము ఉన్న కారణమున, వేరొక వస్తువు బదులుగా వస్తున్నదనే భావముతో నిర్లక్ష్య ధోరణితో వినియోగించకూడదు.

## 11.6 వినియోగదారుల హక్కుల రక్షణకు మార్గాలు :

వినియోగదారుల రక్షణ అనే లక్ష్యాన్ని సాధించుటకు చాలా మార్గాలు వున్నవి.

1. **లోక్ అదాలత్ :** ప్రజా ప్రయోజన సమస్యలను త్వరితగతిన పరిష్కరించే సమర్థవంతమైన వ్యవస్థ ఈ లోక్అదాలత్. తనకు సంభవించిన నష్టాలకు సంబంధించి బాధితుడు తన సమస్యలను సరాసరి ఈ **అదాలత్**కు చెప్పవచ్చును. అప్పటికప్పుడే అవి చర్చించబడి త్వరితగతిన నిర్ణయాలు తీసుకొనబడును.

2. **ప్రజాప్రయోజన వ్యాజ్యములు :** సాంఘిక సమస్యలకు సంబంధించి ఏ వ్యక్తి అయినా ఈ వ్యాజ్యమును న్యాయస్థానములో ఫిర్యాదు చేయవచ్చును. ఇది ఒక సమర్థవంతమైన పథకము. దీని వలన ఫిర్యాదులు చేయని వారికి కూడా ఒక పరిష్కారము చట్టబద్ధంగా ఇవ్వబడును. వినియోగదారులు, అల్పసంఖ్యాకులు, పేద ప్రజలు మరియు పర్యావరణవేత్తలకు ఇది వర్తించును.

3. **వ్యాపారస్థులు చేయు స్వీయ పద్ధతులు :** వినియోగదారులకు సరైన ప్రాధాన్యతయిస్తూ మంచి, పెద్దవ్యాపారసంస్థలు ఈ స్వీయపద్ధతులు పాటిస్తున్నవి. సామాజిక బాధ్యత ఎరిగిన కొన్ని సంస్థలు నాణ్యతలను పాటిస్తూ వినియోగదారుల ఫిర్యాదులను స్వీకరించుటకు ఒక శాఖను కూడా ఏర్పరచి వున్నాయి.

4. **వ్యాపార సంఘములు :** తమ ఖాతాదారులతో ప్రవర్తించవలసిన విధివిధానాలను క్రోడీకరించి "ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ", "కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ" అను వ్యాపార సంఘములు పాటిస్తున్నవి.

5. **వినియోగదారులకు అవగాహన :** అక్షరాస్యులై సరైన అవగాహన కలిగియున్న వినియోగదారులను దోపిడీ చేయుట అంత సులభమైన పనిగాదు. కాబట్టి వినియోగదారులు తమ హక్కులను, బాధ్యతలను ఎరిగి ఈ వినియోగదారుల చట్టము ద్వారా తగు వెసలుబాటు పొందుతున్నారు.

6. **వినియోగదారుల సంస్థలు :** ఈ సంస్థలు వినియోగదారులకు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన జరిపి ఒకవేళ దోపిడీకి గురి అయిన పక్షములో వారికి తగిన పరిష్కారము **చూపి** విముక్తి కల్పించుచున్నవి.

